www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 30-10-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 213 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి ఉ. 1.16 తదుపరి చతుర్దశి; నక్షత్రం: హస్త రా. 9.43 తదుపరి చిత్త వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 11.35-12.21; అమృతఘడియలు: మ. 2.55-4.44; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.16; సూర్యాస్తమయం: 5.40 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శతక్కొట్టిన మంధాన

అదరగొట్టిన హర్మన్ మూడో వన్డేలో కివీస్‌పై విజయం

2-1తో భారత మహిళలదే సిరీస్





స్మృతి మంధాన (100)

అహ్మదాబాద్: వరుస వైఫల్యాలతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన (122 బంతుల్లో 10 ఫోర్లతో 100)తోపాటు హర్మన్‌ప్రీత్ కౌర్ (59 నాటౌట్) విజృంభించడంతో.. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను భారత మహిళల జట్టు 2-1తో సొంతం చేసుకొంది. మంగళవారం జరిగిన సిరీస్ నిర్ణాయక ఆఖరి, మూడో వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో కివీస్‌ను ఓడించింది. 233 పరుగుల లక్ష్యాన్ని భారత్ 44.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ షఫాలీ వర్మ (12)ను హనా రో (2/47) స్వల్ప స్కోరుకే అవుట్ చేయడంతో.. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మంధాన జట్టు బాధ్యతలను భుజాన వేసుకొంది. వన్‌డౌన్ బ్యాటర్ యాస్తిక భాటియా (35) చక్కని సహకారం అందించింది. అయితే, యాస్తికను డివైన్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపడంతో.. రెండో వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌తో కలిసి మంధాన దూకుడుగా ఆడుతూ మూడో వికెట్‌కు 118 పరుగులు జోడించడంతో జట్టు విజయం దిశగా దూసుకెళ్లింది. సెంచరీ పూర్తి చేసుకొన్న మంధానాను రో బౌల్డ్ చేసినా.. తుదికంటా క్రీజులో నిలిచిన హర్మన్ మరో 34 బంతులు విగిలుండగానే మ్యాచ్‌ను ముగించేసింది. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న న్యూజిలాండ్ 49.5 ఓవర్లలో 232 పరుగులకు ఆలౌటైంది. బ్రూక్ హాలిడే (86) అర్ధ శతకంతో పోరాడింది. దీప్తి శర్మ 3 వికెట్లు, ప్రియా మిశ్రా 2 వికెట్లు పడగొట్టారు. ఫీల్డ్‌లో అప్రమత్తంగా వ్యవహరించిన జెమీమా రెండు రనౌట్లు చేయడం విశేషం. సుజీ బేట్స్ (4), లారెన్ డౌన్ (1), కెప్టెన్ సోఫీ డివైన్ (9), జార్జియా ప్లిమ్మర్ (39), మ్యాడీ గ్రీన్ (15) పెవిలియన్‌కు క్యూ కట్టడంతో కివీస్ 88/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో ఇసబెల్ (25)తో కలసి ఆరో వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టిన బ్రూక్.. రో (11)తో కలసి ఏడో వికెట్‌కు 47 పరుగులతో టీమ్ స్కోరును రెండు వందల పరుగుల వద్దకు చేర్చింది. బ్రూక్‌ను దీప్తి క్యాచవుట్ చేసినా.. ఆఖర్లో తహుహు (24 నాటౌట్) ధాటిగా ఆడడంతో జట్టు మెరుగైన స్కోరు చేసింది.

8 వన్డేల్లో అత్యధికంగా 8 సెంచరీలు సాధించిన భారత మహిళా బ్యాటర్‌గా మంధాన. మిథాలీ 7 శతకాల రికార్డును స్మృతి అధిగమించింది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 49.5 ఓవర్లలో 232 ఆలౌట్ (బ్రూక్ 86, ప్లిమ్మర్ 39; దీప్తి శర్మ 3/39, ప్రియ 2/41).

భారత్: 44.2 ఓవర్లలో 236/4 (మంధాన 100, హర్మన్ 59 నాటౌట్; రో 2/47).

హైదరాబాద్ ఇన్నింగ్స్ గెలుపు

హైదరాబాద్: తనయ్ త్యాగరాజన్ (7/106) తిప్పేయడంతో.. తాజా రంజీ సీజన్‌లో హైదరాబాద్ తొలి విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-బీలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 50 పరుగుల తేడాతో పుదుచ్చేరిపై ఘన విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో 153 రన్స్ మాత్రమే చేసి..383 పరుగుల లోటుతో ఫాలో ఆన్ ఆడుతున్న పుదుచ్చేరి రెండో ఇన్నింగ్స్‌లో 333 వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 171/2తో నాలుగో రోజు ఆటను కొనసాగించిన పుదుచ్చేరి అదనంగా 162 పరుగులు జోడించింది. ఓపెనర్ గంగా శ్రీధర్ (106) శతకంతో పోరాడినా.. త్యాగరాజన్ దెబ్బకు క్రమం తప్పకుండా వికెట్లను చేజార్చుకొన్న పుదుచ్చేరి ఓటమిపాలైంది. ఆకాశ్ ఖర్గవే (31), అంకిత్ శర్మ (22 నాటౌట్), విఘ్నేశ్వరన్ (21) ఫర్వాలేదనిపించారు. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌ను 536/8 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. కాగా మరో మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు హిమాచల్ ప్రదేశ్ చేతిలో ఇన్నింగ్స్ తేడాతో ఓటమిపాలైంది.

వేడ్ రిటైర్మెంట్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా జట్టు వికెట్ కీపర్ మాథ్యూ వేడ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 2011లో అరంగేట్రం చేసిన వేడ్ ఈ ఏడాది టీ20 వరల్డ్‌కప్‌లో చివరిసారి ఆడాడు. అయితే ఆటగాడిగా వైదొలిగినా.. ఆసీస్ జట్టు అసిస్టెంట్ కోచ్‌గా మారనున్నాడు. వచ్చే నెలలో పాకిస్థాన్‌తో జరగబోయే టీ20, వన్డే సిరీస్‌లకు అతను వికెట్ కీపింగ్, ఫీల్డింగ్ కోచ్‌గా కొత్త బాధ్యతలు తీసుకోనున్నాడు. అయితే మరో రెండేళ్ల పాటు టాస్మేనియా తరఫున దేశవాళీ క్రికెట్‌లో కొనసాగుతానని 36 ఏళ్ల వేడ్ ప్రకటించాడు. అలాగే ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

విరాట్ నన్ను బ్లాక్ చేశాడు..

మ్యాక్స్‌వెల్



మెల్‌బోర్న్: గ్లెన్ మ్యాక్స్‌వెల్.. విరాట్ కోహ్లీ మధ్య చక్కటి స్నేహబంధం ఉంది. ఐపీఎల్‌లో ఇద్దరూ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడే విషయం తెలిసిందే. అయితే గతంలో వీరి మధ్య అంతగా సత్సంబంధాలు లేవు. ఓసారైతే సోషల్ మీడియాలో మ్యాక్సీని విరాట్ బ్లాక్ కూడా చేశాడట. ఇన్‌స్టాలో కోహ్లీని ఫాలో అవుదామనుకున్నప్పుడు తనను బ్లాక్ చేసిన విషయం తెలిసిందని మాక్సీ చెప్పాడు. భారత్‌లో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో విరాట్ రాంచీ టెస్టులో భుజం నొప్పితో బాధపడ్డాడు. ఆ సమయంలో విరాట్ ఏం చేశాడో.. దాన్నే అనుకరిస్తూ మ్యాక్స్ తన కుడి భుజంపై చేయి వేస్తూ నొప్పిని భరిస్తున్నట్టు నటించాడు. ఆ కోపంతో కోహ్లీ బ్లాక్ చేశాడట.

బాలన్ డీ ఓర్ విజేతలు రోడ్రి, బొన్మాంటి



పారిస్: ప్రతి ఏటా ఫుట్‌బాల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్లేయర్లకు ఇచ్చే ప్రతిష్ఠాత్మక బాలన్ డీ ఓర్ అవార్డు ఈసారి స్పెయిన్‌ను వరించింది. ఆ దేశానికి చెందిన మిడ్‌ఫీల్డర్లు రోడ్రి (మాంచెస్టర్ యునైటెడ్ క్లబ్), ఐతానా బొన్మాంటి (బార్సిలోనా క్లబ్) పురుషులు, మహిళల విభాగాల్లో ఈ పురస్కారాన్ని గెలుచుకున్నారు. రోడ్రి తొలిసారి ఈ అవార్డును అందుకోగా.. బొన్మాంటికిది వరుసగా రెండో పురస్కారం. కాగా పురుషుల విభాగంలో ఈ అవార్డును మెస్సీ 8 సార్లు, క్రిస్టియానో రొనాల్డో ఐదుసార్లు గెల్చుకున్నారు.

హర్షిత్ రాణాకు పిలుపు



ముంబై: న్యూజిలాండ్‌తో చివరిదైన మూడో టెస్టు కోసం పేసర్ హర్షిత్ రాణాను ఎంపిక చేశారు. ఇప్పటికే భారత జట్టు రెండు టెస్టులను కోల్పోయిన విషయం తెలిసిందే. దీంతో 18 వరుస టెస్టు సిరీస్‌ల విజయాలకు కూడా బ్రేక్ పడినట్టయ్యింది. ఇటీవల రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ఢిల్లీ పేసర్ హర్షిత్ అసోంపై ఏడు వికెట్లతో పాటు అర్ధసెంచరీతో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చాడు. బుధవారం అతను జట్టులో చేరనున్నాడు. ఇక, శుక్రవారం నుంచి జరిగే ఆఖరి టెస్టు తుది జట్టులో బుమ్రాకు విశ్రాంతినిచ్చి రాణాకు చోటు కల్పించనున్నట్టు సమాచారం.

ముంబై టెస్టుకూ కేన్ దూరం: న్యూజిలాండ్ వెటరన్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ భారత్‌తో చివరి టెస్టుకు కూడా దూరమయ్యాడు. శ్రీలంక టూర్‌లో గాయపడిన కేన్ స్వదేశంలో కోలుకుంటున్నాడు. అయితే రాబోయే ఇంగ్లండ్‌తో సిరీస్‌కు పూర్తి స్థాయిలో ఫిట్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాడని కివీస్ కోచ్ గ్యారీ స్టీడ్ తెలిపాడు.



సీఎంను కలిసిన కిడాంబి, హరి,వంశీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశాడు. త్వరలో జరిగే తన వివాహానికి రావాల్సిందిగా సీఎంను కిడాంబి ఆహ్వానించాడు. ఇటీవల చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణం నెగ్గిన భారత జట్టులో సభ్యుడైన గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ, దక్షిణాఫ్రికా కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణం సాధించిన క్రీడాకారుడు వంశీ కూడా సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరిని సీఎం అభినందించారు.

ఒలింపియాడ్ విజేతలకు సత్కారం



హైదరాబాద్: యువత ఆటలు ఆడాలి.. ఆస్వాదించాలని తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి సూచించాడు. ప్రవాహ ఫౌండేషన్, మైత్రా ఎనర్జీస్ ఆధ్వర్యంలో చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణాలు సాధించిన భారత ప్లేయర్లు హరికృష్ణ, హారిక, శ్రీనాథ్, అర్జున్ ఇరిగేసి, వంతిక అగర్వాల్‌ను ఘనంగా సన్మానించారు. చెస్ క్రీడాకారులకు ప్రవాహ అందిస్తున్న సహాయాన్ని హరికృష్ణ కొనియాడాడు. మరిన్ని కార్పొరేట్ సంస్థలు చెస్‌ను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశాడు.

బోపన్న జోడీకి ఏటీపీ ఫైనల్స్ బెర్త్

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ డబుల్స్ వెటరన్ స్టార్ రోహన్ బోపన్న ప్రతిష్ఠాత్మక ఏటీపీ ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. ఆస్ట్రేలియా భాగస్వామి మాథ్యూ ఎబ్డెన్ జతగా బోపన్నకు డబుల్స్ బెర్త్ దక్కింది. నాథనిల్ లమాన్స్ - జాక్సన్ విత్రూ జోడీ పారిస్ మాస్టర్స్ నుంచి నిష్క్రమించడంతో ర్యాంకింగ్ ఆధారంగా బోపన్న-ఎబ్డెన్ జంటకు ఏటీపీ ఫైనల్స్ బెర్త్ ఖరారైంది. సింగిల్స్, డబుల్స్ నుంచి టాప్ ఎనిమిది మంది ఆటగాళ్లు మాత్రమే పోటీపడే ఏటీపీ ఫైనల్స్ వచ్చేనెల 10 నుంచి ఇటలీలోని ఇనాల్పీ ఎరీనాలో జరగనుంది.

బెంగళూరుకు తొలి గెలుపు

హైదరాబాద్: ప్రో కబడ్డీ లీగ్‌లో బెంగళూరు బుల్స్ నాలుగు వరుస ఓటముల తర్వాత బోణీ చేసింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 34-33తో దబాంగ్ ఢిల్లీపై గెలిచింది. చివరగా రైడ్‌కు వచ్చిన అషు మాలిక్‌ను టాకిల్ చేసిన సౌరభ్ జట్టుకు తొలి విజయాన్ని అందించాడు. బుల్స్ రైడర్ జై భగవాన్ 11 పాయింట్లు సాధించాడు. ఢిల్లీ తరఫున అషు మాలిక్ 13 పాయింట్లు స్కోర్ చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. కాగా, బెంగాల్ వారియర్స్ వరుసగా రెండో మ్యాచ్‌ను టై చేసుకొంది. బెంగాల్-పుణెరి పల్టన్ మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్ 32-32తో డ్రా ముగిసింది.

జోర్జి, స్టబ్స్ సెంచరీలు

దక్షిణాఫ్రికా 307/2
బంగ్లాతో రెండో టెస్ట్

చిట్టోగ్రామ్: టోనీ డి జోర్జి (141 బ్యాటింగ్), స్టబ్స్ (106) శతకాలతో అదరగొట్టడంతో.. బంగ్లాదేశ్‌తో మంగళవారం మొదలైన రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 307/2 స్కోరు చేసింది. మార్‌క్రమ్ (33), స్టబ్స్‌ను తైజుల్ ఇస్లాం అవుట్ చేశాడు.



ధనత్రయోదశికి పసిడి డీలా

విక్రయాల్లో 10% తగ్గుదల!?
అధిక ధరలే ప్రధాన కారణం

న్యూఢిల్లీ: ధనత్రయోదశి పర్వదినాన బంగారం, వెండి వంటి విలువైన లోహాలు లేదా లోహ పాత్రలు కొనుగోలు చేయడం హిందువులకు సంప్రదాయంగా వస్తోంది. అయితే, ఈ ధనత్రయోదశికి పసిడి విక్రయాలు అంతంత మాత్రంగానే నమోదైనట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. బులియన్ ధరలు రికార్డు స్థాయికి ఎగబాకడమే ఇందుకు కారణం. గత ఏడాదితో పోలిస్తే, ఈసారి ధంతేరస్ పసిడి విక్రయాల పరిమాణం (వాల్యూమ్) 10 శాతం తగ్గి ఉండవచ్చని ఆల్ ఇండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ ఛైర్మన్ సయం మెహ్రా అంచనా వేశారు. విక్రయాల విలువ మాత్రం 20 శాతం వరకు పెరిగి ఉండవచ్చన్నారు. ఎందుకంటే, గడిచిన ఏడాది కాలంలో పసిడి ధర 33 శాతం పెరిగింది. గత ధనత్రయోదశి నాడు (2023 నవంబరు 11) ఢిల్లీ మార్కెట్లో రూ.61,200గా ఉన్న 10 గ్రాముల పసిడి (24 క్యారెట్లు) రేటు.. ఈ సారి పండగ రోజున (మంగళవారం) రూ.81,400 పలికింది. కిలో వెండి సైతం రూ.74,000 నుంచి రూ.99,700 స్థాయికి (35 శాతం వృద్ధి) ఎగబాకింది. ఈసారి ధనత్రయోదశి మంగళవారం ప్రారంభమై బుధవారం మధ్యాహ్నం 1.11 గంటల వరకు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో బుధవారం మరిన్ని విక్రయాలు జరగవచ్చని ఆభరణ వర్తకులు ఆశావహంగా ఉన్నారు. ధర బాగా పెరగడంతో చాలామంది కస్టమర్లు తక్కువ బరువున్న చైన్లు, చెవి దిద్దులు, బ్రేస్‌లెట్ కొనుగోలు చేసినట్లు మెహ్రా చెప్పారు.

రూ.10తో పసిడిలో పెట్టుబడి

జియో ఫైనాన్స్ యాప్ స్మార్ట్ గోల్డ్ ఆఫర్

తులం బంగారం రూ.81,000కు చేరిన తరుణంలోనూ కేవలం పది రూపాయలతో బంగారం కొనుగోలు చేయొచ్చు. ఎలాగంటారా..? జియో ఫైనాన్స్ యాప్ స్మార్ట్‌గా గోల్డ్‌లో పెట్టుబడి పెట్టే వీలు కల్పిస్తోంది. తమ యాప్ ద్వారా భద్రంగా, అవాంతరాల్లేకుండా డిజిటల్ రూపంలో బంగారాన్ని అతి తక్కువ మొత్తంలో (రూపాయల్లో లేదా గ్రాముల్లో) కొనుగోలు చేయవచ్చని జియో ఫైనాన్స్ యాప్ వెల్లడించింది. తిరిగి ఆ పెట్టుబడిని నగదు, గోల్డ్ కాయిన్ లేదా స్వర్ణాభరణం రూపంలో ఉపసంహరించుకునే వీలుంటుందని తెలిపింది. అంతే కాదు, యాప్ ద్వారా గోల్డ్ కాయిన్‌ను ఆర్డర్ చేసి, ఇంటి వద్దకు డెలివరీ పొందే సౌకర్యాన్నీ కల్పిస్తోంది.

6 నెలల్లో రూ.50,400 కోట్లు

మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్ ఎగుమతుల్లో 33 % వృద్ధి

న్యూఢిల్లీ: ఈ ఏడాది సెప్టెంబరుతో ముగిసిన 6 నెలల్లో యాపిల్ 600 కోట్ల డాలర్ల (రూ.50,400 కోట్లు) విలువైన మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లను ఎగుమతి చేసింది. గత ఏడాదిలో ఇదే కాలంతో పోలిస్తే ఎగుమతులు 33 శాతం వృద్ధి చెందాయి. ప్రస్తుత ట్రెండ్‌ను బట్టి చూస్తే, ఈ ఆర్థిక సంవత్సరంలో మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్ ఎగుమతులు 1,000 కోట్ల డాలర్ల స్థాయిని సునాయసంగా దాటే అవకాశం ఉంది. చైనాపై ఆధారపడటం తగ్గించి భారత్‌లో ఉత్పత్తి పెంచడంపై యాపిల్ దృష్టి సారించడం ఇందుకు దోహదపడింది. యాపిల్‌కు భారత్‌లో కీలక సరఫరాదారులైన ఫాక్స్‌కాన్ టెక్నాలజీ, పెగట్రాన్ కార్ప్, టాటా ఎలక్ట్రానిక్స్ తమ అసెంబ్లింగ్ యూనిట్ల ద్వారా సామర్థ్య విస్తరణకు తోడ్పడుతున్నాయని బ్లూంబర్గ్ కథనం పేర్కొంది.

ఒక్క షేరు రూ.2.36 లక్షలు

జెట్ స్పీడ్‌లో దూసుకుపోయిన ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ స్టాక్

- దేశీయ స్టాక్ మార్కెట్లో సరికొత్త రికార్డు
- రూ.లక్ష పెట్టుబడితో రూ.670 కోట్ల రిటర్నులు



ముంబై: అదో బుల్లి (మైక్రో క్యాప్) కంపెనీ. పేరు ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్స్. బీఎస్ఈలో మాత్రమే ఈ కంపెనీ షేరు అతి అరుదుగా అది కూడా అతి తక్కువ స్థాయిలో ట్రేడయ్యేవి. అలాంటి ఈ కంపెనీ షేరు ధర మంగళవారం అమాంతం ఎంఆర్ఎఫ్ కంపెనీ షేరు ధరను మించిపోయి సరికొత్త రికార్డు సృష్టించింది. నిన్న మొన్నటి వరకు బీఎస్ఈలో ఎల్సిడ్ షేరు రూ.3.6 కంటే దిగువనే ట్రేడయ్యేవి. సోమవారం కూడా రూ.3.53 వద్ద ముగిసింది. మంగళవారం ఒక్కసారిగా రేసుగుర్రంలా పరుగెత్తి రూ.2,36,250 వద్ద ముగిశాయి. అంటే సోమవారం రూ.3.53 వద్ద రూ.లక్ష పెట్టుబడితో ఈ కంపెనీ షేర్లు కొన్న మదుపరుల సంపద.. ఒక్కరోజు తిరిగే సరికి 66,92,535 శాతం లాభంతో రూ.670 కోట్లకు చేరింది. ప్రస్తుతం భారత స్టాక్ మార్కెట్లో ఇంత భారీ ధర వద్ద మరే లిస్టెడ్ కంపెనీ షేరు ట్రేడవడం లేదు. ఇప్పటి వరకు ఈ రికార్డును సొంతం చేసుకున్న ఎంఆర్ఎఫ్ కంపెనీ షేరు కూడా మంగళవారం డీలా పడి బీఎస్ఈలో రూ.1,22,576.5 వద్ద క్లోజైంది.

ఇదీ కథ: ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఒక ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ. స్టాక్ ఎక్స్ఛేంజీలు ఈ కంపెనీ షేరును అల్లా టప్పా (పెన్నీ) స్టాక్‌గా ప్రకటించాయి. ప్రస్తుతం ఈ కంపెనీ చేస్తున్న వ్యాపారమంటూ ఏమీ లేదు. అయితే ఏషియన్ పెయింట్స్‌తో పాటు అనేక ఫ్రంట్‌లైన్ కంపెనీల షేర్లలో ఈ కంపెనీకి పెద్ద మొత్తంలో పెట్టుబడులు ఉన్నాయి. వాటి విలువే రూ.11,000 కోట్ల వరకు ఉంటుంది. దీంతో రూ.10 ముఖ విలువ ఉన్న ఈ కంపెనీ షేరు బుక్ వాల్యూ ప్రస్తుతం రూ.5,84,225గా ఉంది. బుక్ వాల్యూకి, మార్కెట్ ధరకు ఏ మాత్రం పొంతన లేదు. దీంతో ఇలాంటి ఇన్వెస్ట్‌మెంట్, ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ కంపెనీల షేర్ల అసలు ధర కనుక్కునేందుకు స్పెషల్ కాల్ ఆక్షన్ పద్ధతిలో వేలం నిర్వహించాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఈ ఏడాది జూన్‌లో స్టాక్ ఎక్స్ఛేంజీలను కోరింది. అందుకు అనుగుణంగా బీఎస్ఈ మంగళవారం ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ కంపెనీ షేర్లలో ప్రత్యేక కాల్ ఆక్షన్ నిర్వహించింది. దీంతో ఈ కంపెనీ షేర్ల ధర రాకెట్ వేగంతో దూసుకుపోయాయి.

ఇంకా తక్కువే

అయితే ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ షేరు ప్రస్తుత మార్కెట్ ధరకు, బుక్ వాల్యూకీ ఇప్పటికీ ఏ మాత్రం పొంతన కుదరడం లేదు. బుక్ వాల్యూ రూ.5,84,225 ఉంటే.. మార్కెట్ ధర రూ.2,36,250 మాత్రమే. గత రెండు వారాల్లో ట్రేడైన సగటు షేర్ల పరిమాణం కూడా 377 మించలేదు. ప్రత్యేక కాల్ ఆక్షన్ జరిగిన మంగళవారం నాడు కేవలం 279 షేర్లు మాత్రమే చేతులు మారాయి. ప్రస్తుతం కంపెనీ మొత్తం ఈక్విటీ (42,41,143 షేర్లు)లో 72.23 శాతం ప్రజల (పబ్లిక్) వద్ద ఉండగా 27.77 శాతం వాటా మాత్రమే ప్రమోటర్ల వద్ద ఉంది. అయినా ట్రేడింగ్ జరిగిన, జరుగుతున్న షేర్ల పరిమాణం అతి తక్కువ స్థాయిలోనే ఉండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. బహుశా ప్రమోటర్లు లేదా వారి కనుసన్నల్లో పనిచేసే బ్రోకర్లు ఈ కౌంటర్‌ను ఆపరేట్ చేస్తున్నారేమో అనే గుసగుసలూ వినిపిస్తున్నాయి. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ప్రైస్ టు బుక్ వాల్యూ ధర ఆకర్షణీయంగా ఉందని మురిసిపోయి, ఏ మాత్రం లిక్విడిటీ లేని ఈ కంపెనీ షేర్లలో పెట్టుబడి పెట్టడం ఏ మాత్రం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రెండో రోజూ లాభాలే

దేశీయ స్టాక్ మార్కెట్లో వరుసగా రెండో రోజూ రిలీఫ్ ర్యాలీ కొనసాగింది. ఆరంభంలో నష్టాలతో ప్రారంభమైన మార్కెట్ మధ్యాహ్నం నుంచి కోలుకుంది. చివరికి సెన్సెక్స్ 363.99 పాయింట్ల లాభంతో 80,369.03 వద్ద, నిఫ్టీ 127.70 పాయింట్ల లాభంతో 24,466.85 వద్ద క్లోజయ్యాయి. బ్యాంకింగ్, ఆయిల్ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు మంగళవారం సూచీలను లాభాల బాట నడిపించాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,450 ▲	73,750 ▲	1,06,900 ▼
ముంబై	78,745 ▲	72,130 ▲	97,873 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	123	విజయవాడ	120
వరంగల్	123	గుంటూరు	123
కరీంనగర్	123	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	123	చిత్తూరు	126
కర్నూలు	123	నెల్లూరు	126
విశాఖపట్నం	107	అనంతపురం	126
గోదావరి	120		

బిజినెస్

18 % తగ్గిన మారుతి లాభం

న్యూఢిల్లీ: సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) లాభం 18 శాతం క్షీణించి రూ.3,102 కోట్లకే పరిమితమైంది. ఇండెక్సేషన్ ప్రయోజనాలు ఉపసంహరించడంతో అధిక ప్రావిజనింగ్ చేయాల్సి రావడం, దీర్ఘకాలిక పెట్టుబడి లాభాల పన్నులో చేసిన మార్పులే ఈ క్షీణతకు కారణమని తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.3,786 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో ఆదాయం స్వల్పంగా పెరిగి రూ.37,339 కోట్ల నుంచి రూ.37,449 కోట్లకు చేరింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన లాభం రూ.3,716 కోట్ల నుంచి రూ.3,069 కోట్లకు తగ్గింది. త్రైమాసికంలో కంపెనీ నికరంగా రూ.35,589 కోట్ల విలువ గల కార్లు విక్రయించింది.

ఎంటార్ టెక్ లాభం 19 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఎంటార్ టెక్నాలజీస్ రూ.190.20 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.18.8 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 48.3 శాతం వృద్ధి చెందగా లాభం 324 శాతం పెరిగింది. సెప్టెంబరు త్రైమాసికంలో అంచనాలకు తగ్గట్టుగానే కంపెనీ పనితీరును కనబరిచామని, రానున్న త్రైమాసికాల్లో ఇదే జోరును కనబరచవచ్చని భావిస్తున్నట్లు ఎంటార్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

జియో పేమెంట్ సొల్యూషన్స్‌కు ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్ లైసెన్సు

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన ఎన్‌బీఎఫ్‌సీ జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అనుబంధ సంస్థ జియో పేమెంట్ సొల్యూషన్స్ లిమిటెడ్ (జేపీఎస్ఎల్)కు ఆర్‌బీఐ నుంచి ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్ లైసెన్సు లభించింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్ 2007లోని సెక్షన్ 7 ప్రకారంగా జేపీఎస్ఎల్‌కు ఈనెల 28 నుంచి అమలులోకి వచ్చేలా ఆర్‌బీఐ లైసెన్సు మంజూరు చేసిందని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ మంగళవారం వెల్లడించింది.

కెనరా బ్యాంక్ లాభం రూ.4,015 కోట్లు

- క్యూ2 లాభంలో 11 శాతం వృద్ధి
- మొత్తం ఆదాయం రూ.34,721 కోట్లుగా నమోదు


బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్.. సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికాని(క్యూ2)కి గాను నికర లాభం 11 శాతం వృద్ధి చెంది రూ.4,015 కోట్లుగా నమోదైందని కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు వెల్లడించారు. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంక్ నికర లాభం రూ.3,606 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.31,742 కోట్ల నుంచి రూ.34,721 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో బ్యాంక్ వడ్డీ ఆదాయం రూ.26,838 కోట్ల నుంచి రూ.29,740 కోట్లకు చేరుకుందని ఆయన తెలిపారు. కాగా సెప్టెంబరు ముగిసే నాటికి బ్యాంక్ గ్లోబల్ వ్యాపారం 9.42 శాతం వృద్ధి చెంది రూ.23,59,344 కోట్లకు చేరిందన్నారు. అలాగే మొత్తం డిపాజిట్లు 9.34 శాతం పెరిగి రూ.13,47,347 కోట్లకు, మొత్తం అడ్వాన్సులు 9.53 శాతం వృద్ధితో రూ.10,11,997 కోట్లకు చేరుకున్నాయన్నారు. కాగా కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం రూ.3,798 కోట్ల నుంచి రూ.4,188 కోట్లకు పెరిగింది.

తగ్గిన మొండి బకాయిలు

సెప్టెంబరు త్రైమాసికంలో బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 4.76 శాతం నుంచి 3.73 శాతానికి తగ్గినట్లు సత్యనారాయణ రాజు వెల్లడించారు. నికర ఎన్‌పీఏలు కూడా 1.41 శాతం నుంచి 0.99 శాతానికి తగ్గాయి. కాగా ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి 90.89 శాతంగా ఉంది. క్యాపిటల్ అడిక్వసీ రేషియో (సీఏఆర్) 16.20 శాతం నుంచి 16.57 శాతానికి పెరిగింది.

త్వరలో కెనరా రొబేకో ఐపీఓకి అనుమతి

మ్యూచువల్ ఫండ్ సంస్థ కెనరా రొబేకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ).. పబ్లిక్ ఇష్యూకి త్వరలో ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి లభించే అవకాశం ఉందని బ్యాంక్ సీఈఓ, ఎండీ సత్యనారాయణ రాజు తెలిపారు. ఇప్పటికే ఈ ఐపీఓ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) ప్రక్రియ పూర్తయిందని ఆయన పేర్కొన్నారు. వచ్చే పదిహేను రోజుల్లో ఆర్థిక సేవల శాఖ నుంచి ఈ ఇష్యూకి అనుమతి రావచ్చని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం కెనరా రొబేకో ఏఎంసీలో కెనరా బ్యాంక్‌కు 51 శాతం వాటా ఉంది. ఐపీఓ ద్వారా బ్యాంక్ 13 శాతం వాటాలను విక్రయించాలని భావిస్తోంది.

ఏప్రిల్‌లోనే ఎంట్రెన్స్‌లు!

నెల ముందుగానే నిర్వహించే యోచన

అడ్డిషన్లలో జాప్యాన్ని నివారించేందుకే..

ప్రవేశ పరీక్షల సెట్లకు త్వరలో కొత్త కమిటీలు

1-2 రోజుల్లో అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఎంపిక

మూడు పేర్లతో సెర్చ్ కమిటీ జాబితా

గవర్నర్ ఆమోదం తర్వాత ప్రకటన 12

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 30-10-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 213

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి మ. 1.16 తదుపరి చతుర్దశి; నక్షత్రం: హస్త రా. 9.43 తదుపరి చిత్త వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 11.35-12.21; అమృతఘడియలు: మ. 2.55-4.44; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.16; సూర్యాస్తమయం: 5.40 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

1 అవినీతి పర్వం

లంచం కొట్టు.. జీతం పట్టు!

రూ.15 లక్షలు ఇస్తేనే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు

కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏవో, జూనియర్ అసిస్టెంట్ డిమాండ్

ఏసీబీకి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ఫిర్యాదు

నిందితులను పట్టుకున్న అధికారులు

3



ఏసీబీకి పట్టుబడిన ఏవో ఖలీలుల్లా, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్

1 నకిలీలలు

సబ్ రిజిస్ట్రార్ అరెస్ట్

నకిలీ రిజిస్ట్రేషన్ కేసులో 14 రోజుల రిమాండ్

తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రంతో భూ రిజిస్ట్రేషన్

యజమాని బతికుండగానే మరొకరికి బదలాయింపు



సబ్ రిజిస్ట్రార్ జ్యోతి

జీడిమెట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నకిలీ రిజిస్ట్రేషన్ కేసులో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన వుజ్జిని జ్యోతిని జీడిమెట్ల పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మేడ్చల్ జడ్జి ఆమెకు 14 రోజుల రిమాండ్ విధించారు. హైదరాబాద్‌లోని ఉప్పుగూడ ప్రాంతంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన లెంద్యాల సురేశ్‌కు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని

మిగతా 14వ పేజీలో...

1 అరాచకం

తిహాడ్ జైలు వార్డెన్ డ్రగ్స్ దందా

మాదక ద్రవ్యాల కేసులో జైలుకొచ్చిన ఓ వ్యక్తితో పరిచయం

అతడు విడుదలయ్యాక కలిసి వ్యాపారం

డ్రగ్స్ ల్యాబ్ నెలకొల్పి పెద్ద ఎత్తున తయారీ

సమాచారం తెలిసి ఎన్‌సీబీ దాడి..

వీరితో పాటు మరో ఇద్దరి అరెస్టు

వందల కోట్ల విలువైన 95కిలోల డ్రగ్స్ సీజ్

2



డ్రగ్స్ ల్యాబ్‌లో పోలీసుల సోదాలు

కేటీఆర్‌తోనే కేసీఆర్ రాజకీయానికి ముగింపు

కేసీఆర్ ఎక్స్‌పైరీ మెడిసిన్. ఎన్నికల ముందే ఇది చెప్పాను. కేసీఆర్‌ను మరిపించేందుకే ఇప్పుడు కేటీఆర్‌ను ప్రస్తావిస్తున్నాం. కేటీఆర్‌తోనే కేసీఆర్ రాజకీయం ముగుస్తుంది. ఆ తర్వాత బావ(హరీశ్‌రావు)తో బామ్మర్ది (కేటీఆర్) రాజకీయం ముగుస్తుంది. ఇక బావను ఎలా హ్యాండిల్ చేయాలో మాకు తెలుసు.

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మూసీపై ముందుకే!

ఈ ప్రాజెక్టుతో మరో నగరాన్ని సృష్టిస్తాం



తొలి దశలో 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి

బాపూ ఘాట్ వద్ద అతి పెద్ద గాంధీ విగ్రహం

బెంగళూరు జిందాల్ తరహాలో ప్రకృతి చికిత్స కేంద్రం

స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్ ఆఫ్ క్యాంపస్ సెంటర్ ఏర్పాటు

వినోదానికి లండన్ ఐ తరహాలో భారీ జెయింట్ వీల్

చెక్ డ్యాం కమ్ వంతెన.. 30 కిలోమీటర్ల రింగ్

ఇక్కడ గజం 10 వేలు ఉంటే 5 లక్షలు కూడా కావచ్చు

ప్రాజెక్టుపై ప్రజలకు 45 రోజుల్లో ప్రజంటేషన్

ఆరున్నర ఏళ్లలో మొత్తం ప్రాజెక్టు అభివృద్ధి

అభివృద్ధి కోసం నిద్రలేని రాత్రులు గడుపుతూ కృషి

రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గడానికి హైడ్రా కారణం కాదు

ఎంపికైన గ్రూప్-1 అభ్యర్థుల్లో 52% బీసీలే.. ఓసీలు 9%

రాజకీయంగా కోరుకునేదేం లేదు.. తిరిగివ్వడమే..

విలేకరులతో ఇష్టాగోష్ఠిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): "మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ముందుకే వెళతాం. దశలవారీగా చేపడతాం. ఈ ప్రాజెక్టుతో ఇంకో నగరాన్నే సృష్టిస్తాం. మిగతా నగరమంతా పగలు నడిస్తే.. మూసీ ఒడ్డున నిర్మించే నగరం మాత్రం రాత్రి నడుస్తుంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. మొత్తం ప్రాజెక్టును ఆరున్నరేళ్లలో పూర్తి చేస్తామన్నారు. మూసీ ప్రాజెక్టు ప్రణాళిక వచ్చిన తర్వాత వికారాబాద్ నుంచి వాడపల్లి (మూసీ నది కృష్ణా నదిలో కలిసే చోటు) వరకు తాను పాదయాత్రకు సిద్ధమని, కేటీఆర్, హరీశ్ రావు, ఈటల రాజేందర్ సిద్ధమేనా? అని సవాల్ విసిరారు. తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తొలి దశలో.. మూసీ, ఈసీ నదులు కలిసే బాపూఘాట్ సంగమం వరకూ ప్రక్షాళన చేసి అభివృద్ధి చేస్తామన్నారు. "మూసీ నది గండిపేట నుంచి 11.5 కిలోమీటర్లు, ఈసీ నది హిమాయత్ సాగర్ నుంచి 9.5 కిలోమీటర్లు ప్రవహించి బాపూఘాట్ వద్ద కలుస్తాయి. తొలి దశలో ఆ ప్రాంతాన్ని ప్రక్షాళన చేస్తాం. బాపూజీ సిద్ధాంతం, ఆరోగ్యం, విద్య, వినోదం.. ఈ నాలుగు అంశాల థీమ్‌తో బాపూఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తాం. ఇక్కడ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన గాంధీజీ విగ్రహం ఏర్పాటు చేస్తాం. గాంధీ ఐడియాలజీ కేంద్రాన్ని నిర్మిస్తాం. బెంగళూరులోని జిందాల్ ప్రకృతి ఆశ్రమం తరహాలో ఇక్కడ కూడా ప్రకృతి చికిత్స ఆశ్రమం నిర్మిస్తాం. స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలకు చెందిన ఆఫ్ క్యాంపస్ సెంటర్‌ను ఇక్కడ ప్రారంభిస్తాం. ఇక, వినోదం కోసం లండన్‌లో థేమ్స్ నది ఒడ్డున ఉన్న 'లండన్ ఐ' వంటి భారీ జెయింట్ వీల్‌ను ఏర్పాటు చేస్తాం. బాపూఘాట్ వద్ద చెక్‌డ్యాం కమ్ వంతెన నిర్మిస్తాం. అక్కడి నుంచి కిందకు మూసీలోకి వదిలే నీరు స్వచ్ఛంగా ఉండేలా చూస్తాం. 30 కిలోమీటర్ల మేర రింగ్‌ను అభివృద్ధి చేస్తాం" అని వివరించారు. పర్యావరణ హిత థీమ్ పార్క్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి రోజు లక్ష మంది సందర్శించేలా పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మల్లన్న సాగర్ నుంచి గండిపేటకు.. అక్కడి నుంచి హిమాయత్ సాగర్‌కు గోదావరి నీటిని తరలించేందుకు ట్రంక్ లైన్ నిర్మాణం కోసం నవంబరు మొదటి వారంలో టెండర్లను పిలుస్తామన్నారు. బాపూఘాట్ పైభాగంలో వచ్చి కలిసే నీటిని శుద్ధి చేసేందుకు అవసరమైన ఎస్‌టీపీల నిర్మాణానికి టెండర్లు పిలుస్తామన్నారు.

ప్రణాళికే పెట్టుబడి.. డబ్బులు ప్రైవేటువే

మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "ఈ అభివృద్ధి ప్రణాళికే

మిగతా 13వ పేజీలో...

అమ్మ ఆవేదన!

అవన్నీ కుటుంబ ఆస్తులే.. షర్మిలకూ ఇవ్వాలి

గిఫ్టుగా కాదు... అది జగన్ బాధ్యత

విజయలక్ష్మి బహిరంగ లేఖ

వైవీ, సాయిరెడ్డి అబద్ధాలు చెబుతున్నారు

షర్మిలకు ఇప్పటిదాకా ఆస్తులు పంచివ్వలేదు

వైఎస్ ఉండగా కొన్ని ఆస్తులు ఇద్దరి పేరిట పెట్టారు

అది షర్మిలకు ఆస్తులు పంచి ఇచ్చినట్లు కాదు

విడిపోదామని 2019లో జగనే చెప్పారు

ఎంవోయూ కూడా రాసిచ్చారు కానీ...

తక్షణం ఇస్తామన్నవీ ఇప్పటికీ ఇవ్వలేదు

వ్యాపారాల్లోకి షర్మిలను రానివ్వలేదు

అయినా నిస్వార్థంగా జగన్ కోసం కష్టపడింది

అధికారంలోకి రావడంలో ఆమె పాత్ర ఎంతో!

ఇకనైనా అసత్య ప్రచారం ఆపండి

షర్మిలకు జగన్ అన్యాయంపై ఆక్రోశం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అన్నా చెల్లెలి మధ్య కొన్నేళ్లుగా అంతర్గతంగా, కొన్నాళ్లుగా బహిరంగంగా సాగుతున్న వివాదంపై తల్లి విజయలక్ష్మి తొలిసారిగా తన భావాలను అందరితో పంచుకున్నారు. 'వైఎస్ రాజశేఖర రెడ్డిని అభిమానించే వారికి...' అంటూ మంగళవారం మూడు పేజీల బహిరంగ లేఖ రాశారు. తమ కుటుంబ ఆస్తులకు సంబంధించి వైఎస్ అంతరంగం, ఆదేశాలతోపాటు తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. షర్మిలకు జగన్ అన్యాయం చేస్తున్నారని స్పష్టం చేశారు. జగన్ తరఫున వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. ఆడిటర్‌గా విజయసాయి రెడ్డి, ఇంటి బంధువుగా వైవీ సుబ్బారెడ్డికి అన్నీ తెలిసీ ఇలా మాట్లాడటం బాధాకరమన్నారు. 'ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు' అని హెచ్చరించారు. ఇప్పటికీ తాను స్పందించకపోతే ఈ వివాదం, అసత్యాల పరంపర కొనసాగుతుందని.. అందుకే ఈ లేఖ రాయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కాగా, తమ తండ్రి వైఎస్ జీవించి ఉండగా ఉన్న కుటుంబ

మిగతా 14వ పేజీలో...



తల్లిదండ్రులకు పిల్లలంతా సమానమే! కానీ... ఒక బిడ్డ మరో బిడ్డకు అన్యాయం చేస్తుంటే చూసి తట్టుకోవడం చాలా కష్టం. అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన ఉండి మాట్లాడటం తల్లిగా నా విధి. నా ధర్మం..

- వైఎస్ విజయలక్ష్మి

బహిరంగ లేఖ పూర్తి పాఠం.. 14



వృద్ధులకు రూ.5 లక్షల

ఆరోగ్య బీమా

70 ఏళ్లు దాటిన వారందరికీ..

పేద, ధనిక భేదాల్లేకుండా

అన్ని వర్గాలకూ వర్తింపు

ఇప్పటికే ఆయుష్మాన్ భారత్‌లో ఉన్నవారికి మరో రూ.5 లక్షలు

ప్రారంభించిన ప్రధాని మోదీ

రూ.12,850 కోట్లతో ఆరోగ్య రంగంలో ప్రాజెక్టులు ప్రారంభం

రాజకీయ లబ్ధికే ఢిల్లీ, బెంగాల్ ఆయుష్మాన్‌లో చేరలేదు

ఆ రాష్ట్రాల వృద్ధులకు ఆరోగ్య సేవలు అందడం లేదు

క్షమించండి: ప్రధాని మోదీ

2

పూచీ ఇస్తేనే సీఎంఆర్

బ్యాంకు గ్యారెంటీ.. లేకపోతే 25% సెక్యూరిటీ డిపాజిట్

పూచీకత్తు ఇచ్చిన మిల్లర్లకే ఇకపై ధాన్యం కేటాయింపులు

డిఫాల్టర్లకు సీఎంఆర్ వడ్లు ఇవ్వొద్దని సర్కారు నిర్ణయం

మిల్లింగ్ చార్జీల పెంపు.. దొడ్డు వడ్లకు 30, సన్నాలకు 40

గడువులోగా బియ్యం ఇచ్చిన మిల్లర్లకే ఈ చార్జీల వర్తింపు

ధాన్యం సేకరణ పాలసీని విడుదల చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పూచీకత్తు లేకుండా రైస్‌మిల్లర్లకు రూ.కోట్ల విలువైన ధాన్యం అప్పగించే విధానానికి రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి చెప్పింది. ఇకపై బ్యాంకు గ్యారెంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ రూపంలో రైస్‌మిల్లర్లు ఆస్తులు తాకట్టు పెడితేనే ధాన్యం అప్పగించాలని నిర్ణయించింది. మంత్రివర్గ ఉప సంఘం నివేదిక, క్యాబినెట్ ఆమోదంతో జీవో-27 ను ప్రభుత్వం మంగళవారం జారీ చేసింది. ధాన్యం సేకరణ పాలసీని ప్రకటిస్తూ ఉత్తర్వులు వెలువరించింది. కొత్త పాలసీ ప్రకారం.. రైస్‌మిల్లర్లు పౌర సరఫరాల శాఖ నియంత్రణలో కస్టమ్ మిల్లింగ్ చేయాల్సి ఉంటుంది. మరోవైపు మిల్లింగ్ చార్జీలు సవరించి రైస్‌మిల్లర్లకు సర్కారు ఉపశమనం కలిగించింది. అయితే సకాలంలో సీఎంఆర్ డెలివరీ ఇచ్చిన మిల్లర్లకే పెంచిన చార్జీలు వర్తిస్తాయని ప్రభుత్వం షరతు పెట్టింది. కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) డెలివరీ ప్రాతిపదికన రైస్ మిల్లర్లను మూడు క్యాటగిరీలుగా ప్రభుత్వం



మిగతా 3వ పేజీలో...



ఫార్ములా-ఈ బాంబు!

రేసింగ్ వ్యవహారంలో విదేశీ సంస్థలకు 55 కోట్ల అడ్డగోలు చెల్లింపులు!

గత ప్రభుత్వ హయాంలో ఆర్థికశాఖ అనుమతి లేకుండానే తంతు

గుర్తించిన సర్కారు.. మునిసిపల్ శాఖ అలర్ట్.. ఏసీబీకి ఫిర్యాదు

దర్యాప్తునకు అనుమతి కోరుతూ ఏసీబీ లేఖ

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): "దీపావళికి టపాసులు పేలుతాయి.." అంటూ ఓ వైపు అధికార పార్టీ నాయకులు ప్రకటనలు చేస్తుండగా.. "కేసులతో ఇబ్బందులకు గురిచేసే కుట్రలు జరుగుతున్నాయి" అని విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో దీపావళికి రెండ్రోజుల ముందు 'ఫార్ములా-ఈ' బాంబు పేలింది. హైదరాబాద్ నగరంలో ఫార్ములా-ఈ రేసింగ్ నిర్వహణకు గత ప్రభుత్వంలో కీలక నాయకులు ప్రధాన పాత్ర పోషించారు. ఈ వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా.. విదేశీ సంస్థలకు నిధులు మళ్లాయని ప్రభుత్వం గుర్తించింది. దీంతో.. సమగ్ర దర్యాప్తు జరపాలంటే అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కి మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ

మిగతా 12వ పేజీలో...

మరో 103 విమానాలకు

బాంబు బెదిరింపులు

దేశవ్యాప్తంగా 16 రోజుల్లో 510 విమానాలకు..

మహారాష్ట్రలో ఓ వ్యక్తి అరెస్టు.. పలు విమానాలకు బెదిరింపు మెయిల్స్ చేసినట్టు పోలీసుల వెల్లడి

ఉగ్రవాదంపై గతంలో పుస్తకం రాసిన నిందితుడు

న్యూఢిల్లీ/ముంబై, అక్టోబరు 29: దేశవ్యాప్తంగా విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం 103 విమానాలకు బెదిరింపులు రావడం గమనార్హం. గడిచిన 16 రోజుల్లో మొత్తం 510 దేశీయ, అంతర్జాతీయ విమానాలకు బెదిరింపులు రాగా.. అవన్నీ ఉత్తుత్తివేనని తేలింది. ఈ బెదిరింపులన్నీ సోషల్ మీడియా ద్వారానే ఎక్కువగా వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎయిరిండియా విమానాలకు మంగళవారం సోషల్ మీడియా ద్వారానే బెదిరింపులు వచ్చాయి. ఈ బెదిరింపులపై సంబంధిత విభాగాలు తక్షణమే అప్రమత్తమయ్యాయని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నామని ఎయిరిండియా అధికార ప్రతినిధి తెలిపారు. ఎయిరిండియా, ఇండిగో, విస్తారా సంస్థల విమానాలకు ఎక్స్‌లో బెదిరింపులు రాగా.. గుర్తుతెలియని వ్యక్తులపై



మిగతా 2వ పేజీలో...



కేరళ ఆలయంలో

బాణసంచా పేలుడు

తొక్కిసలాట.. 154 మందికి గాయాలు

తెయ్యం ఉత్సవాల్లో అపశ్రుతి

ఆలయ ప్రాంగణంలోని షెడ్డులో పెద్ద ఎత్తున బాణసంచా నిల్వ.. నిప్పురవ్వలు పడి పేలుడు

2

హిజ్బుల్లా చీఫ్‌గా

కెమిస్ట్రీ ప్రొఫెసర్

30 ఏళ్లుగా డిప్యూటీగా పని చేసిన ఖాసిం

న్యాయశాస్త్రంపై అధ్యయనం.. పరిశోధనలు

గాజాలో శరణార్థి భవనంపై ఇజ్రాయెల్ దాడి

93 మంది పౌరుల దుర్మరణం

నలుగురు ఐడీఎఫ్ జవాన్ల మృతి

పాలస్తీనాకు భారత్ ఔషధ సాయం

2

స్టెంట్ల పరిశ్రమను వర్చువల్‌గా

ప్రారంభించిన మోదీ

బీబీనగర్ ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు కూడా..

ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలు

వైద్య పరికరాల ఉత్పత్తుల్లో రాష్ట్రాన్ని అగ్రగామి చేద్దాం

ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

13



కార్పొరేట్ ఆస్పత్రుల అనుమతులు..

సర్కారు చేతుల్లోకి?

ఇప్పటిదాకా డీఎంహెచ్‌వోల వద్దే అధికారం

ఇష్టారాజ్యంగా ఇస్తున్న జిల్లా వైద్యాధికారులు


పడకల సంఖ్యను బట్టి ప్రస్తుతం అనుమతులు

ఆ విధానాన్ని మార్చే ఆలోచనలో రాష్ట్ర సర్కారు

అనుమతుల ఫీజులూ భారీగా పెంచే యోచన

ఉన్నత స్థాయి కమిటీ వేసి అధ్యయనం

13



అతీంద్రియ శక్తులున్నాయనే ధీమాతో నాలుగో అంతస్తు నుంచి దూకేశాడు!

» ఓ ఇంజనీరింగ్ విద్యార్థి మూర్ఖపు చేష్ట.. తీవ్రగాయాలు.. తమిళనాడులో ఘటన



కోయంబత్తూర్, అక్టోబరు 29: తనకు అతీంద్రియ శక్తులున్నాయనే ధీమాతో ఆ ఇంజనీరింగ్ విద్యార్థి ప్రాణాలమీదకు తెచ్చుకున్నాడు. ఎత్తయిన భవనమ్మీద నుంచి కిందకు దూకేసినా తనకు ఏమీ కాదనే భావనతో అతడు ఏకంగా నాలుగంతస్తుల భవనం పై నుంచి జంప్ చేశాడు. ఈ ఘటన తమిళనాడు కోయంబత్తూర్ జిల్లా మైలారిపాలెంలో జరిగింది. తనకు దివ్య శక్తులున్నాయని భావించి.. మూర్ఖపు పని చేసిన ఆ విద్యార్థి, మెక్యూరు గ్రామానికి చెందిన 19 ఏళ్ల ప్రభు. బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం 6:30 గంటలకు తానుంటున్న హాస్టల్ భవనంపై నుంచి దూకాడు. తనకు అతీంద్రియ శక్తులేమీ లేవనే సంగతి ఆస్పత్రి పాలయ్యాక గానీ ప్రభు తెలుసుకోలేదు. చావుతప్పి కన్నులొట్టపోయినట్టు.. ప్రాణాపాయం తప్పినా అంతెత్తు నుంచి జంప్ చేయడంతో ప్రభుకు తల సహా ఇతర చోట్ల తీవ్రగాయాలయ్యాయి. తోటి విద్యార్థులు అతడిని చికిత్స కోసం సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించారు. సూపర్ హీరోల మాదిరిగా తనకు సూపర్ పవర్స్ ఉంటాయనే నమ్మకంతో ప్రభు ఈ పనిచేసినట్లు పోలీసులు వెల్లడించారు. తనకు దివ్య శక్తులున్నాయంటూ తరచూ అతడు తోటి విద్యార్థులతో చెప్పేవాడని పేర్కొన్నారు. పైగా తనకు గతవారం ఎవరో చేతబడి చేసినట్లుగా అతడు స్నేహితులకు చెప్పాడని వెల్లడించారు.

తిహాడ్ జైలు వార్డెన్ డ్రగ్స్ దందా

వందల కోట్ల విలువైన 95 కేజీల డ్రగ్స్ సీజ్


డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

న్యూఢిల్లీ, అక్టోబరు 29: గ్రేటర్ నోయిడాలో తిహాడ్ జైలు వార్డెన్ రహస్యంగా నడుపుతున్న మాదకద్రవ్యాల తయారీ ల్యాబ్ గుట్టురట్టయింది. ఢిల్లీకి చెందిన ఓ వ్యాపారవేత్తతో కలిసి ఆ వార్డెన్ ఇంతకాలం ఈ డ్రగ్ దందా నడిపారు. గౌతమ్‌బుద్ధ నగర్ జిల్లా కాసనా ఇండస్ట్రీయల్ ప్రాంతంలో అనధికార డ్రగ్ ల్యాబ్ ఉన్నట్లు సమాచారం అందడంతో ఇటీవల ఢిల్లీ పోలీసు ప్రత్యేక విభాగంతో కలిసి ఎన్‌సీబీ ఆ ప్రాంతంలో రైడ్స్ నిర్వహించింది. దాంతో ఈ డ్రగ్ ల్యాబ్ వ్యవహారం బట్టబయలైంది. రైడ్ సమయంలో ఢిల్లీ వ్యాపారి అక్కడే ఉన్నారు. తిహాడ్ జైలు వార్డెన్‌తో కలిసి ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ముంబైకి చెందిన ఓ కెమిస్ట్‌తో అక్కడ మెథాంపెటమైన్ డ్రగ్ తయారు చేయిస్తున్నారని, ఢిల్లీలో ఉంటున్న ఒక మెక్సికన్ డ్రగ్ సప్లయర్‌తో దాని నాణ్యత చెక్ చేయిస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ సోదాల్లో దాదాపు 95 కేజీల మెథాంపెటమైన్ డ్రగ్(ద్రవ, ఘన రూపాల్లో)ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ వందల కోట్ల రూపాయలు ఉంటుంది. ఈ వ్యవహారంలో వార్డెన్, వ్యాపారవేత్తతో పాటు మరో ఇద్దరిని ఈనెల 25న అరెస్టు చేసి, 27న కోర్టులో హాజరుపరచగా, వారిని 4 రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అప్పగించింది. కాగా, ఢిల్లీ వ్యాపారికి, జైలు వార్డెన్‌కు జైల్లోనే పరిచయం ఏర్పడడం గమనార్హం. సదరు వ్యాపారి గతంలో ఓ డ్రగ్స్ కేసులో కొన్నాళ్లు తిహాడ్ జైల్లో ఉన్నారు. ఆ పరిచయంతోనే వ్యాపారి బయటకు వచ్చాక కలిసి డ్రగ్స్ దందా మొదలుపెట్టారు.

లోకం తీరు



జనన, మరణాల నమోదుకు యాప్

» ప్రారంభించిన అమిత్ షా



న్యూఢిల్లీ, అక్టోబరు 29: ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులువుగా జనన, మరణాలను నమోదు చేయడానికి ఉద్దేశించిన ప్రత్యేక యాప్‌ను మంగళవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారు. సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం (సీఆర్ఎస్) మొబైల్ యాప్ పేరుతో రిజిస్ట్రార్ జనరల్-సెన్సస్ కమిషనర్ కార్యాలయం దీన్ని రూపొందించింది. ఈ కార్యాలయం ఉండే జనగణన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన దేశ ప్రథమ హోం మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహాన్ని కూడా ఆవిష్కరించారు. అమిత్ షా ప్రసంగిస్తూ ప్రధాని మోదీ డిజిటల్ ఇండియా విజన్ మేరకు దీన్ని రూపొందించినట్లు చెప్పారు. దీని సాయంతో ఎక్కడి నుంచయినా, ఏ సమయంలోనయినా స్థానిక భాషల్లో పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సర్దార్ పటేల్ సేవలను గుర్తు చేస్తూ హిందీలో ట్వీట్ చేశారు. సుదృఢ భారత దేశం నిర్మాణానికి ఆయన పునాదులు వేశారని చెప్పారు. 'ఉక్కు మనిషి' విగ్రహం పోరాటాలు, త్యాగాలకు చిహ్నంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 31న పటేల్ జయంతి జరగనున్న నేపథ్యంలో మేజర్ ధ్యాన్ చంద్ స్టేడియంలో నిర్వహించిన 'రన్ ఫర్ యూనిటీ' పరుగును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం కోసం పటేల్ ఎనలేని కృషి చేసినా దాన్ని తుడిచివేయడానికి ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. ఈ నెల 31న దీపావళి పండగ ఉండడంతో ఆ కారణంగా ఈ సారి రెండు రోజుల ముందుగానే పటేల్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.

తేజస్ ఇంజన్ల సరఫరాలో రెండేళ్ల జాప్యం

» అమెరికా కంపెనీ జీఈకి భారత్ జరిమానా

న్యూఢిల్లీ, అక్టోబరు 29: స్వదేశీ తేలికపాటి యుద్ధ విమానం తేజస్ ఎంకే1ఏలకు అవసరమైన ఎఫ్404-ఐఎన్20 ఇంజన్ల సరఫరాలో రెండేళ్ల జాప్యం చేసిన అమెరికా సంస్థ జనరల్ ఎలక్ట్రిక్ (జీఈ) ఏరోస్పేస్‌కు భారత్ జరిమానాలు విధించినట్టు తెలిసింది. హాల్, జీఈ మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా ఇంజన్ల డెలివరీ 2023 మార్చిలో ప్రారంభం కావాలసి ఉంది. అది సాధ్యం కాకపోవడంతో 2024 మార్చి నుంచి డెలివరీలు ప్రారంభిస్తామని జీఈ తెలిపింది. అయినా ఇంజన్లు ఇంతవరకు భారత్‌కు చేరుకోలేదు. ఇటీవల అమెరికా పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్.. ఇంజన్ల డెలివరీ జాప్యం అంశాన్ని ప్రస్తావించినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఒప్పందం ప్రకారం సరైన సమయానికి డెలివరీ అందించలేకపోయిన జీఈపై భారత్ జరిమానాలు విధించినట్టు తెలిసింది. దీంతో 2025 మార్చి లేదా ఏప్రిల్ నాటికల్లా ఇంజన్ల డెలివరీలు ప్రారంభిస్తామని జీఈ హామీ ఇచ్చినట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఎంత జరిమానా విధించారన్న విషయం వెల్లడించలేదు కానీ.. ఒకటి కంటే ఎక్కువసార్లే పెనాల్టీ విధించినట్టు పేర్కొన్నాయి.

3 రకాల క్యాన్సర్ ఔషధాల ధరల తగ్గింపు!

న్యూఢిల్లీ, అక్టోబరు 29: క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే మూడు ఔషధాల ధరలను తగ్గించాల్సిందిగా వాటిని తయారు చేసే కంపెనీలను కేంద్రం కోరింది. ఈ మేరకు 'జాతీయ ఔషధ ధరల సాధికారసంస్థ' (ఎన్‌పీపీఏ) మెమోరాండం జారీ చేసింది. ధరలు తగ్గించాల్సిన ఔషధాల జాబితాలో ట్రస్టుజుమాబ్, ఒసిమర్టినిబ్, దుర్వాలుమాబ్ ఉన్నాయి. వీటిని రొమ్ము, ఊపిరితిత్తులు, పిత్తాశయ క్యాన్సర్ల చికిత్సలో ఉపయోగిస్తున్నారు. కొన్ని రకాల క్యాన్సర్ ఔషధాలకు కస్టమ్స్ సుంకం నుంచి మినహాయింపు ఇవ్వనున్నట్లు కేంద్రం 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రకటించింది. ఈ మేరకు జూలై 23న పై మూడు ఔషధాలపై కస్టమ్స్ సుంకాన్ని పూర్తిగా ఎత్తివేస్తున్నట్లుగా, జీఎస్టీని 12 శాతం నుంచి 3 శాతానికి తగ్గిస్తున్నట్లుగా కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించింది. ఈ ప్రయోజనం క్యాన్సర్ బాధితులకు లభించేలా.. సదరు ఔషధాల ఎమ్మార్పీ ధరలను తగ్గించాలని కేంద్రం తాజా ప్రకటనలో ఫార్మా కంపెనీలకు సూచించింది.

హరియాణా ఎన్నికల్లో ఎలాంటి లోపాల్లేవు: ఈసీ

న్యూఢిల్లీ, అక్టోబరు 29: హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ లేవనెత్తిన సందేహాలను ఎన్నికల సంఘం (ఈసీ) తిరస్కరించింది. అవన్నీ నిరాధార ఆరోపణలని కొట్టివేసింది. ఆశించిన ఫలితాలు రానప్పుడు ఈ రకంగా మొత్తం ఎన్నికల వ్యవస్థనే తప్పుబట్టేవిధంగా ఆరోపణలు చేయటం సరికాదని తెలిపింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఉద్దేశించి ఈసీ మంగళవారం 1600 పేజీలతో కూడిన సుదీర్ఘ వివరణ ఇచ్చింది. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతీ ప్రక్రియ ఎటువంటి లోపాలు లేకుండా అమలైందని, కాంగ్రెస్ అభ్యర్థులు, ఏజెంట్లు కూడా దీనికి సాక్షిగా ఉన్నారని తెలిపింది. హరియాణా ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున.. ఫలితాలను ఎప్పటికప్పుడు వెల్లడించే విషయంలో ఈసీ తీవ్రమైన జాప్యం చేసిందని కాంగ్రెస్ ఆరోపించింది. అలాగే, బీజేపీ అభ్యర్థులు గెలిచిన నియోజకవర్గాల్లో ఈవీఎంల బ్యాటరీ 99% చార్జింగ్‌తో ఉండగా, తమ అభ్యర్థులు గెలిచిన స్థానాల్లో చార్జింగ్ 60-70% ఉందని.. ఈ తేడాకు కారణమేమిటని ప్రశ్నించింది.

ఏడాదిలో 1100 మంది భారతీయులను వెనక్కి పంపిన అమెరికా

న్యూఢిల్లీ, అక్టోబరు 29: అమెరికాలోకి అక్రమ మార్గాల్లో ప్రవేశించి, నివసిస్తున్న భారతీయులపై అక్కడి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. 12 నెలల కాలంలో 1100 మంది భారతీయులను స్వదేశానికి తిప్పి పంపించింది. ఈ విషయాన్ని హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖలో సరిహద్దులు, వలస విధానం వ్యవహారాలను చూస్తున్న అసిస్టెంట్ సెక్రటరీ రొసీ ముర్రే మంగళవారం వెల్లడించారు. ఈ నెల 22న ప్రత్యేక విమానంలో భారతీయులను పంజాబ్‌కు తిప్పిపంపించామని ఆమె చెప్పారు. ఏడాదిలో మొత్తంగా 145 దేశాల నుంచి వచ్చిన 1,60,000 మందిని తిప్పి పంపినట్టు వివరించారు. అక్రమ వలసదార్లను తిప్పి పంపించడంలో భారత ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం లభించినట్టు చెప్పారు.

అవును.. హంతక ముఠాను నడిపా!

» ఫిలిప్పీన్ మాజీ అధ్యక్షుడు రోడ్రిగో



మనీలా, అక్టోబరు 29: మాదక ద్రవ్యాల స్మగ్లర్లను అరికట్టడానికి తాను గతంలో 'హంతక ముఠా' (డెత్ స్క్వాడ్)ను ఏర్పాటు చేసినట్టు ఫిలిప్పీన్ మాజీ అధ్యక్షుడు రోడ్రిగో డ్యూటెర్టే (79) అంగీకరించారు. ఏడుగురితో ఈ 'డెత్ స్క్వాడ్' ఉండేదని, అయితే వారెవరూ పోలీసులు కాదని చెప్పారు. వారు గ్యాంగ్‌స్టర్లని వెల్లడించారు. ఆయన 22 ఏళ్ల పాటు దావో నగరం మేయర్‌గా ఉన్నప్పుడు అనుమానాస్పద రీతిలో సుమారు 1400 మంది మరణించినట్టు మానవ హక్కుల సంఘాలు ఇచ్చిన నివేదికపై ప్రస్తుతం సెనేట్ విచారణ జరుపుతోంది. సోమవారం జరిగిన విచారణకు హాజరైన రోడ్రిగో.. తన ఆధ్వర్యంలో 'డెత్ స్క్వాడ్' ఉండేదని అంగీకరించారు. "నేను చెప్పిన వారిని లేపేయకపోతే నేనే మిమ్మల్ని చంపేస్తానటూ" ఆ స్క్వాడ్ సభ్యులను హెచ్చరించారు కూడా. "నిస్సహాయంగా ఉన్న అనుమానితులను చంపాలని నేనెప్పుడు ఆదేశాలు ఇవ్వలేదు. ఒక్క మాట మాత్రం చెప్పా. క్రిమినల్స్ మనపై తిరగబడేలా రెచ్చగొట్టండి. వారు తిరిగి దాడి చేసినప్పుడు కాల్చి చంపండి. ఎన్‌కౌంటర్‌కు తగిన సాకులు దొరుకుతాయి. అలా చేస్తే నగరంలోని చాలా సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పా" అని రోడ్రిగో అంగీకరించారు.

చైనా కమ్యూనిస్ట్ నేత కూతురితో 35 ఏళ్ల క్రితం టిమ్ వాల్జ్ ప్రేమాయణం

» ఎన్నికల వేళ డెమోక్రటిక్ పార్టీలో కలకలం!



వాషింగ్టన్, అక్టోబరు 29: కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా(సీపీసీ) కీలక నేత కుమార్తెతో.. ప్రస్తుతం అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ తరఫున ఉపాధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న టిమ్ వాల్జ్ ప్రేమాయణం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు బ్రిటన్ వార్తాపత్రిక డెయిలీ మెయిల్ ఓ కథనాన్ని ప్రచురించింది. వీరి ప్రేమకు మధ్యలోనే బ్రేకులు పడ్డట్లు తెలిపింది. అమెరికా ఎన్నికల వేళ ఈ అంశం చర్చనీయాంశమైంది. టిమ్ వాల్జ్ 1989లో (అప్పట్లో ఆయన వయసు 25) చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్సులోని ఓ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేశారు. ఆ సమయంలో సీపీసీ నేత బిన్‌హుయ్ కుమార్తె జెన్నా వాంగ్‌తో ప్రేమలో పడ్డారు. వారాంతాల్లో హాంకాంగ్ వెళ్లే వాల్జ్ తనకోసం ఖరీదైన బహుమతులు తెచ్చేవారని వాంగ్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. తాను అమెరికాలో స్థిరపడడంపై ఎన్నో కలలు కనేదాన్నని, వాల్జ్ పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చేవారు కాదని ఆమె పేర్కొన్నారు. ఓ సారి తమ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. దాంతో.. తమ బంధం విడిపోయిందని.. వాల్జ్ అమెరికాకు, తాను ఇటలీకి వెళ్లిపోయినట్లు వివరించారు. టిమ్ వాల్జ్ 1993లో గ్వెన్ విప్పల్ అనే మహిళను వివాహం చేసుకున్నారు.

వృద్ధులకు 5లక్షల ఆరోగ్య బీమా

దేశవ్యాప్తంగా 70ఏళ్లు దాటిన వారందరికీ అందుబాటులోకి


ఆయుష్మాన్ వయ వందన కార్డు నమూనాను లబ్ధిదారుకు అందజేస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 29: దేశవ్యాప్తంగా 70ఏళ్ల వయసు దాటిన వారందరికీ రూ.5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ధన్వంతరి జయంతి, 9వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఏఐఐఏ)లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై) కింద తీసుకొచ్చిన ఈ సదుపాయాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. అలాగే ఆరోగ్య రంగంలో రూ.12,850 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులతో పాటు గర్భిణులు, చిన్నారుల వ్యాక్సినేషన్ కోసం ఉద్దేశించిన యూ-విన్ పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. తాజా పథకం ద్వారా దేశవ్యాప్తంగా 4.5 కోట్ల కుటుంబాల్లోని 6కోట్ల మంది వృద్ధులకు ప్రయోజనం చేకూరుతుందని అంచనా. పేద, ధనిక భేదాలు లేకుండా అన్ని వర్గాల వారికి ఈ బీమా వర్తిస్తుంది. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నవారికి కొత్త కార్డులు అందిస్తారు. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ పరిధిలో ఉన్నవారికి మరో రూ..5లక్షల అదనపు టాప్-ఆప్ కవరేజీ లభిస్తుంది. (ఈ మొత్తాన్ని వారు కుటుంబంలో 70ఏళ్ల కంటే తక్కువ వయసున్న ఇతర సభ్యులతో పంచుకోవాల్సిన అవసరం లేదు.). ప్రైవేటు వైద్య ఆరోగ్య బీమా, ఈఎస్‌ఐసీ కింద ప్రయోజనం పొందుతున్నవారు కూడా ఈ పథకం కింద ప్రయోజనం పొందడానికి అర్హులు. సీజీహెచ్‌ఎస్, ఎక్స్-సర్వీస్‌మన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీం, ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు ఫోర్స్ పథకాల్లో ఉన్న వృద్ధులు వాటిని గానీ ఏబీ-పీఎంజేఏవైని గానీ ఎంచుకోవచ్చు. దీనికోసం పీఎంజేఏవై పోర్టల్ లేదా ఆయుష్మాన్ యాప్‌లో పేరు నమోదు చేసుకోవాలి. కాగా, ఆయుష్ రంగ విస్తరణలో భాగంగా ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద రెండో దశను ప్రధాని ఈ సందర్భంగా ప్రారంభించారు. దీనిలో అత్యాధునిక పంచకర్మ ఆసుపత్రి, ఆయుర్వేద ఫార్మసీ, స్పోర్ట్స్ మెడిసిన్ యూనిట్, సెంట్రల్ లైబ్రరీ, ఐటీ, స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్, 500 సీట్ల ఆడిటోరియంను నిర్మిస్తారు. ఇండోర్‌లో నూతన ఈఎస్ఐసీ ఆసుపత్రిని ప్రారంభించడంతో పాటు ఫరీదాబాద్(హరియాణా), బొమ్మసంద్ర, నరసాపూర్(కర్ణాటక), మీరట్(ఉత్తర ప్రదేశ్), అచ్యుతాపురం(ఏపీ), ఇండోర్‌లలో ఆదనపు ఈఎస్ఐసీ ఆసుపత్రులక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీటితో పాటు ఎయిమ్స్ రుషీకేశ్, బీబీనగర్, గువాహటి, భోపాల్, జోధ్‌పూర్ సహా 11 ప్రధాన సంస్థల్లో డ్రోన్ ఆధారిత సేవలను ప్రధాని ప్రవేశపెట్టారు. అలాగే ఎయిమ్స్ రిషీకేశ్‌లో హెలికాప్టర్ అత్యవసర వైద్యసేవలను ప్రారంభించనున్నారు.

మీకు సేవ చేయలేకపోతున్నా..క్షమించండి

రాజకీయ ప్రయోజనాల కోసం ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయడం లేదని, ఈ రాష్ట్రాలకు చెందిన వృద్ధులకు ఈ పథకం కింద ఉచిత వైద్యం అందకపోడం బాధాకరమని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. 'ఈ రెండు రాష్ట్రాల్లో 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ సేవ చేయలేకపోతున్నందుకు క్షమాపణలు కోరుతున్నా. మీ రాష్ట్రంలోని ప్రభుత్వాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ పథకంలో చేరడం లేదు' అని మోదీ చెప్పారు. ప్రస్తుతం ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, ఒడిశా మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తున్నారు.

యువత ఉపాధికి ప్రత్యేక వ్యవస్థ

దేశంలో ప్రతి యువకుడు/యువతికి ఉపాధి కల్పించే సరికొత్త ప్రత్యేక వ్యవస్థను సృష్టిస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. యువతకు గరిష్ఠ సంఖ్యలో ఉద్యోగాలు సమకూర్చాలన్నది తన ప్రభుత్వ ధ్యేయంగా పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన 'రోజ్‌గార్ మేళా'లో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 51 వేల మంది యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2022లో ఈ మేళా పథకాన్ని ప్రారంభించామని.. రెండేళ్లలోనే ఇప్పటివరకు 7.5 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. ప్రభుత్వ పర్యవేక్షణలో లక్షన్నర స్టార్టప్‌లు ప్రారంభించామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోటి మంది యువతను చేర్చుకోవడానికి పెయిడ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం చేపట్టామని ప్రస్తావించారు. ప్రధాని ఈ సందర్భంగా ప్రజలకు ధన త్రయోదశి శుభాకాంక్షలు తెలియజేశారు. 'ఈ దీపావళి పర్వదినం ప్రత్యేకం కాబోతోంది. ఎందుకంటే 500 ఏళ్ల తర్వాత అయోధ్య దివ్య దేవాలయంలో శ్రీరాముడిని ప్రతిష్ఠించిన తొలి సంవత్సరమిది' అని వ్యాఖ్యానించారు.

మరో 103 విమానాలకు బాంబు బెదిరింపులు

(మొదటి పేజీ తరువాయి)


ముంబై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు విమానాలకు బాంబు బెదిరింపులు చేస్తున్న వ్యక్తిని మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని గోండియాకు చెందిన జగదీశ్ ఉకే(35) బెదిరింపు మెయిల్స్ చేస్తున్నట్లు డీసీపీ శ్వేత ఖేద్కర్ వెల్లడించారు. ఇతను ప్రధానమంత్రి కార్యాలయం, రైల్వే మంత్రి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విమానయాన కార్యాలయాలు, డీజీపీ, రైల్వే రక్షక దళం సహా పలు ప్రభుత్వ కార్యాలయాలకూ బెదిరింపు మెయిల్స్ పంపినట్లు తెలిపారు. జగదీశ్.. ఉగ్రవాదంపై పుస్తకం కూడా రాసినట్లు చెప్పారు. 2021లో అతన్ని ఓ కేసులో అరెస్టు చేసినట్లు వివరించారు. జగదీశ్ మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఫడణవీస్‌కు కూడా బెదిరింపు మెయిల్ పంపడంతో సోమవారం ఆయన నివాసం వద్ద భద్రతను పెంచారు. అలాగే ఉగ్రవాద బెదిరింపులపై తనకున్న పరిజ్ఞానానికి సంబంధించి ప్రధానితో చర్చించేందుకు అవకాశం కల్పించాలని కూడా జగదీశ్ అభ్యర్థించడం గమనార్హం. ఈ నెల 21న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు, డీజీపీకి, ఆర్పీఎఫ్‌కు మెయిల్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

సల్మాన్‌కు బెదిరింపు కాల్ చేసిన యువకుడి అరెస్టు

ముంబయి, అక్టోబరు 29: డబ్బులు ఇవ్వాలంటూ సినీ హీరో సల్మాన్‌ఖాన్‌ను బెదిరిస్తూ ఫోన్ కాల్ చేశాడన్న ఆరోపణలపై 20 ఏళ్ల యువకుడిని నొయిడాలో అరెస్టు చేసినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. బాంద్రా (తూర్పు) నియోజకవర్గం ఎమ్మెల్యే జీషన్ సిద్దిఖీ కార్యాలయానికి శుక్రవారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. సల్మాన్‌ఖాన్‌తో పాటు జీషన్ కూడా సొమ్ములు ఇవ్వాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించాడు. ఇటీవల లారెన్స్ బిష్ణోయ్ ముఠా చేతిలో హత్యకు గురయిన మాజీ మంత్రి బాబా సిద్దిఖీ కుమారుడే జీషన్ కావడం గమనార్హం. కాగా, ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పే పదేళ్ల అభినవ్ అరోరాను చంపేస్తామని బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరించిందని ఆ బాలుడి కుటుంబసభ్యులు చెప్పారు.

హిజ్బుల్లా చీఫ్‌గా కెమిస్ట్రీ ప్రొఫెసర్

షేక్ నయీం-బిన్-మహమ్మద్ ఖాసీం నియామకం



బీరుట్/టెల్‌అవీవ్, అక్టోబరు 29: హిజ్బుల్లా తమ సెక్రటరీ జనరల్‌గా విద్యావంతుడైన షేక్ నయీం-బిన్-మహమ్మద్ ఖాసీంను ప్రకటించింది. హిజ్బుల్లా సంస్థ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన ఖాసీం.. మూడు దశాబ్దాలుగా ఆ సంస్థకు డిప్యూటీ చీఫ్‌గా.. అల్-మూసావీ, హసన్ నస్రల్లా హయాంలో సేవలందించారు. గత నెల 27న బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో హసన్ నస్రల్లా మృతిచెందగా.. ఆయన అల్లుడు షఫీద్దీన్ తదుపరి చీఫ్ అవుతారని అంతా భావించగా.. సిరియాలోని డమాస్కస్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో అతను కూడా మృత్యువాత పడ్డారు. ఆ తర్వాత నెల రోజులపాటు నాయకత్వం లేకుండానే.. హిజ్బుల్లా ముందుకు సాగింది.

మిగతా చీఫ్‌లకు భిన్నం

హిజ్బుల్లా మిలిటెన్సీకి చీఫ్‌లుగా వ్యవహరించిన అల్-మూసావీ, హసన్ నస్రాల్లాతో పోలిస్తే.. ఖాసీం విద్యావంతుడు. మొదటి ఇద్దరూ మహమ్మద్ ప్రవక్తకు వారసులుగా చెప్పుకొంటూ.. నల్లటి తలపాగాను ధరించేవారు. ఖాసీం మాత్రం శాంతికి చిహ్నమైన తెలుపురంగు తలపాగాను ధరిస్తారు. 1953లో బీరుట్‌లోని తహ్తాబస్తా ప్రాంతంలో జన్మించిన ఖాసీంకు భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1970లో లెబనీస్ విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీగా పనిచేస్తూనే.. రసాయనశాస్త్రం అభ్యసించారు. 1977 నుంచి రసాయనశాస్త్రంలో ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఫ్రెంచ్‌లో ప్రావీణ్యంతోపాటు.. న్యాయశాస్త్రం, షియాపై అధ్యయనాలు చేశారు. లెబనాన్ యూనియన్ ఆఫ్ ముస్లిం స్టూడెంట్స్ సంస్థను స్థాపించారు. 1974-88 మధ్యకాలంలో ఇస్లామిక్ రిలీజియస్ ఎడ్యుకేషన్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా పనిచేశారు. 1974లో అల్-సదర్ స్థాపించిన మూవ్‌మెంట్ ఆఫ్ ద డిస్ప్రెడ్ సైనిక విభాగం(లెబనీస్ రెసిస్టెంట్స్ రెజిమెంట్)లో చేరారు. దీన్నే అమల్ ఉద్యమం అంటారు. ఇరాన్ విప్లవం తర్వాత.. అమల్ ఉద్యమానికి రాజీనామా చేశారు. ఇమామ్ ఖోమేనీతో ప్రభావితమై.. 1982లో హిజ్బుల్లా వ్యవస్థాపక సభ్యుడిగా.. డిప్యూటీ చీఫ్‌గా నియమితులయ్యారు.

ఔషధాలను తరలించిన భారత్

పాలస్తీనా ప్రాంతంలో యుద్ధవాతావరణం నేపథ్యంలో మూడు టన్నుల ఔషధాలను సాయంగా పంపినట్లు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఈ ఔషధాల్లో లైఫ్‌సేవింగ్, క్యాన్సర్ నివారణ మందులు ఉన్నట్లు ఎక్స్‌లో పోస్టు చేశారు.

శరణార్థుల భవనంపై దాడి

ఉత్తర గాజాలో శరణార్థులు తలదాచుకుంటున్న ఓ భవనంపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) మంగళవారం జరిపిన బాంబింగ్‌లో 93 మంది మృతిచెందారు. ఇదే ప్రాంతంలో హమాస్ జరిపిన కాల్పుల్లో నలుగురు ఐడీఎఫ్ సైనికులు మృతిచెందారని, ఒకరు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. మరోవైపు ఇజ్రాయెల్‌లో ఐక్యరాజ్య సమితి(ఐరాస) అనుబంధ సంస్థ యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏపై నిషేధం విధించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది.

కేరళ ఆలయంలో బాణసంచా పేలుడు, తొక్కిసలాట

154 మందికి గాయాలు

కాసర్‌గడ్(కేరళ), అక్టోబరు 29: కేరళలోని ఓ ఆలయంలో జరిగిన తెయ్యం(కాళియాట్టం) ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. దేవాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన బాణసంచా హఠాత్తుగా పేలడంతో తొక్కిసలాట జరిగి సుమారు 154 మంది గాయపడ్డారు. వీళ్లలో 10 మంది తీవ్రమైన కాలిన గాయాలతో బాధపడుతున్నారు. తెయ్యం లేదా కాళియాట్టం అనేది ఉత్తర కేరళ ప్రాంతంలోని ఆలయాల్లో నిర్వహించే పురాతన కళా ప్రదర్శన. అయితే, కాసర్‌గడ్ జిల్లాలోని నీలేశ్వరం పట్టణ సమీపంలోని వీరర్కవు దేవాలయంలో సోమవారం రాత్రి తెయ్యం ఉత్సవం జరుగుతుండగా ప్రమాదం జరిగింది. ఉత్సవాల కోసం ఆలయ ప్రాంగణంలోని ఓ రేకుల షెడ్డులో పెద్ద ఎత్తున బాణసంచా నిల్వ ఉంచారు. ఆలయానికి వచ్చిన వందలాది మంది భక్తులు తెయ్యం ప్రదర్శన చూస్తుండగా ఆ షెడ్డులో పేలుడు సంభవించింది. పేలుడు శబ్దంతో జనం ఒక్కసారిగా పరుగులు తీయడంతో తొక్కిసలాట జరిగింది. ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, ఈ ఘటనకు సంబంధించి ఆలయ కమిటీకి చెందిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిలో ముగ్గురిని మంగళవారం అరెస్టు చేశారు.

అధ్యక్ష ఎన్నికల్లో ఓటేసిన బైడెన్



వాషింగ్టన్, అక్టోబరు 29: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అధ్యక్ష ఎన్నికల్లో ముందుగానే తన ఓటు హక్కును వినియోగించుకొన్నారు. సోమవారం సొంత రాష్ట్రం డెలావెర్‌లోని విల్మింగ్టన్‌లో తన ఇంటి సమీపంలోని ఓ పోలింగ్ కేంద్రంలో క్యూలో నిలబడి ఓటేశారు. అనంతరం ఆయన.. "కమలాహ్యారిస్‌కు ఓటేసినందుకు గర్వంగా ఉంది" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలతో పాటు ఉపాధ్యక్ష అభ్యర్థి టిమ్ వాల్జ్‌కు కూడా బైడెన్ ఓటేశారు. మరోవైపు, వాషింగ్టన్, ఒరేగాన్‌లో పలు బ్యాలెట్ బాక్సులకు దుండగులు నిప్పంటించారు. ఒరేగాన్‌లో పోర్ట్‌ల్యాండ్‌లో రెండు వేర్వేరు ప్రాంతాల్లో మూడు బ్యాలెట్ బాక్సులు దెబ్బతిన్నాయి. వాషింగ్టన్‌లో బ్యాలెట్ బాక్సులకు ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు చెప్పారు.

వైట్‌హౌస్‌లో దీపావళి సంబరాలు

» పాల్గొన్న అధ్యక్షుడు జో బైడెన్

» అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి సునీత విలియమ్స్ సందేశం


అంతరిక్ష కేంద్రంలో సునీత

వాషింగ్టన్, అక్టోబరు 29 : అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సోమవారం వైట్‌హౌస్‌లో దీపావళి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, ఆరువందల మందికి పైగా భారతీయ అమెరికన్ ప్రముఖులు పాల్గొన్నారు. వైట్‌హౌస్‌లో దీపావళి సంబరాలు ఘనంగా చేయడంపై బైడెన్ ఆనందం వ్యక్తం చేశారు. అధ్యక్షుడిగా ఇది తనకు ఎంతో గౌరవం అన్నారు. అమెరికా వ్యాప్తంగా ఉన్న భారతీయ అమెరికన్ కాంగ్రెస్ ప్రతినిధులు, అధికారులు, కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. "కమల నుంచి డాక్టర్ మూర్తి వరకు చాలా మంది ఇక్కడ ఉన్నారు... నేటి అమెరికా ఎలా ఉందో... అలానే నా అడ్మినిస్ట్రేషన్ కూడా ఉండాలన్నది నా నిర్ణయం.. అది నెరవేరింది... అందుకు గర్వంగా ఉంది.." అని బైడెన్ చెప్పారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న వ్యోమగామి సునీత విలియమ్స్ వీడియో సందేశాన్ని కూడా కార్యక్రమంలో వినిపించారు. అంతరిక్ష కేంద్రంలో ఉండి దీపావళి జరుపుకొనే అరుదైన అవకాశం తనకు దక్కిందని సునీత ఆనందం వ్యక్తం చేశారు. వైట్‌హౌస్‌లో దీపావళి సంబరాలు జరిపినందుకు బైడెన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు, లండన్‌లోని ట్రఫాల్గర్ స్క్వేర్‌లో దీపావళి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ నెల 27నే జరిగిన వేడుకలకు వేలాది మంది హాజరయ్యారు.

రష్యాకు సాయంగా 12వేల మంది ఉత్తర కొరియా సైనికులు

» ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

కీవ్, అక్టోబరు 29: ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు సాయంగా ఉత్తరకొరియా ఇప్పటికే 3వేల మంది సైనికులను తరలించిందని, ఇంకా వేలాది మందిని పంపిస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఉత్తరకొరియా సైనికులు ఇప్పటికే రష్యా తరఫున యుద్ధంలో పాల్గొంటున్నారని చెప్పారు. ఇంకా 9 వేల మంది సైనికులను రష్యాకు పంపిస్తున్నట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. మొత్తంగా 12వేల మంది ఉత్తరకొరియా సైనికులు రష్యా తరఫున ఉక్రెయిన్‌పై యుద్ధం చేయబోతున్నారని చెప్పారు. రెండు దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంలో ఉత్తరకొరియా జోక్యంతో పరిస్థితి మరింత తీవ్రం అవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రష్యాలో ఉత్తరకొరియా సైనికులు ఉన్నారని దక్షిణ కొరియా చాలా కాలంగా ఆరోపిస్తోంది. అది నిజమేనని ఇటీవలే నాటో ధ్రువీకరించింది.

15 లక్షల లంచం ఇస్తేనే సిబ్బందికి వేతనాల మంజూరు

» మెడికల్ కాలేజీ ఏవో, జూ.అసిస్టెంట్ డిమాండ్

» అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ ఫిర్యాదు.. పట్టుకున్న ఏసీబీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాల చెల్లింపు కోసం లంచం తీసుకుంటూ భద్రాద్రి జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) ఖలీలుల్లా, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ మంగళవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ కళాశాలలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో సదరు ఏజెన్సీ యాజమాన్యం మెడికల్ కళాశాలను, జిల్లా ఉన్నతాధికారులను సంప్రదించింది. దీంతో ఏవో రెండున్నర నెలల జీతాల బిల్లులను మంజూరు చేశారు. అయితే, సరైన ధ్రువపత్రాలు లేవంటూ 23 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించగా వారికి కూడా పని చేసిన కాలానికి జీతాలివ్వాలని ఆ ఏజెన్సీ కోరింది. దీంతో మొత్తం 49 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు రూ.15 లక్షలు లంచం ఇవ్వాలని ఏవో, జూనియర్ అసిస్టెంట్ డిమాండ్ చేశారు. రూ.7 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్న ఆ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ యాజమాన్యం ఏసీబీని ఆశ్రయించింది. ఏబీసీ అధికారుల సూచన మేరకు.. ఆ ఏజెన్సీ వారు రూ.3 లక్షలను మెడికల్ కళాశాల ఏవో ఖలీలుల్లా, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్‌లకు ఇవ్వగా.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు తల్లీకూతుళ్ల సజీవ దహనం



పోచమ్మ, కొమురమ్మ(ఫైల్)

రామగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి తల్లీకూతుళ్లు సజీవ దహనమయ్యారు. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో తల్లి కల్వల పోచమ్మ, ఆమె కూతురు గడ్డం కొమురమ్మ(55) మృత్యువాతపడ్డారు. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని పెద్దపల్లి మండలం కూనారం గ్రామానికి చెందిన కల్వల పోచమ్మ, ఆమె భర్త మల్లయ్య రెండు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం కమాన్‌పూర్ మండలం ముల్కలపల్లికి వచ్చి నివాసముంటున్నారు. వీరి కూతురు గడ్డం కొమురమ్మ, ఆమె భర్త కనకయ్య రత్నాపూర్ పంచాయతీ పరిధి రాంనగర్‌లో ఉంటున్నారు. సెంటినరీకాలనీలోని పన్నూరు సెంటర్ సమీపంలో కొమురమ్మ, పోచమ్మ దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. సోమవారం దాబాల్లో పనిముగిసే సరికి బాగా చీకటి కావడంతో కొమురమ్మ తన తల్లి పోచమ్మను రాంనగర్‌లోని తన నివాసానికి వెంట తీసుకెళ్లింది. చిన్నపాటి గదిలో ఒకే మంచంపై తల్లీకూతుళ్లు నిద్రించారు. రాత్రి వేళ కూలర్ వైర్లలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. గాఢనిద్రలో ఉన్న పోచమ్మ, కొమురమ్మ బయటకురాలేక అందులోనే సజీవ దహనం అయ్యారు. పని ముగించుకుని రాత్రి ఇంటికి తిరిగి వచ్చిన కొమురమ్మ భర్త కనకయ్య గది తలుపు తెరవడంతో పోచమ్మ, కొమురమ్మ మంటల్లో కాలుతూ కనిపించారు. మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. ఈ ఘటనపై ఏసీపీ రమేశ్ మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్ కారణంగానే వారు మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సిద్దరామయ్య సన్నిహితుల ఇళ్లపై ఈడీ దాడులు

బెంగళూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ముడా ఇంటిస్థలాల వివాదానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల దాడులు కాంగ్రెస్‌లో కలవరం రేపుతున్నాయి. ముడా మాజీ కమిషనర్‌లు నటేశ్, దినేశ్‌కుమార్ సీఎం సిద్దరామయ్యతోపాటు మంత్రి భైరతి సురేశ్, సిద్దరామయ్య కుమారుడు యతీంద్రకు ఆప్తులు. వీరితోపాటు మైసూరు జడ్పీ మాజీ సభ్యుడు రాకేశ్ పావణ్ణ.., సీఎం ఆప్తుడు, బిల్డర్ మంజునాథ్ ఇళ్లపై ఈడీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులపై ప్రభుత్వం, పార్టీలో చర్చలు జోరందుకున్నాయి. జేపీ నగర్‌లోని కార్తీక్ డెవలెపర్స్ యజమాని ఎస్. మంజునాథ్ కార్యాలయం, ఇంటిపై ఆరుగురు ఈడీ అధికారులు దాడులు చేశారు.

పూచీ ఇస్తేనే సీఎంఆర్

(మొదటి పేజీ తరువాయి)



విభజించింది. గతంలో ఎప్పుడూ డిఫాల్టర్ల జాబితాలో చేరకుండా, సకాలంలో బియ్యం డెలివరీ చేసే మిల్లర్లను మొదటి క్యాటగిరీలో చేర్చింది. ఆమోదించిన మిల్లింగ్ కెపాసిటీపై 10 శాతం బ్యాంకు గ్యారెంటీని ఈ మిల్లర్లు ఇవ్వాల్సి ఉంటుంది. లేకపోతే 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. ఇక రెండో క్యాటగిరీలో.. గతంలో డిఫాల్టర్ అయినప్పటికీ, జరిమానాతో సహా బకాయిలు చెల్లించిన రైస్ మిల్లర్లను చేర్చింది. వీరు 20 శాతం బ్యాంకు గ్యారెంటీ, లేకపోతే 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. మూడో క్యాటగిరీలో.. గతంలో డిఫాల్టర్ అయి ఉండి, 100 శాతం బకాయిలు తీర్చేసినా.. 25 శాతం జరిమానా చెల్లించని రైస్‌మిల్లర్లను చేర్చింది. వీరు 25 శాతం బ్యాంకు గ్యారెంటీ, లేకపోతే 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. ఇక బకాయిలు, జరిమానా ఏదీ చెల్లించని రైస్‌మిల్లర్లకు ధాన్యం ఇచ్చేది లేదని జీవోలో సర్కారు స్పష్టం చేసింది.

మిల్లింగ్ ఛార్జీల పెంపు..

కస్టమ్ మిల్లింగ్ నిబంధనల ప్రకారం.. ప్రభుత్వం అప్పగించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేయగా వచ్చే నూకలు, తౌడు, ఊక, పరం తదితర ఉప ఉత్పత్తులన్నీ రైస్‌మిల్లర్లే తీసుకుంటారు. వీటితోపాటు క్వింటాకు రూ.10 చొప్పున అదనపు మిల్లింగ్ చార్జీలు ఇచ్చేవారు. అయితే ఈ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. ఇక నుంచి దొడ్డు ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే క్వింటాకు రూ.30, సన్న వడ్లను మిల్లింగ్ చేస్తే క్వింటాకు రూ.40 చొప్పున అదనపు మిల్లింగ్ చార్జీలు చెల్లిస్తారు. ఖరీఫ్- 2024 సీజన్ నుంచి కొత్త చార్జీలు అమలవుతాయి. అయితే గడువులోగా సీఎంఆర్ డెలివరీ చేసిన మిల్లర్లకే అదనపు మిల్లింగ్ చార్జీలు వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. గడువులోగా సీఎంఆర్ పూర్తిచేయని వారికి, పొడిగించిన గడువులో సీఎంఆర్ డెలివరీ చేసిన మిల్లర్లకు ఈ చార్జీలు వర్తించబోవని షరతు పెట్టింది.

సన్నాలను గుర్తించే బాధ్యత ఏఈవోలకు..

సన్న ధాన్యాన్ని గుర్తించే బాధ్యతను ప్రభుత్వం వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈవో)కు అప్పగించింది. ఇందుకు ప్రతి రైస్‌మిల్లుకు ఒక ఏఈవోను కేటాయించింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు వచ్చిన ధాన్యంపై ఏమైనా అభ్యంతరాలుంటే మిల్లర్లు 48 గంటల్లో ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేయాలి. ఆ ఫిర్యాదును స్వీకరించిన ఏఈవో 24 గంటల్లో రైస్‌మిల్లుకు వెళ్లి ధాన్యాన్ని పరిశీలించాలి. సన్న రకమో..? దొడ్డు రకమో..? తేల్చాలి. ఈ అంశంలో కలెక్టర్లు కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇప్పించాలని సర్కారు ఉత్తర్వుల్లో తెలిపింది. సన్నాలు, దొడ్డు రకాల నాణ్యతను ఎలా పరిశీలించాలి? గ్రేస్‌రైస్ క్యాలిపర్‌తో గానీ, నేరుగా తనిఖీ చేయటం ద్వారా గానీ ఎలా గుర్తించాలనే అంశాలను శిక్షణలో వివరించాలని పేర్కొంది. ఒకవేళ సన్నాలు, దొడ్డు రకాలను గుర్తించే క్రమంలో ఏఈవోల నిర్ణయాలపై అభ్యంతరాలు వస్తే.. వాటిని పరిష్కరించటానికి జిల్లా, రెవెన్యూ డివిజన్ స్థాయిలో రెండు కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం సూచించింది. వ్యవసాయ శాఖ ఏడీఏ, పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దారుతో డివిజన్ కమిటీ.. జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో), జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి(డీఎస్‌వో)తో జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

అప్పులు పెరిగిపోయి.. చోరీలకు మరిగి..

» వరుసగా 17 దొంగతనాలకు పాల్పడిన ఓ యువకుడి అరెస్టు

బాలసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో దెబ్బతిని.. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో చిత్తయి.. భారీగా అప్పులపాలై చివరికి తేలిగ్గా డబ్బు సంపాదించేందుకు చోరీలకు మరిగాడో యువకుడు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డాడు. నిందితుడు వరంగల్ జిల్లా రాయపర్తికి చెందిన కొండపల్లి ధర్మరాజు. సీపీ అంబర్ కిషోర్ ఝా వెల్లడించిన వివరాల ప్రకారం.. ధర్మరాజు డిగ్రీ పూర్తి చేసి బిర్యానీ సెంటర్ పెట్టి నష్టపోయాడు. ఆపై హనుమకొండ పోస్టల్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. వ్యాపారంలో నష్టపోయిన డబ్బును తిరిగి పొందేందుకు వ్యక్తిగత రుణాలు తీసుకొని ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడి భారీగా నష్టపోయాడు. తీసుకున్న అప్పులు తీర్చలేక దొంగతనాల మార్గాన్ని ఎంచుకున్నాడు. తాళం వేసి ఉన్న ఇళ్లలో రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడ్డాడు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 17 చోరీలకు పాల్పడ్డాడు. కేయూసీ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో 8, హనుమకొండ, హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 4, సుబేదారి, సంగెం, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, దేవరుప్పుల పోలీసుస్టేషన్ పరిధిలో 5 చోరీలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. వరుస చోరీలపై అప్రమత్తమైన పోలీసులు, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పర్యవేక్షణలో ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుని నిందితుడిపై నిఘా పెట్టారు. మంగళవారం ఉదయం చోరీ చేసిన సొమ్మును అమ్మేందుకు ధర్మరాజు కేయూసీ వైపు వస్తున్నట్టు పక్కా సమాచారం రావడంతో సీసీఎస్, కేయూసీ పోలీసులు వాహనాలను తనిఖీ చేయగా పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి రూ.28.5 లక్షల విలువైన 334 గ్రాముల బంగారం, కిలో వెండి, రూ.13వేల నగదు, ఓ బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

గిరిజన బాలికపై సామూహిక అత్యాచారం

» మైనర్ సహా ముగ్గురి అరెస్ట్.. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఘటన

హుస్నాబాద్, అక్టోబరు 29: ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ గిరిజన బాలికపై ముగ్గురు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకొచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను హుస్నాబాద్ ఏసీపీ సతీష్ వెల్లడించారు. హుస్నాబాద్‌లోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గిరిజన బాలిక ఈ నెల 27న రాత్రి ఇంటి ముందు ఆడుకుంటోంది. అదే ప్రాంతానికి చెందిన ఓ మైనర్, మరో ఇద్దరు యువకులు బాలికను పట్టణ శివారులోకి బలవంతంగా తీసుకువెళ్లి అత్యాచారం చేశారు. కూతురు కనిపించకుండాపోవడంతో కంగారుపడిన బాలిక తల్లి చుట్టుపక్కల వెతికింది. కొన్ని గంటల తర్వాత బాలిక ఇంటికి రాగా... ఇప్పటి వరకు ఎక్కడికి వెళ్లావని ప్రశ్నించింది. దాంతో బాలిక... భయంతో ఏడుస్తూ జరిగిన విషయం చెప్పింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

లండన్‌లో 22 టన్నుల చీజ్ దోపిడీ

» డిస్ట్రిబ్యూటర్లమని చెప్పి రూ. 3 కోట్ల సరుకు స్వాహా

లండన్, అక్టోబరు 29: పక్కా ప్లాన్ వేసిన కొంతమంది కేటుగాళ్లు లండన్‌లోని ఓ ప్రముఖ డెయిరీ నుంచి ఏకంగా 22 టన్నుల చీజ్‌ను దోపిడీ చేశారు. హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్లమని, పేరు మోసిన కంపెనీకి పంపిణీ చేస్తామని చెప్పడంతో వాళ్లను పూర్తిగా నమ్మిన సదరు డెయిరీ... కష్టపడి తయారుచేసిన రూ. 3 కోట్ల విలువైన సరుకును పంపించింది. తీరా చూస్తే మోసపోయినట్లు తెలుసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ జున్ను దోపిడీ ఘటన లండన్‌లో కలకలం రేపుతోంది. నగరంలోని నీల్స్ యార్డ్ డెయిరీ... చెడ్డార్ చీజ్ తయారీలో పేరుగాంచింది. పలు రకాల చీజ్‌లు తయారుచేయడంలో దానికంటూ ఓ ప్రత్యేకత ఉంది. అందుకే అక్కడి చీజ్ కోసం జనం ఎగబడతారు. అలాంటి ప్రముఖ దుకాణాన్ని మోసగాళ్లు లక్ష్యంగా చేసుకున్నారు. తాము హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్లమని, ఓ పెద్ద పేరున్న ఫ్రెంచ్ రిటైలర్‌కు పంపిణీ చేసేందుకు గాను 22 టన్నుల చీజ్ అవసరముందని ఆర్డర్ ఇచ్చారు. వాళ్ల కట్టుకథనంతా నమ్మిన నీల్స్‌యార్డ్... సరుకును సదరు పంపిణీదారుకు అప్పగించింది. కానీ అది గమ్యస్థానానికి చేరలేదు. దాంతో మోసం బయటపడింది. ఆ దేశానికి చెందిన ప్రముఖ చెఫ్.. జెమీ ఆలీవర్ సోషల్ మీడియాలో పంచుకోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆయన దీన్ని 'అతి పెద్ద జున్ను దోపిడీగా అభివర్ణించారు.

ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అజిత్ పవార్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహించారు. నాలుగుసార్లు పదవిలో ఉండి ఒక్కసారి పదవి లేకపోతే దాని కోసం కుటుంబాన్ని చీల్చుతారా అని శరద్ పవార్ ప్రశ్నించారు.

శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానము, యాదగిరిగుట్ట

ప్రకటన

యాదాద్రి భువనగిరి జిల్లా - శ్రీ స్వామి వారి విమాన గోపురమునకు కాపర్ ఎలక్ట్రో గోల్డ్ ప్లేటింగ్ షీట్ సగను ఫిట్టింగ్, స్కఫ్ ఫోల్డింగ్ మరియు లేబర్ ట్రాన్స్‌పోర్ట్ పనులకు పేరొందిన సంస్థలు / కళాకారుల నుండి యాదగిరిగుట్ట దేవస్థానం కొటేషన్స్ కోరుతోంది. అనుభవం గల వారు తేది.06.11.2024న మ.2.00 గం. లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చు. వివరాలకు వెబ్‌సైట్ www.yadagiriguttatemple.telangana.gov.in దర్శించండి.

సం/- శ్రీ ఎ. భాస్కర్ రావు, కార్యనిర్వహణాధికారి

DIPR Ro No.6014-PP/CL/ADVT/1/2024-25, తేది: 29.10.2024

అడిషనల్ కలెక్టర్ (LB), జగిత్యాల

టెండరు ప్రకటన 2024

Rc.No: 6062/A4/MDM/2024 తేది: 30.10.2024

2024-25 విద్యా సంవత్సరానికి జగిత్యాల జిల్లా వద్ద గుర్తించబడిన (632) పాఠశాలలలో PM పోషణ్ (MDM పథకం) క్రింద రూ.85.55 లక్షల అంచనా విలువతో (07) రకాల కిచెన్ యుటెన్సిల్స్/ డివైస్‌లు అనగా రైస్, కూరల కొరకు జగోనా, స్టీల్ కంటైనర్లు, స్టీల్ బకెట్లు, స్టీల్ వెంచాలు & కఫ్ఫీర్ల సరఫరా కొరకు నమోదిత సంస్థల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. **టెండరు డాక్యుమెంట్ల అమ్మకం & దాఖలు:** జగిత్యాల DEO కార్యాలయం వద్ద 30.10.2024 ఉ.10.00 గం. నుండి 06.11.2024 మ.3.00 గం. వరకు. **సీల్డ్ టెండర్లు తెరుచుట:** అడిషనల్ కలెక్టర్ (LB) ఛాంబర్, జగిత్యాలలో 07.11.2024 ఉ.11.00 గం.కు. టెండరు ఫారం ధర రూ.2,000/- & బయానా వ్యయం రూ.2,00,000/-లను **"District Educational Officer Jagtial"** పేరున డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించవలెను. టెండరు ఫారాలను మరియు ఇతర సమాచారాన్ని DEO కార్యాలయం, జగిత్యాల (IDOC జగిత్యాల వద్ద 1వ అంతస్తులోని రూమ్ నం.125) నుండి పనిరోజులలో పొందవచ్చును. ఈ ప్రొక్యూర్‌మెంట్ రద్దుచేయడానికి, మార్పు చేయడానికి మరియు తేదీలను పొడిగించడానికి అడిషనల్ కలెక్టర్ (LB), జగిత్యాల వారికి పూర్తి హక్కులు కలవు.

సం/- డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, జగిత్యాల సం/- అడిషనల్ కలెక్టర్ (LB), జగిత్యాల

DIPR RO No.6001-PP/CL/ADVT/1/2024-25, తేది: 29.10.2024

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్

CIN No. U40109TG2000SGC034119

ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన

నం.12/2024-25 OF CE(PROJ)/TGNPDCL, KMM

బిడ్ నం.II-104/2024-25 - పని పేరు: PM-సూర్య ఘర్: ఉచిత కరెంటు యోజన పథకం క్రింద ఖమ్మం (జిల్లా)లోని సిరిపురం (గ్రామం)లో 1024 లబ్ధిదారుల కొరకు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్స్ స్థాపన (2177K Wp). తదుపరి వివరాల కొరకు దర్శించండి: www.eprocurement.gov.in & www.tgnpdcl.in

సం/- చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), TGNPDCL, వరంగల్

సంక్షిప్త టెండరు ప్రకటన నం.01/2024-25 OF SE/OP/NML

స్పెసిఫికేషన్ నం.49/2024-25 నుండి 52/2024-25తో

ఆపరేషన్ సర్కిల్, నిర్మల్‌లో వివిధ పనుల కొరకు TGNPDCL నమోదిత కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. పని వివరాలను మా వెబ్‌సైట్ www.tgnpdcl.in నుండి పొందవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, నిర్మల్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన

నం.11/2024-25 OF CE(PROJECTS)/TGNPDCL/WARANGAL

బిడ్ నం.I-144/2024-25/CE(PROJECTS)/TGNPDCL/WARANGAL - పని పేరు: TGNPDCLలోని హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, LAN / WAN నెట్‌వర్క్, కంప్యూటర్ సిస్టంల యొక్క పెరిఫెరల్స్ మరియు UPS యూనిట్ల AMC. తదుపరి వివరాల కొరకు దర్శించండి: tender.telangana.gov.in, www.tgnpdcl.com

సం/- చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), TGNPDCL, వరంగల్

DIPR RO No.6007-PP/CL/ADVT/1/2024-25 తేది: 29.10.2024

TELANGANA POWER GENERATION CORPORATION LIMITED

VIDYUT SOUDHA:: HYDERABAD-82.

T.No.e-157/CE/O&M/KTPS-V&VI/BM-V/P31/TGGENCO/2024-25

KTPS-V&VI - Procurement of Heating elements (Baskets) of APH 27.5 VIMT 2000 (Double sealing) at Kothagudem Thermal Power Station Stages V&VI, Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works: **Rs.34,20,000/.** Scheduled Open & Closing Date: **28.10.2024 at 10:00 Hrs. & 18.11.2024 at 15:30 Hrs.**

T.No.e-158/CE/O&M/KTPS-V&VI/BM-V/P31/TGGENCO/2024-25

KTPS-V&VI - Procurement of 6.6 KV HT Motors Power Cables at KTPS-V stage at Kothagudem Thermal Power Station Stages V&VI, Paloncha. Bhadradri Kothagudem Dist.- Value of the works. **Rs.43,89,500/.** Scheduled Open & Closing Date: **30.10.2024 at 19:00 Hrs. & 20.11.2024 at 15:30 Hrs.**

T.No.e-159/CE/O&M/KTPS-V&VI/BM-V/P31/TGGENCO/2024-25

KTPS-V&VI - Procurement of Seamless Boiler Tubes for Unit-9 Overhaul Works 2024-2025 at Kothagudem Thermal Power Station Stages V&VI, Paloncha, Bhadradri Kothagudem Dist.- Value of the works: **Rs.36,57,000/.** Scheduled Open & Closing Date: **28.10.2024 at 10:00 Hrs. & 18.11.2024 at 15:30 Hrs.**

T.No.e-15/CEG/SEG-1/KTPS-V&VI/E2A6/TGGENCO/2024-25

KTPS-V&VI - Procurement of 2000kVA, 1600kVA, 630kVA, 11kV/433 Volts, Dyn-11 Dry type Indoor Transformers of Unit-XI at Kothagudem Thermal Power Station Stages V&VI, Paloncha, Bhadradri Kothagudem Dist.- Value of the works: **Rs.1,15,00,000/.** Scheduled Extended upto: **11.11.2024 at 15:00 Hrs.**

T.No.e-13/CEG/SEG-1/KTPP-II/E3A7/Cup Lock/TGGENCO/2024-25

KTPP-II - Providing Cup Lock Scaffolding along with material on hire basis for attending Boiler overhaul works during capital overhaul at Kakatiya Thermal Power Project, Chelpur (V), Jayashankar Bhoopalapally Dist for the year 2024-25. Value of the works **Rs.71,00,000/-** Scheduled Extended upto: **06.11.2024 at 11:00 Hrs.**

T.No.e-06/SE/O&M-II/KTPP/TGGENCO/2024-25

KTPP - Erection and dismantling of certain scaffoldings and platforms, carrying out thickness survey, HP welding and alignment of RH&SH coils in 1X600MW Boiler during 2024-25 at Kakatiya Thermal Power Project, Chelpur (V), Jayashankar Bhoopalapally Dist for the year 2024-25. Value of the works **Rs.39,78,141/-** Scheduled Open & Closing Date: **24.10.2024 at 10:30 Hrs & 07.11.2024 at 10:00 Hrs.**

T.No.e-07/SE/O&M-II/KTPP/TGGENCO/2024-25

KTPP - Permanent refurbishment work of Bottom ash hopper corner-3 in bottom ash handling system by internal and external modification as per the M/s. DESCORD Consulting Engineers at Kakatiya Thermal Power Project, Chelpur (V), Jayashankar Bhoopalapally Dist for the year 2024-25.Value of the works **Rs.15,19,200/-** Scheduled Open & Closing Date: **26.10.2024 at 13:30 Hrs & 07.11.2024 at 11:30 Hrs.**

T.No.e-04/CE/CETD/SE/Civil/KTPS-VII/TGGENCO/2024-25

CETD - Supply, Fabrication and Fixing of Wooden Wardrobes, Cots etc at Centre of Excellence for Training & development, Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works.**Rs48,85,374/-** Scheduled Open & Closing Date: **24.10.2024 at 19:00 Hrs. & 18.11.2024 at 13:00 Hrs**

DIPR RO No.6009-PP/CL/ADVT/1/2024-25, Dt.29.10.2024

మధిర పురపాలక సంఘం కార్యాలయం

ఖమ్మం జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

Roc No.E1/11/2024-25/482 తేది: 29.10.2024

పురపాలక సంఘంలో కొన్ని గ్రాంట్ల క్రింద (10) పనుల టెండర్లు ప్రతిపాదించబడినవి. పై పనుల కొరకు మొత్తం మంజూరు అయినవి రూ.47.30 లక్షలు. ప్రారంభ తేది: 30.10.2024. ఆఖరి తేది: 07.11.2024. తదుపరి వివరాల కొరకు మునిసిపల్ ఇంజనీర్ (7995075404), మధిర పురపాలక సంఘం.

సం/- కమిషనర్, మధిర పురపాలక సంఘం.

DIPR R.O. No. 6004-PP/CL/ADVT/1/2024-25, తేది: 29.10.2024

భారతీయ రిజర్వు బ్యాంకు

పర్యవేక్షణ విభాగం

ప్రాంతీయ కార్యాలయం.6-1-56, సెక్రటేరియట్ రోడ్, సైఫాబాద్, హైదరాబాద్-500004

బహిరంగ ప్రకటన

రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా చట్టం,1934 (చట్టం) యొక్క సెక్షన్ 45-IA (6) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ భారతీయ రిజర్వు బ్యాంకు సదరు చట్టంలోని సెక్షన్ 45-I(a) లో నిర్వచించబడిన విధంగా నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సంస్థల యొక్క వ్యాపారాన్ని నిర్వహించుటకు దిగువనీయబడిన కంపెనీ యొక్క సర్టిఫికేట్ ఆఫ్ రిజిస్ట్రేషన్‌ను రద్దుపరచబడినది.

క్ర. సం.	కంపెనీ పేరు మరియు సిఐఎన్ నెంబర్	కంపెనీ నమోదిత కార్యాలయ చిరునామా	రిజర్వు బ్యాంకు ద్వారా జారీ చేసిన సర్టిఫికేట్ ఆఫ్ రిజిస్ట్రేషన్ నెంబర్ మరియు తేది	రద్దు పరచబడిన తేది
1	M/s వయా ఫిన్సర్వ్ ప్రైవేట్ లిమిటెడ్ (CIN:U67190TG2014 PTC093562	యూనిట్ 4బి,4వ అంతస్తు, ప్లాట్ నెం. 98 &99, లుంబిని లేఅవుట్, స్పేస్ & మోర్ బిజినెస్ పార్క్ @ గచ్చిబౌలి, 2, గచ్చిబౌలి, హైదరాబాద్ శేరిలింగంపల్లి, తెలంగాణ, భారతదేశం-500032	N-09.00449 తేది మే 4, 2017	సెప్టెంబర్ 5, 2024

ఇకనుండి, పైన పేర్కొన్న కంపెనీ చట్టంలో నిర్వచించిన విధంగా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థల కార్యకలాపాలు నిర్వహించరాదు.

పైన పేర్కొన్న కంపెనీ తమ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌ను స్వచ్ఛందగా సరెండర్ చేసింది

ఈ ప్రకటన ప్రజా శ్రేయస్సు దృష్ట్యా జారీ చేయబడినది.

ప్రదేశం: హైదరాబాద్ జనరల్ మేనేజర్

भारतीय रिज़र्व बैंक

पर्यवेक्षण विभाग

क्षेत्रीय कार्यालय, 6-1-56, सचिवालय मार्ग, सैफाबाद, हैदराबाद - 500 004

सार्वजनिक सूचना

भारतीय रिज़र्व बैंक अधिनियम, 1934 (अधिनियम) की धारा 45-IA (6) के अंतर्गत प्रदत्त शक्तियों का प्रयोग करते हुए भारतीय रिज़र्व बैंक ने अधिनियम की धारा 45-I (a) के अंतर्गत परिभाषित गैर बैंकिंग वित्तीय संस्थान का व्यवसाय करने के लिए निम्नलिखित कंपनी के पंजीकरण प्रमाणपत्र को रद्द कर दिया है :

क्रम सं.	कंपनी का नाम और सीआईएन संख्या	कंपनी के पंजीकृत कार्यालय का पता	पंजीकरण प्रमाणपत्र संख्या और दिनांक	रद्द करने की तारीख
1	मेसर्स वाया फिनसर्व प्राइवेट लिमिटेड (CIN: U67190TG2014PTC093562)	यूनिट 4बी, चौथी मंजिल, प्लॉट 98 और 99, लुंबिनी लेआउट, स्पेस एंड मोर, बिजनेस पार्क, @ गचीबॉवली 2, गचीबॉवली, हैदराबाद, सेरी लिंगमपल्ली, तेलंगाना, भारत 500032	एन-09.00449 दिनांक 4 मई, 2017	5 सितंबर, 2024

अब से, उपर्युक्त कंपनी अधिनियम के तहत परिभाषित गैर-बैंकिंग वित्तीय संस्थानों से संबंधित व्यवसाय नहीं कर सकती है। उपर्युक्त कंपनी ने स्वेच्छा से अपना पंजीकरण प्रमाणपत्र वापस कर दिया है।

इसे जनहित में जारी किया जाता है।

स्थान: हैदराबाद महाप्रबंधक

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దెబ్బకు దెబ్బ!

ఇరాన్ క్షిపణి దాడికి ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేసిన ఇజ్రాయెల్ అధినేత బెంజమీన్ నెతన్యాహూ మూడువారాల తరువాత దానిని నెరవేర్చారు. శనివారం తెల్లవారుజామున, ఇరాన్‌లోని కీలక సైనిక స్థావరాలమీద వందలాది విమానాలతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. అక్టోబర్ 1న రెండువందల మిసైళ్ళు ప్రయోగించి, ఇజ్రాయెల్‌ను గతంలో కంటే గట్టిదెబ్బే కొట్టిన ఇరాన్‌కు, ఘాటుగా, ధీటుగా జవాబు చెప్పాలన్న ఒత్తిడి నెతన్యాహూ మీద బలంగా ఉంది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టులాంటి చమురు కేంద్రాలను సర్వనాశనం చేయాలని, అణుకేంద్రాలను కూల్చడానికి ఇంతకుమించిన తరుణం ఉండబోదని నెతన్యాహూకు మద్దతు ఇస్తున్న మిత్రపక్షాలు వీరంగం వేశాయి. అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో, నలుదిక్కులా విసిరేసినట్టు ఉన్న ఇరాన్ అణుస్థావరాలను దెబ్బతీయడం ఇజ్రాయెల్‌కు కష్టమే కానీ, ఇజ్రాయెల్ ప్రతీకారంలో చమురుస్థావరాలు ప్రధానంగా దెబ్బతింటాయని అప్పట్లో విశ్లేషణలు వెలువడ్డాయి. అయితే, ఎంతో ఆలస్యంగా ప్రతీకారం తీర్చుకున్నప్పటికీ, ఇజ్రాయెల్ ఇప్పటి దాడి రక్షణరంగ నిపుణులకు సైతం ఆశ్చర్యం కలిగించింది. కొద్దిమంది సైనికులు తప్ప, ప్రధానంగా పౌరులకు ప్రమాదం వాటిల్లకుండా అనేక గంటలపాటు సాగిన ఈ దాడిలో సైనికస్థావరాలు, ఆయుధాగారాలు బాగా దెబ్బతిన్నాయి. చమురు క్షేత్రాలు, అణుక్షేత్రాల జోలికి ఇజ్రాయెల్ పోలేదు. కానీ, క్షిపణి తయారీలో వాడే ఇంధనం ఉత్పత్తి కేంద్రాన్ని ధ్వంసం చేసింది, మిసైల్, డ్రోన్ తయారీ కేంద్రాలు నాశనమైనాయి. ఇజ్రాయెల్ దాడులను తిప్పికొట్టామని, నష్టం నామమాత్రమని ఇరాన్ అంటున్నప్పటికీ, ఇజ్రాయెల్ దెబ్బకు ఇరాన్ మరో రెండేళ్ళవరకూ తన అణుకార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోలేదని కొన్ని విశ్లేషణలు అంటున్నాయి. ఇరాన్ గగనతల రక్షణవ్యవస్థ ఎంత బలహీనంగా ఉన్నదో ఈ దాడి తేల్చేసింది. చేతకాక కాదు, ఒక హెచ్చరికగా మాత్రమే ఈ దాడి చేశానని ఇజ్రాయెల్ చెప్పదల్చుకున్న విషయం సుస్పష్టం. కానీ, దెబ్బకు దెబ్బ అనే ఈ విషవలయం ఇప్పట్లో ఆగేది కాదు. ఈ ప్రకటిత దాడి పశ్చిమాసియాను మరింత ప్రమాదకరమైన పరిస్థితుల్లోకి నెట్టేసింది.

ఇరాన్‌కు శక్తిలేదని కాదు కానీ, అమెరికా అండ, అమ్ములపొదిలో అత్యాధునికమైన ఆయుధాలూ ఉన్న ఇజ్రాయెల్‌తో పోరాడటం ఇరాన్‌కు అంతసులువు కాదు. ఇరాన్‌ను ఆంక్షలతో చుట్టేసి, ఆర్థికంగా నలిపేసి, సొంతంగా హెలికాప్టర్ విడిభాగాలను కూడా తయారుచేసుకోనివ్వని అమెరికా, మరోపక్క ఇజ్రాయెల్‌కు ఎఫ్–35 వంటి అధునాతన యుద్ధవిమానాలు ప్రసాదించిన విషయం తెలిసిందే. అమెరికాతో పాటు పశ్చిమ దేశాలన్నీ ఇజ్రాయెల్‌కు కొమ్ముకాస్తుంటే, ఇరాన్ పక్షాన రంగంలోకి దిగేందుకు దాని మిత్రదేశాలని అంటున్న చైనా, రష్యాలు సైతం సందేహిస్తున్నాయి. అయినా, ఇటీవల ఇజ్రాయెల్ తనకు చేసిన వరుస అవమానాలకు ఇరాన్ స్పందించింది. జూలైలో హమాస్ పొలిటికల్ చీఫ్ ఇస్మాయెల్ హనియేను టెహ్రాన్‌లో హత్యచేయడం, మరుసటి నెల హిజ్బొల్లా అధినేత హసన్ నస్రల్లాను చంపేయడం వంటి చర్యల ద్వారా ఇరాన్‌ను ఇజ్రాయెల్ అవమానించింది, సవాల్ విసిరింది. దీనికి ప్రతిగా క్షిపణిదాడులు జరుపుతూ ఇది సంకేతాత్మక చర్య మాత్రమేనని, ఇక చాలునని ఇరాన్ ఓ మాటన్నది. అంతమాత్రాన ఇజ్రాయెల్ తిరిగి ప్రతీకారం తీర్చుకోకుండా ఉండదు కానీ, ఎంతగా దెబ్బతిన్నప్పటికీ, ఎంతోకొంత తిరిగి దెబ్బతీయగలస్థితిలో ఇరాన్ ఉంటుందన్న విషయాన్ని మిగతా ప్రపంచం కూడా గుర్తుపెట్టుకోవాలి. ఇరాన్ తలుచుకుంటే అంతర్జాతీయ చమురు సరఫరా వ్యవస్థ సైతం దెబ్బతినిపోవచ్చు. ఇప్పటివరకూ సాగిన పోరాటంలో ఇజ్రాయెల్‌దే పైచేయి అయినమాట నిజం. పాశ్చాత్యదేశాల ఆర్థిక, ఆయుధ సహకారంతో అది ఏకకాలంలో అనేకమంది శత్రువులతో యుద్ధం చేస్తోంది, పైచేయి సాధించింది. గాజాలో ఆరంభమైన యుద్ధాన్ని హమాస్, హిజ్బొల్లా, హౌతీల మీదుగా ఇరాన్ వరకూ విస్తరించింది. శత్రుశేషం ఉండనివ్వనంటూ ఇజ్రాయెల్ ఏడాదికి పైగా సాగిస్తున్న యుద్ధాన్ని ఇలా నిరవధికంగా కొనసాగనివ్వడం ప్రమాదం. ఈ నెల 17న హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ మరణించగానే, ఇజ్రాయెల్ ఇక ఈ శుభవార్తతో యుద్ధం ఆపివేయాలని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఓ మాటన్నారు. కానీ, అటు హమాస్, ఇటు ఇజ్రాయెల్ పాతపాటే పాడుతూ యుద్ధాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల తరువాతైనా ఈ పరిస్థితిలో మార్పువస్తే బాగుండును.

విజ్ఞాన జగత్తులో జెండర్ సమత్వం

మహిళా భౌతిక శాస్త్రవేత్తల తొలి అంతర్జాతీయ సమావేశం 2002లో పారిస్‌లో జరిగింది. భారత ప్రతినిధిగా పాల్గొన్న రోహిణీ గాడ్బోలే దృష్టికి, ఆ సదస్సు సందర్భంగా వచ్చిన కొన్ని వాస్తవాలు రెండు దశాబ్దాల అనంతరం, వైజ్ఞానిక పరిశోధనల విషయమై మన విధానంలో ఒక ప్రయోజనకరమైన మార్పుకు దోహదం చేశాయి. 2020లో భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం రూపొందించిన 'సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ పాలసీ (STIP)' డాక్యుమెంట్‌లో మహిళలకు సమానవకాశాలు కల్పించే దిశగా 'ఈక్విటీ అండ్ ఇంక్లూజన్' అనే అధ్యాయం రావడానికి రోహిణీ గాడ్బోలే ప్రధాన కారకురాలు అనడంలో అతిశయోక్తి లేదు. వైజ్ఞానిక పరిశోధనల విధానపత్రంలో ఆ వినూత్న మార్పు ప్రభావం ఇప్పటికిప్పుడు స్పష్టంగా లేకపోయినా పది, పదిహేనేళ్ల తరువాత కొట్టొచ్చినట్లు కనిపిస్తుందనడంలో సందేహం లేదు. ప్రొఫెసర్ రోహిణీ తీసుకున్న మరో ప్రగతిశీల నిర్ణయం ఫలితంగా 2008లో 'లీలావతి డాటర్స్– : ది ఉమెన్ సైంటిస్ట్స్ ఆఫ్ ఇండియా' అనే విలువైన పుస్తకం రావడం ఆ గమనంలో ఒక అర్థవంతమైన మజిలీ.

ప్రొఫెసర్ రోహిణీ గాడ్బోలే 2024 అక్టోబర్ 25 ఉదయం నిద్రలోనే అంతిమ శ్వాస విడిచినట్టు 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్' ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఆ సంస్థలోనే కాకుండా ప్రపంచ ప్రఖ్యాతి చెందిన సెర్న్ (CERN)లో కూడా ఆమె పరిశోధనలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో విశ్వవిద్యాలయాలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా బోధించారు. పార్టికల్ ఫినోమెనాలజీ, స్టాండర్డ్ మోడల్ ఆఫ్ పార్టికల్ ఫిజిక్స్, హై ఎనర్జీ ఫిజిక్స్ రంగాలలో రోహిణి మూడు దశాబ్దాలకు పైగా పరిశోధనలు చేశారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే హై ఎనర్జీ ఫోటో హైడ్రానిక్ [illegible]ర్ రూపురేఖలను వివరించడానికి ఆమె ప్రయత్నించారు. ఇది తర్వాత కాలంలో ఎంతో ప్రభావం చూపే పరిశోధన. అంతకుమించి భారత వైజ్ఞానిక రంగంలో మహిళలకు సమాన అవకాశాల కల్పనకు రోహిణీ గాడ్బోలే ఎంతో కృషి చేశారు. మహిళా శాస్త్రవేత్తలకు మరింత విద్యా ప్రోత్సాహం ఇచ్చి, వారిలో పరిశోధనా స్ఫూర్తిని నింపిన వైజ్ఞానికురాలు రోహిణీ గాడ్బోలే. 2019లో పద్మశ్రీ పురస్కారం, ఐఐటి కాన్పూరు గౌరవ డాక్టరేట్, సత్యేంద్రనాథ్ బోస్ మెడల్ మొదలైన వాటితోపాటు ఫ్రెంచ్ ప్రభుత్వ ఆర్డర్ ఆఫ్ నేషనల్ మెరిట్‌ను కూడా ఆమె పొందారు.

1848లో సావిత్రి బాయి పూలే కారణంగా దేశంలో తొలి బాలికల పాఠశాల, 1884లో మహదేవ్ గోవింద్ రణడే పూనికతో దేశంలోనే తొలి బాలికల ఇంగ్లీషు పాఠశాల మొదలైన పూణే నగరంలో 1952 నవంబర్ 12న రోహిణి ఒక విద్యాధికుల కుటుంబంలో నాల్గవ బిడ్డగా జన్మించారు. తండ్రి ఆదివారం పూట తన చిన్నారి కుమార్తెలకు 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ప్రచురించే సైన్సు వార్తలు, వ్యాసాలు వివరించి చెప్పేవారు. ఉదయం సంస్కృతంలో సాగే ఆధ్యాత్మిక విషయాలు వినపడినా రాత్రి భోజనాల దగ్గర మాత్రం సాహిత్యం, రాజకీయాలు, చరిత్ర, కళలు, సంగీతం, ఆర్థిక పరిస్థితులు వంటి విషయాలు లోతుగా చర్చకు వచ్చేవని రోహిణి రెండేళ్ల క్రితం రాసిన ఒక వ్యాసంలో పేర్కొన్నారు. అసలు ఇంగ్లీషు లేకుండా ఏడవ తరగతి దాకా మరాఠీ మీడియంలో చదివినా తాను చిన్నపుడు విన్న గెల్ మాన్ (Gell Mann) జ్విగ్ (Zweig) శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన క్వార్క్స్ (Quarks) సిద్ధాంతం తర్వాతి కాలంలో రోహిణికి జీవితకాలపు పరిశోధనా ఆసక్తిగా మారిపోయింది.



రోహిణీ గాడ్బోలే
1952 – 2024

> 'పరిశోధనారంగంలో వివక్ష' అనే అంశంపై పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సు రోహిణీ గాడ్బోలేలో కొత్త ఆలోచనలను రేకెత్తించింది. ఒక నూతన దృక్పథంతో తన పాతికేళ్ల పరిశోధక జీవితాన్ని నిశితంగా పరిశీలించుకునేట్టు ఆమెను ప్రేరేపించింది. భారతదేశ వైజ్ఞానిక పరిశోధనా రంగంలో ఉన్న వివక్షను, మహిళా శాస్త్రవేత్తల పరిశోధనా కృషికి ఎదురవుతున్న అవరోధాలను అధ్యయనం చేసి ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో మార్పులు వచ్చేట్టు చేసిన అపురూప శాస్త్రవేత్త రోహిణీ గాడ్బోలే.

పూణేలోని ప్రతిష్ఠాత్మక ఉన్నత పాఠశాలలో చదివినా అందులో ఆడపిల్లలకు కేవలం హోమ్ సైన్స్ మినహా మరో విజ్ఞాన సంబంధమైన బోధనాంశం ఉండేది కాదు. అయితే ఆమె మ్యాథ్స్ టీచర్ సొవాని, ఆమె భర్త, సైన్స్ టీచర్ బాపు సొవాని తోడ్పాటు, ప్రోత్సాహంతో మరాఠీ సైన్స్ మేగజైన్ 'సృష్టి విగ్యాన్' కారణంగా సైన్స్ సంబంధిత ఆసక్తి ఆమెలో బలపడింది. ఆ కారణంగానే ఉన్నతపాఠశాల స్థాయిలో జనరల్ సైన్స్ మరింత బోధించాలని, ల్యాబ్ మరింత మెరుగ్గా ఉండాలని ఉన్నత పాఠశాల విద్యార్థినిగా ఉన్నప్పుడే ఆమె గట్టిగా సూచించారు. పెద్దక్క తీసుకుని వచ్చిన నేషనల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ స్కాలర్‌షిప్ అప్లికేషన్ రోహిణీ విద్యాసక్తులను ఒక కొత్త మలుపు తిప్పింది. ఆ ఉపకార వేతనం కారణంగా ఎన్నో సైన్స్ పుస్తకాలు కొని చదవడానికి అవకాశం కల్పించింది. అలాగే సెలవుల్లో ఐఐటి కాన్పూర్, ఐఐటి ఢిల్లీ వంటి ప్రతిష్ఠాత్మకమైన సంస్థల్లో నిర్వహించే శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొనే వెసులుబాటు లభించింది. అందులో ఎంతో మంది యోగ్యులైన మిత్రులు లభించడం అనేది రోహిణి జీవితంలో చాలా కీలకంగా మారింది. అలా పరిచయమైన స్నేహితులలో నోబుల్ బహుమతి పొందిన వెంకీ రామకృష్ణన్, ఖగోళ శాస్త్రవేత్త రమేష్ నారాయణ కూడా ఉన్నారు. అలాగే ఐఐటి బొంబాయిలో ఎమ్మెస్సీ చదువుతున్నప్పుడు అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ యూనివర్సిటీ ఉమెన్‌కు సంబంధించిన స్కాలర్‌షిప్ అప్లికేషన్ ఆమెను విదేశాల్లో చదివించేలా మలుపు తిప్పింది. అయితే అక్కడ పిహెచ్.డి అయిపోయిన తర్వాత అవకాశాలున్నా స్వదేశానికి తిరిగి వచ్చి ముంబైలోని టీఐఎఫ్ఆర్‌లో పనిచేశారు. 1995లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో చేరారు. ఈ సంస్థలో ఆమె పరిశోధకురాలుగానే కాకుండా ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ నిర్వహించే ఫిజిక్స్ జర్నల్ 'ప్రమాణ'కు ఎడిటర్‌గా కూడా వ్యవహరించారు. మాన్యూల్ డ్రీస్, ప్రబీర్‌రాయ్‌తో కలసి రాసిన 'సూపర్ సిమెట్రీ' ప్రపంచ వ్యాప్తంగా పరిశోధకులు, విద్యార్థులు అధ్యయనం చేస్తున్నారు.

పరిశోధనారంగంలో వివక్ష అనే అంశంపై పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సు రోహిణిలో కొత్త ఆలోచనలను పురిగొల్పింది. ఫలితంగా ఒక నూతన దృక్పథంతో తన పాతికేళ్ల పరిశోధక జీవితాన్ని నిశితంగా పరిశీలించుకునేట్టు ఆమెను ప్రేరేపించింది. మేరీ క్యూరీ వంటి వారి జీవితాలు గొప్పస్ఫూర్తిగా మనకు అందుబాటులో ఉన్నా, ఆమె చేరిన స్థాయి మామూలు విద్యార్థులకు కించిత్ భయాన్ని కూడా కలిగిస్తుంది. కనుక స్థానికంగా మన దేశంలోని ప్రతికూల పరిస్థితులను నిభాయించుకుని విజయం సాధించిన మహిళా శాస్త్రవేత్తలను పరిచయం చేసేందుకు సంకల్పించిన రోహిణి, రామ్ రామస్వామితో కలిసి 'లీలావతి డాటర్స్– : ది ఉమెన్ సైంటిస్ట్స్ ఆఫ్ ఇండియా' అనే స్ఫూర్తిదాయక గ్రంథాన్ని రాశారు. 2008లో బెంగళూరులోని ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ ఆ పుస్తకాన్ని ప్రచురించింది. 12వ శతాబ్దానికి చెందిన భాస్కరుడు బాలవితంతువైన తన కూతురు లీలావతికి వినోదం కలిగించేందుకు 'లీలావతి గణితం' రాశారనే చారిత్రక ఐతిహ్యం ఒకటి ఉన్నది. ఆ స్ఫూర్తితోనే రోహిణి తన పుస్తకానికి 'లీలావతి డాటర్స్' అని నామకరణం చేశారు. ఈ పుస్తకం మూడో ఎడిషన్‌లో జానకి అమ్మాళ్, అసిమా చటర్జీ, అన్నమణి, కమలాసోనీ మొదలైన వైజ్ఞానిక విదుషీమణుల జీవిత కథనాలతో పాటు మరో 90 మంది మహిళా శాస్త్రవేత్తలు తాము పరిశోధనా రంగంలో చవిచూసిన అనుభవాలను వివరిస్తూ రాసిన వ్యాసాలు ఉన్నాయి. భారతదేశ వైజ్ఞానిక పరిశోధనా రంగంలో ఉన్న వివక్షను, మహిళా శాస్త్రవేత్తల పరిశోధనా కృషికి ఎదురవుతున్న అవరోధాలకు సంబంధించి తొలిసారి పూర్తిగా దృష్టి పెట్టి, అధ్యయనం చేసి ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో మార్పులు వచ్చేట్టు దోహదం చేసిన అపురూప శాస్త్రవేత్త రోహిణీ గాడ్బోలేకు మనందరం నివాళులు అర్పించాలి.

● నాగసూరి వేణుగోపాల్

న్యాయ నిర్ణయాలలో ఆ స్వతంత్రత ఏదీ?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

అయోధ్యలో బాబ్రీ మసీదు తాళాలు తెరిచి, రామ్ లల్లా విగ్రహాన్ని భక్తుల సందర్శనానికి వీలు కల్పించేలా 1986లో ఫైజాబాద్ జిల్లా మెజి[illegible] కెఎం పాండే ఆదేశాలు జారీ చేశారు. 'ఆ రోజు విచారణ జరుగుతున్నంత సేపు ఒక నల్లటి కోతి కోర్టు గది కప్పుపై కూర్చుని ఉండేది. తుది తీర్పు వినేందుకు వచ్చిన వేలాది ప్రజలు ఆ కోతికి పళ్లు, ఇతర ఆహార పదార్థాలు ఇచ్చినప్పటికీ అది ఏ మాత్రం వాటిని ముట్టుకునేది కాదు. చివరకు మసీదు తాళాలు తెరవాలని సాయంత్రం 4.40 గంటలకు తీర్పు ఇచ్చిన వెంటనే ఆ కోతి అక్కడి నుంచి మాయమైపోయింది. తీర్పు ఇచ్చిన తర్వాత నేను అక్కడి నుంచి బంగళాకు చేరుకునే సరికే ఆ కోతి ఆశ్చర్యకరంగా వరండాలో కనిపించింది. ఇది దైవిక శక్తి కాకపోతే మరేమిటి?' అని పాండే తన ఆత్మకథ 'వాయిస్ ఆఫ్ కాన్షియస్' (అంతరాత్మ స్వరం)లో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ కూడా అన్నీ దైవ సంకల్పితాలని నమ్మేవారిలో ఒకరు. అయోధ్యలో వివాదాస్పద భూమిని రామమందిర నిర్మాణానికి అప్పగించి, మసీదుకోసం వేరే స్థలం కేటాయించాలన్న సుప్రీంకోర్టు తుది తీర్పు కూడా దైవ ఘటనే అని ఆయన విశ్వసించారు! అయోధ్య సమస్యకు పరిష్కారం చూపాలని తాను ఇంట్లో దేవుడి విగ్రహం ముందు కూర్చుని ప్రార్థించానని జస్టిస్ చంద్రచూడ్ కొద్ది రోజుల క్రితం మహారాష్ట్రలో ఒక సమావేశంలో వెల్లడించారు. భారతదేశంలో విశ్వాసాల విషయంలో ఒక జిల్లా మెజి[illegible]కూ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికీ పెద్ద తేడా లేదని ఈ ఉదంతాలు నిరూపిస్తాయి.

ఎవరు అవునన్నా, కాదన్నా, రాజ్యాంగం, రూల్ ఆఫ్ లా, చట్టాలతో పాటు మన దేశంలో మనిషి భక్తి విశ్వాసాలు, నమ్మకాలు కూడా కీలకమైన పదవుల్లో ఉన్న వారి నిర్ణయాలను ప్రభావితం చేయకతప్పదు. చాలా అరుదైన వ్యక్తులు మాత్రమే తమ వ్యక్తిగత విశ్వాసాలను, నమ్మకాలను పక్కన పెట్టి తాము తీసుకున్న నిర్ణయాలు ఈ రాజ్యాంగం ప్రకారం, దేశ చట్టాల ప్రకారం సరైనవా కాదా అని మాత్రమే చూస్తారు. వచ్చే వారం పదవీవిరమణ చేయనున్న జస్టిస్ చంద్రచూడ్ రెండేళ్ల పనితీరును అంచనా వేయాలంటే ఆయన ఈ రెండేళ్లలో ఇచ్చిన తీర్పులు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆయన వ్యవహరించిన తీరును పరిశీలించాల్సి ఉంటుంది. 'ప్రజాస్వామ్య వ్యవస్థలో మాకు మా విధుల గురించి బాగా తెలుసు. రాజకీయ కార్యనిర్వాహక వర్గానికీ వారి విధుల గురించి తెలుసు. ఏ న్యాయమూర్తీ న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ముప్పు రానివ్వరు.' అని జస్టిస్ చంద్రచూడ్ ఇటీవల ముంబైలో లోక్‌సత్తా నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ అన్నారు. వినాయక చవితి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన నివాసానికి వచ్చి పూజలు చేసిన విషయం వివాదాస్పదం కావడం గురించి మాట్లాడుతూ ఆయన ఈ వివరణ ఇచ్చారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే జస్టిస్ చంద్రచూడ్ ఈ వ్యాఖ్య ద్వారా ప్రభుత్వం తరఫున కూడా వివరణ ఇచ్చారు. న్యాయమూర్తి తనకు తన విధుల గురించి తెలుసని చెప్పుకోగలరు కాని ఇతరులకు కూడా తమ విధుల గురించి తెలుసని ఎలా చెప్పగలరు?

రాజ్యాంగాన్ని సుప్రీంకోర్టు పరిరక్షిస్తుందని మన రాజ్యాంగవేత్తలు, న్యాయనిపుణులు భావిస్తారు. సుప్రీంకోర్టు తొలి దశకంలో (1950–60) కనియా, పతంజలి శాస్త్రి, మెహర్‌చంద్ మహాజన్, ముఖర్జీ, ఎస్ఆర్ దాస్ వంటి ప్రముఖుల నాయకత్వంలో రాజ్యాంగంలోని మూడు విభాగాల మధ్య ఖచ్చితమైన సమతుల్యం ఏర్పడేలా చూశారు. ఆ తర్వాతి దశకంలో (1960–70) నెహ్రూ మరణానంతరం ఏర్పడిన రాజకీయ అస్థిరత, ఆర్థిక అస్థిరత్వం అవినీతి పెచ్చరిల్లడం తదితర పరిస్థితుల్లో సుప్రీం తన భూమికను తాను నిర్వచించుకుంది. ఈ కొత్త మార్పుకు తెలుగువాడైన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కోకా సుబ్బారావు సారథ్యం వహించారు. గోలక్‌నాథ్ కేసు, ప్రివీ పర్సు కేసు, బ్యాంకు జాతీయాకరణ కేసులపై చరిత్రాత్మక తీర్పులు ఇదే కాలంలో వచ్చాయి. రాజకీయ గుత్తాధిపత్యానికి ఈ తీర్పులు అడ్డుకట్ట వేసి ప్రాథమిక హక్కులకు పెద్దపీట వేశాయి. ఈ కేసులను చెల్లకుండా చేసేందుకు 1971 తర్వాత పార్లమెంట్ రాజ్యాంగ సవరణలు చేసింది. ఈ కాలంలో కూడా కోర్టులు ప్రభుత్వాన్ని ప్రతిఘటించాయి. కేశవానంద భారతి కేసులో ప్రాథమిక హక్కులతో పాటు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంట్‌కు లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పు తర్వాత ఈ దేశంలో సర్వోన్నత న్యాయస్థానం అధికారాలను తగ్గించేందుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ కోర్టు తట్టుకుని నిలబడింది.

ఎమర్జెన్సీ అనంతరం 1977లో జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 1978లో మనేకా గాంధీ కేసులో కోర్టు వ్యక్తిగత స్వేచ్ఛను హరించే హక్కు ప్రభుత్వానికి లేదని స్పష్టం చేసింది. మినర్వా మిల్, వామనరావు కేసుల్లోనూ రాజ్యాంగంలోని మౌలిక స్వరూపానికి కోర్టు రక్షణలు కల్పించింది. 1980 తర్వాత కోర్టులు పేదలు, నిస్సహాయులు, అణగారిన వర్గాల తరఫున నిలబడేందుకు, ఖైదీల ప్రయోజనాలు కాపాడేందుకు, రూల్ ఆఫ్ లాను కాపాడేందుకు ప్రాధాన్యతనిచ్చాయి. ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)కు ఇదే కాలంలో ప్రాచుర్యం లభించింది. భగవతి, కృష్ణయ్యర్, దేశాయి, చిన్నప్పరెడ్డి, జస్టిస్ థాకర్ లాంటి వారు ఒక టీమ్‌గా పనిచేసి సుప్రీంకోర్టు ఔన్నత్యాన్ని పెంచారు. 1990వ దశకంలో కూడా ఇందిరా సహానీ, ఎస్ఆర్ బొమ్[illegible], విశాఖ, సమతా, మోహినీ జైన్ తదితర కేసుల్లో కీలకమైన తీర్పులు వచ్చాయి. రిజర్వేషన్లు కల్పించడం, రాష్ట్రపతి పాలనను దుర్వినియోగం చేయడం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు అరికట్టడం, ఆదివాసీ ప్రాంతాలను మైనింగ్ దోపిడీ నుంచి పరిరక్షించడం, చదువుకునే హక్కును జీవించే హక్కుగా మార్చడం మొదలైన అంశాలపై అనేక కీలక తీర్పులు వెలువడ్డాయి.

సంస్కరణల అనంతరం కోర్టు తీర్పుల స్వరూప, స్వభావాలు మారినప్పటికీ ప్రైవసీ, మానవ హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛ వంటి అంశాలపై కీలకమైన తీర్పులు వెలువడ్డాయి. జస్టిస్ వెంకటాచలయ్య లాంటి ప్రధాన న్యాయమూర్తులు ప్రధానమంత్రులను సుప్రీంకోర్టుకు ఆమడ దూరంలో ఉంచారు. ఆయన తర్వాత జస్టిస్ జెఎస్ వర్మ, జస్టిస్ దీపక్ మిశ్రా వంటి వారు కీలకమైన తీర్పులను వెలువరించారు. మూక ఊచకోత లాంటి వాటిని తీవ్రంగా గర్హించడంతో పాటు స్త్రీలు, గే ల విషయంలో చెప్పుకోదగ్గ తీర్పులు ఇచ్చిన జస్టిస్ దీపక్ మిశ్రాను విలేఖరుల సమావేశంలో విమర్శించిన జస్టిస్ గొగోయ్ తర్వాతి కాలంలో వివాదాస్పదుడై పదవీ విరమణ అనంతరం రాజ్యసభ సభ్యత్వాన్ని పొందారు.



> ప్రభుత్వ ప్రతి నిర్ణయాన్ని న్యాయవ్యవస్థ వ్యతిరేకించాలని ఎక్కడా లేదు. అయితే ప్రభుత్వమూ, న్యాయవ్యవస్థల మధ్య పరిధులు చెరిగిపోతున్నాయని, ప్రభుత్వ అభిప్రాయాలు, భావజాలానికి న్యాయవ్యవస్థ అనుగుణంగా నడుస్తోందని, సంపన్నులు, పలుకుబడిగల వారికే న్యాయం జరుగుతోందనే అభిప్రాయం ఏర్పడడం ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుందా?

నిజానికి తెలుగువాడైన జస్టిస్ రమణ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీబాధ్యతలు చేపట్టే నాటికి ఆయనకు ముందున్న ముగ్గురు సిజెలు సుప్రీంకోర్టు ప్రమాణాలను తగ్గించారనే విమర్శలు ఉండేవి. ఆ ప్రమాణాలను నిలబెట్టడమే ఆయనకు తలకు మించిన పని అయింది. జస్టిస్ రమణ సుప్రీం న్యాయమూర్తిగా ఉన్న కాలంలోనే మహారాష్ట్రలో రాత్రికి రాత్రి ప్రభుత్వాన్ని పడగొట్టడాన్ని వ్యతిరేకించి తక్షణం సభలో విశ్వాస పరీక్షకు ఆదేశించడంతో ఉద్ధవ్ థాకరే ప్రభుత్వం మళ్లీ కొనసాగగలిగింది. రమణ సిజె అయిన తర్వాత కూడా ఇచ్చిన తీర్పుల ప్రాముఖ్యత ఎంతో ఉన్నది. అనురాధా బాసిన్ కేసులో ఇంటర్నెట్‌ను ప్రాథమిక హక్కుగా పరిగణిస్తూ కశ్మీర్‌లో ఇంటర్నెట్ పునరుద్ధరించడం, లఖీంపూర్ ఖేరీ హత్యాకాండపై విచారణకు ఆదేశించడం, బెయిల్ వచ్చిన వెంటనే ఖైదీలు విడుదలయ్యేందుకు ఫాస్టర్ వ్యవస్థను ప్రవేశపెట్టడం, కేరళ జర్నలిస్టు సిద్దిఖీ కప్పన్‌కు తక్షణ వైద్య సహాయం అందేలా చూడడం, ట్రిబ్యునల్స్‌కు వెంటనే చైర్మన్లను నియమించాలనడం వీటిలో ఉన్నాయి.

జస్టిస్ రమణ తర్వాత సిజె అయిన ఉదయ్ ఉమేష్ లలిత్ ఎక్కువ కాలం ఉండలేదు. కాని జస్టిస్ చంద్రచూడ్‌కు ఎక్కువకాలం ఉండే అవకాశం వచ్చింది. ఆయన ప్రైవసీ హక్కు, ఢిల్లీలో అక్రమంగా కట్టిన సూపర్ టెక్ ట్విన్ టవర్స్‌ను కూలగొట్టడం, అబార్షన్ హక్కులను అవివాహితలకు కూడా కల్పించడం, అడల్ట్రీని నేరం కాదని చెప్పడం, సేమ్ సెక్స్ సంబంధాలను ఆమోదించడం వంటి చెప్పుకోదగ్గ తీర్పులు ఇచ్చారు. ముఖ్యంగా అంతర్జాతీయంగా తన పేరు చర్చకు వచ్చే కేసులపై ఆయన ప్రధానంగా దృష్టి సారించారు. కాని ఆయన హయాంలో ఎలెక్టోరల్ బాండ్ల విషయంలో కీలక తీర్పు వెలువడింది. అయితే జరిగిందేమిటి? ఎలెక్టోరల్ బాండ్లు అక్రమం అని సిజె ప్రకటించినప్పటికీ ఈ అక్రమానికి కారకులైన వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదు? చండీఘడ్ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలను చెల్లకుండా చేసిన ఎన్నికల అధికారిని క్రిమినల్‌గా అభివర్ణించారు కాని ఆయనపై కూడా ఎలాంటి చర్యా లేదు. మహారాష్ట్రలో ఏర్పడ్డ షిండే, ఫడ్నవీస్, అజిత్ పవార్ ప్రభుత్వాన్ని అక్రమమని ప్రకటించారు కాని అదే ప్రభుత్వం కొనసాగడానికి వీలు కల్పించారు. మణిపూర్ హింసాకాండపై కానీ, సాయిబాబా బెయిల్ ఆగమేఘాలపై రద్దు చేయడంలో కానీ సిజెగా ఆయన కలుగచేసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. జస్టిస్ రమణ హయాంలో బినామీ వ్యవహారాల నిషేధ చట్టం, 2016ను గతంలో ఎప్పుడో జరిగిన వ్యవహారాలకు అన్వయించడం సరి కాదని, చట్టం ఆమోదించిన నాటి నుంచీ అన్వయించాలని తీర్పు నిచ్చారు. కాని జస్టిస్ చంద్రచూడ్ ఈ తీర్పును రద్దు చేశారు. రాజకీయ ప్రత్యర్థులను వేధించేందుకే ఈ తీర్పును రద్దు చేయించారన్న ఆరోపణలు వస్తున్నాయి.

న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వ నియంత్రణకు అనుమతించారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ ప్రతి నిర్ణయాన్ని న్యాయవ్యవస్థ వ్యతిరేకించాలని ఎక్కడా లేదు. అయితే ప్రభుత్వమూ, న్యాయవ్యవస్థల మధ్య పరిధులు చెరిగిపోతున్నాయని, ప్రభుత్వ అభిప్రాయాలు, భావజాలానికి న్యాయవ్యవస్థ అనుగుణంగా నడుస్తోందని, సంపన్నులు, పలుకుబడి గల వారికే న్యాయం జరుగుతోందనే అభిప్రాయం ఏర్పడడం ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరం కాదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

సృజనశీలతలో నవ తరంగం

'కృత్రిమ మేధ వలన కార్మికుల ఆదాయాలలో కోత పడింది. ఈ ఆదాయ క్షీణతకు ప్రధాన కారణం కృత్రిమ మేధ సంబంధించిన ఆటోమేషన్ -ఆధారిత ఆవిష్కరణలు'

– అంతర్జాతీయ కార్మిక సంస్థ World Employment and Social Outlook 2024 నివేదిక.

అసలు కృత్రిమ మేధ అంటే ఏమిటి? కృత్రిమ మేధకు సంబంధించి ప్రస్తుతం ప్రపంచంలో వస్తున్న మార్పులు ఏమిటి? ఆ మార్పుల ప్రభావం ఉద్యోగాలపై ఎలా ఉంటోంది? తదితర అంశాలను ఈ సందర్భంగా చర్చించాల్సిన అవసరమున్నది.

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్– ఎఐ) మన రోజువారి జీవితంలో ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది. ఉదాహరణకు, మీరు సిరి లేదా గూగుల్ అసిస్టెంట్ లాంటి వాయిస్ అసిస్టెంట్‌ని ఉపయోగించి, 'ఈ రోజు వాతావరణం ఎలా ఉంది?' అని అడిగితే, ఎఐ మీ ప్రశ్నను అర్థం చేసుకుని సమాధానం ఇస్తుంది. అలానే మీరు కంప్యూటర్ కానీ మొబైల్ ఫోన్‌లో కానీ పదాలను టైప్ చేస్తూ తప్పు చేస్తే, అక్షర దోషాలను ఎత్తిచూపడం, లేదా ఆటో -కరెక్ట్ చేయడం కూడా ఎఐ పని. మీరు ఫోన్‌లో యూట్యూబ్‌లో మీకు నచ్చిన వీడియోలు చూసినప్పుడు, ఎఐ వాటిని గుర్తించి, మీకు నచ్చే ఇతర వీడియోలను సిఫారసు చేస్తుంది. అలాగే, గూగుల్ మ్యాప్స్ లాంటి నావిగేషన్ యాప్‌లు మీకు అత్యంత సులభమైన దారి చూపించడం కూడా ఎఐ పుణ్యమే. ఇవన్నీ సాధారణ ఎఐ మన నిత్య జీవితంలో మన పనిని ఎలా సులభతరం చేస్తుందో చెప్పే ఉదాహరణలు.

అయితే ఇప్పుడు ఈ సాంకేతికత మరొక అడుగు ముందుకువేసింది. సాధారణ ఎఐలో ఒక పాయ మరింత అభివృద్ధి చెంది జెనరేటివ్ ఎఐ(జెన్ ఎఐ) ఏర్పడింది. జెన్ ఎఐ అనేది ఒక ప్రత్యేకమైన సృజనాత్మక మేధస్సు. ఉదాహరణకు, మీరు జెన్ ఎఐకి 'ఒక రాజు గారు- –ఏడుగురు కొడుకుల కథ' అనే అంశం ఇచ్చి కథ రాయమంటే చిటికెలో ఒక కథని సృష్టించగలదు. మీరు చిత్రాన్ని వేయాలని అడిగి, కొన్ని సూచనలు ఇస్తే, మీకు కావలసినట్లుగా ఒక అందమైన బొమ్మను గీయగలదు. మీరు కొత్త పాట రాయాలనుకుంటే, జెన్ ఎఐ మీకు ఆసక్తి ఉన్న సంగీత శైలుల ఆధారంగా ఒక కొత్త పాటను సృష్టించగలదు.

సాధారణ ఎఐకు జెన్ ఎఐకు తేడా చెప్పాలంటే సాధారణ ఎఐ అనేది ఒక తెలివైన రోబో లాంటిది, ఇది మనం ఇచ్చిన సూచనలు పాటిస్తూ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం, గణిత సమస్యలు పరిష్కరించడం, సినిమాలు సూచించడం లాంటి నిర్దిష్ట పనులు చేస్తుంది. కానీ సొంతంగా ఆలోచించి కొత్తగా దేన్నీ సృష్టించలేదు. జెన్ ఎఐ మాత్రం, చాలా క్రియేటివ్ రోబో లాంటిది. ఇది చూసి, నేర్చుకున్న వాటిని ఉపయోగించి కొత్త విషయాలను సృష్టించగలదు. స్థూలంగా చెప్పాలంటే, సాధారణ ఎఐ మనం ఇచ్చిన నియమాలను పాటిస్తూ పనిచేస్తే, జెన్ ఎఐ తాను నేర్చుకున్న జ్ఞానాన్ని ఉపయోగించి కొత్త విషయాలను సృష్టిస్తుంది! అంటే సాధారణ ఎఐ పాత వంటగాడు లాంటిది: తనకు ఇప్పటికే తెలిసిన వంటకాలను మాత్రమే తయారుచేయగలదు. మీరు ఈ చెఫ్‌కు చికెన్, మసాలా దినుసులు, బియ్యం, పంచదార ఇస్తే, బహుశా ఈ దినుసులతో ఎలాంటి వంటకం సాధ్యం కాదు అనొచ్చు. కానీ జెన్ ఎఐ మాత్రం ఇప్పటివరకూ ఎవరికీ తెలియని తీపి వంటకాన్ని సృష్టించగలదు.

అసలు కృత్రిమ మేధ అనే భావన మొదట, 1950ల మధ్యలో శాస్త్రజ్ఞులు ఊహించారు. 1956లో, జరిగిన 'డార్ట్‌మౌత్ సదస్సు'లో 'కృత్రిమ మేధస్సు' అనే పదం పుట్టింది. అప్పటి నుండి కంప్యూటర్లు మానవ మేధస్సు చేయగలిగిన పనులు చేయగలవని కలలు కనడం మొదలయ్యింది. 1980వ దశకంలో, కొన్ని కొత్త కంప్యూటర్ ప్రోగ్రామ్‌లు ఎఐ రంగంలో కొంత అభివృద్ధిని తీసుకువచ్చినప్పటికీ, కొన్ని సమస్యలు కూడా ఎదురయ్యాయి. ఉదాహరణకు, ఎఐకు శిక్షణ ఇవ్వడానికి అవసరమైన పెద్ద డేటా సెట్లు అందుబాటులో లేకపోవడం, అభివృద్ధికి కావాల్సిన కంప్యూటర్ సామర్థ్యం తక్కువగా ఉండడం వలన ఎఐ అభివృద్ధి నెమ్మదించింది. ఈ కారణంగా, ఈ కాలాన్ని 'ఎఐ శీతాకాలం' అని పిలుస్తారు.

2000ల తరువాత, సూపర్ కంప్యూటర్ల ఆగమనం, వాటికి శిక్షణ ఇవ్వడానికి పెద్ద డేటా సెట్లు అందుబాటులోకి రావడం వలన ఎఐ మళ్ళీ పుంజుకుంది. 2010లలో కృత్రిమ నరాలు అధునాతన దశకు చేరుకున్నాయి. ఈ నరాలు మానవ మేధస్సు ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకుని వాటిని అనుకరించడానికి సహాయపడతాయి. 2014లో, 'జనరేటివ్ అడ్వర్సేరియల్ నెట్వర్క్స్' (GANs) అనే ఒక ప్రత్యేకమైన ఎఐ మోడల్ వచ్చింది. ఇది రెండు భాగాలుగా ఉంటుంది: ఒక భాగం కొత్త విషయాలు సృష్టించడానికి ప్రయత్నిస్తే, మరొక భాగం ఆ విషయాల ప్రామాణికతను తనిఖీ చేస్తుంది. అంటే ఉదాహరణకు మొదటి భాగం పిల్లి బొమ్మను గీస్తే రెండవ భాగం ఆ బొమ్మ నిజమైన పిల్లికి దగ్గరగా ఉందా లేదా అని చూసి మొదటి భాగానికి ఫీడ్ బ్యాక్ ఇవ్వడం ద్వారా తనను మెరుగుపరచుకోవడానికి తోడ్పడుతుంది. తర్వాత 2017లో, 'ట్రాన్స్‌ఫార్మర్' అనే కొత్త టెక్నాలజీ వచ్చింది. ఇది ఎఐని మంచి కథలు, గీతాలు లాంటివి సృష్టించడంలో సహాయపడుతుంది. ఒకరకంగా ఈ టెక్నాలజీ జనరేటివ్ ఎఐకి పునాది లాంటిది.

జెన్ ఎఐ మానవుల్లా ఆలోచించగలిగే శక్తి వలన చాలా ఉపయోగాలు ఉన్నాయి. విసుగు విరామం లేకుండా పదే పదే చేయాల్సిన పనులను జెన్ ఎఐ automate చేయగలదు, కంటెంట్‌ను వేగంగా సృష్టించగలదు, కొత్త ఆలోచనలను ప్రేరేపించగలదు. ప్రస్తుతానికి జెన్ ఎఐ ట్యూమర్ డిటెక్షన్, మెడిసిన్/డ్రగ్ ట్రయల్స్, విద్యార్థుల కోసం వ్యక్తిగతంగా వారికి అనుమానాలు తీర్చడానికి పలు పాశ్చాత్య దేశాలలో వాడుతున్నారు. ఎలాంటి సంక్లిష్టమైన భావనను ఐనా సరళమైన భాషలో విడమర్చి చెప్పే శక్తి జెన్ ఎఐ సొంతం. అంతే కాకుండా సంక్లిష్టమైన సాఫ్ట్‌వేర్ కోడ్ రాయడం, డేటా విశ్లేషించడం తదితర సంక్లిష్టమైన పనుల్ని మనుష్యుల కంటే వందల రెట్లు వేగంగా చేయగలదు. అలానే ఎఐ వినియోగం వల్ల, గుమస్తా పనులు, డిజైనర్, సృజనాత్మక రంగాల్లో పలు పనులు సులభతరం అవుతాయి. ఇక స్థానిక భాషలలో జెన్ ఎఐ వినియోగంలోకి రావడం సాంకేతికత ప్రజాస్వామీకరణలో ఒక పెద్ద అడుగు.

> మానవుల్లా ఆలోచించగలిగే శక్తి 'జెనరేటివ్ ఎఐ'కు ఉన్నది. సంక్లిష్టమైన పనుల్ని మనుష్యుల కంటే వందల రెట్లు వేగంగా చేయగల అధునాతన సాంకేతికత అది. మెరుగైన జీవన ప్రమాణాలకు స్వచ్ఛమైన నీరు, విద్యుత్ వెలుగులు ఎంత కీలకమో, ఆవిష్కరణ, విద్య, వ్యక్తిగత అభివృద్ధికి జెన్ ఎఐని ఉపయోగించుకునే సామర్థ్యమూ అంతే ముఖ్యం.



ఇవన్నీ బానే ఉన్నా జెన్ ఎఐ ప్రతికూల ప్రభావాలు కూడా ఎక్కువే. గత రెండు దశాబ్దాలుగా, ఎఐలో పురోగతితో సహా సాంకేతిక ఆవిష్కరణలు కార్మిక ఉత్పాదకత, ఆర్థిక ఉత్పత్తిలో నిరంతర పెరుగుదలకు దారితీశాయని, అయితే, ఈ ఆవిష్కరణలు ఏకకాలంలో కార్మికుల ఆదాయం వాటా క్షీణతకు దారి తీశాయని ఇటీవల విడుదల అయిన World Employment and Social Outlook – 2024 నివేదిక వెల్లడించింది.

ఈ క్షీణతకు ముఖ్య కారణాలలో ఆటోమేషన్- ఆధారిత సాంకేతిక పురోగతి ఒకటి అని నివేదిక పేర్కొంది. ఎఐ ఒకవైపు ఉత్పాదకతను పెంచుతూ, మరొకవైపు మానవ శ్రమకు డిమాండ్‌ను తగ్గిస్తుందని, ఈ పరిస్థితిని మార్చడానికి బలమైన విధాన జోక్యాలు అవసరమని నివేదిక తెలిపింది. అలానే 2004 నుండి 2024 వరకు, కార్మిక ఆదాయం వాటా 1.6 శాతం పాయింట్లు తగ్గిందని, దీని ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా వారి ఆదాయంలో $ 2.4 ట్రిలియన్ క్షీణత నమోదు అయ్యిందని కూడా నివేదిక తేల్చింది. ఎఐ ఆధారిత ఆటోమేషన్, ఎఐ ఆధారిత ఆవిష్కరణలు ఈ క్షీణతకు కారణమయ్యాయని ఆ నివేదిక తెలిపింది.

అలానే కార్మిక ఆదాయంలో తగ్గుదలతో పాటు, మూలధన ఆదాయం పెరగడం వలన ఆదాయ అసమానతలు మరింత ఎక్కువవుతున్నాయి. మూలధన ఆదాయం కొంతమంది దగ్గరే కేంద్రీకృతం కావడం వలన అసమానతలు మరింత పెరుగుతున్నాయి.

సాంకేతిక పురోగతులు దీర్ఘకాల ఆర్థిక వృద్ధికి లాభదాయకమైనప్పటికీ, తాత్కాలికంగా కార్మిక విభాగాల్లో మాత్రం సంక్షోభ స్థితికి దారితీసే పరిస్థితులు ఉన్నాయని ఆ నివేదిక హెచ్చరించింది. అలానే జెన్ ఎఐ సాంకేతికత మొత్తం గూగుల్, మైక్రోసాఫ్ట్ తదితర బహుళజాతి కంపెనీల గుత్తాధిపత్యంలో ఉండడం ఆందోళనకరం. ఈ గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా, ఓపెన్ సోర్స్ ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం, న్యాయమైన పోటీకి అవకాశం కల్పించడంతో పాటు విభిన్న ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడం చాలా ముఖ్యం. అలానే జెన్ ఎఐ శిక్షణ కోసం అనుమతి లేకుండా కాపీరైట్- మెటీరియల్‌ను ఉపయోగించారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.

చివరిగా సాంకేతికత మన జీవితాలను లోతుగా ప్రభావితం చేస్తున్న ఈ యుగంలో, జెన్ ఎఐకి అందుబాటు అందరికీ హక్కుగా పరిగణించబడాలి. మెరుగైన జీవన ప్రమాణాలకు స్వచ్ఛమైన నీరు, విద్యుత్ సేవలు ఎంత కీలకమో, ఆవిష్కరణ, విద్య, వ్యక్తిగత అభివృద్ధికి జెన్ ఎఐని ఉపయోగించుకునే సామర్థ్యమూ అంతే ముఖ్యం అనే ఎరుక అవసరం. జెన్ ఎఐ ఫలాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావడం అంటే మానవ నాగరికత సమసమాజ స్థాపన అనే విలువ దిశగా ఒక అడుగు వేసినట్లే.

■ రణధీర్ మళ్ల
పీహెచ్‌డీ విద్యార్థి, ఎక్సెటర్ యూనివర్సిటీ, ఇంగ్లాండు

■ చక్రధర్ బుద్ధ
సీనియర్ పరిశోధకులు, లిబ్‌టెక్ ఇండియా

ఆంధ్రజ్యోతి ★

ANDHRAJYOTHY
గ్రేటర్ వరంగల్ 5

బుధవారం 30 అక్టోబరు 2024

జోనల్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలు ప్రారంభం

- ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి రాక
- పాల్గొన్న 960 మంది గురుకుల పాఠశాలల విద్యార్థులు
- ఏటూరునాగారంలో రెండు రోజుల పాటు నిర్వహణ


ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా

6



పర్యవేక్షణేదీ?



నగరంలో నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా దందా

- అనుమతుల్లేకుండా యథేచ్ఛగా విక్రయాలు
- విచ్చలవిడిగా గోదాములు, దుకాణాల ఏర్పాటు
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 299 షాపులకు తాత్కాలిక లైసెన్సులు జారీ

8

దీపావళి అంటేనే బాణసంచా వ్యాపారం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా రూ.కోట్లలో అమ్మకాలు జరుగుతాయి. ఇందులో ఎక్కువశాతం నగరం నుంచే జరుగుతుంటాయి. ఈ క్రమంలో అధికార యంత్రాంగం నుంచి పర్యవేక్షించే వారు లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు నీళ్లొదిలి.. జనావాసాలు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో గోదాములు, దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారు.

వరంగల్, హనుమకొండల్లోని సుమారు 20ప్రాంతాలు కేంద్రంగా హోల్‌సేల్ పేరుతో జరిగే వ్యాపారంలో ఎన్నో అక్రమాలున్నాయంటూ ఆరోపణలున్నాయి. సదరు దుకాణాల వద్ద కనీస నిబంధనలు, ప్రమాణాలు పాటించడం లేదని తెలుస్తోంది. ఇక పండుగ దుకాణాల


కరీమాబాద్ రాకాశికుంట ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచి బాణసంచాను సీజ్ చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ఏర్పాటు ప్రక్రియలో భాగంగా వరంగల్ జిల్లాలో 71, హనుమకొండ జిల్లాలో 228 తాత్కాలిక షాపులకు అధికారులు అనుమతులిచ్చారు. దీంతో మూడురోజులపాటు బాణసంచా వ్యాపారం జోరుగా సాగనుండగా.. ఈ దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో పాటించాల్సిన నిబంధనలపై అగ్నిమాపక, పోలీసు శాఖలు ఇప్పటికే వ్యాపారులకు పలు ఆదేశాలు, సూచనలు ఇచ్చాయి.

- మట్టెవాడ

ఆరోగ్యశాఖలో అయోమయం

డీఎంహెచ్‌వోల నియామకంలో గందరగోళం

వరంగల్ మెడికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఎంహెచ్‌వోల నియామకంలో అయోమయం నెలకొంది. రాష్ట్రంలోని 13 జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌చార్జి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల నియామకం చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తా మెమో నెంబరు 7165/బీ/ 2024 మంగళవారం విడుదల చేశారు. ములుగు జిల్లా డీఎంహెచ్‌వోగా డాక్టర్ గోపాల్‌రావును నియమించారు. మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డాక్టర్ జి.మురళీధర్‌ను నియమించారు. జనగామ జిల్లా డీఎంహెచ్‌వోగా డాక్టర్ కె.మల్లికార్జున్‌ను నియమించారు. అయితే ప్రస్తుతం ములుగు డీఎంహెచ్‌వోగా ఉన్న డాక్టర్ అప్పయ్య తన సొంత స్థానమైన హనుమకొండలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. అదే విధంగా గత సాధారణ బదిలీల్లో హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా ఉన్న డాక్టర్ బి.సాంబశివరావు వరంగల్ జిల్లాకు బదిలీ అయ్యారు. కానీ ప్రస్తుతం ఈ అధికారి ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు. కరీంనగర్‌లో విధులు నిర్వర్తించాల్సిన కె.వెంకటరమణ ఎంజీఎం ఆస్పత్రి సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా వచ్చేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం.

అయితే ఈ ఉత్తర్వులు ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యశాఖలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాల్సిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ మంగళవారం నుంచి సెలవుల్లో వెళ్లినట్లు తెలిసింది. ఆయన తిరిగి విధుల్లో చేరితేనే ఏ జిల్లాకు ఎవరు అధికారి అనే విషయంపై స్పష్టత రానుంది. అప్పటిదాకా వైద్య, ఆరోగ్యశాఖలో అయోమయం తప్పేటట్లు లేదు.



'పశ్చిమ, పరకాల' ఓటర్ల జాబితా ప్రచురణ

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల ముసాయిదా ప్రచురణ జాబితాను జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో విడుదల చేశారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన ప్రచురణ జాబితా, సీడీని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అదనపు కలెక్టర్ అందేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి. గణేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాద్‌రావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటరు చైతన్య కార్యక్రమాలు

పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో స్వీప్ ఆధ్వర్యంలో నూతన ఓటర్ల నమోదు కోసం విస్తృతంగా ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో స్వీప్ ఆధ్వర్యంలో నిర్వహించే యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా ఓటరు నమోదు చైతన్య కార్యక్రమాలపై మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నవంబర్ 1వ తేదీ నుంచి 26వ తేదీ వరకు స్వీప్ ఆధ్వర్యంలో ఓటర్ల చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ విద్యాలత, ఆర్డీఓ నారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే విజయవంతంగా నిర్వహించాలి..

- నవంబరు 6నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే
- ఏర్పాట్లను కలెక్టర్లు పకడ్బందీగా పూర్తి చేయాలి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. మంగళవారం మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో ఉప ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర కుటుంబ సర్వేపై సమీక్షించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు తయారుచేసిన ప్రణాళిక, సర్వే ఉద్దేశం, జిల్లా స్థాయిలో కలెక్టర్లు తీసుకోవాల్సిన చర్యలు మొదలైన అంశాలను ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి వివరించారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే) నిర్వహణ విధి విధానాలను క్యాబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదించామన్నారు. ఈ సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరిస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం ఉన్నతమైన ఆలోచనతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపడుతుందని, బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాల మెరుగుపరచడానికి తగిన ప్రణాళిక తయారు చేసేందుకు ఈ సర్వే ఉపయోగిస్తామన్నారు. నవంబర్ 6వ తేదీ నుంచి సర్వే ప్రారంభించాలని, సర్వే షెడ్యూల్ వివరాలు ప్రజలకు చేరేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. సర్వే చేస్తున్న సమయంలో కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ధరణి పాస్ పుస్తకాలు కుటుంబం దగ్గర ఉంచుకునేలా ప్రచారం చేయాలన్నారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించాలన్నారు.


హనుమకొండ నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న మంత్రి భట్టి)


వీసీలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

ఎన్యుమరేషన్ సమయంలో కుటుంబ యజమానికి వారి వద్ద నుంచి సేకరించే సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని తెలియజేయాలని, నింపిన షెడ్యూల్ ఫారం జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. ఈ డేటా ఇతరులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని తెలిపారు. రోజువారి సర్వేను జిల్లా వారిగా ఏ రోజుకారోజు సాయంత్రం 6గంటలకు తెలియజేయాలన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ.. జిల్లా యంత్రాంగం సమన్వయంతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సర్వేలో ఏ ఒక్క ఇల్లు తప్పకుండా ఇండ్ల జాబిత ప్రక్రియ పూర్తిచేయాలని, షెడ్యూల్ రూపకల్పన, స్టిక్కర్, అవసరమైన సామగ్రి సేకరణ పూర్తి చేయాలన్నారు.

అనంతరం వరంగల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టాలన్నారు. సర్వేకు వెళ్లే ఎన్యుమరేటర్‌కు ఐడీ కార్డు జారీ చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే హనుమకొండ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జడ్పీ సీఈవో విద్యాలత, డీపీవో లక్ష్మీరమాకాంత్‌తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల గొంతుకను బలంగా వినిపిస్తాం..

- విద్యుత్ చార్జీల పెంపునకు సర్కారు కుట్ర
- మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

బాలసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల తరఫున ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకను బలంగా వినిపిస్తామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళ వారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ కార్యాలయం వద్ద విద్యుత్ చార్జీల పెంపు ఆలోచన ప్రతిపాదన తిరస్కరణల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18,500కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపాలని చూసిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు పెంచలేదన్నారు. విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా పబ్లిక్ ఇయరింగ్‌లో కేటీఆర్ పాల్గొని ఈఆర్‌సీని కేటీఆర్ విద్యుత్ బిల్లులు పెంచకుండా ఒప్పించారన్నారు. ప్రజల సంక్షేమం చేతకాకే కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ మాదిరి వరంగల్ ప్రజల జోలికి వస్తే ఊరుకోబోమని వినయ్ భాస్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో 'కుడా' మాజీ చైర్మన్లు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు బోయినపల్లి రంజిత్‌రావు, సంకు నర్సింగ్, సారంగపాణి, బాబురావు, లక్ష్మీనారాయణ, వేణు, నాయకులు పులి రజినీకాంత్, చుంచు కృష్ణ, నయీమొద్దీన్, ఖుద్దూస్ పాల్గొన్నారు.


టీఎస్ ఎన్పీడీసీఎల్ కార్యాలయం ముందు సంబరాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

సంబరాలను అడ్డుకున్న పోలీసులు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పశ్చిమ నియోజక వర్గ పరిధిలో దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో సంబరాల కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ ద్వారా టీఎస్ ఎన్పీడీసీఎల్ కార్యాలయం వద్దకు రాగానే అక్కడికి సుబేదారి, హనుమకొండ పోలీసులు చేరుకొని కార్యాలయ గేట్లను మూసివేశారు. బీఆర్ఎస్ శ్రేణులు కార్యాలయం ఎదుట బాణసంచా పేల్చే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసు సిబ్బందికి, బీఆర్ఎస్ శ్రేణులకు తోపులాట జరిగింది. అయినప్పటికీ బీఆర్ఎస్ నాయకులు బాణసంచా పేల్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసులు దౌర్జన్యం చేశారని వినయ్ భాస్కర్ అన్నారు. తెలంగాణలో నిరసన తెలపడంపై నిర్బంధం కొనసాగుతున్న వేళ కనీసం సంబరాలను సైతం చేసుకోనివ్వకపోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని విమర్శించారు. కాంగ్రెస్ నిరంకుశ నియంతృత్వ ప్రభుత్వ పోకడలకు త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న హనుమకొండ డీవైఎస్‌వో అశోక్‌కుమార్

ముగిసిన జిల్లాస్థాయి క్రీడా ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ , అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ)- అండర్19 ఆధ్వర్యంలో రెండు రోజులుగా జేఎన్‌ఎస్‌లో నిర్వహిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్ కళాశాలల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు హనుమకొండ డీవైఎస్‌వో, ఎస్‌జీఎఫ్‌ఐ అండర్ -19 కార్యదర్శి అశోక్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో 41క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించామన్నారు. హోరాహోరీగా జరిగిన ఎంపిక పోటీల్లో రాష్ట్రస్థాయికి చేరేందుకు క్రీడాకారులు తమ సత్తాను చాటుతూ దూసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు బరుపాటి గోపి, సతీష్, ప్రభాకర్, పీఈటీలు, డీఎస్‌ఏ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా ఇళ్లలో నిల్వ చేస్తే చర్యలు : సీపీ

బాలసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బాణసంచాను ఇళ్లల్లో నిల్వ చేస్తే చర్యలు తీసుకుంటామని సీపీ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. దీపావళిని ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అనుమతి లేకుండా బాణసంచా అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.

నాణ్యత పాటిస్తే పత్తికి మద్దతు ధర

సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్ దవే

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): పత్తికి మార్కెట్లో మద్దతు ధర పొందాలంటే నాణ్యతాప్రమాణాలు పాటించాలని సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మెనేజర్ అర్జున్ దవే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తిలో 8 శాతం తేమ మించకపోతే మద్దతు ధర లభిస్తుందని, 8 నుంచి 12 శాతం వరకు ఉంటే నిబంధనల మేరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు పత్తిని ఆరబెట్టి తీసుకుని రావాలని, 12 శాతం కంటే తేమ ఎక్కువ ఉండరాదని సూచించారు. పూర్తి వివరాలకు సీసీఐ కార్యాలయం 0870-2565077 నంబర్‌కు సంప్రదించవచ్చని కోరారు.

డిగ్రీ సెమిస్టర్ ఫీజు చెల్లింపు గడువు 11

కేయూ క్యాంపస్, అక్టోబరు 29:(ఆంధ్రజ్యోతి): కేయూ డిగ్రీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ రెగ్యులర్, బ్లాక్‌లాగ్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును నవంబరు 11 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

అనారోగ్యంతో వీడియో జర్నలిస్టు మృతి

వడ్డెపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రాయపుర ప్రాంతానికి చెందిన వీడియో జర్నలిస్టు కాగితోజు రాజ్‌కుమార్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజ్‌కుమార్ మెదడులో రక్తం గడ్డ కట్టడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రాజ్‌కుమార్ రెండు దశాబ్దాలుగా వివిధ చానళ్లలో కెమెరా మెన్‌గా పని చేశాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఆయన మృతిపట్ల జర్నలిస్టు యూనియన్ల నాయకులు, జర్నలిస్టులు సంతాపాన్ని తెలిపారు.



రాజ్‌కుమార్ (ఫైల్)

జోనల్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలు షురూ

- ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి రాక
- ఏటూరునాగారంలో రెండు రోజుల పాటు నిర్వహణ

ఏటూరునాగారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం మండల కేంద్రంలోని కొమరం భీం క్రీడా మైదానంలో 8 రీజియన్ల జోనల్ స్థాయి క్రీడలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడోత్సవాల్లో ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలోని బాల బాలికల ఎంపికలను నిర్వహించనున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, క్యారమ్, అర్చరీ, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ తదితర క్రీడలు జరిగాయి. కాగా, ఈ క్రీడలకు ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి 8 జోన్లలోని ఒక్కో జోన్ నుంచి 120 మంది విద్యార్థులకు గాను ఉమ్మడి జిల్లాలోని వివిధ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, బాల, బాలికల పాఠశాలలు, గిరిజన పాఠశాలలను నుంచి మొత్తం 960 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు.

ముఖ్య అతిథిగా ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని వాలీబాల్‌ను పీవో చిత్రమిశ్రా సర్వీస్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు మంచి క్రమశిక్షణతో మెదిలి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి రాష్ట్ర స్థాయిలో మంచి పేరుప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని 100 శాతం ఫలితాలు సాధించాలని అన్నారు.

తొలి రోజు పోటాపోటీగా క్రీడలు..

తొలిరోజు క్రీడలు పోటాపోటీగా జరిగాయి. డ్రా పద్ధతిన పోటీలను ప్రారంభించగా, మంగళవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, క్యారమ్, అర్చరీ, టెన్నికాయిట్ ఆటలు నిర్వహించారు. వాలీబాల్ అండర్-17 విభాగంలో కరీంనగర్, కొత్తగూడె జట్లు తలపడగా కొత్తగూడెం జట్టు విజయం సాధించింది. భూపాలపల్లి, ములుగు జట్లు తలపడగా, ములుగు జట్టు గెలుపొందింది. వాజేడు, వరంగల్ జట్లు తలపడగా వరంగల్ జట్టు విజయం సాధించింది. అంతేకాకుండా బాలుర అండర్-17లో వాజేడు, కొత్తగూడెం జట్లు తలపడగా, కొత్తగూడెం విజయం సాధించింది. భూపాలపల్లి, మహబూబాబాద్ జట్లు తలపడగా, మహబూబాబాద్ జట్టు గెలుపొందింది. ములుగు, ఏటూరునాగారం జట్లు తలపడగా ఏటూరునాగారం జట్టు విజయం సాధించింది. కరీంనగర్, వరంగల్ జట్లు తలపడగా వరంగల్ జట్టు విజయం సాధించింది. అండర్-17 విభాగం ఖోఖోలో కరీంనగర్, ములుగు జట్లు తలపడగా, ములుగు విజయం సాధించింది. హనుమకొండ, ఏటూరునాగారం జట్లు తలపడగా ఏటూరునాగారం జట్టు గెలుపొందింది. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ములుగు ఏటీడీవో దేశిరామ్, ఏటూరునాగారం ఏటీడీవో క్షేత్రయ్య, ఏటూరునాగారం, భూపా లపల్లి స్పోర్ట్స్ అధికారి ఆదినారాయణ, శ్యామలత, నారాయణ, ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోని వివిధ గిరిజన బాల, బాలికల వసతి గృహా ల పాఠశాలల పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ క్రీడలో తలపడుతున్న కరీంనగర్, వరంగల్ జట్లు

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

అధికారులతో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)ను పకడ్బందీగా నిర్వహించాలని, ఇందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం రాత్రి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మార్గదర్శకాలపై వివిధ శాఖల అధికారులు, జిల్లాలోని మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఎంపీఎస్‌ఓలతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఈ సర్వేను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని, మండలానికి ప్రత్యేక అధికారులుగా ఉన్న జిల్లాస్థాయి అధికారులతోపాటు ఎంపీడీవోలు, ఇతర అధికారుల పర్యవేక్షణలో ఎన్యుమరేటర్ల ద్వారా సర్వే జరుగుతుందన్నారు. ప్రతీ గ్రామం, వార్డులలో ఎన్యుమరేషన్ బ్లాకుల ప్రకారం సర్వే చేస్తారన్నారు. బుధవారం మండలస్థాయిలో సర్వేకు సంబంధించి వివిధ అంశాలను తెలియజేసేందుకు ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, పరకాల ఆర్డీఓ నారాయణ, డీపీవో లక్ష్మీ రమాకాంత్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

జిల్లాల పరిధిపై కాదు..

వసతులపై దృష్టి పెట్టండి..

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

హనుమకొండ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వసతులు కల్పించకుండా జిల్లాల పరిధిని విస్తరించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. కనీస వసతులు కల్పించలేని వారు జిల్లా పరిధి పెంచి ప్రజలకు ఏమి చేయగలరని ఎద్దేవా చేశారు. గతంలో కాంగ్రెస్ నాయకులు నగర శివార్లలోని గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేసి కనీస వసతులు కల్పించలేకపోయారన్నారు. ఇప్పుడు ఆయా గ్రామాల ప్రజలు ప్రతీ ఒక్క విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవలే శాసన సభ్యులు సమీక్ష సమావేశాలు నిర్వహించి నగరంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందన్నారు. రోడ్లన్నీ చెత్తతో కంపులు కొడుతున్నాయని, తాగునీరు అందించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పుడు ఉన్న వారికే సౌకర్యాలు కల్పించలేని ప్రభుత్వం.. కొత్తగా పరిధి విస్తరించి ప్రజలకు ఏమి మేలు చేస్తుందని ప్రశ్నించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధి పెంచడానికి ముందు మాస్టర్ ప్లాన్ విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

సూపర్ న్యూమరీ పోస్టుల

రెగ్యులరైజ్ ఎప్పుడు ?

- భర్తీ చేయడంలో అధికారుల కాలయాపన
- కలెక్టర్‌కు విన్నవించిన అశావహులు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపర్ న్యూమరీ పోస్టులు పొందిన వారిని రెగ్యులరైజ్ చేయడంలో కాలయాపన జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండు నెలలుగా ఫైలు కదలడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ఏడాది 2023 ఆగస్టులో జిల్లాలో 58 మంది సూపర్ న్యూమరీ పోస్టులు పొందగా, అందులో ఎగ్రెనిస్ట్ జూనియర్ అసిస్టెంట్ల పోస్టుల్లో 29మందిని విద్యాశాఖకు కేటాయించారు. జిల్లాలోని విద్యాశాఖలో ఎక్కడా జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఏర్పడ్డా వీరిని ఆ పోస్టులోకి పంపించాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో మూడుకు పైగానే జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉన్నా వీరిని మాత్రం ఆ పోస్టుల్లోకి పంపించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

జిల్లా విద్యాశాఖకు కేటాయించిన 29 మంది వారిని ఖాళీ జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లోకి పంపించాలని ఈ ఏడాది ఆగస్టులో వారు డీఈవోకు అర్జీ పెట్టుకున్నారు. మూడు నెలలు కావస్తున్నా.. పోస్టులు ఖాళీలుగా ఉన్నా.. ఆ పోస్టుల్లోకి వారిని పంపించడం లేదు. దీంతో వారు జిల్లా కలెక్టర్‌ను సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో ఆశ్రయించి వినతి పత్రం అందజేశారు. తమకు దక్కాల్సిన పోస్టులను జిల్లా విద్యాశాఖాధికారులు కావాలనే కాలయాపన చేస్తున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ ఈ విషయంపై చర్యలు తీసుకుంటారని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు రాష్ట్రాలు

బాగుండాలని కోరుకున్నా..

- తిరుమలలో మంత్రి కొండా సురేఖ

తిరుమల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదని, అన్ని విధాలా సవ్యంగా ముందుకు వెళ్లాలని వేంకటేశ్వరస్వామిని కోరుకున్నట్టు తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం ఆమె కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సురేఖ ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. మనవడి పుట్టెంట్రుకలను సమర్పించేందుకు కుటుంబ సభ్యులందరితో కలిసి వచ్చానన్నారు. తన వివాహం కూడా తిరుమలలోనే జరిగిందని గుర్తుచేశారు. భవిష్యత్తులో అంతా మంచే జరగాలని, కుటుంబాన్ని చల్లగా చూడాలని, అలాగే సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే శక్తిని ప్రసాదించాలని కూడా వేడుకున్నానన్నారు.

సెలవుపై బల్దియా కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఐదు రోజుల పాటు సెలవుపై వెళ్తున్నారు. కమిషనర్ సొంత రాష్ట్రమైన మహారాష్ట్రలో దీపావళి పండుగ జరుపుకోవడానికి బుధవారం నుంచి ఆదివారం వరకు సెలవుపై వెళుతున్నారు. తిరిగి నవంబర్ 4వ తేదీన విధుల్లో చేరి ప్రజావాణి కార్యక్రమలో పాల్గొంటారు. కాగా, కమిషనర్ తిరిగి విధుల్లో చేరే వరకు అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా ఇన్‌చార్జి కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తారు. మంగళవారం సాయంత్రం కమిషనర్ విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

28 మందికి జరిమానా

మట్టెవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 28 మందికి మంగళవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. వారికి మొత్తం రూ.36 100, అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురికి రూ.5000 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ప్రముఖ ఫొటోగ్రాఫర్

కంభంపాటి సీత కన్నుమూత

- యాత్రా రచనలు, వైల్డ్ , బర్డ్ లైఫ్ ఫొటోగ్రఫీలో పేరు
- ఈతలోనూ జాతీయ స్థాయి పతకాలు
- వరంగల్‌లోని ఆంధ్ర బాలికా కళాశాలలో అధ్యాపకురాలిగా సేవలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఫొటోగ్రాఫర్, యాత్రా రచయిత్రి కంభంపాటి సీత(73) కన్నుమూశారు. రోగ నిరోధకశక్తి తగ్గి.. వారం కిందట హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరిన ఆమె చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి 2.30గంటలకు గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆమె స్వస్థలం సికింద్రాబాద్‌లోని పద్మారావునగర్ కాగా వరంగల్‌లోని ఆంధ్ర బాలికా కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకురాలిగా సేవలందించారు. జీవిత సహచరుడు సోమంచి శ్రీనివాసరావుతో కలిసి ప్రపంచ దేశాలు చుట్టొచ్చిన ఆమె విశ్రాంత జీవితమంతా వైల్డ్‌లైఫ్, బర్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీకే అంకితమయ్యారు. వీరి ప్రతిభకు మెచ్చి ఇండియన్ ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫిక్ కౌన్సిల్ సభ్యత్వం ఇచ్చింది. సీత యాత్రా రచనలు 'విశ్వవిహారం', 200కుపైగా అరుదైన పక్షిజాతుల ఛాయాచిత్రాలతో 'బర్డ్స్ బ్యూటిఫుల్', మసైమరా వైల్డ్‌లైఫ్ ఫొటోలతో 'కాల్ ఆఫ్ ది వైల్డ్' పుస్తకాలు ప్రచురించారు.

సీత, శ్రీనివాసరావు దంపతులు తీసిన ఛాయాచిత్రాలు ప్రఖ్యాత మ్యాగజైన్ లలో ప్రచురితమయ్యాయి. వెన్నునొప్పి నుంచి ఉపశమనం కోసం తన 55వ ఏట ఆమె ఈత నేర్చుకున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని తీర్థన్‌నదిలో ఈది స్థానికుల మన్ననలు పొందారు. స్విమ్మింగ్ పోటీల్లో సీత 30కుపైగా రాష్ట్ర, జాతీయ స్థాయి పతకాలు సాధించారు. 'మహాభారతంలోని కపోత కథలా ఇప్పుడొక పావురం వెళ్లిపోయింది' అంటూ కంభంపాటి సీత మృతి పట్ల ప్రముఖ కవి వరవరరావు ముంబై నుంచి సంతాప సందేశం పంపారు. వారితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మానవహక్కుల వేదిక కన్వీనర్ జీవన్‌కుమార్, భూమిక ఉమెన్స్ కలెక్టివ్ కొండవీటి సత్యవతి, వీక్షణం ఎన్ వేణుగోపాల్ తదితరులు నివాళులు అర్పించారు. పంజాగుట్ట శ్మశానవాటికలో సీత అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం ముగిశాయి.



కంభంపాటి సీత (ఫైల్)

జాతీయ సెమినార్‌కి

లింగాపురం విద్యార్థి ఎంపిక



ప్రశంసా, అర్హత పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థి వినయ్‌కుమార్

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం లింగాపురం జడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న బూర వినయ్‌కుమార్ అనే విద్యార్థి జాతీయ సెమినార్‌కు ఎంపికయ్యాడు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎస్సీఈఆర్టీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెమినార్ పోటీల్లో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ప్రాబబిలిటీ అండ్ వర్సెస్ అనే అంశంపై పేపర్ ప్రజెంట్ చేసి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు.

నవంబరు 25న ముంబైలోని నెహ్రూ సైన్స్ సెంటర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి సెమినార్‌లో వినయ్‌కుమార్ పాల్గొంటాడు. జాతీయ స్థాయి సెమినార్‌కు ఎంపికైన విద్యార్థికి డీఈవో ఎం.జ్ఞానేశ్వర్, డీఎస్‌వో డాక్టర్ శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.

మార్కెట్‌కు కొత్త మిర్చి

తేజ రకం క్వింటాల్‌కు ధర రూ.12,011

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు కొత్త మిర్చి అమ్మకానికి వచ్చింది. మంగళవారం తేజరకం మిర్చికి గరిష్ట ధర రూ.12011లు పలికింది. ఈ సీజన్‌లో మిర్చి కొత్తది అమ్మడం ఇదే తొలిసారి. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి గ్రామానికి చెందిన యాట మహేష్ అనే రైతు తొమ్మిది బస్తాల తేజ రకం మిర్చిని మంగళవారం మార్కెట్‌కు తీసుకు వచ్చాడు. హనుమాన్ అడ్తి ద్వారా సర్వేశ్వర ఇండస్ట్రీస్ నిర్వాహకులు క్వింటాకు రూ.12011ల చొప్పున కొనుగోలు చేశారు.

కొత్త మిర్చి సాధారణంగా నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబరు మొదటి వారంలో అమ్మకానికి వస్తుంది. కానీ అక్టోబరు చివరి వారంలోనే రావడంతో రైతులు ఆసక్తిగా చూశారు.



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన (కొత్త) తేజ మిర్చి బస్తాలు

బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం..

- హనుమాన్ చాలీసా బృందం కోలాటం
- డిసెంబరు 22న ఆలయంలో ప్రదర్శన

భీమదేవరపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అధ్యాత్మిక రంగంలో బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం మండలంలోని కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం, తపస్వీ డాన్స్ అకాడమీ సంయుక్త నిర్వహణలో డిసెంబరు 22న హనుమాన్ చాలీసా కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కాసం రమేష్‌గుప్తా మంగళవారం తెలిపారు. .ఇందు కోసం 1001 మంది మహిళలతో మహాబృందం కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. తపస్వీ డ్యాన్స్ అకాడమి నిర్వాహకురాలు శ్వేత వివిధ జిల్లాల నుంచి మహిళలకు హనుమాన్ చాలీసాపై కోలాట ప్రదర్శనకు సంబంధించి శిక్షణను ఇస్తున్నారు. కరీంనగర్, సిద్దిపేట, హనుమకొండ, జనగామ, ములుగు, భూపాలపల్లి, హైదరాబాద్ తదితర జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా మహా బృందం కోలాట ప్రదర్శనకు మహిళలు వస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రత్నగిరి గ్రామానికి చెందిన మహిళలు మహాబృందం కోలాట ప్రదర్శన, హనుమాన్ చాలీసా కోసం శిక్షణ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు ఉపేందర్‌శర్మ, రత్నగిరి మాజీ సర్పంచ్ నవిల నిర్మల, వంగ జమునా, మహిళలు పాల్గొన్నారు.



కోలాట శిక్షణ కోసం వచ్చిన మహిళలతో నిర్వాహకురాలు శ్వేత

మార్కెట్‌కు

వరుస సెలవులు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. గురువారం దీపావళి పండుగ, శుక్రవారం అమావాస్య, శనివారం వారాంతపు యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవు ఉన్నందున తిరిగి సోమవారం నుంచి మార్కెట్లో క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, కార్మికులు, వ్యాపారులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2437	2080
పల్లికాయ (సూక)	4600	4000
పల్లికాయ (పచ్చిది)	---	---
కందులు	8212	6900
పెసళ్లు	6512	4052
పత్తి	6850	5500
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	10939	9234
పసుపు (గోల)	---	---
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	17000	12000
వండర్‌హాట్ ఏసీ	15000	11000
యూఎస్341ఏసీ	15000	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	8000	3000

- వరంగల్ వ్యవసాయం



జెండా ఊపి సంచార హెచ్ఐవీ వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

సంచార హెచ్ఐవీ టెస్టింగ్ వాహనం షురూ

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించిన సంచార హెస్ఐవీ టెస్టింగ్, నిర్ధారణ వాహనాన్ని మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.ప్రావీణ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐసీటీసీలు అందుబాటులో లేని ప్రాంతాలు, హైరిస్క్ ప్రాంతాల్లో హెచ్ఐవీ బాధితుల కుటుంబసభ్యులకు ఈ సంచార వాహనం ద్వారా హెచ్ఐవీ టెస్టులు, కౌన్సిలింగ్ సేవలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో లలితాదేవి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పద్మ బ్రాహ్మణులకు సన్మానం

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పద్మ బ్రాహ్మణులను సన్మానించారు. మంగళవారం ట్రస్టు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన పద్మ బ్రాహ్మణులను ట్రస్టు నిర్వాహకులు ఎ.రాజేంద్రప్రసాద్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌరోహిత్యం అనేది జాతికి సంబంధించింది కాదని, మార్కండేయ వంశానికి చెందిన వివిధ రకాల గోత్రాల వారు పౌరోహిత సేవలందిస్తూ వాస్తు, ఇతరత్రా కార్యక్రమాలతో సమాజ సేవ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం కార్యవర్గం బింగి రమేష్, మలిపెద్ది కృష్ణశాస్త్రి, మార్త రాజ్‌కుమార్ శాస్త్రి, రంగు యాదగిరి, చిందం కరుణాకర్, మార్త వేణుగోపాల్, ట్రస్టు సభ్యులు భారతి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు



కాజీపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ వరంగల్ జిల్లా నూతన అధ్యక్షుడిగా బస్కె నాగరాజు నియమితులయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో నూతన అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు.

బాలికకు ఆర్థిక సహాయం

కాశిబుగ్గ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన బాలికకు బీజేపీనేత వన్నాల వెంకటరమణ మంగళవారం ఆర్థిక సహాయం అందించారు. దాసరి సన్విక తల్లిదండ్రులు అకాల మరణం చెందడంతో విషయం తెలుసుకున్న వెంకటరమణ ఎల్బీనగర్‌లోని ఆమె నివాసానికి వెళ్లి రూ.10వేల చెక్కును సన్వికకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమైక్య వ్యాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు దాదాపు 700లకు పైగా కుటుంబాలకు ప్రతీ నెల 10కిలోల బియ్యం పంపిణీ చేశామని, ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించామని అన్నారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయించినట్లు పేర్కొన్నారు. అనాథ పిల్లల చదువులకు ఆర్థిక సహాయం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ చేపట్టినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, అపురూప రజనీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌డే విద్యార్థులకు బహుమతులు అందజేత

కేయూ క్యాంపస్, అక్టోబరు 29:(ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ డే సంబురాలను పురస్కరించుకుని మంగళవారం కేయూలో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. కేయూ క్యాంపస్‌లోని గణితశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో డీన్ హన్మంతు, ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో చదువుతో పాటు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకయ్య, భారవిశర్మ, బి.రమ, తిరుమలదేవి, సౌజన్య, మమత, పద్మజ, శాస్త్రి, శ్రీనివాస్ ముంజుం, సోమయ్య రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

కరీమాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల శ్రేయస్సుకోసం పాటుపడిన మహనీయులను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ కడారి కుమార్ పిలుపునిచ్చారు మంగళవారం కరీమాబాద్ అంబేద్కర్ భవన్‌లో గౌతమబుద్ధుడు, ఉపాసిక బొమ్మల కట్టయ్య, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో పోరాట సమితి కో కన్వీనర్ ఉసిల్ల దయాకర్ రమాబాయి, మహిళా మండలి జిల్లా నాయకురాలు తరాల రాజమణి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జక్కుల రాజు, కార్యదర్శి తరాల రవితేజ, కోశాధికారి బొమ్మల రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పశుగణన పోస్టర్ల ఆవిష్కరణ

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అఖిల భారత జాతీయ పశుగణన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌లను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె. వెంకటనారాయణ, జిల్లా ఉప పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి. శ్రీనివాస్, డాక్టర్లు ప్రవీణ్, దీపిక, వినయ్, విక్రమ్, పార్థసారథి, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

కాజీపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఫారెస్టు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రాంతంలో ఈ నెల 23న ఐదు చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ పరిరక్షకుడు ప్రకాశ్ డిమాండ్ చేశారు. మంగళవారం చెట్లు నరికిన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశాడు. ఫారెస్టు అధికారులు, గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఎవరైనా చెట్లు నరికితే టోల్ ఫ్రీ నెంబరు 1800 4255 364కు సమాచారం అందించాలన్నారు.

గురుకులంలో ధన్వంతరి జయంతి వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శైలజ

న్యూశాయంపేట, అక్టోబరు 29(ఆంధజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న ధర్మసాగర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం ధన్వంతరి వేడుకలు ప్రిన్సిపాల్ సల్ల శైలజ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి హాజరై విద్యార్థులకు ఆయుర్వేద ప్రాముఖ్యత యోగ విద్యాభ్యాసం వల్ల కలిగే ప్రయోజనాలు, యోగా విద్య విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సల్ల శైలజ, ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ ప్రసాద్, డాక్టర్ సర్వేశం, ఫార్మసిస్టులు శ్రీకాంత్, స్వర్ణలత, ఉపాధ్యాయులు దేవిప్రసాద్, ఇందిర, షర్మిల, సుధ పాల్గొన్నారు.

గిరిజన గురుకులంలో ఆయుర్వేద వైద్య శిబిరం

గిర్మాజిపేట (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా మంగళవారం వరంగల్ యాకుత్‌పురాలోని గిరిజన సంక్షేమశాఖ గురుకుల పాఠశాల, కళాశాల(బాలురు)లో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా ఆయుష్ ఇన్‌చార్జి డాక్టర్ ఎం.రాజు, వైద్యాధికారులు డాక్టర్ సహజ, డాక్టర్ రాజేందర్.. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ కమలాకర్, ఫార్మసిస్ట్ సంజయ్, ఏఎన్ఎం సమ్మక్క, ప్రిన్సిపాల్ రామ్మోహన్, వైస్ ప్రిన్సిపాల్ కె.మధు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

» వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం వరంగల్ కలెక్టరేట్ నిర్వహించిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రోడ్లు సక్రమంగా లేకపోవడం, సైన్‌బోర్డులు, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల అక్కడక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు అలాంటి ప్రదేశాలను గుర్తించి వెంటనే అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. గతంలో గుర్తించి 17 బ్లాక్ స్పాట్స్‌పై తీసుకున్న చర్యలపై సమీక్షించారు. యువత ట్రిబుల్ డ్రైవింగ్ చేస్తున్నారని, ఓవర్ టేక్ చేయకుండా కళాశాలల విద్యార్థులకు రోడ్డు భద్రతా, ప్రమాదాలు నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలు డ్రైవింగ్ చేయకుండా చూడాలని, హైవేలపై రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సరైన లైటింగ్ ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

డీసీపీ రవీందర్ మాట్లాడుతూ.. మా మునూరు ఎయిర్‌పోర్ట్ హైవే ప్రాంతంలో తరుచుగా ప్రమా దాలు జరుగుతున్నందున స్పీడ్ బ్రేకర్లతోపాటు సీసీ కెమె రాలు ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు.



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న డీఆర్‌వో విజయలక్ష్మి

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాల న్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్ అండ్ బీ అధికారి జితేం దర్‌రెడ్డి, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి జైపాల్‌రెడ్డి, జిల్లా పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ అధికారి జ్ఞానేశ్వర్, నేషనల్ హైవే ఆఫ్ ఇండియా అధికారి సతీష్, ఆర్టీసీ డీఎం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఆర్‌వో

వరంగల్ డీఆర్‌వోగా నియమితులైన విజయలక్ష్మి మంగళవారం కలెక్టర్ సత్యశారదను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయలక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేశారు. జీడబ్ల్యూఎంసీలో విధులు నిర్వర్తించిన విజయలక్ష్మి వరంగల్ డీఆర్‌వోగా నియమితులయ్యారు.

ఐసెట్ కుంభకోణంపై విచారణ జరిపించాలి



వీసీకి వినతి పత్రాన్ని ఇస్తున్న ఏబీవీపీ నేతలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఐసెట్ కుంభకోణంపై విచారణ జరిపించాలని కేయూ ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు మాట్లాడారు. కేయూ కామర్స్ విభాగం ప్రొఫెసర్ నరసింహచారి, మాజీ వీసీ రమేశ్‌తో కలిసి ఐసెట్ పేరు మీదు రూ.45లక్షల మేరకు కుంభకోణానికి పాల్పడినట్లు ఆరోపించారు.

ఐసెట్ నిధుల్లో అవినీతికి పాల్పడిన చారిని వెంటనే తొలగించాలని అన్నారు. ఐసెట్ కన్వీనర్‌గా చారిని మాజీ వీసీ రమేశ్ నియమించుకుని అనేక అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. రూ.29 లక్షలు వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకున్నారని ఆరోపించారు. సెల్ఫ్ చెక్‌లతో రూ.16లక్షలను డ్రా చేసుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి స్టేట్ కౌన్సిల్ దృష్టికి తెస్తానని చెప్పినట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు.

జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఇస్తారికి పేటెంట్

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ భారత ప్రభుత్వ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పేటెంట్‌ను ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం భారత ప్రభుత్వ పేటెంట్ సంస్థ నిర్వాహకులు ఇస్తారీకి పేటెంట్ ఇవ్వగా, కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ప్రతీ అనులేఖనాన్ని నిరోధించడంలో ఎక్లిప్టా ఆల్బా మొక్కల పాత్ర అనే అంశంపై పేటెంట్ జారీ చేసింది. డాక్టర్ వెంకన్న లూనావత్ పీహెచ్‌డీ పట్టాను ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ పర్యవేక్షణలో పూర్తి చేశారు. అదే క్రమంలో 2022 అక్టోబరు 16న పేటెంట్ కోసం దరఖాస్తులు చేశారు. దీనిని పరిశీలించిన పేటెంట్ కార్యాలయం ఇస్తారీకి పేటెంట్‌ను ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నాణ్యతా ప్రమాణాలే ఎగుమతులకు గీటురాయి

» వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పురుగుమందులు వాడకుండా పండించిన మిర్చి పంటకు ఎగుమతి చేసే అవకాశం ఉంటుందని, ఎగుమతులున్నప్పుడే మార్కెట్లో మంచి ధర పలుకుతుందని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ స్పైస్ బోర్డు వరంగల్ ఆధ్వర్యంలో ఆదివాసీ ఫార్మ్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ మంగపేట మిర్చి రైతులకు మార్కెట్ లింకేజీ ప్రోగ్రాంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మిర్చి పంటలో తేమ లేకుండా సరుకు ప్యాకింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పైస్‌బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ విజిష్ట, చిల్లీస్ సెక్షన్ అధ్యక్షుడు రాజేష్ డి కరాణి, ఆదివాసీ ఫార్మ్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్లో స్వచ్ఛ భారత్

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మంగళవారం జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ ఆధ్వర్యంలో మై భారత్ స్వచ్ఛత సేవా(స్వచ్ఛ భారత్) కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో చెత్త చెదారాన్ని తొలగించారు. పరిసరాల పరిశుభ్రత కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ.. ప్రపంచంలో యువత ఎక్కువగా ఉన్న దేశం మనదని, యువత తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో బిమ్మన రాజారెడ్డి, నెహ్రూ యువకేంద్రం అధికారి దేవీలాల్, నేషనల్ యూత్ అవార్డు గ్రహీత అకులపల్లి మధు, చాంబర్ ప్రతినిధులు, మార్కెట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

కమిషన్ పర్యటనలో బీసీలు పాల్గొనాలి

వడ్డెపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కలెక్టరేట్ భవనంలో నవంబరు 2న జరిగే బీసీ కమిషన్ పర్యటనలో బీసీలంతా పాల్గొని తమ అభిప్రాయాలను కమిషనర్‌కు తెలియజేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ జవహర్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో బీసీల విద్యా, ఉద్యోగ, రాజకీయ, సామాజిక స్థితిగతులను రాజకీయ పార్టీలకు అతీతంగా వివిధ బీసీ కులాలు, బీసీ సంఘాలు బీసీల డిమాండ్లను వినతి పత్రాల ద్వారా కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం బీసీ కమిషన్ చేసే పర్యటన కీలకమైందని పేర్కొన్నారు. బీసీకమిషన్ పర్యటనలో బీసీ మేధావులు, బీసీ ఉద్యోగులు, బీసీ విద్యార్థులు, బీసీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కోరారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు తమ్మల శోభారాణి, రవీందర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలి



వరంగల్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): క్యూబాపై అమెరికా సామ్రాజ్యవాద నిరంకుశ నిర్బంధాన్ని ఎత్తివేయాలని, క్యూబాకు అండగా నిలుద్దామని సీఐటీయూ వరంగల్ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి అన్నారు. మంగళవారం సీఐటీయూ అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ బీట్ బజార్ నుంచి చౌరస్తా వరకు ప్లకార్డులు పట్టుకొని సంఘీభావ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గున్నాల ప్రభాకర్, ఎం. ఉపేందర్, అప్పాజీ వాణి, మీర్ షాజియా, మాదాసు దివ్య, ఎండి ఇస్మాయిల్, ఎండి జుబేదా, సూరయ్య, రాఘవరెడ్డి, యాకూబ్ పాషా, లక్ష్మి, జహీదా, సదానందం, మురళి, విజయ, మల్లేశం, రాజ్‌కుమార్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ డ్రైవర్లకు కనీస వేతనం ఇవ్వాలి



సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న నాయకులు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 29(ఆంధ్రజోతి): నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న స్వచ్ఛ ఆటోల ఓనర్ కం డ్రైవర్లకు రూ.20,500 కనీస వేతనం అందించాలని సీఐటీయూ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఓనర్ కం డ్రైవర్ల సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. డ్రైవర్ల సమస్యలపై అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు జన్ను ప్రకాశ్, ఉప్పలయ్య హాజరై మాట్లాడారు. సమావేశంలో స్వచ్ఛ ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు మురళీ కృష్ణ, ప్రధాన కార్యదర్శి మట్టెడ సురేందర్, కోశాధికారి విజయ్‌కుమార్ నాయకులు దేవేందర్, అశోక్, దినేష్, మహేశ్, సుమన్, శ్రీనివాస్, డ్రైవర్లు పాల్గొన్నారు.

రైలు ఎక్కబోతూ జారి పడి ఒకరికి గాయాలు

గిర్మాజిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆహారం కోసం రైలు దిగి తిరిగి ఎక్కబోతుండగా జారిపడి ఓ ప్రయాణికుడు గాయపడ్డాడు. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం తేని జిల్లా కంబం మండల కేంద్రానికి చెందిన సుధాకర్ మంగళవారం రామగుండం నుంచి మధురై వెళ్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో దిండిగల్ జంక్షన్‌కు బయలుదేరాడు. రైలు వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకోగా సుధాకర్ ఆహారం కోసం రైలు దిగి కొనుగోలు చేస్తుండగా రైలు బయలుదేరడంతో పరుగెత్తుకుంటూ వచ్చి రైలు ఎక్కబోతూ జారిపడ్డాడు. ఈ సంఘటన చూసిన ప్రయాణికులు పెద్దగా అరవడంతో లోకోపైలట్ రైలును ఆపారు. జీఆర్‌పీ, ఆర్‌పీ సిబ్బంది అక్కడికి చేరుకొని సుధాకర్‌ను ఎంజీఎంకు తరలించారు. ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చామని సీఐ సురేందర్ తెలిపారు.

అందరిలో సేవాగుణం ఉండాలి

ఖిలావరంగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డబ్బు సంపాదించడమే ముఖ్యం కాదని, ప్రతీ ఒక్కరిలో కొంతైనా సేవాగుణం ఉండాలని కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి సూచించారు. మంగళవారం ఆయన 34వ, డివిజన్ శివనగర్‌లోని వందనస్కూల్‌లో నగరపాలక సంస్థ ఉద్యోగులకు శ్రీమాత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దీపావళి పండుగ చీరెలను పంపిణీ చేశారు. అదేవిధంగా శరత్ కంటివైద్యశాల ఆధ్వర్యంలో 450 మందికి కంటి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీమాత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ముద్దసాని మల్లిక, ప్రధానకార్యదర్శి నన్నపు సంజీవరావు, కార్యవర్గం ఎం.మల్లయ్య, ఎం. శారద, అంజలీదేవి, కె.కళ, వి. ఇంద్రదేవి, వందనస్కూల్ ప్రిన్సిపాల్ ఆడెపు శ్యామ్, కరస్పాండెంట్ విజయ, ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక కార్మికులకే ఉపాధి కల్పించాలి

ఖిలావరంగల్, అక్టోబరు 29 (అంధ్రజ్యోతి): నగరంలోని టైల్స్ కార్మికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని కాకతీయ టైల్స్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు జన్ను సునిల్ కోరారు. మంగళవారం శివనగర్‌లోని సంస్థ కార్యాలయంలో టైల్స్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరంగల్ నగరంలోని టైల్స్ కార్మికులు తమ వృత్తిని చేసుకుంటూ జీవిస్తుండగా, వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన కార్మికులతో తమ ఉపాధిని కోల్పోతున్నామన్నారు.ఈ విషయంలో జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకొని స్థానిక టైల్స్ కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

లేని పక్షంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బరిగెల ప్రమోద్, కోశాధికారి సింగారపు బాబురావు, పాకాల రాజు, జన్ను యాదగిరి, సింగారపు ప్రకాశ్, మచ్చ కోటేశ్వర్, బొజ్జ రంజిత్, శ్యా మల సతీష్, మచ్చ సురేష్, గొర్రె శివ, టైల్స్ కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పుప్పాలగుట్టలో గ్యార్మీ షరీఫ్ వేడుకలు

ఖిలావరంగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 35వ, డివిజన్ పుప్పాలగుట్టలో చేయూత అమ్మ సేవా సొసైటీ అధ్యక్షుడు ఎస్‌కే యాకూబ్ ఆధ్వర్యంలో మంగళవారం గ్యార్మీషరీఫ్ వేడుకలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, మాజీ కార్పొరేటర్ మసూద్, యాకూబ్, సయ్యద్ అజాం, అప్పు, రయ ్యత్ అలీ, బజాన్, సలీం, కట్టు, వినోద్,రాజేష్, శే ఖర్, శివ, అప్సర్, చిన్న యాకూబ్, సద్దాం, అనిల్, రామ్, శ్యామ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రంగశాయిపేటలో ఘనంగా గ్యార్మీ షరీఫ్

శంభునిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రంగశాయిపేటలో మంగళవారం ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు నిర్వహించారు. మాషుక్‌పురా గ్యార్మీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవేడుకలకు ఉర్సు దర్గా పీఠాధిపతులు ఉబేద్ బాబా, నవీద్‌బాబా హాజరై ఆధ్యాత్మిక సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంలో జెండాను రంగశాయిపేటలో ఊరేగించి గద్దెకు చేర్చారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో స్థానిక మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం, కమిటీ బాధ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వరంగల్ తూర్పులో టీడీపీ సభ్యత్వ నమోదు

మట్టెవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. నాయకులు దుస్సా సుదర్శన్, జీఎల్.శ్రీధర్, నాగవెల్లి సురేశ్, నల్లకుంట రవికుమార్, దుస్స వేణు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సమస్యలపై నేడు నిరసన దీక్ష

బాలసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణనపై స్పష్టత కోరుతూ బహుజన వర్గాలకు తీవ్ర నష్టం చేస్తున్న ఈడబ్ల్యూఎస్ జీవో 29ని వెంటనే రద్దు చేయాలని బీసీ సంఘాల నాయకులు కోరారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో ఒక రోజు చేపట్టనున్నర నిరసన దీక్షకు బహుజన బీసీ సంఘాలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, తెలంగాణ పూలే యువజన సంఘాల కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు..

శంభునిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దేశాలన్నీ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నాయని బీజేపీ జిల్లా నాయకుడు కర్నె రవీందర్ అన్నారు. మంగళవారం 41వ డివిజన్‌లోని శ్రీరాంనగర్ కాలనీతో పాటు పలు కాలనీల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కర్నె రవీందర్ మాట్లాడుతూ.. మోదీ పాలనకు ఆకర్షితులై కోట్లాది మంది బీజేపీలో వస్తున్నారన్నారు. వరంగల్ జిల్లాలో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గంటా రవికుమార్‌ల సమక్షంలో వేలాదిమంది పార్టీ సభ్యత్వాలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుసుమ సతీష్, మాచర్ల దీన్‌దయాల్, బైరి నగేష్, సూర సాంబరాజు, సుదర్శన్, జనార్దన్, బాబురావు, చేరాలు, విజయ్ కుమార్, రాజు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో యువత ముందుండాలి

» కాకతీయ యూనివర్సిటీ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ కార్యక్రమాల్లో యువత ముందుండాలని కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేయూ క్యాంపస్‌లోని బయోటెక్నాలజీ, వ్యాయామ విద్యా కళాశాలలో నూతన జాతీయ సేవా పథకం యూనిట్లను రిబ్బన్ కట్ చేసి వీసీ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌పి.టీబీటీ ప్రసాద్, డాక్టర్ కుమారస్వామి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ తాడూరి శాస్త్రి, డాక్టర్ టి. రాధిక, ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ప్రొఫెసర్ వై.వెంకయ్య, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్డీఎల్‌సీఈ పాఠ్య పుస్తకాల ఆవిష్కరణ

కేయూ దూరవిద్య కేంద్రం అకడమిక్ ప్రామాణాలతో దూరవిద్య స్టడీ మెటీరియల్ సిద్ధం చేసి విద్యార్థులకు అందచేయడం అభినందనీయమని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేయూ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంతో కలిసి సైన్స్ విభాగాల స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఐసీబీఎస్ సంఖ్యలో స్టడీ మెటీరియల్‌ను తీసుకుని రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉన్నత ప్రమాణాలు కలిగిన పుస్తకాలను చదువుకుని విద్యార్థులు ఉన్నతస్థానంలోకి రావాలని అన్నారు. డైరెక్టర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. తెలంగాణలోని అన్ని దూర విద్య కేంద్రాల కంటే కేయూ ముందు వరుసలో ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ, సంయుక్త సంచాలకుడు డాక్టర్ వెంకట గోపీనాథ్ పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ ఆఫీసును ప్రారంభిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

మానసిక వికలాంగులను ఆదరించాలి

మానసిక వికలాంగుల పట్ల సానుభూతితో అదరించాలని కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రం మానసిక వికలాంగుల కేంద్రంలో మానసిక వికలాంగులు తయారు చేసిన మట్టిదీపాల స్టాల్స్‌ను వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి, డాక్టర్ బి.రమ మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వహాకురాలు రామలీల, రిటైర్డు ప్రొఫెసర్ డాక్టర్ పద్మ, వర్సిటీ స్టూడెంట్ కోడం కల్యాణ్,శివరాం, సిబ్బంది పిల్లలు పాల్గొన్నారు.

దీపం.. లక్ష్మీ స్వరూపం



రేపు దీపావళి పర్వదినం

- ఉదయం మంగళహారతులు, సాయంత్రం ధనలక్ష్మీ పూజలు
- టపాసుల కొనుగోలుతో మార్కెట్‌లో సందడి
- ఊపందుకున్న పూలు, పండ్లు, ప్రమిదల అమ్మకాలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అంధకార చీకట్లను పారదోలే లక్ష్మీ స్వరూపం.. దీపం. ఆధ్యాత్మికంగా ప్రత్యేక విశిష్టతను కలిగి ఉన్న దీపాల పండుగ దీపావళిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఆశ్వయుజ అమావాస్య సందర్భంగా గురువారం ఇళ్లు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకోనున్నారు. ఇక ఈ పండుగ వచ్చిందంటే బాణసంచా, వివిధ రకాల మిఠాయిలు, భగవంతుడి ఆరాధనకు ఉపయోగించే పూలు, పండ్లు, దీపాలు వెలిగించే ప్రమిదల అమ్మకాలు జోరందుకుంటాయి. దీపావళి అంటే ఒక రోజు ముందుగా భోగి, నరక చతుర్దశిగా ఆచరించుకుంటారు. లోకాన్ని ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెట్టి హతమారుస్తున్న నరకాసురుడు అనే రాక్షసుడిని శ్రీకృష్ణభగవానుడి భార్య సత్యభామ సంహరించడం ఆ రోజు చతుర్దశి కావడంతో నరక చతుర్దశిగా పిలుస్తారు. శ్రీరామచంద్రుడు లంకలో రావణాసురుడిని సంహరించి సీతామాతతో తన పరివారంతో అయోధ్యకు చేరుకున్న రోజు అమావాస్య కావడం, ప్రజలు ఆ రోజున దీపాలను వెలిగించి పండుగను జరుపుకోవడంతో నాటి నుంచి దీపావళి పర్వదినం కాంతులు వెదజల్లుతోంది. అమావాస్య సాయం సంధ్యా సమయం దీపం వెలిగించడం వల్ల లక్ష్మీదేవి ఇంటికి వచ్చి సిరిసంపదలను అనుగ్రహిస్తుందని పురాణాల్లో ప్రసిద్ధి. నాటి నుంచి దీపావళి పర్వదినాన్ని ఆచరించుకుంటున్నారు. దీపావళి సందర్భంగా గురువారం ఉదయం 3 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు మంగళహారతులు తీసుకోవాలని, సాయంత్రం ప్రదోషకాలంలో దీపాలు వెలిగించి సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ధనలక్ష్మీ పూజలను ఆచరించు కోవచ్చని పండితులు చెబుతున్నారు. పండుగ నేపథ్యంలో బాణసంచా, వస్త్ర వ్యాపారం జోరందుకుంది. దీంతో మార్కెట్‌లో జనం రద్దీ కనిపిస్తోంది. కొత్తగా పెళ్లైన అల్లుళ్లకు దీపావళి కట్నాలు పెడతారు. అలాగే వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారు దీపావళి పండుగకు తమ సొంతూళ్లకు చేరుకుంటుడంతో సందడి వాతావరణం కనిపిస్తోంది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు కిటకిట లాడుతున్నాయి.

నేడు నరకాసుర వధ

సిద్ధమైన 58 అడుగుల భారీ ప్రతిమ ● వరంగల్ ఉర్సు గుట్ట మైదానంలో ఏర్పాట్లు



గతంలో ఏర్పాటు చేసిన రావణ ప్రతిమ

కరీమాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్సవాలకు నిలయమైన వరంగల్ ఉర్సు గుట్టలోని రంగలీలా మైదానం మరో వేడుకకు సిద్ధమైంది. రాక్షస సంహారాలకు వేదికగా పిలుచుకునే ఈ ప్రాంతంలో ఇటీవలి దసరా వేడుకల్లో భాగంగా రావణవధను నిర్వహించారు. మళ్లీ దీపావళి సందర్భంగా బుధవారం జరగబోయే నరకాసుర వధ కోసం సర్వం సిద్ధం చేస్తున్నారు. త్రి నగరి ప్రజలకు దీపావళి పర్వదినాన ఆనందాల వెలుగులను అందించేందుకు ఉర్సు గుట్టను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. 22 సంవత్సరాలుగా దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉర్సు నరకాసుర వధ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో ప్రధానంగా 58 అడుగుల భారీ నరకాసుర ప్రతిమను శక్తివంతమైన బాణసంచాతో దహనం చేసేందుకు, ప్రత్యేక బాణసంచా విన్యాసాలకు అంతా సిద్ధం చేశారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో విద్యుత్‌దీపాలు, సౌండ్ బాక్సులు, బారికేడ్లు, భారీ ఎల్ఈడీ స్ర్కీన్‌లు, పార్కింగ్ ప్రదేశాలు తదితర ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రం 5.30గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో ఉర్సు ప్రతాప్‌నగర్ నుంచి శ్రీకృష్ణ సత్యభామ వేషాధారణలో స్థానిక కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలతో, కోలాటాలతో, భజనలతో, మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగింపుతో రథం గుట్టకు చేరుకుంటారు. ఆ తరువాత వేదికపై సాంస్కృతిక ప్రదర్శనలిస్తారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాష్, శాసనమండలి సభ్యుడు బస్వరాజు సారయ్య, ఎంపి కడియం కావ్య, కలెక్టర్ సత్యశారద, కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీపీ అంబర్‌కిషోర్ ఝా, భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు, ఆర్‌డీవో, ఖిలావరంగల్ ఎమ్మార్వో, పలువురు అధికారులు, స్థానిక కార్పొరేటర్లు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. ఏర్పాట్లను నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి, ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామలరావు, కోశాధికారి కనుకుంట్ల రవి, మహిళా విభాగం ప్రతినిధి మరుపల్ల భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు వనం మధుతో పాటు సహాయ కార్యదర్శులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షిస్తునారు.

సీతంపేటలో దీపావళి బతుకమ్మ

మూడు రోజుల పాటు ఉత్సవాలు ● వేర్వేరుగా జరుపుకోనున్న స్త్రీ, పురుషులు ● రాష్ట్రంలోనే ఇదో ప్రత్యేక వేడుక



ఎద్దుల ప్రతిమలను కుంటలో నిమజ్జనం చేస్తున్న పురుషులు (ఫైల్)

హసన్‌పర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సహజంగా దసరా రోజుల్లో బతుకమ్మ వేడుకలు జరుగుతాయి. కానీ హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేటలో మాత్రం దీపావళి సందర్భంగా ఇక్కడి ప్రజలు బతుకమ్మ వేడుకలను నిర్వహించుకుంటారు. మూడు రోజుల పాటు ఇక్కడ జరిగే ఈ బతుకమ్మ వేడుకలు రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి. మహారాష్ట్ర నుంచి ఇక్కడకు వలస వచ్చి స్థిరపడిన నేతకాని కులస్థులు తమ పూర్వీకుల ఆచారమైన ఈ వేడుకలను పాటిస్తున్నారు. ఈ పండుగలో మొదటి రోజు దీపావళి పర్వదినం రోజున కుటుంబ సమేతంగా కేదారీశ్వరస్వామి వ్రతాన్ని ఆచరిస్తారు. రెండవ రోజు పురుషులు ఎద్దుల ప్రతిమలకు రకరకాల పిండి వంటలతో తయారు చేసిన నగలతో ఊరేగించి. అనంతరం చెరువులో నిమజ్జన కార్యక్రమం చేస్తారు. మూడవ రోజు మహిళలు తీరొక్కపూలను సేకరించి పేర్చిన బతుమకమ్మ ఊరేగింపుతో ఊరు శివారులోని చెరువుకు చేరుకొని బతుకమ్మ ఆటపాటలతో సంబురంగా గడిపి గౌరమ్మను గంగకు చేర్చుతారు. దాంతో మూడు రోజుల నేతకాని కులస్థుల దీపావళి బతుకమ్మ వేడుకలు ముగుస్తాయి.



బతుకమ్మలతో తరలివస్తున్న మహిళలు (ఫైల్)

వివిధ రాష్ట్రాల నుంచి సీతంపేటకు...

సీతంపేటలో నిర్వహించే దీపావళి బతుకమ్మ వేడుకలకు వివిధ రాష్ట్రాలలో స్థిరపడిన నేతకాని కులస్థులు, వారి బంధువులు ముందు రోజే చేరకుంటారు. ఇక ఈ వేడుకల్లో రెండో రోజు పురుషుల ప్రత్యేక కార్యక్రమమైన ఎద్దుల ప్రతిమల ఊరేగింపులో యువకుల కోలాటం ఆసక్తి కలిగిస్తుంది. అంతేకాకుండా ఎద్దుల ప్రతిమలను చెరువు గట్టు వద్దకు తీసుకెళ్లి వరుసైన వారితో సరసం చేయడం మరింత ఆసక్తికరంగా ఉంటుంది. అనంతరం నగలుగా అలంకరించిన రకరకాల పిండి వంటలను ఆరగించి ఎద్దుల ప్రతిమలను చెరువులో నిమజ్జనం చేసి యువకులు రంగులు చల్లుకొని సంబుర చేసుకుంటారు. మూడో రోజు మహిళలు బతుకమ్మలతో ఊరేగింపులో పురుషుల కోలాటం, పాటలు ఆకట్టుకుంటాయి.

ప్రత్యేక నిధులు కేటాయించాలి..

జనగాం శరత్‌కుమార్, సీతంపేట మాజీ సర్పంచ్

సీతంపేటలో నేతకాని కులస్థులు మూడు రోజుల పాటు నిర్వహించుకునే దీపావళి బతుకమ్మ వేడుకలకు ఎమ్మెల్యే సీడీఎఫ్ ఫండ్ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నేతకాని కులస్థుల ఆత్మగౌరవాన్ని కాపాడడమే కాకుండా వారు నిర్వహించుకునే దీపావళి బతుకమ్మ వేడుకల నిర్వాహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

దీపావళి బతుకమ్మ ఎంతో ప్రత్యేకం

బండారి రజితచేరాలు, మాజీ ఎంపీటీసీ

రాష్ట్రంలో దసరా సమయంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించుకునే బతుకమ్మ వేడుకలకు ఎంత ప్రాముఖ్యం ఉందో.. సీతంపేటలో జరిగే దీపావళి బతుకమ్మ వేడుకలకు కూడా అంత ప్రత్యేకత ఉంది. కేవలం ఒక్క సీతంపేటలో జరుపుకునే ఈ దీపావళి బతుకమ్మ వేడుకలను ప్రపంచానికి చాటిచెప్పాలనే మా ఆరాటం. ప్రభుత్వం కూడా అందుకు పూర్తి సహాయసహకారాలు అందించాలి.

కాళేశ్వరంలో 'కార్తీక' ఏర్పాట్లు

మహదేవపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : శుభ ప్రదం.. శివ ప్రీతికరంమైన కార్తీక మాసం నవంబరు 2వతేదీ శనివారం నుంచి ప్రారంభం కానుండటంతో గోదావరి తీరంలోని కాళేశ్వరంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్తీక మాసంలో కాళేశ్వర క్షేత్రాన్ని సందర్శించినా, స్వామిని దర్శించినా, స్మరించినా సకల పాపాలు పోయి దీర్ఘాయువుతో జీవిస్తారని భక్తుల నమ్మకం. త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా అలరాలుతున్న ఈ క్షేత్రం దక్షిణంగా అర్ధచంద్రాకారంగా గోదావరి నది ప్రవహిస్తోంది. రాష్ట్రంలోని సుప్రసిద్ధ క్షేత్రాలలో ఒకటిగా విరాజిల్లుతున్న కాళేశ్వర ముక్తీశ్వర దివ్య క్షేత్రంలో కాళేశ్వర, ముక్తీశ్వర స్వామివార్లు కొలువై ఉన్నారు. ఒకే పానవట్టంపై రెండు లింగాలున్న ఆలయంగా ఈ క్షేత్రం ప్రసిద్ధి చెందింది. కాకతీయ రుద్రదేవుడి కాలంలో నిర్మాణం జరిగినట్టు పురాణాలు చెబుతుండగా ఎందరో మహా మునులు ఆలయ అభివృద్ధికి అనేక పూజలు చేసినట్టు చెబుతుంటారు. ఏటా కార్తీక మాసంలో తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో లక్షలాది భక్తులు తరలొస్తారు. ఈ క్రమంలో కార్తీక మాసమంతా ప్రత్యేక పూజలు జరుగుతాయని, లక్ష వత్తుల పూజలు , లక్ష దీపాలు వెలిగించడం, లక్ష ముగ్గులు, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, దీపారాధనలు, ఉసిరికాయలో గోదావరి పుణ్యస్నానాలు, స్వామివారికి రోజువారిగా మహారుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, శుభానంద దేవికి కుంకుమ పూజలు చేస్తారు. కాగా ఆలయంలో కార్తీక మాసం మొత్తం నిత్యాన్నదానం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. లక్ష పత్రి పూజల్లో పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నెలంతా పూజలు, కార్యక్రమాలు

2వ తేదీ నుంచి కార్తీక మాసమంతా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో దేవస్థానం వారు ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహిస్తారు. రోజూ సాయంత్రం 6గంటల నుంచి దేవాలయంలో సామూహిక దీపోత్సవం ఉంటుంది. అందుకు కావాల్సిన వత్తులు, మట్టి ప్రమిదలు, నూనె దేవస్థానం వారే అందిస్తారు. అలాగే సోమవారం వచ్చే 4, 11, 18, 25 తేదీల్లో, కార్తీక పౌర్ణమి రోజైన 15వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి దేవాలయంలో సామూహిక సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహిస్తారు. 12, 15వ తేదీల్లో మంగళవాయిద్యాలతో గోదావరి వద్దకు వెళ్లి పంచరత్నాలతో హారతి సమర్పిస్తారు. 14వ తేదీ వైకుంఠ చతుర్దశి సందర్భంగా రాత్రి 8 గంటల నుంచి భజన, ప్రవచన కార్యక్రమం, 15వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి దేవాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు ఉంటాయి. అదే రోజున 7గంటలకు జ్వాలా తోరణం నిర్వహిస్తారు.

పర్యవేక్షణేదీ?

నగరంలో నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా దందా

అనుమతుల్లేకుండా గోదాములు, దుకాణాల్లో యథేచ్ఛగా విక్రయాలు

మట్టెవాడ, అక్టోబరు 29: (ఆంధ్రజ్యోతి) : దీపావళి పర్వ దినం నేపథ్యంలో ఏటా రూ.కోట్లలో బాణసంచా వ్యాపారం జరుగుతుంది. ముఖ్యంగా త్రినగరిలో మూడురోజుల పాటు అమ్మకాలు జోరుగా సాగుతాయి. ఈ క్రమంలో బాణసంచా విక్రయాలపై అధికార యంత్రాంగం తరపున పర్యవేక్షించే వారు ఎక్కడా కనిపించకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల మధ్యే గోదాములు, దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యాపారులంతా వరంగల్ నగరంలోని పాతబీటు బజార్, బట్టల బజార్, దేశాయిపేట రోడ్డు, నర్సంపేట రోడ్డు, స్టేషన్ రోడ్డు, ఎల్‌బీ నగర్, కరీమాబాద్, రామన్నపేట, పాపయ్యపేట చమన్, హంటర్ రోడ్డు కేంద్రంగా ఉండే హోల్‌సేల్ దుకాల నుంచి సరుకు కొనుగోలు చేస్తుంటారు. నెల రోజుల ముందుగానే ఇక్కడి హోల్‌సేల్ వ్యాపారులు శివకాశి నుంచి దిగుమతి చేసుకున్న టపాసులను హోల్‌సేల్, రిటైల్ పద్దతులలో అమ్మకాలు జరుపుతుంటారు. సుమారు 20చోట్ల పెద్ద ఎత్తున అమ్మకాలు జరుగుతుంటాయి. కానీ సదరు దుకాణాల వద్ద కనీస నిబంధనలు, ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బట్టలబజార్, రామన్నపేట, హంటర్ రోడ్డు లాంటి రద్దీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున బాణసంచా నిల్వలు చేసి అమ్మకాలు జరుపుతున్నారని, మరికొన్ని చోట్ల ఇళ్ల మధ్యలోనే గోదాంలను ఏర్పాటు చేసి బాణసంచా నిల్వ చేశారని సమాచారం. ఈ క్రమంలోనే మంగళవారం వరంగల్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కరీమాబాద్ శాకరాశి కుంట సమీపంలో అనుమతి లేకుండా నిల్వ చేసిన రూ.48లక్షల బాణసంచాను సీజ్ చేశారు.

రూ.కోట్లలో వ్యాపారం


దీపావళి పండుగ సమయంలో బాణసంచా వ్యాపారం రూ.కోట్లలో ఉంటుంది. వరంగల్ బీటు బజార్, రామన్నపేట, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్ ప్రాంతాలలో అధికంగా హోల్ సేల్ వ్యాపారం సాగుతుంది. దీనికి తోడు జిల్లాలో అనేక చోట్ల పలు ఫంక్షన్‌హాళ్లు, కళాశాలల మైదానాలు, తదితర చోట్ల టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నారు. కాగా, వ్యాపారులు టాపాసులు కొనుగోలు చేసే వారికి ఎలాంటి రసీదులు ఇవ్వడం లేదని, దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

299షాపులకు తాత్కాలిక లైసెన్సులు

వరంగల్ జిల్లాలో 71, హనుమకొండ జిల్లాలో 228 తాత్కాలిక షాపులకు అనుమతులు ఇచ్చారు. వరంగల్‌లో వివేకానంద జూనియర్ కళాశాల గ్రౌండ్, పోచమ్మమైదాన్ గ్రౌండ్, హనుమకొండలో హయగ్రీవాచారి మైదానం, కాజీపేట మార్కెట్ స్థలంలో తాత్కాలిక వ్యాపారం నిర్వహించేందుకు అనుమతులు ఇచ్చారు.

అప్రమత్తత అవసరం..

ఎస్. శ్రీధర్‌రెడ్డి, అగ్నిమాపక అధికారి, వరంగల్ జిల్లా



అప్రమత్తతోనే ప్రమాదాలు నివారించవచ్చు. వరంగల్ జిల్లాలో 71, వరంగల్ నగరంలో ఆరు చోట్ల బాణాసంచాల విక్రయాలకు తాత్కాలిక లైసెన్స్‌లు ఇచ్చాం. అనుమతి లేకుండా వ్యాపారం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. విక్రయదారులు అగ్నిమాపక శాఖ సూచనలను విధిగా పాటించాలి. దుకాణాల అనుమతి తీసుకోవాలి. నాణ్యమైన టాపాసులు అమ్మాలి. విక్రయ కేంద్రాల్లో ఇసుక, నీరు, మంటలను ఆర్పే పరికరాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి.

తాత్కాలిక షాపుల ఏర్పాటులో నిబంధనలివీ..

- ఒక్కో షాపునకు మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలి.
- దుకాణాలను రేకుల షెడ్డులోనే ఏర్పాటు చేయాలి.
- ప్రతీ దుకాణం ఎదుట 200లీటర్ల రెండు నీటి బ్యారెల్లను అందుబాటులో ఉంచాలి.
- మంటలు ఆర్పే యంత్రం, ఇసుక బకెట్లు ఏర్పాటు చేయాలి.
- దుకాణాల వద్ద చెత్త, చెదారం వేయకూడదు.
- షాపుల్లో పెట్రోమాక్స్‌లైటు గానీ, దీపాలుగానీ వాడకూడదు.
- విద్యుత్ సరఫరాకు ఐఎస్ఐ మార్క్ కలిగిన నాణ్యమైన వైర్లనే వాడాలి.
- దుకాణాలకు 100 మీటర్ల పరిధిలో టపాసులను కాల్చరాదు.
- 18 ఏళ్లలోపు పిల్లలను షాపులో పనికి పెట్టుకోకూడదు.
- విక్రయదారులు కాటన్ దుస్తులనే ధరించాలి.

టపాసులు కాల్చడంలో జాగ్రత్తలు అవసరం

దివ్వెల పండుగ దీపావళి ఆనందంగా జరుపుకోవాలి తప్ప విషాదానికి దారి తీయకుడదు. అందుకు పలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. బాణసంచాను ఇంటి లోపల కానీ, కారిడార్‌లో కానీ కాల్చరాదు. విశాలమైన ప్రదేశంలోనే కాల్చాలి. బాణసంచా కాల్చే సమయంలో కాటన్ దుస్తులను ధరించాలి. సరిపడా నీటిని అందుబాటులో పెట్టుకోవాలి. నాణ్యమైన బాణసంచాను మాత్రమే కొనుగోలు చేయాలి. పిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే కాల్చాలి. ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు వెంటనే అగ్నిమాపక కేంద్రం, పోలీసులకు సమాచారం అందించాలి. క్షతగాత్రులైతే ఆస్పత్రులకు తరలించాలి.

పొగమంచు.. గమనించు..

మంచుతో రహదారిపై ముప్పు

మట్టెవాడ (వరంగల్), నవంబరు 29: (ఆంధ్రజ్యోతి): చలికాలం పొగమంచు కారణంగా రహదారులపై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. ఎదుటి వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారులపై దట్టంగా కమ్మేసిన పొగమంచు రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతోంది. అతివేగానికి తోడు పొగమంచుతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. చెరువులు, లోతట్టు ప్రాంతాలు, ఎక్కువగా చెట్లు, తోటలు ఉండే చోట పొగ మంచు ఎక్కువగా ఉంటోంది. తెల్లవారుజామున జరిగే ప్రమాదాల్లో డ్రైవర్లు నిద్ర మత్తులో ఉండడం కూడా మరో కారణమవుతోంది. అందువల్ల ఉదయం 7 గంటల తర్వాత మాత్రమే ప్రయాణించాలని, హెడ్‌లైట్లు, వెనుకలైట్లు, ఇండికేటర్లు వేసుకొని వాహనాలు నడుపాలని రవాణశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.

మంచులో జాగ్రత్తగా..

- చలికాలం మంచు కురుసే సమయంలో ముందున్న వాహనం కనిపించక రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అందువల్ల డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- మంచు దట్టంగా కురిసే సమయంలో ప్రయాణాలను మానుకుంటే మంచిది. అనివార్యమైతే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కచ్చితంగా హెడ్‌లైట్‌లు వెలుగుతూనే ఉండాలి. ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఎదురుగా వచ్చిన వాహనాలు ఢీకొట్టే ప్రమాదం ఉంటుంది.
- రోడ్ల పక్కన బండి నిలిపితే హెడ్‌లైట్‌తోపాటు వెనుకలైట్లు కూడా వెలుగుతూ ఉండాలి. దీనివల్ల ఇతర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. వాహనం చుట్టూ రేడియం టేపు తప్పనిసరిగా ఉంచాలి. దీనివల్ల మంచుకురిసే సమయంలో వాహన ఉనికి తెలుస్తుంది. వాహనం నడిపేటప్పుడు వైపర్‌ను వాడాలి. లోభీం లైట్లు వేస్తే రోడ్డు కనిపించడంతోపాటు కాంతిదూరం ఎక్కువగా ఉంటుంది.
- ముందు వెళ్లే వాహనాల నుంచి సురక్షిత దూరాన్ని పాటించాలి.
- వాహనం నడిపేటప్పుడు ఇండికేటర్ లైట్లు వేసుకొని వెళ్లాలి.
- కేవలం 30, 40 స్పీడ్‌తోనే వాహనం నడపాలి.
- వాహన అద్దాలపై పడే మంచును తుడిచేయడానికి డీఫాగర్‌ను వినియోగించాలి.
- ప్రధాన లైట్లు, సిగ్నల్ లైట్లు, లోభీం లైట్లు అన్ని వెలిగించి వాహనాలు నడపాలి.
- రోడ్డు స్పష్టంగా కన్పించకపోతే సురక్షితమైన స్థలంలో వాహనాన్ని నిలిపివేయాలి
- వాహనాల మధ్య కచ్చితమైన దూరాన్ని పాటించాలి.
- విండ్ స్ర్కీన్ సైడ్‌మిర్రర్లపై ఎప్పటికప్పుడు మంచును శుభ్రం చేయాలి.

మహిళల స్వావలంబనే లక్ష్యంగా..



నెల్లికుదురు మండలం బ్రాహ్మణపల్లిలో డ్రోన్‌తో పురుగుమందును పిచికారి చేస్తున్న డ్రోన్ పైలెట్ అమృత

చేయూత

- 'నమో డ్రోన్ దీదీ' పథకం అమలుకు
- పూర్తి రాయితీతో డ్రోన్ల పంపిణీ, శిక్షణ
- ఎకరం పంటపై 8నిమిషాల్లో మందుల పిచికారీ.. రూ.400అద్దె

కేసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పద్ధతులను ఆధునీకరించడంతోపాటు మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవతో కేంద్ర ప్రభుత్వం 'నమోడ్రోన్ దీదీ' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద ప్రయోగాత్మకంగా రాష్ట్రానికి తొలి విడతలో ఒక ప్రముఖ కంపెనీ ద్వారా 150 వ్యవసాయ డ్రోన్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా ప్రతీజిల్లాకు యూనిట్లను కేటాయించారు. నాబార్డు ఆధ్వర్యంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీవో) ద్వారా వందశాతం రాయితీతో సుమారు రూ.8లక్షల విలువైన వ్యవసాయ డ్రోన్లను అందించారు. వాటిలో మహబూబాబాబాద్ జిల్లాకు మూడు యూనిట్లు రాగా.. ఒక్కొక్కటి చొప్పున ముగ్గురు మహిళలకు అందించారు. స్వయం సహాయక సంఘాల్లో విద్యావంతులైన మహిళలనే ప్రాథమిక అర్హతగా ఎంపిక చేయగా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లిలో కుంట అమృత, కల్వలలో గుర్రం మమత, దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామంలో మరో మహిళ ఎంపికయ్యారు. వీరికి పది రోజులపాటు చెన్నైలో, వారం రోజులపాటు హైదరాబాద్‌లో డ్రోన్ నిర్వహణపై 'డ్రోన్ పైలెట్లు'గా శిక్షణనిచ్చారు. డ్రోన్ పైలెట్లకు లైసెన్సుకూడా జారీ చేశారు. డ్రోన్ పైలెట్ లైసెన్సు ఉన్నవారే దీన్ని ఆపరేట్ చేయాలి. లేనట్లయితే డ్రోన్ ద్వారా ఏదైనా ప్రమాదం సంభవిస్తే బాధ్యులపై చట్టరీత్యా చర్యలు ఉంటాయి.

ప్రయోగాత్మకంగా అమలు

వ్యవసాయంలో డ్రోన్ ఉపయోగించడం అది కూడా మహిళలతో నిర్వహింపజేయడం ప్రయోగాత్మకంగా చేపట్టారు. వ్యవసాయ పద్ధతులను ఆధునికీకరించడం, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి స్వయం సహాయక బృందాల నుంచి డ్రోన్ పైలెట్ల కోసం మహిళలను ఎంపిక చేశారు. డ్రోన్ తయారీ కంపెనీలకు స్వయం సహాయక సంఘాల మహిళలకు మధ్యలో లీడ్ ఫర్టిలైజర్ కంపెనీలు(ఎల్ఎఫ్‌సీ), క్లస్టర్ లెవల్ ఫెడరేషన్ (సీఎల్ఎఫ్)ల ద్వారా ఈ డ్రోన్‌లను అందజేశారు. ఈ డ్రోన్‌లతో పురుగుమందులు, ఎరువులు, కలుపునివారణ మందులను అవసరమైన ప్రాంతంలో కచ్చితంగా పిచికారీ చేసే అవకాశం ఉంటుంది. పొలం, చెల్కల్లో నడుచుకుంటూ పిచికారీ చేయడంవల్ల మొక్కలు ధ్వంసమయ్యే అవకాశం ఉంటుంది. డ్రోన్ ద్వారా పిచికారీతో ఈ సమస్య ఉండదు. ఎకరా విస్తీర్ణానికి సరిపోయే ద్రావకాన్ని ఒకేసారి ట్యాంకులో నింపుకొని కేవలం 8 నుంచి 10 ఎనిమిది నిమిషాల్లోనే పొలం, చేనులో మందును వ్యవసాయ డ్రోన్ పిచికారి చేస్తుంది. ఎకరాకు రూ.400 చొప్పున డ్రోన్ అద్దెను తీసుకుంటున్నారు. నిమిషాల్లోనే పిచికారీ చేస్తుండ డంతో రైతులు డ్రోన్ ద్వారా మందు చల్లించేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమ మండలంలోనే కాకుండా పొరుగు మండలాలకు డ్రోన్‌ను అద్దెకు తీసుకువెళ్లి మహిళలు ఉపాధి పొందుతున్నారు. ఈ యూనిట్ల పనితీరును సమీక్షించి విజయవంతమైతే మరిన్ని గ్రామాల్లో మహిళలకు డ్రోన్లను ఇచ్చేందుకు కేంద్రం నిర్ణయించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

డ్రోన్ పైలెట్ అవుతానని ఊహించలేదు..

కుంట అమృత, డ్రోన్ పైలెట్, తాళ్లపూసపల్లి



మా గ్రామంలో త్రివేణి గ్రామైక్య సంఘం కింద రత్నం స్వయం సహాయ సంఘానికి అధ్యక్షురాలిగా పనిచేస్తున్న నేను డిగ్రీ, బీఈడీ పూర్తి చేశా. నమో డ్రోన్ దీదీ పథకానికి నన్ను ఎంపిక చేసి చెన్నై, హైదరాబాద్‌లలో శిక్షణ ఇప్పించి లైసెన్సు కూడా ఇచ్చారు. రైతులు ఇప్పుడిప్పుడే డ్రోన్‌పై అవగాహన ఏర్పడి మందుల పిచికారిలో వాడుతున్నారు. వందశాతం రాయితీతో డ్రోన్ ఇచ్చి ఉపాధి మార్గం కల్పించేందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు.

ఫెస్టివ్ టిప్స్

బడ్జెట్‌లో దీపావళి

దీపావళి... ఖర్చుతో కూడుకున్న పండగే! అందులో సందేహం లేదు. అయితే ఖర్చులు తడిచి మోపెడవకుండా, కొద్దిపాటి బడ్జెట్‌లోనే పండుగను జరుపుకునే మార్గాలెన్నో ఉన్నాయి. అవే ఇవి!

క్యాండిల్స్ బదులుగా దివ్వెలు!: బల్బులు, క్యాండిల్స్‌తో దీపావళి వెలుగులు విరజిమ్మాలంటే ఖర్చు పెరుగుతుంది. కాబట్టి ఈ దీపావళినాడు మట్టితో తయారైన ప్రమిదలు సేకరించి, వాటి మీద ఆక్రిలిక్ కలర్స్‌తో డిజైన్లు గీయండి. వీటిలో నూనె లేదా మైనం నింపి వెలిగించండి. మట్టి ప్రమదలు ఎక్కువ సమయం పాటు వెలగడమే కాదు, వాటిని తయారుచేసిన వారికీ మేలు చేసినవాళ్లం అవుతాం!

పువ్వుల రంగోలి!: రసాయనాలతో తయారైన కృత్రిమ రంగులకు బదులు పూల రేకులు, పసుపు, బియ్యం పిండిలతో రంగోలి తయారుచేయండి. వీటి ఖరీదు తక్కువ. పైగా అలంకరణ కూడా తేలికే!

బడ్జెట్‌లో వెలుగులు!: ఇంట్లో పనికి రాని గాజు సీసాలను సేకరించి వాటికి రంగు లేయండి. వాటి లోపల ఫెర్రీ లైట్లను నింపి, కిటికీల దగ్గర ఉంచి ఆన్ చేయండి. ఈ సీసాల్లో చిన్న చిన్న సందేశాలు, తీపి పదార్థాలనూ ఉంచి, స్నేహితులకు, పొరుగింటి వారికీ పండగ సందర్భంగా బహుమతిగా ఇవ్వవచ్చు.

దుపట్టాతో డెకరేషన్!: గది సీలింగ్ నుంచి మూలలకు రంగురంగుల దుపట్టా లేదా చీరలతో అలంకరించుకోవచ్చు. కిటికీలకు, తలుపుల దగ్గర కర్టెన్లుగానూ వాడవచ్చు. బెడ్ వెనకాల గోడకు డిజైన్‌లా దుపట్టాలను అలంకరించి, వాటి మీద అక్కడక్కడా పువ్వులను గుచ్చండి. గదులకు పండగ శోభ వస్తుంది.

కాగితం తోరణాలు: పూల తోరణాలకు బదులుగా రంగురంగుల కాగితాలతో తోరణాలు తయారుచేసి, వాకిళ్లకు కట్టుకోవచ్చు. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల కాగితాలను ఇందుకు ఉపయోగించుకోవచ్చు.

పూల రేకులతో: మొత్తంగా పూల దండలు కొనడం ఖరీదైన వ్యవహారమే! అయితే



లూజ్ ఫ్లవర్స్ తక్కువ ధరకు దొరుకుతూ ఉంటాయి. కాబట్టి వాటిని తెచ్చి, విడదీసి, రేకులను కలిపి మాలగా కుట్టుకోవచ్చు. కొంత సృజనాత్మకతను జోడించి, ఆకులతో కలిపి ఆకర్షణీయంగా గుచ్చుకోవచ్చు. ఈ మాలలను గుమ్మాలకు వేలాడదీసుకుంటే, ఇంటికి పండుగ శోభ వచ్చేస్తుంది.

డాండియా!: డిజె లేదని దిగాలు పడవలసిన అవసరం లేదు. స్నేహితులను పోగు చేసి డాండియా ఆడుకోవచ్చు. వినసొంపైన గుజరాతీ లేదా బాలీవుడ్ ప్లేలిస్ట్ తయారుచేసుకుని దీపావళి రాత్రి డాండియాతో హంగామా చేయవచ్చు. ఇందుకోసం డాండియా స్టిక్స్, మిలమిల మెరిసే డాండియా దుస్తులు ఉంటే చాలు.

భలే బహుమతులు!: ప్రమిదలకు ఆకర్షణీయమైన రంగులతో పెయింట్ చేసి స్నేహితులకు ఇవ్వవచ్చు. మైనం కొని క్యాండిల్స్ తయారుచేసి బహుకరించవచ్చు. స్వీట్లు తయారుచేసే సామర్థ్యం ఉంటే వాటిని అందంగా గిఫ్ట్ ప్యాక్ చేసి స్నేహితులకు బహుకరించవచ్చు.

వారియర్

కథాబలం... పాత్రకు ప్రాధాన్యం ఉన్న చిత్రాలతో బాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న నటి... భూమి పెడ్నేకర్. తెర మీదే కాదు... నిజ జీవితంలోనూ భూవి ఎది భిన్నమైన పాత్రే. వాతావరణ మార్పులతో పర్యావరణానికి... తద్వారా మానవాళికి పొంచివున్న ముప్పు గురించి ఆమె నిత్యం అవగాహన కల్పిస్తోంది. 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్' నుంచి 'యంగ్ గ్లోబల్ లీడర్' అవార్డు గెలుచుకున్న భూమి... కాలుష్యరహిత ప్రకృతి కోసం 'ఐక్యరాజ్య సమితి', ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఉద్యమిస్తోంది.



మార్పు కోసం పయనం

భూమి పెడ్నేకర్ చిత్రాలు వినోదాన్ని పంచుతూనే... సున్నితమైన సామాజిక అంశాలను స్పృశిస్తాయి. 'టాయిలెట్ ఏక్ ప్రేమ్ కహానీ, రక్షాబంధన్, సాండ్ కీ ఆంఖ్' తదితర సినిమాలు అందుకు ఉదాహరణ. నిజ జీవితంలో కూడా భూతాపం వంటి వాతావరణ మార్పులు, సమస్యలకు సంబంధించిన వార్తల్లో 34 ఏళ్ల భూమి పేరు తరచూ కనిపిస్తుంటుంది. పర్యావరణ హితం కోరుతూ అనేక వేదికల మీద ఆమె ప్రసంగించింది. పలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన సదస్సుల్లో పాల్గొని అవగాహన కల్పిస్తోంది. సినిమా షూటింగ్ ఉన్నా... లేకపోయినా... ఆమెకు ఇది రోజువారీ కార్యక్రమాల్లో ఒక భాగం. సగటు బాలీవుడ్ తారలకు భిన్నంగా... సామాజిక చైతన్యమే లక్ష్యంగా సాగుతోంది ఆమె ప్రయాణం. అందుకే ఈ ఏడాది 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్' (డబ్ల్యూఈఎఫ్) ఆమెకు 'యంగ్ గ్లోబల్ లీడర్' అవార్డును ఇచ్చి గౌరవించింది. సమాజంలో సానుకూల మార్పు తీసుకువచ్చేందుకు దూరదృష్టి, ధైర్యం, ప్రభావం చూపగల వ్యక్తులకు ఈ అవార్డును ఇస్తారు. 'పర్యావరణ పరిరక్షణకు భూమి ఆవేదనతో కూడిన తన గళాన్ని వినిపిస్తోంది. మార్పు కోసం అలుపెరుగని కృషి చేస్తోంది' అంటూ ఈ సందర్భంగా డబ్ల్యూఈఎఫ్ కొనియాడింది.

2024 సంవత్సరానికి గానూ ప్రపంచవ్యాప్తంగా నలభై ఏళ్ల లోపు వయసుగల 90 మంది గ్లోబల్ చేంజ్ మేకర్స్‌ను డబ్ల్యూఎఫ్ఈ ఆ మధ్య అవార్డులు ప్రకటించింది. 'వారిలో నేను కూడా ఒకరిని అయినందుకు, సామాజిక ప్రయోజనాల కోసం నేను చేస్తున్న కృషికి గుర్తింపు లభించినందుకు సంతోషంగా ఉంది. ఈ పురస్కారం నాకు ఎంతో ప్రతిష్టాత్మకం. దీన్ని అందుకోవడం గౌరవంగా భావిస్తున్నా' అంటున్న భూమికి అవార్డులు కొత్తేమీ కాదు. పరిశ్రమలో ఎంతో ప్రతిభగల తారగా గుర్తింపు పొందిన ఆమెను... పలు 'ఫిలిమ్ ఫేర్ అవార్డు'లతో పాటు ఎన్నో ప్రతిష్టాత్మక పురస్కారాలు వరించాయి.

సమాజానికి తిరిగి ఇవ్వాలి...

'ప్రకృతిపరంగా, సామాజికంగా మనం ఎన్నో ప్రయోజనాలు పొందుతున్నాం. అందుకు మనం కూడా ఈ సమాజానికి ఎంతోకొంత తిరిగి ఇవ్వాలి. చిన్నప్పటి నుంచీ నాలో ఈ భావన బలపడింది. సినిమాల ద్వారా, అలాగే అవగాహన, సేవా కార్యక్రమాల ద్వారా ఆ దిశగా నా వంతు కృషి చేస్తున్నా. ఇక వాతావరణంలో సంభవిస్తున్న ప్రతికూల మార్పుల గురించి 2016లోనే నేను గళం విప్పాను. నాటి నుంచి దీనివల్ల జరిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాను. ఒకరికి చెప్పాలంటే ముందు సంబంధిత అంశాలపై మనకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలి. దాని కోసం నేను ఎంతో పరిశోధించాను. విరివిగా పుస్తకాలు చదివాను. ఇందులోని సమస్యలు, ఎదురవుతున్న సవాళ్లు ఏంటన్నది అధ్యయనం చేశాను. తొలినాళ్లలో వాతావరణ మార్పులపై మాట్లాడినప్పుడు కొందరు నన్ను తప్పుపట్టారు. అవహేళన చేశారు. కానీ వాటిని నేను పట్టించుకోలేదు. నా ఆలోచనలకు దగ్గరగా ఉన్నవారితో కలిసి ఈ ప్రయాణం మొదలుపెట్టాను' అంటున్న భూమికి నలుగురిలో ఒకరిగా బతికేయడం అస్సలు నచ్చదు. అది సినీ పరిశ్రమ అయినా... బయటి ప్రపంచంలో అయినా... తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు కావాలని కోరుకొంటుంది. దాని కోసం అహర్నిశలూ శ్రమిస్తుంది.



కల నిజం చేసుకొని...

'యష్‌రాజ్ ఫిలిమ్స్'లో అసిస్టెంట్ క్యాస్టింగ్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన భూమి... నటి కావాలని చిన్నప్పటి నుంచి కలలు కన్నది. ఎన్నో ఇబ్బందులు పడి పరిశ్రమలో నిలదొక్కుకున్న ఆమె... పుట్టింది, పెరిగిందీ ముంబయిలోనే. ఆమె తండ్రి సతీష్ మహారాష్ట్ర మాజీ మంత్రి. ఓరల్ కేన్సర్‌తో తండ్రి చనిపోవడంతో... తల్లి సుమిత్ర పొగాకు వ్యతిరేక ఉద్యమం నడిపారు. 'ఆర్య విద్యామందిర్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన భూమి.. పదిహేనేళ్ల వయసులోనే నటన వైపు అడుగులు వేసింది. నటనలో శిక్షణ కోసం 'విజిలింగ్ ఉడ్స్ ఇంటర్నేషనల్' స్కూల్‌లో చేరాలనుకుంది. బ్యాంకులో రుణం తీసుకుని మరీ అందులో చేర్పించారు ఆమె తల్లితండ్రులు.

అయితే తరగతులకు తరచూ డుమ్మా కొట్టడంతో భూమిని ఆ సంస్థవాళ్లు బయటకు పంపించారు. ఆ తరువాతే 'యష్‌రాజ్ ఫిలిమ్స్'లో చేరింది. ఆరేళ్లు అక్కడ పని చేసిన తరువాత... అంటే 2015లో ఊహించని బ్రేక్ వచ్చింది. 'దమ్ లగాకే హైసా'లో హీరోయిన్‌గా అవకాశం లభించింది. అందులో అధిక బరువు గల అమ్మాయి పాత్ర. దాని కోసం అప్పటికే బొద్దుగా ఉన్న భూమి... మరింత బరువు పెరిగింది. ఆ చిత్రంలోని నటనకు గానూ 'ఫిలిమ్‌ఫేర్ అవార్డు' లభించింది. ఇక అక్కడి నుంచి జయాపజయాలతో సంబంధం లేకుండా ఆమెకు అవకాశాలు వస్తూనే ఉన్నాయి.

వైవిధ్యానికి మారుపేరు...

కథల ఎంపిక విషయంలో భూమి ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటుంది. వచ్చిన అవకాశాలన్నిటికీ ఓకే చెప్పకుండా వైవిధ్యమైన పాత్రలను మాత్రమే ఎంచుకొంటోంది. పాత్ర డిమాండ్ చేస్తే... శరీర ఆకృతిని మార్చుకోవడానికి కూడా వెనకాడదు భూమి. ఆ క్రమంలోనే తొలి చిత్రం పూర్తయ్యేసరికి 89 కేజీల బరువున్న ఆమె... తరువాత ప్రాజెక్ట్ కోసం 57 కేజీలకు తగ్గింది.

పరిశ్రమలోకి వచ్చి పదేళ్లు కూడా కాలేదు. కానీ ఇరవైకి పైగా చిత్రాల్లో నటించింది. ఈ కొద్ది ప్రయాణంలోనే బడా స్టార్లు బాలీవుడ్‌ను ఏలుతున్నా... తనకంటూ ఒక ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకోగలిగిందంటే... వృత్తిపట్ల ఆమెకు ఎంతటి అంకితభావమో అర్థం చేసుకోవచ్చు.

భూమి ఫౌండేషన్...

ఒకవైపు వరుస సినిమాలతో బిజీగా ఉన్నా... మరోవైపు సామాజిక కార్యక్రమాల కోసం కూడా తగిన సమయం కేటాయిస్తుంది భూమి. అందుకు ఒక వేదిక ఉండాలన్న ఉద్దేశంతో 'భూమి ఫౌండేషన్' నెలకొల్పింది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా సముద్రతీరాల్లోని వ్యర్థాలను తొలగించడం, మొక్కలు నాటడం, వాన నీటి సంరక్షణ తదితర ప్రచార కార్యక్రమాలు చేపడుతోంది. 'వాతావరణ మార్పులకు సంబంధించిన వార్తలు, వాటివల్ల కలిగే దుష్పరిణామాలు నిత్యం పతాక శీర్షికల్లో చూస్తున్నాం. నా దృష్టిలో ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న అతిపెద్ద ముప్పు ఇది. మా ఫౌండేషన్ ద్వారా ఆచరణాత్మక మార్పు తీసుకువచ్చేందుకు కృషి చేస్తాను' అంటున్న ఈ నటి అందుకు అవసరమైన నిధులను తానే సమకూర్చుకొంటోంది. 'ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం'లో కూడా భూమి భాగస్వామి అయింది.

తేనెతో వీటిని కలపొద్దు...

తేనె ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే తీపి పదార్థం. కొన్ని ప్రత్యేక వంటకాల్లో, బేకింగ్ ఉత్పత్తుల్లో చక్కెరకు బదులు తేనెను ఉపయోగిస్తుంటారు. అంతే కాదు ఎన్నో ఔషధగుణాలు ఉన్న తేనెతో ఆయుర్వేద మందులు కూడా తయారు చేస్తారు. దీర్ఘకాలిక వ్యాధులతోపాటు చర్మ సంబంధిత అలెర్జీల నివారణకు, కాలిన గాయాలను మాన్పడానికి, దగ్గు తదితర గొంతు సమస్యల నుంచి బయటపడేందుకు తేనె అద్భుతంగా పనిచేస్తుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న తేనెను ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలి. ముఖ్యంగా కొన్ని పదార్థాలతో తేనెను అసలు కలపకూడదు అంటున్నారు నిపుణులు. అవేంటో చూద్దాం!

వేడి నీళ్లు: బాగా వేడిగా ఉండే నీళ్లతో కలిపినపుడు తేనెలోని ఎంజైమ్స్, పోషకాలు నశిస్తాయి. అందులోని సహజ చక్కెరలు కూడా వేడెక్కి కార్సినోజెనిక్ పదార్థాలను విడుదల చేస్తాయి. వీటివల్ల కేన్సర్ వచ్చే ప్రమాదముంటుంది. అందుకే గోరువెచ్చని నీటితో కలిపి సేవించడం మంచిది.

వెల్లుల్లి: కొన్ని చైనీస్ వంటకాల్లో తేనెను, వెల్లుల్లిని కలిపి అత్యధిక ఉష్ణోగ్రత వద్ద ఫ్రై చేస్తుంటారు. దీని వల్ల వెల్లుల్లిలోని ఘాటైన పొరలు తేనెకున్న సహజ స్వభావాన్ని నాశనం చేస్తాయి. ఈ రెంటినీ కలిపి తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం.

కీర: తేనె, కీర రెండూ ఆరోగ్యానికి చాలా మంచివి. కానీ వీటికున్న వ్యతిరేక లక్షణాల వల్ల రెంటినీ కలిపి తీసుకోవడం మంచిది కాదని ఆయుర్వేదం చెబుతోంది. కీరా శరీరాన్ని చల్లబరిస్తే తేనె వేడిని పుట్టిస్తుంది. ఈ రెంటినీ కలిపి తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి.

డెయిరీ ఉత్పత్తులు: బాగా వేడిగా ఉన్న పాలు, కాఫీ, టీలతో తేనెను కలిపితే వాటిలోని ప్రొటీన్లు గడ్డ కట్టి తేనె స్వభావాన్ని మార్చి విషతుల్యం చేస్తాయి. వేడిగా ఉన్న గ్రీన్ టీ, ఫ్లేవర్డ్ మిల్క్, హాట్ చాక్లెట్‌లతో కూడా తేనెను కలపకూడదు.

పుల్లని పండ్లు: పుల్లని పండ్లలో ఆమ్ల లక్షణాలు ఉంటాయి. ఇవి తేనె రుచిని, స్వభావాన్ని మార్చి పొట్టలో గ్యాస్ట్రిక్ ట్రబుల్ వచ్చేలా చేస్తాయి. పైన్‌యాపిల్, మామిడి పండ్లతో కలిపి తీసుకుంటే మధుమేహం వచ్చే ప్రమాదముంటుంది. తేనెను యోగర్ట్, ఓట్స్, బ్రెడ్ వంటి ఆమ్లరహిత పదార్థాలతో కలిపి తీసుకోవడం మంచిది.

నెయ్యి: తేనె, నెయ్యి రెంటినీ సమానపాళ్లలో కలిపి తీసుకోవడం అత్యంత ప్రమాదం. దీనివల్ల శరీరంలో క్లోస్ట్రీడియమ్ బొటులిజం బ్యాక్టీరియా ఉత్పత్తవుతుంది. ఇది పలు టాక్సిన్లను విడుదల చేసి శ్వాసకోశ సమస్యలను, కేన్సర్‌ను, కడుపునొప్పిని కలిగిస్తుంది. దీనికి



సంబంధించిన వివరణ ప్రముఖ ఆయుర్వేద గ్రంథం చరక సంహితలో కూడా ఉంది.

మాంసం, చేపలు: గుడ్లు, మాంసం, చేపల్లో అధిక పరిమాణంలో ప్రొటీన్లు ఉంటాయి. వీటిని తేనెతో కలిపి తీసుకుంటే జీర్ణక్రియ ఆలస్యమవుతుంది. దీనివల్ల కడుపులో అజీర్తి, వికారం, వాంతులు వంటి సమస్యలు వస్తాయి.

ప్రకృతితో బంధం

వినూత్నం

చుట్టూ అడవి, కొండల మధ్యన ఒక క్యాంపు. అక్కడి ప్రకృతి అందాలు వీక్షించేందుకు వచ్చే పర్యాటకులు ఆ క్యాంప్‌లో బస చేయవచ్చు. కానీ అందులో అటాచ్డ్ బాత్‌రూములు ఉండవు. గీజర్‌లు కనిపించవు. ఏసీల మాటే ఉండదు. రాజస్థాన్‌లోని గోద్వారాలో ఉన్న భాగీరా క్యాంప్‌లో అడుగుపెడితే కనిపించే దృశ్యం ఇది. పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ క్యాంప్‌ని ఏర్పాటు చేశారు వన్యప్రాణి సంరక్షకురాలు పద్మజా రాథోర్. ఇది రిసార్టు కాదు, జంగిల్ క్యాంప్ అంటున్న పద్మజా రాథోడ్ విశేషాలు ఇవి...

"ప్రకృతి నుంచి మనం వేరుగా లేము. దానికి అంతర్భాగంగా ఉన్నాం. ప్రతిఒక్కరూ ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలి" అని అంటారు పద్మజా రాథోడ్. వన్యప్రాణుల సంరక్షురాలిగా ఆమె గోద్వార్ ప్రజలకు సుపరిచితురాలు. అంతరించిపోతున్న జాతులను సంరక్షించడంతో పాటు స్థానిక మహిళలకు సాధికారత కల్పించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు పద్మజ. ప్రకృతికి, మనుషులకు మధ్య ఉన్న సామరస్యపూర్వక సంబంధాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఆమె పనిచేస్తున్నారు. "నాకు నా తల్లిదండ్రులే ప్రేరణ. వారి సహకారంతోనే ఈ పనులన్నీ చేస్తున్నాను. మెహ్రాన్‌ఘర్ కోటలో మార్వార్‌లోని నీటి సంరక్షణా వ్యవస్థల నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందాను" అని అంటారు పద్మజ.



అవగాహన కల్పించడం కోసం...

పద్మజా రాథోడ్ వైల్డ్‌లైఫ్ సోషల్ ఎంటర్‌ప్రైజ్ అండ్ కమ్యూనిటీ రిజర్వ్‌గా భాగీరా క్యాంప్‌ను ప్రారంభించారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది ఒక ఆర్గానిక్ వెల్‌నెస్ క్యాంప్. గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన నైపుణాభివృద్ధి కోర్సులను అందించే కేంద్రంగా ఉపయోగపడుతోంది. ఒకప్పుడు పచ్చదనం, సమృద్ధిగా ఉన్న భూగర్భజలాలతో గోద్వార్ ప్రాంతం కళకళాడుతూ ఉండేది. ఆ తరువాత మారిన పరిస్థితులతో విధ్వంసం జరిగింది. విచ్చలవిడి పర్యాటకం, పారిశ్రామికీకరణ, అడవులను నరికివేయడం, పెరిగిన జనాభా వంటివి విధ్వంసానికి కారణమయ్యాయి. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు పద్మజా రాథోడ్ భాగీరా క్యాంప్‌ను నెలకొల్పారు. గోద్వార్ ప్రాంతంలోని జవాయిలో గ్రానైట్ కొండల మధ్య ఈ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఇది లగ్జరీ సఫారీ అనుభవాన్ని అందించే చోటు అనుకుంటే పొరపాటు. ప్రకృతికి, మనుషులకు మధ్య ఉన్న సంబంధాన్ని పెంపొందించడం కోసం ఏర్పాటు చేసిన స్వర్గధామం అని చెప్పుకోవచ్చు. ప్రకృతి సరిహద్దుల గురించి అవగాహన కల్పించడం, ప్రజలు తమ పరిసరాల గురించి తెలుసుకునేలా చేయడం, చుట్టూ ఉండే జీవులను గౌరవించేలా ప్రోత్సహించడం అనే ఆలోచనతో ఈ క్యాంప్ ప్రారంభమైంది.



ఆలోచన విజయవంతం

భాగీరా క్యాంప్ ఏర్పాటు చేశాక పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించడం, చిత్తడి నేలలు ఎండిపోవడం వల్ల ఏర్పడిన సమస్యలను పరిష్కరించడం కోసం 'రీవైల్డింగ్ జవాయి' పేరుతో ఒక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈ ప్రాంతాల్లో నీటివనరులు పునరుత్తేజం పొందేలా చేశారు. నీటిని నిల్వ చేసేందుకు భూమికి రంధ్రాలు చేశారు. ఈ విషయంలో ఆమె తండ్రి సహాయసహకారాలు అందించారు. ఆయన నీటి నిర్వహణలో నిపుణులు. ఒక దశాబ్దం తరువాత వారి కృషి ఫలించింది. జవాయిలో భూగర్భజలాలు విజయవంతంగా రీఛార్జ్ అయ్యాయి. వేసవికాలం రాకముందే ఎండిపోయే కిశోర్‌సాగర్ సరస్సు ఇప్పుడు ఏడాది పొడవునా జలకళతో కనిపిస్తోంది. అంతేకాకుండా నేలను సంరక్షించుకోవడం, వన్యప్రాణుల రక్షణలో స్థానిక కమ్యూనిటీలను భాగస్వాములను చేయడం, సాధికారతను కల్పించడం, దేశీయ పద్ధతులను ప్రోత్సహించడం వంటివి చేశారు. "గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌తో పాటు ముఖ్యమైన ఇతర జంతుజాలం అంతరించే దశలో ఉంది. 1995 నుంచి ఒంటెల సంఖ్య 60 శాతం తగ్గిపోయింది" అంటారు పద్మజ. ఈ పరిస్థితులను మార్చేందుకు ఆమె బహుముఖ విధానాన్ని అనుసరించారు. ఈ విధానంతో వన్యప్రాణులను సంరక్షించడమే కాకుండా, పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం సాధ్యమైంది. గడ్డిభూములు ఔషధ మొక్కలతో కొత్త రూపు సంతరించుకున్నాయి.

"భాగీరా క్యాంప్ స్థిరమైన జీవనానికి నిదర్శనం. ఇక్కడ సఫారీ కూడా ప్రకృతి పట్ల గౌరవంతో నిర్వహిస్తాం. ఇక్కడ బసచేసే వారు స్థానికుల వలే జీవించాల్సి ఉంటుంది. ప్రత్యేక వసతులు ఉండవు" అని వివరిస్తారు పద్మజ. ఆమె వన్యప్రాణుల సంరక్షణతో పాటు 'రాజ్ దాదిసా బదన్ కన్వర్ స్కూల్ ఆఫ్ సెల్ఫ్ స్టడీ' పేరుతో ఒక సంస్థను నడుపుతున్నారు. ఇక్కడ హోటల్ కార్యకలాపాలు, ఫొటోగ్రఫీ, ఫిల్మ్‌మేకింగ్ వంటి వాటిలో నైపుణ్య శిక్షణను అందిస్తున్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న గ్రామీణ ప్రజలకు ప్రాథమిక విద్యతోపాటు ఆతిథ్య నైపుణ్యాలను అందించడం ద్వారా వారిని పర్యావరణ పరిరక్షకులుగా మార్చేందుకు ఆమె కృషి చేస్తున్నారు.

సుమారు ఐదువందలకు పైగా గిరిజనులతో కలిసి పనిచేస్తున్నారు. 2017లో భాగీరా క్యాంప్‌కు ఔట్‌లుక్ రెస్పాన్సిబుల్ ట్రావెల్ అవార్డు లభించింది.

ఫ్యాషన్

దివ్వెల పండగలో ధగధగలు

పండగ శోభ ప్రతిబింబించే దుస్తులు కచ్చితంగా పట్టు చీరలే! ఇప్పుడెన్నో రకాల పట్టుచీరలు మార్కెట్లో దొరుకుతున్నాయి. సౌకర్యానికి పెద్ద పీట వేస్తూనే, అరుదైన రంగులు, డిజైన్లలో రూపొందుతూ మహిళల మనసులను ఆకట్టుకుంటున్నాయి. అలాంటి పట్టు చీరల్లో ఇవి కొన్ని.



ఎరుపు, ఆకుపచ్చ, పసుపు... సాధారణంగా పట్టు చీరలంటే ఇవే రంగులు గుర్తుకొస్తాయి. అయితే బీజ్, పేల్ పింక్, ఓషన్ బ్లూ రంగుల పట్టు చీరలు ఎంచుకుంటే సంప్రదాయ వస్త్రధారణకు మోడర్న్ టచ్ ఇచ్చిన వారవుతారు. నలుగురిలోనూ ప్రత్యేకంగా కనిపిస్తారు.

ఇలా ఎంచుకోవాలి:

పట్టు చీరలు మోయలేని సుకుమారుల కోసం తయారైనవే సాఫ్ట్ సిల్క్ శారీస్. మెత్తగా, మృదువుగా, సౌకర్యంగా ఈ రకం పట్టు చీరల్లో కాంట్రాస్ట్ కలర్స్ ఎంచుకుంటే మరింత నాజూకుగా కనిపించవచ్చు.

- పట్టు చీర అందమంతా అంచుల్లో, పవిటలో దాగుంటుంది. భారీ జరీ పనితనం ఉండి, అరుదైన డిజైన్లతో తయారైన పవిట చీర మొత్తానికే అందాన్నిస్తుంది.
- ఎంచుకునే బ్లౌజు సరికొత్తగా ఉండాలి. పొడవు, పొట్టి, ఫ్లోయా...ఇలా ఎలాంటి డిజైన్‌లో కుట్టించుకున్నా చీర పవిటకు మ్యాచ్ అయ్యేలా చూసుకోవాలి.



కాంచీపురం, ధర్మవర ం, మైసూర్... ఒకటా రెండా కట్టుకోవడానికి బోలెడన్ని పట్టుచీరలు. జరీ భారీగా ఉండేవి కొన్నైతే, సుతిమెత్తని పట్టు సాఫ్ట్ సిల్క్‌తో తయారయ్యేవి మరికొన్ని. ఎలాంటి పట్టుతో తయారైనా సిల్క్ శారీస్ అందాలు వర్ణనాతీతం. అయితే ఒడ్డు, పొడవును బట్టి అంచు భారీగా ఉండాలా, చిన్నదిగా ఉండాలా? అనేది నిర్ణయించుకోవాలి.

ఎరుపు, ఆకుపచ్చ, పసుపు... సాధారణంగా పట్టు చీరలంటే ఇవే రంగులు గుర్తుకొస్తాయి. అయితే బీజ్, పేల్ పింక్, ఓషన్ బ్లూ రంగుల పట్టు చీరలు ఎంచుకుంటే సంప్రదాయ వస్త్రధారణకు మోడర్న్ టచ్ ఇచ్చిన వారవుతారు. నలుగురిలోనూ ప్రత్యేకంగా కనిపిస్తారు.



చీర అంచుతో మ్యాచ్ అయ్యే బ్లౌజ్ ధరించడం పాత ఫ్యాషన్. పట్టు చీరల విషయంలో మరికాస్త జాగ్రత్తగా బ్లౌజ్ డిజైన్ చేసుకోవాలి. తాజా ట్రెండ్‌కు తగ్గట్టు చీర రంగుకు కాంట్రాస్ట్‌గా ఉండే బ్లౌజ్ అయితే సరికొత్తగా కనిపిస్తారు.









ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 30 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com



క్రిస్మస్ కోసం సిద్ధం



నితిన్ హీరోగా నటిస్తున్న యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్' షూటింగ్ దాదాపు పూర్తయింది. శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం ఆరు రోజుల టాకీ వర్క్, రెండు పాటలు మాత్రమే బ్యాలెన్స్ ఉన్నట్లు దర్శకుడు వెంకీ కుడుముల చెప్పారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంతో జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. నవంబర్ మొదటి వారంలో టీజర్ విడుదల చేస్తామనీ, క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 20న సినిమాను రిలీజ్ చేస్తామనీ నిర్మాతలు నవీన్ యర్నేని, రవిశంకర్ చెప్పారు. 'రాబిన్‌హుడ్' చిత్రానికి సాయి శ్రీరామ్ డీవోపీ కాగా, జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు.

లొకేషన్ల వేటలో జక్కన్న

మహేశ్‌బాబు-రాజమౌళి కలయికలో పాన్ ఇండియా చిత్రం ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఎస్ఎస్ఎంబీ 29 'అనేది ప్రచారంలో ఉన్న వర్కింగ్ టైటిల్. మహేశ్‌బాబు ఇప్పటికే ఈ సినిమా కోసం కొత్తలుక్‌తో సిద్ధమయ్యారు. ఈ సినిమాకు సంబంధించిన పనులు శరవేగంతో సాగుతున్నాయని రాజమౌళి చెప్పకనే చెప్పారు. ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసిన రాజమౌళి లొకేషన్ల వేటలో పడ్డారు. మంగళవారం ఆయన సోషల్ మీడియాలో ఓ ఫొటోను పోస్ట్ చేసి 'వెతుకుతున్నాను' అని తెలిపారు. ఆ



ఫొటోలో కెన్యాలోని అటవీ ప్రాంతంలో జంతువుల మధ్య తిరుగుతూ రాజమౌళి కనిపించారు. అటవీ నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కబోతోందని రాజమౌళి చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయన కెన్యాలోని అడవుల్లో చిత్రీకరణకు అనువైన ప్రదేశాలను వెతికే పనిలో ఉన్నారని తెలుస్తోంది. లొకేషన్లు ఖరారు అయితే సెట్స్‌పైకి వెళ్లడమే ఆలస్యం. కొత్త ఏడాదిలో చిత్రీకరణ ప్రారంభమవనుంది.

రిలీజ్ డేట్ ఫిక్స్



ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో హీరో సత్యదేవ్, కన్నడ స్టార్ డాలీ ధనంజయ నటించిన మల్టీ స్టారర్ చిత్రం 'జీబ్రా'. 'లక్ ఫేవర్స్ ద బ్రేవ్' దీని ట్యాగ్‌లైన్. ఎస్.ఎన్. రెడ్డి, పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మాతలు. నవంబరు 22న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. పోస్టర్‌లో సత్యదేవ్, డాలీ ధనంజయ ఫెరోసియస్‌గా కనిపించారు. బ్యాక్ డ్రాప్‌లో కరెన్సీ నోట్లు, లైట్ హౌస్, ఫ్యాక్టరీ మొదలైన ఎలిమెంట్స్ ఉన్నాయి. ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్స్, మోషన్ వీడియో, టీజర్‌తో మేకర్స్ క్యూరియాసిటీని పెంచారు. టీజర్ మంచి రెస్పాన్స్‌తో భారీ అంచనాలను నెలకొల్పింది.

రొమాంటిక్‌గా మరో సారి...



'స్వామి రారా', 'కేశవ' సినిమాల తర్వాత నిఖిల్ సిద్ధార్థ్, డైరెక్టర్ సుధీర్ వర్మ కలయికలో తెరకెక్కుతోన్న మూడో చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. రుక్మిణీ వసంత్, దివ్యాంశ కౌశిక్ కథానాయికలు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. నవంబర్ 8న ఈ చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన రొమాంటిక్ ఫస్ట్ సింగిల్ 'హే తార' అందర్నీ ఆకట్టుకుంది. తాజాగా, ఈ సినిమా నుంచి రెండో పాటను విడుదల చేశారు. 'నీతో ఇలా' అని సాగే ఈ రొమాంటిక్ గీతంలో నిఖిల్ సిద్ధార్థ్, దివ్యాంశ కౌశిక్ కెమిస్ట్రీ ఆకట్టుకుంది. రాకేందు మౌళి సాహిత్యం అందించగా.. కార్తీక్, నిత్యశ్రీ ఆలపించారు. ఎడిటింగ్: నవీన్ నూలి, సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ప్రసాద్, సంగీతం:కార్తీక్.

పోలీస్ పాత్రలో...



రాఘవ లారెన్స్, ఎల్విన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ 'బుల్లెట్ బండి'. ఇన్నాసి పాండియన్ దర్శకత్వంలో కతిరేసన్ నిర్మిస్తున్నారు. రాఘవ లారెన్స్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. సినిమా టైటిల్ 'బుల్లెట్ బండి'. ఇందులో పోలీసాఫీసర్ పాత్రలో రాఘవ లారెన్స్ కనిపించనున్నారు. నటుడు సునీల్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఎడిటర్: వడివేల్ విమల్‌రాజా, డీఓపీ: అరవింద్ సింగ్, సంగీతం: సామ్ సీఎస్.

మంచి సినిమా నిర్మించా



హీరో కిరణ్ అబ్బవరం నటించిన భారీ పీరియాడిక్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లు. సుజీత్, సందీప్ దర్శకులు. నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి. ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి మీడియాతో ముచ్చటించారు.' నాకు చిన్నప్పటి నుంచి పాటలు వినడం ఇష్టం. అలా సినిమాల మీద బాల్యం నుంచే ఆసక్తి ఏర్పడింది. వృత్తిపరంగా వ్యాపారవేత్తగా మారినా సినిమాల మీద ఇంట్రెస్ట్ అలా ఉండిపోయింది. లాక్‌డౌన్ టైమ్‌లో 'ఇప్పుడు కాక ఇంకెప్పుడు' అనే సినిమా ప్రొడ్యూస్ చేశాను. 'క' సినిమా కథ విన్నప్పుడు కంటెంట్ చాలా కొత్తగా ఉంది అనిపించింది. ఇందులో సస్పెన్స్, సెంటిమెంట్ ఉన్నాయి. ఇద్దరు దర్శకులు సుజీత్, సందీప్ స్క్రిప్ట్ బాగా నెరేట్ చేశారు. కథను ఎంత బాగా చెప్పారో అంతకంటే బాగా తెరకెక్కించారు. ఔట్‌పుట్ చూసి ఇంప్రెస్ అయ్యాను. ఈ సినిమాకు సీక్వెల్ కూడా చేసుకోవచ్చు. కిరణ్ అబ్బవరం కష్టపడే తత్వం ఉన్న హీరో. చాలా మంచివాడు. 'క' సినిమాకు ఎంతో శ్రమించి వర్క్ చేశాడు. హైదరాబాద్‌లో చాలా మంచి థియేటర్స్ దొరికాయి. మొత్తంగా 350కి పైగా థేయేటర్లలో 'క' రిలీజ్ అవుతోంది' అని తెలిపారు.

కొత్తగా..

పది ప్రేమ కథలు



దర్శకుడు, రచయిత మనోహర్ చిమ్మని దర్శకత్వంలో 'యో 10 ప్రేమ కథలు' టైటిల్‌తో కొత్త సినిమా షూటింగ్ లాంఛనంగా ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని వి.సి.క్రియేషన్స్ సమర్పణలో, మనూటైమ్ మూవీ విజన్ నిర్మిస్తోంది. పది మంది పాపులర్ హీరో, హీరోయిన్స్ నటిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. దర్శకుడు మనోహర్ చిమ్మని మాట్లాడుతూ' యో..అనే మాట యువతకు ప్రతీక. ఈతరం యువతీయువకుల ఆలోచనలు, జీవనశైలి చుట్టూ అల్లిన 10 ప్రేమ కథల సమాహారం ఈ సినిమా. ఒక్కో ప్రేమ కథ ఒక్కో జానర్లో ఉంటుంది. అయితే ఈ ప్రేమ కథలన్నింటికీ లక్ష్యం ఒక్కటే ఉంటుంది' అని తెలిపారు.

ఓ చిన్న పిల్ల ప్రశ్నకు సమాధానం



రాకేశ్ గలేబి, స్రవంతి ప్రత్తిపాటి, మానస వీణ, భార్గవ్ గోపీనాథం ముఖ్య తారలుగా కోమల్ ఆర్ భరద్వాజ్ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'రహస్యం ఇదం జగత్'. పద్మ రావినూతల, హిరణ్య రావినూతల నిర్మాతలు. ఈ చిత్రం నవంబరు 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు చందు మొండేటి విడుదల చేశారు. 'ఈ టీజర్ చూసి ఎగ్జైట్‌గా ఫీలయ్యాను. ప్రత్యేకంగా, వ్యక్తిగతంగా నేను వేటికి అయితే ఎక్కువగా ఎగ్జైట్ అవుతానో, కనెక్ట్ అవుతానో, చదువుతానో, రీసెర్చ్ చేస్తానో...వాటికి సిమిలర్‌గా ఈ సినిమా కాన్సెప్ట్ ఉంది. జనాలు ఇలాంటి సినిమాలు చూసే మూడ్‌లో ఉన్నారు. తప్పకుండా ఈ చిత్రం అందరినీ అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు చందు మొండేటి. ఈ చిత్ర దర్శకుడు కోమల్ ఆర్. భరద్వాజ్ మాట్లాడుతూ' నాకు కార్తికేయ సినిమా ఇన్‌స్పిరేషన్. దాని ప్రేరణతో ఈ చిత్రాన్ని రూపొందించాను. 'ఈ సినిమా ఓన్లీ మైథాలజీ కాదు. రాముడు, హనుమంతుడికేనా మనకు కూడా జరుగుతుందా' అని ఓ చిన్న పిల్ల అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఉంటుంది. అందరికీ గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది. సైన్స్ ఫిక్షన్‌కు మైథలాజికల్ అంశాలు జోడించి నేటి తరం ప్రేక్షకుల మెప్పు పొందే విధంగా రూపొందించాం' అని అన్నారు.

విషయమున్న సినిమాలను ఆదరిస్తారు



రమేశ్ చెప్పాల దర్శకత్వంలో సాయిరోనక్, ప్రగ్యా జంటగా నటించిన చిత్రం 'లగ్గం'. వేణుగోపాల్ రెడ్డి నిర్మాత. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం సోమవారం సక్సెస్ మీట్ నిర్వహించింది. నటుడు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'విషయం ఉన్న సినిమాలను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని, అందుకు 'లగ్గం' సినిమా విజయమే రుజువు అని అన్నారు. సాఫ్ట్‌వేర్ జీవితాలు, ఓ తండ్రి తన కూతురి కోసం పడే తపన, కుటుంబానికి దూరంగా బతికే వారి కష్టాలతో దర్శకుడు ఫుల్ ఎమోషనల్ టచ్ ఇచ్చారు' అని అన్నారు. హీరో సాయి రోనక్ మాట్లాడుతూ 'ఈ చిత్రంలో నటించడం నాకు ఎంతో సంతృప్తిని ఇచ్చింది, బయట వస్తున్న టాక్‌ని బట్టి చూస్తే ఈ సినిమా తరవాత నాకు మరిన్ని మంచి అవకాశాలు వస్తాయి అనే నమ్మకం ఏర్పడింది' అని తెలిపారు

లైంగికంగా వేధించాడు



- మలయాళ దర్శకుడు రంజిత్‌పై నటుడి ఫిర్యాదు

జాతీయ అవార్డు గ్రహీత, మలయాళ చిత్ర దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై బెంగళూరులో లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ఓ హోటల్లో రంజిత్ తనను లైంగికంగా వేధించాడంటూ ఓ యువ నటుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. '2012లో బెంగళూరులో మమ్ముట్టి కథానాయకుడిగా నటిస్తున్న ఓ చిత్రం షూటింగ్ జరుగుతున్న సమయంలో రంజిత్‌ను కలిశాను. సినిమాలో అవకాశం ఇస్తానని హోటల్‌కు పిలిపించి, అక్కడ ఆడిషన్ పేరుతో దుస్తులు విప్పించి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు' అని నటుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా బెంగాలి నటి శ్రీలేఖ మిత్రా ఫిర్యాదు మేరకు రంజిత్ లైంగిక వేధింపుల కేసులో విచారణ ఎదుర్కొంటున్నారు.

టీవీ రీచార్జ్ కోసం వెతికి.. నిండా మునిగి

» యాప్ డౌన్‌లోడ్ చేయించి

2.92 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కస్టమర్ కేర్ నంబరు కోసం గూగుల్‌లో వెతుకుతున్నారా? కొంచెం జాగ్రత్త! జాబితాలో కనిపించిన నంబరునల్లా క్లిక్ చేశారో హైదరాబాద్‌లోని ఓ వ్యాపారి (40)కి ఎదురైన చేదు అనుభవమే మీకూ ఎదురవ్వొచ్చు! సైబర్ నేరగాళ్ల వలలో చిక్కిన ఆ వ్యాపారి.. బ్యాంకు ఖాతాల వివరాలన్నీ చెప్పేసి రూ.2.92 లక్షలు సమర్పించుకున్నాడు. టీవీ రీచార్జ్ చేసేందుకు కస్టమర్ కేర్ నంబరు కోసం గూగుల్ సెర్చ్ చేసిన ఆ వ్యాపారి అందులో కనిపించిన నంబరుకు ఫోన్ చేసి వివరాలు చెప్పాడు. కొద్దిసేపటికి కస్టమర్ కేర్ ప్రతినిధిని అంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. రీచార్జ్ చేయడానికి ఆన్‌లైన్ పేమెంట్ చేయాలని సూచించి నంబర్ పంపాడు. దానికి ముందుగా రూ. 10 రీచార్జ్ చేయాలని సూచించాడు. సదరు నంబర్‌కు పేమెంట్ వెళ్లకపోవడంతో లింక్‌ను పంపాడు. ఈ లింక్ ద్వారా 'కస్టమర్ సపోర్ట్ యాప్'ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, యాప్‌లో 3 బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేసుకున్న తర్వాత చెల్లింపులు చేయాలని సూచించాడు. యాప్ డౌన్‌లోడ్ చేసిన 30 నిమిషాల్లో సైబర్ నేరగాళ్లు మూడు బ్యాంకు ఖాతాల నుంచి రూ.2.92 లక్షలు వేర్వేరు ఖాతాలకు బదిలీ చేశారు. మోసపోయానని గుర్తించిన బాధితుడు ఘటనపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో.. 'మీ సిమ్ కార్డ్ నుంచి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగాయని భయపెట్టిన సైబర్ కేటుగాళ్లు ఓ ప్రైవేటు ఉద్యోగి నుంచి రూ.1.55 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఓ కేసు విషయమై ముంబై క్రైం బ్రాంచ్ అధికారులు మాట్లాడతారని చెప్పి కాల్ కనెక్ట్ చేశాడు. మీ ఆధార్‌కార్డుకు లింక్ అయిన సిమ్ కార్డు నుంచి చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరిగాయని భయపెట్టాడు. బాధితుడి నుంచి రూ.1.55 లక్షలు తాను సూచించిన ఖాతాలకు బదిలీ చేయించుకున్నాడు. అడిగినంత డబ్బులు చెల్లించినా, మళ్లీ డబ్బు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదైంది.

మోమోస్ తయారీ కేంద్రాలపై దాడులు

» 110చోట్ల పరిశీలన.. 69 నమూనాలు ల్యాబ్‌కు

» బాధితులను పరామర్శించిన అధికారులు

» అదుపులోకి మరో ఆరుగురు నిందితులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కలుషిత మోమోస్ కారణంగా ఓ గృహిణి మృతిచెందగా.. 50 మంది అస్వస్థతకు గురైన నేపథ్యంలో.. జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 110 మోమోస్ తయారీ కేంద్రాలపై ముప్పేట దాడులు నిర్వహించి, తనిఖీ చేపట్టారు. అనుమతులు లేకుండా.. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో మోమోస్‌ను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. పురుగులు పట్టిన మైదా పిండి, కాలం చెల్లిన ముడిపదార్థాలను మోమోస్ తయారీకి వినియోగిస్తున్నట్లు నిర్ధారించారు. కొన్ని తయారీ కేంద్రాల్లో అపరిశుభ్రత, డ్రైనేజీ ఓవర్‌ఫ్లో వంటి పరిస్థితులను గుర్తించారు. 69 కేంద్రాల్లో మోమోస్ నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్ నుంచి నివేదిక వచ్చాక.. సంబంధిత మోమోస్ తయారీ కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ ఎస్.పంకజ వెల్లడించారు. కాగా.. బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో మోమోస్ తిని అస్వస్థతకు గురై, తన్వీర్, స్వాతి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని ఫుడ్ సేఫ్టీ అధికారులు పరామర్శించారు. వారి నమూనాలను సేకరించి, ల్యాబ్‌కు తరలించారు. అస్వస్థతకు కలుషితమైన మోమోస్ కారణమా? లేక అందులో వినియోగించిన మయోనైస్ కారణమా? అనేది నివేదిక వచ్చాక తెలుస్తుందని అధికారులు వివరించారు. మరోవైపు.. కలుషిత మోమోస్ కేసులో బంజారాహిల్స్ పోలీసులు మరో ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరంతా ఢిల్లీ మోమోస్ నుంచి ఆహార పదార్థాలను కొనుగోలు చేసి.. సంతల్లో విక్రయిస్తుంటారని పోలీసులు వివరించారు.



తనిఖీలు చేపడుతున్న అధికారులు

గౌరవనీయమైన తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి వారి సమక్షంలో

విద్యుత్ నియంత్రణ భవన్, G.T.S కాలనీ, కళ్యాణ్ నగర్, హైదరాబాద్ - 500 045

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (TGSPDCL) | **ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (TGNPDCL)**

బహిరంగ ప్రకటన

ఆర్థిక సంవత్సరము 2024-25 నుండి 2028-29 వరకు రిటైల్ సరఫరా వ్యాపారం కోసం సమగ్ర ఆదాయ ఆవశ్యకత (ARR) మరియు ఆర్థిక సంవత్సరము 2024-25 కు రిటైల్ సరఫరా టారిఫ్ మరియు క్రాస్ సబ్సిడీ సర్-ఛార్జ్

1. ఇందు మూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, రెండు డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు, అనగా సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీ.జి.ఎస్.పి.డి.సి.ఎల్) మరియు నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టి.జి.ఎన్.పి.డి.సి.ఎల్) వారు ఆర్థిక సంవత్సరము 2024-25 నుండి 2028-29 వరకు రిటైల్ సరఫరా వ్యాపారం కోసం సమగ్ర ఆదాయ ఆవశ్యకత (A R R) మరియు ఆర్థిక సంవత్సరము 2024-25 కు రిటైల్ సరఫరా టారిఫ్ మరియు క్రాస్ సబ్సిడీ సర్‌ఛార్జ్ ప్రతిపాదనలను పురస్కరించుకొని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి వారు యావత్ తెలంగాణ రాష్ట్రంలోని వినియోగదారులందరికీ ఆర్థిక సంవత్సరము 2024-25 నుండి 2028-29 వరకు రిటైల్ సరఫరా వ్యాపారం కోసం సమగ్ర ఆదాయ ఆవశ్యకత (A R R) మరియు ఆర్థిక సంవత్సరము 2024-25 కు రిటైల్ సరఫరా టారిఫ్ మరియు క్రాస్ సబ్సిడీ సర్‌ఛార్జ్ ఈ క్రింద వివరించబడ్డ అనుబంధం I, అనుబంధం II మరియు అనుబంధం III ప్రకారం నిర్ణయించడమైనది.
2. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి వారు యావత్ తెలంగాణా రాష్ట్రంలోని వినియోగదారులందరికి ఆర్థిక సంవత్సరము 2024-25 నుండి 2028-29 వరకు రిటైల్ సరఫరా వ్యాపారం కోసం సమగ్ర ఆదాయ ఆవశ్యకత (A R R) మరియు ఆర్థిక సంవత్సరము 2024-25 కు రిటైల్ సరఫరా టారిఫ్ మరియు క్రాస్ సబ్సిడీ సర్ ఛార్జీలను నిర్ణయించడమైనది.
3. రిటైల్ సరఫరా ఛార్జీలు రాష్ట్రంలోని సిరిసిల్ల గ్రామీణ విద్యుత్ సరఫరా సహకార సంఘం పరిధిలోని వినియోగదారులకు కూడా వర్తిస్తాయి.
4. ఈ రిటైల్ సరఫరా ఛార్జీలు మరియు క్రాస్ సబ్సిడీ సర్‌ఛార్జీ 01-11-2024 నుండి 31-03-2025 వరకు చట్టాన్ని అనుసరించి కమీషన్ వారు సవరించినంత వరకు అమలులో ఉంటాయి.

సం/ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ

సం/ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ

అనుబంధం – I

ఆర్థిక సం|| 2024-25 నుండి ఆర్థిక సం|| 2028-29 వరకు రిటైల్ సరఫరా వ్యాపారం కొరకు సమగ్ర ఆదాయ ఆవశ్యకత (ఎఆర్ఆర్)

		TGSPDCL				
క్రమ సం	వివరములు	2024-25	2025-26	2026-27	2027-28	2028-29
1	విద్యుత్ కొనుగోలు ఖర్చులు	29220.04	33813.75	36119.02	38704.47	41475.98
2	PGCIL& ULDC ఖర్చులు	1624.06	1702.37	1789.85	1880.16	1973.99
3	ట్రాన్స్మిషన్ ఖర్చులు	2201.88	2400.26	2453.92	2484.12	2559.85
4	SLDC ఖర్చులు	38.80	47.69	58.28	60.71	62.50
	పంపిణీ వ్యయం - వీలింగ్ వ్యాపారం	4213.80	4684.44	5133.68	5616.47	6134.02
5	ఓ &ఎం ఛార్జీలు రిటైల్ సరఫరా వ్యాపారం	358.56	381.44	405.93	432.17	460.26
6	తరుగుదల రిటైల్ సరఫరా వ్యాపారం	53.54	64.83	74.51	85.02	96.12
7	అప్పుపై వడ్డీ మరియు ఆర్థిక ఛార్జీలు రిటైల్ సరఫరా వ్యాపారం	46.96	53.47	61.54	70.00	79.12
8	నిర్వహణ మూలధనంపై వడ్డీ - రిటైల్ సరఫరా వ్యాపారం	0.00	0.00	0.00	0.00	0.00
9	ఈక్విటీ పై రాబడిరిటైల్ సరఫరా వ్యాపారం	16.88	27.86	34.93	42.69	51.14
10	టారీఫేతర ఆదాయం	151.16	158.71	166.65	174.98	183.73
11	వినియోగదారుల సెక్యూరిటీ డిపాజిట్ పై వడ్డీ	323.69	333.40	343.40	353.70	364.31
	సమగ్ర ఆదాయ ఆవశ్యకత (ARR)	37947.03	43350.80	46308.42	49554.53	53073.56

		TGNPDCL				
క్రమ సం	వివరములు	2024-25	2025-26	2026-27	2027-28	2028-29
1	విద్యుత్ కొనుగోలు ఖర్చులు	11494.19	13022.62	13548.26	14137.70	14745.22
2	PGCIL& ULDC ఖర్చులు	677.94	710.63	747.15	784.84	824.01
3	ట్రాన్స్మిషన్ ఖర్చులు	919.14	1001.95	1024.35	1036.96	1068.57
4	SLDC ఖర్చులు	16.19	19.91	24.33	25.34	26.09
	పంపిణీ వ్యయం - వీలింగ్ వ్యాపారం	2822.25	3186.90	3525.84	3886.78	4275.51
5	ఓ &ఎం ఛార్జీలు రిటైల్ సరఫరా వ్యాపారం	262.34	279.50	297.72	317.23	338.19
6	తరుగుదల - రిటైల్ సరఫరా వ్యాపారం	31.74	39.31	45.94	53.12	60.84
7	అప్పు పై వడ్డీ మరియు ఆర్థిక ఛార్జీలు రిటైల్ సరఫరా వ్యాపారం	24.42	32.46	39.84	47.37	55.27
8	నిర్వహణ మూలధనంపై వడ్డీ - రిటైల్ సరఫరా వ్యాపారం	0.00	0.00	0.00	0.00	0.00
9	ఈక్విటీపై రాబడి - రిటైల్ సరఫరా వ్యాపారం	8.42	15.90	21.21	26.93	33.23
10	టారీఫేతర ఆదాయం	119.85	125.84	132.13	138.74	145.67
11	వినియోగదారుల సెక్యూరిటీ డిపాజిట్ పై వడ్డీ	99.45	112.96	128.31	145.74	165.53
	సమగ్ర ఆదాయ ఆవశ్యకత (ARR)	16236.25	18296.30	19270.82	20323.28	21446.79

అనుబంధం – II

ఆర్థిక సం|| 2024-25 రిటైల్ సరఫరా ధరల యొక్క సంక్షిప్త పట్టిక

(తెలంగాణ రాష్ట్రంలోని రెండు పంపిణీ సంస్థల మరియు రెస్కో సిరిసిల్లలకు 01-11-2024 నుండి 31-03-2025 వరకు వర్తించును)

వినియోగదారుల విభాగం	ఫిక్స్‌డు / డిమాండ్ ఛార్జీలు: యూనిట్	ఫిక్స్‌డు / డిమాండ్ ఛార్జీలు: (రూ./ యూనిట్ /నెల)	ఎనర్జీ ఛార్జీలు (రూ./ యూనిట్)
లో-టెన్షన్			
LT-I గృహ వినియోగం			
LT-I(A): నెలకు 100 యూనిట్ల వరకు			
0-50	కెడబ్ల్యు	10	1.95
51-100	కెడబ్ల్యు	10	3.10
LT-I(B) (i): నెలకు 100 యూనిట్ల పైన మరియు 200 యూనిట్ల వరకు			
0-100	కెడబ్ల్యు	10	3.40
101-200	కెడబ్ల్యు	10	4.80
LT-I(B) (ii): నెలకు 200 యూనిట్ల పైన			
0-200	కెడబ్ల్యు	10	5.10
201-300	కెడబ్ల్యు	10	7.70
301-400	కెడబ్ల్యు	10	9.00
401-800	కెడబ్ల్యు	10	9.50
800 యూనిట్ల పైనుండి	కెడబ్ల్యు	50	10.00
LT-II గృహేతర/వాణిజ్యవినియోగం			
LT-II(A): నెలకు 50 యూనిట్ల వరకు	కెడబ్ల్యు	30	7.00
LT-II(B): నెలకు 50 యూనిట్ల పైన			
0-100	కెడబ్ల్యు	70	8.50
101-300	కెడబ్ల్యు	70	9.90
301-500	కెడబ్ల్యు	100	10.40
500 యూనిట్ల పైనుండి	కెడబ్ల్యు	100	11.00
LT-II(C): ప్రచార మరియు ప్రకటనల బోర్డులు	కెడబ్ల్యు	150	13.00
LT-II(D): క్షౌరశాలలు నెలకు 200 యూనిట్ల వరకు వినియోగం			
0-50	కెడబ్ల్యు	60	5.30
51-100	కెడబ్ల్యు	60	6.60
101-200	కెడబ్ల్యు	60	7.50
LT-III: పరిశ్రమలు			
పరిశ్రమలు	కెడబ్ల్యు	100	7.70
కాలానుగుణ పరిశ్రమలు (ఆఫ్ సీజన్)	కెడబ్ల్యు	100	8.40
మత్స్య మరియు రొయ్యల పెంపకం	కెడబ్ల్యు	50	6.20
చెరుకు గానుగలు	కెడబ్ల్యు	50	6.20
కోళ్లఫారాలు	కెడబ్ల్యు	65	7.00
పట్టుగొడుగులు, కుందేళ్ళ, గొర్రెల మరియు మేకల పెంపకం	కెడబ్ల్యు	100	7.30
LT – III పరిశ్రమల క్రింద పున్నరైస్ మిల్లులకు కాంట్రాక్టు లోడ్ యొక్క గరిష్ఠ పరిమితి 93 KW / 125 HP మరియు LT - III పరిశ్రమల క్రింద మిగిలిన వినియోగదారులకు కాంట్రాక్టు లోడు యొక్క గరిష్ఠ పరిమితి 75 KW / 100 HP			
LT-IV: కుటీరపరిశ్రమలు			
LT-IV(A): కుటీరపరిశ్రమలు	కెడబ్ల్యు	20.00	4.00
LT-IV(B): వ్యవసాయాధారిత కార్యకలాపాలు	కెడబ్ల్యు	20.00	4.00
LT – IV (B) వ్యవసాయ ఆధారిత పనులు: గొర్రెలు, మేకల పెంపకం మరియు పాడి పరిశ్రమ కార్యకలాపాలకు కనెక్టెడ్ లోడ్ యొక్క గరిష్ఠ పరిమితి 25 HP. LT IV – (B) వ్యవసాయ ఆధారిత పనులు క్రింద మిగిలిన వినియోగదారులకు కనెక్టెడ్ లోడ్ యొక్క గరిష్ఠ పరిమితి 20 HP.			
LT-V: వ్యవసాయం			
LT-V(A): వ్యవసాయం (DSM విధానం తప్పనిసరి)			
కార్పొరేట్ రైతులు	హెచ్ పి		2.50
కార్పొరేట్ రైతులు కాకుండా	హెచ్ పి		0.00
LT-V(B): ఇతరులు			
ఉద్యాన మొక్కల పెంపకం (15 హెచ్ పి వరకు)	హెచ్ పి	20	4.00
LT-VI: వీధిదీపాలు మరియు రక్షిత మంచినీటి పథకాలు			
LT-VI(A): వీధిదీపాలు			
పంచాయతీలు	కెడబ్ల్యు	32	7.10
పురపాలక సంఘాలు	కెడబ్ల్యు	32	7.60
కార్పోరేషన్లు	కెడబ్ల్యు	32	8.10
LT-VI(B): రక్షిత మంచినీటి పథకాలు			
పంచాయతీలు	హెచ్ పి	32.00/హెచ్.పి కనీస ఛార్జీలు రూ.50/నెలకు	6.00
పురపాలక సంఘాలు	హెచ్ పి	32.00/హెచ్.పి కనీస ఛార్జీలు రూ.100/నెలకు	7.10
కార్పోరేషన్లు	హెచ్ పి	32.00/హెచ్.పి కనీస ఛార్జీలు రూ.100/నెలకు	7.60
LT-VII: సాధారణ			
LT-VII(A): సాధారణ విద్యుత్ వాడకం	కెడబ్ల్యు	21	8.30
LT-VII(B): మత పరమైన ప్రదేశాలు	కెడబ్ల్యు	30	5.00
LT-VIII: తాత్కాలిక వినియోగం	కెడబ్ల్యు	21	12.00
LT - VIII తాత్కాలిక సరఫరా కోసం, టారిఫ్ ఆర్డర్ లో నిర్దేశించబడిన ఇతర ఛార్జీల తో పాటుగా అంచనా వేయబడిన వినియోగ ఛార్జీలను వినియోగదారు ముందుగానే డిపాజిట్ చేయవలసి ఉంటుంది			
LT IX: విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు	కెడబ్ల్యు	0.00	6.00
HT-I: పరిశ్రమలు			
HT-I(A): పరిశ్రమలు (సాధారణ)			
11 kV	కెవిఎ	500	7.65
33 kV	కెవిఎ	500	7.15
132 kV మరియు ఆ పైన	కెవిఎ	500	6.65
లైట్లు & ఫ్యాన్లు			
11 kV			7.65
33 kV			7.15
132 kV మరియు ఆ పైన			6.65
కోళ్లఫారాలు			
11 kV	కెవిఎ	500	7.65
33 kV	కెవిఎ	500	7.15
పారిశ్రామిక కాలనీల వినియోగం			
11 kV			7.30
33 kV			7.30
132 kV మరియు ఆ పైన			7.30
కాలానుగుణ పరిశ్రమలు			
11 kV	కెవిఎ	500	8.60
33 kV	కెవిఎ	500	7.90
132 kV మరియు ఆ పైన	కెవిఎ	500	7.70
HT-I(A) విద్యుత్ (కేటగిరీ) CMD 150 KVA వరకు			
11 kV	కెవిఎ	100	8.00
HT-I(B): ఫెర్రో అల్లోయ్స్			
11 kV	కెవిఎ	500	7.65
33 kV	కెవిఎ	500	7.15
132 kV మరియు ఆ పైన	కెవిఎ	500	6.65
HT-II: ఇతరులు			
11 kV	కెవిఎ	500	8.80
33 kV	కెవిఎ	500	8.00
132 kV మరియు ఆ పైన	కెవిఎ	500	7.80
HT-II (B): మత పరమైన ప్రదేశాలు			
11 kV	కెవిఎ	285	5.00
33 kV	కెవిఎ	285	5.00
132 kV మరియు ఆ పైన	కెవిఎ	285	5.00
HT-III: విమానాశ్రయాలు, బస్సు స్టేషన్లు & రైల్వే స్టేషన్లు			
11 kV	కెవిఎ	500	8.50
33 kV	కెవిఎ	500	7.85
132 kV మరియు ఆ పైన	కెవిఎ	500	7.45
HT-IV: నీటిపారుదల మరియు CPWS			
HT-IV(A): నీటిపారుదల & వ్యవసాయం			
11 kV	కెవిఎ	300	6.30
33 kV	కెవిఎ	300	6.30
132 kV మరియు ఆ పైన	కెవిఎ	300	6.30
HT-IV(B): CPWS			
11 kV			6.10
33 kV			6.10
132 kV మరియు ఆ పైన			6.10
HT-V: రైలుమార్గాలు			
HT-V(A): రైలుమార్గాలు	కెవిఎ	500	5.05
HT-V(B): హెచ్ ఎం ఆర్ మార్గాలు	కెవిఎ	500	4.95
HT-VI: టౌన్‌షిప్‌లు/నివాస కాలనీలు			
11kV	కెవిఎ	285	7.30
33 kV	కెవిఎ	285	7.30
132 kV మరియు ఆ పైన	కెవిఎ	285	7.30
HT-VII: తాత్కాలిక వినియోగం			
11 kV	కెవిఎ	500	11.80
33 kV	కెవిఎ	500	11.00
132 kV మరియు ఆ పైన	కెవిఎ	500	10.80
HT - VII తాత్కాలిక సరఫరా కోసం, టారిఫ్ ఆర్డర్ లో నిర్దేశించబడిన ఇతర ఛార్జీల తో పాటుగా అంచనా వేయబడిన వినియోగ ఛార్జీలను వినియోగదారు ముందుగానే డిపాజిట్ చేయవలసి ఉంటుంది			
HT-VIII: రెస్కో			
11kV			4.77
HT-IX: విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు			
11 kV	కెవిఎ	100	6.00
33 kV	కెవిఎ	100	6.00
132 kV మరియు ఆ పైన	కెవిఎ	100	6.00

నియమ నిబంధనలు

1. టైం ఆఫ్ డే టారిఫ్ / ప్రోత్సాహకం ఛార్జీలు వర్తింపు

ఈ క్రింద పేర్కొనబడిన విభాగాలకు టైం ఆఫ్ డే టారిఫ్ / ప్రోత్సాహకం వర్తిస్తాయి

i) HT-I(A): పరిశ్రమలు (సాధారణ)
ii) HT-I(A): కోళ్లఫారాలు
iii) HT-II(A): ఇతరులు
iv) HT-II (B): మత పరమైన ప్రదేశాలు
v) HT-III: విమానాశ్రయాలు, బస్సు స్టేషన్లు & రైల్వే స్టేషన్లు
vi) HT-IX: విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు

వివరాలు	వర్తించే కాలం	ఆ.సం 2024-25 కి రిటైల్ సప్లై ఎనర్జీ ఛార్జీలపై (రూ./యూనిట్)
టైం ఆఫ్ డే (ToD) టారిఫ్	6 AM to 10 AM & 6 PM to 10 PM	(+) 1/-
టైం ఆఫ్ డే (ToD) ప్రోత్సాహకం	10 PM to 6 AM	(-) 1.50/-

2. ఇంధన సర్‌ఛార్జ్ సర్దుబాటు ఛార్జీలు (FSA/FCA) కాలానుగుణంగా సవరించిన నిబంధన 1 of 2023 ప్రకారం అదనంగా విధించబడుతుంది.
3. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ సుంకం చట్టం నిబంధనల ప్రకారం విద్యుత్ సుంకం కాలానుగుణంగా సవరించబడిన నిబంధనల ప్రకారం పై ధరలలో కలిసి లేదు.
4. సరఫరా యొక్క వోల్టేజ్ వినియోగదారులకు సరఫరా చేయవలసిన వోల్టేజ్ GTCS ప్రకారం మరియు ఎప్పటికప్పుడు కమీషన్ ద్వారా తెలియజేయబడిన విధంగా సవరించబడును.
5. డిమాండ్ ను దాటిన వారికి అదనపు ఛార్జీలు.

ఏదైనా ఒక నెలలో నమోదైన డిమాండ్ (ఆర్ఎండి) వినియోగదారుడు లైసెన్సీతో కుదుర్చుకున్న ఒప్పందపు డిమాండ్ (సిఎండి) కన్నా ఎక్కువగా ఉంటె వినియోగదారుడు ఈ క్రింది ఛార్జీలను చెల్లించవలెను.

సిఎండిలో ఆర్ఎండి %	ఎక్కువ డిమాండ్‌పై డిమాండ్ ఛార్జీలు	మొత్తం ఎనర్జీపై ఎనర్జీ ఛార్జీలు
100% నుండి 120%	సాధారణ ఛార్జీలకు రెండు రెట్లు	సాధారణ ఛార్జీలు
120% కంటే ఎక్కువ 200% వరకు	సాధారణ ఛార్జీలకు రెండు రెట్లు	సాధారణ ఛార్జీలకు 1.15 రెట్లు
200% కంటే ఎక్కువ	సాధారణ ఛార్జీలకు రెండు రెట్లు	సాధారణ ఛార్జీలకు 1.20 రెట్లు

HT కేటగిరీ V (A) & V (B) రైల్వే ట్రాక్షన్ మరియు HMR కు సంబంధించి నమోదయిన డిమాండ్ ఒప్పందపు డిమాండ్‌కు 120 % దాటినచో మొత్తం వినియోగించిన ఎనర్జీపై సాధారణ ఛార్జీలకు 1.05 రెట్లు లెక్కించబడును.

6. కనీస ఛార్జీలు			
ఎల్.టి విభాగాలు		ఆర్థిక సంవత్సరం 2024 – 25 కు రేట్లు	
ఎల్.టి-1(A)	గృహ వినియోగం	కాంట్రాక్టెడ్ లోడ్ 1000 వాట్స్ వరకు	
		సింగల్ ఫేజ్	-
ఎల్.టి-1(B)(i)		కాంట్రాక్టెడ్ లోడ్ 1000 వాట్స్ పైన	
		సింగల్ ఫేజ్	-
ఎల్.టి-1(B)(ii)		త్రీ ఫేజ్	-
ఎల్.టి-2(A) & ఎల్.టి-2(B)	గృహేతర/వాణిజ్యం	సింగల్ ఫేజ్	రూ.50/-నెలకు
		త్రీ ఫేజ్	రూ.100/-నెలకు
ఎల్.టి-2(C)	ప్రచురణ మరియు ప్రకటనల బోర్డులు	రూ.300/-నెలకు	
ఎల్.టి-2(D)	-	సింగల్ ఫేజ్	రూ.65/-నెలకు
		త్రీ ఫేజ్	రూ.200/-నెలకు
ఎల్.టి-6(A)	వీధి దీపాలు పంచాయితీలు	రూ.2/-పాయింట్/నెలకు	
	వీధి దీపాలు మున్సిపాలిటీలు & కార్పోరేషన్లు	రూ.6/-పాయింట్/నెలకు	
ఎల్.టి-7(A)	సాధారణ అవసరం	సింగల్ ఫేజ్	రూ.50/-నెలకు
		త్రీ ఫేజ్	రూ.150/-నెలకు
ఎల్.టి-8	తాత్కాలిక సరఫరా	మొదటి 30 రోజులు లేక అందులో పాక్షిక కానికి ప్రతి ఒప్పందపు లోడ్ కిలో వాట్ కి రూ.125/- చొప్పున తదుపరి ప్రతి 15 రోజులు లేక అందులో పాక్షిక కాలానికి ఒప్పందపు లోడు కిలో వాట్ కి రూ.75/- చొప్పున	
ఎల్.టి-9	విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు	సింగల్ ఫేజ్	రూ.65/-నెలకు
		త్రీ ఫేజ్	రూ.200/-నెలకు
హెచ్.టి విభాగాలు			
బిల్లింగ్ డిమాండ్		హెచ్.టి 4A మరియు హెచ్.టి 6 క్యాటగిరీలను మినహాయించి మిగిలిన అన్ని క్యాటగిరిలకు నెలలో నమోదైన డిమాండ్ లేదా ఒప్పందపు డిమాండ్ లో 80% గాని ఏది గరిష్టమో అది బిల్లింగ్ డిమాండ్‌గా పరిగణించబడుతుంది. హెచ్.టి 4A కేటగిరి నిర్వహణ కాలంలో అనగా (జూలై నుండి నవంబర్ వరకు) నమోదైన గరిష్ఠ డిమాండ్ లేదా ఒప్పంద డిమాండ్‌లో 80% గాని ఏది గరిష్టమో అది బిల్లింగ్ డిమాండ్‌గా పరిగణించబడుతుంది. నిర్వహణ లేని కాలంలో అనగా (డిసెంబర్ నుండి జూన్ వరకు) నమోదైన గరిష్ఠ డిమాండ్ లేదా ఒప్పంద డిమాండ్ లో 25% గాని ఏది గరిష్టమో అది బిల్లింగ్ డిమాండ్ గా పరిగణించబడుతుంది. HT-VI (అనగా టౌన్ షిప్స్ & నివాస కాలనీలు) కేటగిరి లో వాస్తవ నమోదిత డిమాండ్ బిల్లింగ్ డిమాండ్ అవుతుంది.	
కనీస ఎనర్జీ ఛార్జీలు			
హెచ్.టి. I(A)	పరిశ్రమలు సాధారణ	50 యూనిట్లు (కెవిఎహెచ్) / బిల్లింగ్ డిమాండ్ కెవిఎ నెలకు	
హెచ్.టి. I(B)	ఫెర్రో అల్లోయ్స్	50 యూనిట్లు (కెవిఎహెచ్)/ బిల్లింగ్ డిమాండ్ కెవిఎ నెలకు	
హెచ్.టి. II (A)	ఇతరులు	25 యూనిట్లు (కెవిఎహెచ్)/ బిల్లింగ్ డిమాండ్ కెవిఎ నెలకు	
హెచ్.టి. II (B)	ప్రార్థనా మందిరాలు	25 యూనిట్లు (కెవిఎహెచ్)/ బిల్లింగ్ డిమాండ్ కెవిఎ నెలకు	
హెచ్.టి. III	ఎయిర్ పోర్టు, బస్సు స్టేషన్ మరియు రైల్వే స్టేషన్	50 యూనిట్లు (కెవిఎహెచ్)/ బిల్లింగ్ డిమాండ్ కెవిఎ నెలకు	
హెచ్.టి. V(A) & V(B)	రైల్వే మార్గాలు & హెచ్.ఎం.ఆర్	32 యూనిట్లు (కెవిఎహెచ్)/ ఒప్పందపు డిమాండ్ కెవిఎ నెలకు	
హెచ్.టి. VI	టౌన్‌షిప్ & నివాస కాలనీలు	నమోదైన డిమాండ్ ను బిల్లింగ్ డిమాండ్‌గా పరిగణించవలెను. 25 యూనిట్లు (కెవిఎహెచ్) / ఒప్పందపు డిమాండ్ కెవిఎ నెలకు	
హెచ్.టి. IX	విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు	25 యూనిట్లు (కెవిఎహెచ్)/బిల్లింగ్ డిమాండ్ కెవిఎ నెలకు	

7. వినియోగదారుల ఛార్జీలు	
వినియోగదారుల విభాగము	ఛార్జీలు (రూ./నెల)
లో-టెన్షన్ (LT)	
LT-I: గృహ వినియోగం (యూనిట్లు / నెలకు)	
0-50	40
51-100	70
101-200	90
201-300	100
301-400	120
401-800	140
800 యూనిట్ల పైన	160
LT-II:(A&B): గృహేతర / వాణిజ్య వినియోగం (యూనిట్లు / నెలకు)	
0-50	50
51-100	90
101-300	105
301-500	120
500 యూనిట్ల పైన	160
LT II(C): ప్రచురణ మరియు ప్రకటనల బోర్డులు	160
LT II(D): క్షౌరశాలలు 200 యూనిట్స్/నెల వరకు	
0-50	45
51-100	55
101-300	65
LT-III: పరిశ్రమలు 20 HP వరకు	100
LT-III: పరిశ్రమలు 21-50 HP వరకు	350
LT-III: పరిశ్రమలు 51-100 HP వరకు	1200
LT- IV: కుటీర పరిశ్రమలు	50
LT -V: వ్యవసాయం	30
LT -VI: వీధిదీపాలు & రక్షిత మంచినీటి పథకాలు	120
LT -VII: సాధారణ విద్యుత్ వాడకం	100
LT -VIII: తాత్కాలిక వినియోగం	100
LT -IX: విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు	120
హై టెన్షన్ (HT)	
HT: 11 kV	2000
HT:33 kV	3500
HT: 132 kV మరియు ఆ పైన	5000

8. అపరాధ రుసుము:

ఎల్.టి విభాగాలు

a) ఎల్.టి-1(A), ఎల్.టి-1(B), ఎల్.టి-2(A), ఎల్.టి-2(D), ఎల్.టి-4 మరియు ఎల్.టి-5(B), క్యాటగిరిలలోని వినియోగదారుడు గడువు తేదీ తరువాత బిల్లు చెల్లించినచో ఈ క్రింద తెలిపిన ధరల ప్రకారం బిల్లు పై నెలకు అపరాధ రుసుము చెల్లించాలి.

ఎల్.టి-1(A)	రూ.10/-నెలకు
ఎల్.టి-1(B), ఎల్.టి-2(A), ఎల్.టి-2(D), ఎల్.టి-4 మరియు ఎల్.టి-5(B)	రూ.25/-నెలకు

b) ఎల్.టి-2(B), ఎల్.టి-2(C), ఎల్.టి-3, ఎల్.టి-6, ఎల్.టి-7 మరియు ఎల్.టి-9 క్యాటగిరి వినియోగదారులు గడువు తేదీ లోపు విద్యుత్ ఛార్జీలు చెల్లించనప్పుడు బిల్లు పై గడువు తేదీ నుండి బిల్లు చెల్లింపు తేదీ వరకు ప్రతి 100 రూ.లకు రోజుకు 5 పైసలు చొప్పున లేదా 150 రూ.లు ఈ రెండింటిలో ఏది ఎక్కువ అయితే అది లైసెన్సీ వారిచే అపరాధ రుసుము విధించబడును. వాయిదాలు మంజూరు చేసిన సందర్భంలో బకాయి ఉన్న మొత్తం పై సాలిన 18% చక్రవడ్డీ చొప్పున లైసెన్సీ వారిచే వడ్డీ విధించుబడును మరియు ఈ రెండు (అపరాధ రుసుము మరియు వడ్డీ) ఒకే సారి విధించబడదు.

హెచ్.టి విభాగాలు

వినియోగదారులు గడువు తేదీ లోపు విద్యుత్ ఛార్జీలు చెల్లించనప్పుడు బిల్లు పై గడువు తేదీ నుండి బిల్లు చెల్లింపు తేదీ వరకు ప్రతి 100 రూ.లకు రోజుకు 5 పైసలు చొప్పున లేదా 550 రూ.లు ఈ రెండిటిలో ఏది ఎక్కువ అయితే అది లైసెన్సీ వారిచే అపరాధ రుసుము విధించబడును. వాయిదాలు మంజూరు చేసిన సందర్భంలో బకాయి ఉన్న మొత్తం పై సాలిన 18% చక్రవడ్డీ చొప్పున లైసెన్సీ వారిచే వడ్డీ విధించుబడును మరియు ఈ రెండు (అపరాధ రుసుము మరియు వడ్డీ) ఒకే సారి విధించబడదు.

9. రీకనెక్షన్ ఛార్జీలు

ఎల్.టి సర్వీసులు	
ఎల్.టి -1(A)	రూ.25/-
ఎల్.టి ఓవర్ హెడ్ సర్వీసులకు	రూ.75/-
భూగర్భ సర్వీసులు	రూ.200/-
హెచ్.టి సర్వీసులు	
11 kV	రూ.1000/-
33 kV	రూ.2000/-
132 kV మరియు ఆ పైన	రూ.3000/-

10. టెస్టింగ్ ఛార్జీలు

ఇన్‌స్టాలేషన్ ఛార్జీలు	ఎల్.టి	హెచ్.టి
నూతన ఇన్‌స్టాలేషన్ లేదా ఇంతకు ముందు ఉన్న ఇన్‌స్టాలేషన్ విస్తరణకు మొదటి సారి పరీక్ష మరియు తనిఖీ	లేదు	లేదు
తదుపరి పరీక్ష మరియు లేదా తనిఖీ సంబంధిత విభాగంచే ఇన్‌స్టాలేషన్ లోపం గుర్తించినప్పుడు లేదా సరఫరా నిబంధన పాటించనప్పుడు ముందస్తుగా వినియోగదారుడు చెల్లించవలసిన ఛార్జీలు	20/-	200/-
మీటర్లు		
ఎసి సింగల్ ఫేజ్ ఎనర్జీ మీటర్	100/-	
ఎసి త్రీ ఫేజ్ ఎనర్జీ మీటర్	300/-	
ఎల్.టి ట్రైవెక్టర్ మీటర్	2000/-	
11 kV		3000/-
33 kV		3000/-
132 kV మరియు ఆ పైన		3000/-
ప్రతి ట్రాన్స్ఫార్మర్ ఆయిల్ నమూనాకు	రూ.150/- ప్రతి నమూనాకు	

11. పర్యవేక్షణ/తనిఖీ మరియు చెకింగ్ ఛార్జీలు

LT-I(A): గృహ వినియోగం	రూ.100/-
LT-I(B): గృహ వినియోగం	రూ.100/-
LT-V: వ్యవసాయం	రూ.100/-
అన్ని ఇతర LT కెటగిరీలకు	రూ.100/-
అన్ని HT కెటగిరీలకు	రూ.600/-

12. తక్కువ పవర్ ఫ్యాక్టర్ ఛార్జీలు

కెవిఎహెచ్ బిల్లింగ్ వర్తించే అన్ని వినియోగదారులకు పవర్ ఫ్యాక్టర్ సర్‌ఛార్జ్ విధించబడదు.

13. కెపాసిటర్ సర్-ఛార్జీలు

ఈ క్రింద తెలిపిన కనెక్టెడ్ లోడ్ కలిగిన కెడబ్ల్యుహెచ్ ఆధారిత బిల్లింగ్ ఎల్.టి వినియోగదారులకు (ఎల్.టి గృహ అవసరాలు మినహాయించి) కెపాసిటర్లు పని చేయనట్లుగా గుర్తించినచో అమలులో ఉన్న నిబంధనల ప్రకారం బిల్లు మొత్తం పై 25% చొప్పున కెపాసిటర్ సర్‌ఛార్జ్ విధించబడును.

క్యాటగిరి	ఒప్పందపు లోడ్
ఎల్.టి 2 మరియు ఎల్.టి 7 A	10 KW లోపు
ఎల్.టి 3 మరియు ఎల్.టి 6 B	13 HP లోపు

14. స్థిర ఛార్జీలు - సీజనల్ పరిశ్రమలు

ఎల్.టి III : ఒప్పందపు లోడ్ లో 30 % పైన రూ. 75/-KW/నెల.

HT : ఒప్పందపు లోడు లో 30 % లేదా నమోదిత డిమాండ్ రెండింటి లో ఏది ఎక్కువ అతే అది

15. ఎల్.టి మరియు హెచ్.టి వినియోగదారులకు తాత్కాలిక సరఫరా

వినియోగదారుని అభ్యర్థన మేరకు తాత్కాలిక విభాగం ధరలలో మొదటి 12 నెలల వరకు తాత్కాలిక సరఫరా ఇవ్వవచ్చు. 12 నెలల అనంతరం వినియోగదారునికి తాత్కాలిక విభాగం క్రింద కొనసాగించే అవకాశం కలదు.

16 . హరిత విద్యుత్ టారిఫ్: హరిత విద్యుత్ టారిఫ్ సంబంధిత కేటగిరి సాధారణ టారిఫ్ కంటే అదనంగా రూ. 0.66 /- యూనిట్ విద్యుత్ వినియోగంపై వినియోగదారు హరిత విద్యుత్ టారిఫ్ ఎంచుకున్న కాలానికి విధించబడుతుంది. HT మరియు LT కేటగిరీల క్రింద సాధారణ సరఫరాను పొందుతున్న HT మరియు LT వినియోగదారుడు హరిత విద్యుత్ టారిఫ్‌ను ఎంచుకోవచ్చు.

17. గ్రిడ్ మద్దతు ఛార్జీలు : గ్రిడ్ సపోర్ట్ ఛార్జీలను TGDISCOM లు ప్రతిపాదనలకు బదులుగా అంటే రూ.19.37/- kW/నెలకు కాక రూ.16.32/- kW/నెలకు కమిషన్ ఆమోదించింది.

18. స్టాండ్‌బై ఛార్జీలు

సంబంధిత ఓపెన్ యాక్సెస్ ఎనర్జీ వినియోగదారుల నుండి ఎటువంటి నోటీసు లేనప్పుడు సంబంధిత కేటగిరీ ఎనర్జీ ఛార్జీలపై 10 % అధికముగా వర్తింపజేసే విధంగా స్టాండ్ బై ఛార్జీలు వర్తిస్తాయి. గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ కన్స్యూమర్ (లు) డే ఆ హెడ్ మార్కెట్ ముగింపు సమయానికి కనీసం ఒక రోజు ముందుగా 11:00 గంటలకు ముందుగా నోటీసు ఇచ్చినట్లయితే, స్టాండ్ బై ఛార్జ్ వర్తించదు.

అనుబంధం – III

ఆర్థిక సంవత్సరం 2024-25 కు క్రాస్-సబ్సిడీ సర్-ఛార్జీ

వినియోగదారుని విభాగం	టిజిఎస్‌పిడిసిఎల్ (రూ.లు/కెడబ్ల్యుహెచ్)	టిజిఎన్‌పిడిసిఎల్ (రూ.లు/కెడబ్ల్యుహెచ్)
HT - 11 కెవి హెచ్.టి		
హెచ్.టి-I పరిశ్రమలు	1.95	1.95
హెచ్.టి-II ఇతరులు	2.20	2.27
హెచ్.టి-III ఎయిర్ పోర్టులు, బస్‌స్టేషన్స్ మరియు రైల్వే స్టేషన్స్	1.91	2.00
హెచ్.టి-IV (A) ఎత్తిపోతలు మరియు వ్యవసాయం	2.85	2.93
హెచ్.టి-IV (B) CPWS	0.72	0.13
హెచ్.టి-VI టౌన్‌షిప్స్ మరియు నివాస కాలనీలు	1.66	1.78
హెచ్.టి-VII తాత్కాలిక సరఫరా	2.84	3.22
హెచ్.టి-IX విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు	0.88	
HT - 33 కెవి హెచ్.టి		
హెచ్.టి-I పరిశ్రమలు	1.62	1.69
హెచ్.టి-II ఇతరులు	1.90	2.10
హెచ్.టి-IV(A) ఎత్తిపోతలు మరియు వ్యవసాయం	1.85	2.53
హెచ్.టి-IV(B) CPWS	0.67	0.70
హెచ్.టి-VI టౌన్‌షిప్స్ మరియు నివాస కాలనీలు	1.66	1.71
హెచ్.టి-VII తాత్కాలిక సరఫరా	2.78	2.99
HT - 132 కెవి హెచ్.టి మరియు ఆ పైన		
హెచ్.టి-I పరిశ్రమలు	1.44	1.60
హెచ్.టి-I (B) ఫెర్రో అల్లోయ్స్	1.76	
హెచ్.టి-II ఇతరులు	1.65	4.75
హెచ్.టి-III ఎయిర్ పోర్టులు, బస్‌స్టేషన్స్ మరియు రైల్వే స్టేషన్స్	1.54	
హెచ్.టి-IV (A) ఎత్తిపోతలు మరియు వ్యవసాయం	1.94	2.24
హెచ్.టి-IV (B) CPWS	0.88	0.90
హెచ్.టి-V రైల్వే మార్గాలు & హెచ్.ఎం.ఆర్	0.88	1.14
హెచ్.టి-VI టౌన్‌షిప్స్ మరియు నివాస కాలనీలు		1.68
హెచ్.టి-VII తాత్కాలిక సరఫరా		3.20

DIPR.RO.NO.6032-PP/CL/ADVT/1/2024-25, DT. 29-10-2024



విశాఖ నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును పరామర్శిస్తున్న సంజయ్

హామీలు అమలు చేసేంత వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతాం

- బావ, బావమరుదులు రేవంత్‌రెడ్డికి సహకరిస్తున్నారు
- బీఆర్‌ఎస్‌ను భూస్థాపితం చేస్తాం: బండి సంజయ్

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ఆరు హామీలను అమలు చేసేంత వరకు ఆ ప్రభుత్వాన్ని వెంటాడుతూనే ఉంటామని బీజేపీ నాయకులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. రోజ్‌గార్ మేళాలో పాల్గొనడానికి విశాఖపట్నం వచ్చిన ఆయన మంగళవారం ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణాలో బావ, బావమరుదులు ఇద్దరూ పోటీ పడి సీఎం రేవంత్‌రెడ్డికి సహకరిస్తున్నారని ఆరోపించారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్ ఘటనను నీరుగార్చిందని విమర్శించారు. బూతులు తిట్టేటోడు నోటీసులు ఇస్తే విలువ ఏముంది?... అని ప్రశ్నించారు. నోటీసులకు బదులు ఇచ్చానని, తాను కూడా తిరిగి నోటీసులు ఇస్తానన్నారు. తెలంగాణాలో బీఆర్‌ఎస్‌ను నామరూపాల్లేకుండా భూస్థాపితం చేస్తామన్నారు.

కేటీఆర్ పేరు ఎక్కడా ప్రస్తావించలేదు

- లీగల్ నోటీసుకు జవాబిచ్చిన కేంద్ర మంత్రి సంజయ్

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తాను ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరు ఎక్కడా ప్రస్తావించలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కేటీఆర్ చేసిన ఆరోపణలు అవాస్తవమని, నిరాధారమైనవని అన్నారు. ఈ నెల 19న నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్.. తన పరువుకు భంగం కలిగించేలా డ్రగ్స్ వ్యవహారంలో తనపై నిరాధార ఆరోపణలు చేశారంటూ కేటీఆర్, ఆయనకు లీగల్ నోటీసులు పంపించిన సంగతి తెలిసిందే. దీనికి సంజయ్ సమాధానమిచ్చారు. తనకిచ్చిన లీగల్ నోటీసును వారం రోజుల్లో ఉప సంహరించుకోవాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని కేటీఆర్‌ను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా, ఎలాంటి ఆధారాలు లేకుండా కేటీఆర్ తనకు నోటీసులు ఇచ్చారని సంజయ్ పేర్కొన్నారు. 'రాజకీయ విమర్శలకు లీగల్ నోటీసులు ఇవ్వడం సరికాదు. అయినా.. ఈ నెల 19న నేను నిర్వహించిన మీడియా సమావేశంలో ఎక్కడా కేటీఆర్ పేరు ప్రస్తావించలేదు. మీడియాలో వచ్చిన కథనాల గురించి నాకు తెలియదు. మిమ్మల్ని కించపరిచే ఉద్దేశం నాకు ఎంత మాత్రం కూడా లేదు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన వైఫల్యాలనే నేను ప్రస్తావించాను' అని సంజయ్ అన్నారు. లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా, ఎంపీగా ఎక్కడా అధికార దుర్వినియోగానికి పాల్పడలేదని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో తన పరిధిలోనే మాట్లాడానని, తన మాటల్లో తప్పు లేదని స్పష్టం చేశారు.

ఆర్టీసీలో యూనియన్‌లను అనుమతించాలి

- ఆర్టీసీ స్టాఫ్‌అండ్‌వర్కర్స్ యూనియన్ వినతి

హైదరాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో యూనియన్లను అనుమతించి, విలీన తేదీ అపాయింటెడ్ తేదీగా ప్రకటించేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని టీజీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధి బృందం మంగళవారం ఎమ్మెల్సీ కోదండరామ్, టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధు యాష్కీలకు విజ్ఞప్తి చేసింది. ఆర్టీసీ విలీనానికి అసెంబ్లీలో బిల్ పాస్ కావడంతోపాటు గవర్నర్ ఆమోదం పొంది, 2023 సెప్టెంబరు 15న నోటిఫికేషన్ సైతం విడుదలైనా ఇప్పటి వరకు అపాయింటెడ్ తేదీ, విధివిధానాల ఖరారు కోసం వేసిన కమిటీ పని ప్రారంభించలేదని తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శులు డి.గోపాల్, సాయిరెడ్డి, కెటి.రెడ్డి, వెంకటయ్యలతో కూడిన ప్రతినిధి బృందం మంగళవారం కోదండరెడ్డి, మధుయాష్కీలకు సమర్పించిన వినతి పత్రంలో ఈమేరకు పేర్కొంది.

ట్రైకార్ నిధులు ఇవ్వండి: గిరిజన సమాఖ్య

రాష్ట్రంలో గిరిజన కార్పొరేషన్ ద్వారా లబ్దిదారులకు అందాల్సిన రూ.265 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ డిమాండ్ చేశారు. 32,122 మంది లబ్ధిదారులకు సంబంధించిన ట్రైకార్ నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గత నాలుగేళ్లుగా బ్యాంకు రుణాలు, రాయితీలకు గిరిజనులు దూరమయ్యారని పేర్కొన్నారు. వెంటనే కార్యాచరణను ప్రకటించాలని కోరారు.

భూదాన్ భూములపై విచారణ వేగవంతం

- 40ఎకరాల అన్యాక్రాంతంపై అధికారుల ఫోకస్

కందుకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని తిమ్మాపురం రెవెన్యూ పరిధిలోని భూదాన్ భూముల బదలాయింపుపై పోలీసులు విచారణ వేగిరం చేశారు. హైదరాబాద్ శివార్లలోని కందుకూరు మండలం తిమ్మాపురంలో రూ.200 కోట్ల విలువైన 40 ఎకరాల భూదాన్ భూముల అన్యాక్రాంతంపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. తిమ్మాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 6, 129, 130, 147, 167, 197, 444, 453, 454, 455, 573, 574, 575 లోని భూదాన్ భూములు ధరణిలో క్రయ విక్రయాలు ఎలా జరిగాయి? ఇందులో ఎవరెవరి పాత్ర ఉందన్న కోణంలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారిస్తున్నారు. ధరణి పోర్టల్ రాక ముందు భూదాన్ భూములను మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్‌కు ఎలా అనుమతులు ఇచ్చారు? ముఖ్యంగా దేవాలయ భూములు నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ ఆ భూములు బదలాయింపులు (విక్రయాలు) ఎందుకు, ఎలా జరిగాయన్న విషయంపై వారు ఆరా తీస్తున్నారు. భూదాన్ భూముల బదలాయింపుపై సమగ్రంగా విచారణ చేపట్టి రెండు రోజుల్లో నిందితులపై కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

వివాదంలోని స్థలం మూడో పార్టీకి అప్పగింత

- రంగారెడ్డి కలెక్టర్‌గా అమోయ్ కుమార్ ఉత్తర్వులు
- కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ స్థలం విషయమై నవాబు వారసులు, ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతుండగానే దాన్ని మూడో పార్టీకి కట్టబెడుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా అమోయ్‌కుమార్ తీసుకున్న నిర్ణయాన్ని మంగళవారం హైకోర్టు తిరస్కరించింది. అత్యంత విలువైన 52 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి డీ-నోటిఫై చేసి ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తూ జారీచేసిన ప్రొసీడింగ్స్‌ను కొట్టివేసింది. గుట్టలబేగంపేట్ పరిధిలోని సర్వే నెంబరు 63 (మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రం వెనుక)లో ఉన్న 52 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి అమోయ్‌కుమార్ డీ-నోటిఫైచేశారు. సర్వే నంబర్‌లో మొత్తం 73.39 ఎకరాలు ఉండగా ఆ మొత్తం భూమిపై స్టేటస్ కో ఉత్తర్వులు అమలులో ఉన్నాయి. అయినప్పటికీ దాదాపు మూడొంతుల భూమిని డీ-నోటిఫై చేయడమే కాకుండా వాటి రిజిస్ట్రేషన్లకు అనుమతించాలని కోరుతూ రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులకు లేఖరాశారు. ఈ మేరకు 2022 ఆగస్టు 8న ప్రొసీడింగ్స్ జారీచేశారు. ఈ ఉత్తర్వులు చెల్లవని, ఆ భూమి తమకు వారసత్వంగా వచ్చిందని పేర్కొంటూ రౌనాక్‌యార్ ఖాన్, బుక్యార్‌ఖాన్, వారి కుటుంబ సభ్యులు హైకోర్టులో పలు పిటిషన్‌లు దాఖలు చేశారు. మరోవైపు ఇవి ప్రభుత్వ భూములని ప్రభుత్వ న్యాయవాదులు తెలిపారు. తాజాగా ఈ పిటిషన్‌లపై విచారణ జరిపిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం యథాతథ ఉత్తర్వులు అమల్లో ఉండగా భూములను డీనోటిఫై చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదంటూ వాటిని కొట్టివేసింది.

ఫార్ములా-ఈ బాంబు!



(మొదటి పేజీ తరువాయి)

అధికారులు ఫిర్యాదు చేయడం ఇప్పుడు సంచలనంగా మారింది. సచివాలయం ఎదుట.. ట్యాంక్‌బండ్ చుట్టూ.. ఫార్ములా-ఈ రేసింగ్ కోసం 3 కిలోమీటర్ల మేర ట్రాక్ నిర్మించారు. 2023లో తొలిసారి ఫార్ములా-ఈ రేస్‌ను నిర్వహించారు. ఈ రేసింగ్‌కు దేశవిదేశాల నుంచి పెద్దసంఖ్యలో వీక్షకులు హాజరయ్యారు. 2024 ఫిబ్రవరి 10న కూడా ఫార్ములా-ఈ రేసింగ్‌కు విదేశీ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. విదేశీ సంస్థతో ఎంవోయూ చేసుకుని, నిధులు చెల్లించాలంటే.. భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) అనుమతి అవసరమని మునిసిపల్ అధికారులు చెబుతున్నారు. అయితే.. ఫార్ములా-ఈ రేసింగ్ నిర్వహణ విషయంలో.. ఆర్థిక శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి (ఎంఏయూడీ) శాఖ నుంచి రూ.55 కోట్ల మేర విదేశీ సంస్థలకు నిధులను చెల్లించారు.

ఎలా గుర్తించారు?

గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ.. డిసెంబరులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వం మారిన వెంటనే.. తాము ఫార్ములా-ఈ ఆపరేషన్‌ను నిర్వహించడం లేదంటూ విదేశీ సంస్థలు ప్రకటించాయి. ఒప్పందంలో ప్రస్తావించిన అంశాలను పాటించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాయి. దీంతో.. ఈ అంశంపై దృష్టి సారించిన ప్రభుత్వం.. అంతర్గత దర్యాప్తు చేయించింది. ఈ క్రమంలో ఫార్ములా-ఈ రేసింగ్ నిర్వహణలో అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఆర్థిక శాఖ, ఇతర విభాగాల నుంచి ముందస్తు అనుమతుల్లేకుండానే.. విదేశీ సంస్థలకు రూ.55 కోట్లను చెల్లించినట్లు వెల్లడైంది. అంత అత్యవసరంగా విదేశీ సంస్థలకు రూ.55 కోట్లను చెల్లించాల్సిన అవసరమేమొచ్చిందని అప్పటి అధికారుల నుంచి ప్రభుత్వం వివరణ తీసుకుంది. వారు ఇచ్చిన సమాధానాలు సంతృప్తికరంగా లేకపోవడంతో.. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. సమగ్ర దర్యాప్తు జరపాలని ఏసీబీని కోరారు. ఏసీబీ కూడా ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసేందుకు అనుమతినివ్వాలంటూ ప్రభుత్వానికి లేఖ రాసింది.

ఏప్రిల్‌లోనే ప్రవేశ పరీక్షలు!

నెల ముందుగానే నిర్వహించే యోచన.. అడ్మిషన్లలో జాప్యాన్ని నివారించేందుకే

- ప్రవేశాల సెట్లకు త్వరలో కొత్త కమిటీలు



హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్వహించే వివిధ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ముఖ్యంగా ప్రవేశ పరీక్షలను గతంలో కన్నా నెల రోజుల ముందుగానే నిర్వహించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు భావిస్తున్నారు. ప్రవేశ పరీక్షలను ఆలస్యంగా నిర్వహించడం వల్ల అడ్మిషన్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందని అంచనా వేశారు. అడ్మిషన్లను సకాలంలో పూర్తి చేయాలంటే... ప్రవేశ పరీక్షలను కనీసం నెల రోజులు ముందుగా నిర్వహించాలనే నిర్ణయానికొచ్చారు. దాదాపు ఏప్రిల్‌లోనే ఈ పరీక్షలను పూర్తి చేయాలనే యోచనలో ఉన్నారు. రాష్ట్రంలో కరోనా తర్వాత ప్రవేశ పరీక్షల నిర్వహణ, వివిధ కోర్సులకు నిర్వహించే అడ్మిషన్ల ప్రక్రియ కొంత ఆలస్యంగా జరుగుతున్న విషయం తెలిసిందే. దీని వల్ల విద్యార్థుల్లో కొంత అయోమయం నెలకొంది. ముఖ్యంగా జాతీయ స్థాయిలో వివిధ కోర్సుల్లో చేరే విద్యార్థులకు కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. దీనిని నివారించేలా ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న విధానం ప్రకారం.. ఎంసెట్, ఐసెట్, ఈసెట్ వంటి అనేక ప్రవేశ పరీక్షలు మే నుంచి జూన్ నెలల్లో జరుగుతున్నాయి. వాటి ఫలితాలను జూలైలో వెల్లడిస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో అడ్మిషన్లు చేపడుతున్నారు. ఈ ఏడాది కొన్ని కోర్సులకు సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను మార్చాలని భావిస్తున్నారు. వీలైతే ఏప్రిల్‌లోనే ముఖ్యమైన ప్రవేశ పరీక్షలను పూర్తి చేయడానికి వీలుగా షెడ్యూల్‌ను రూపొందించాలనే యోచనలో ఉన్నారు. ఈ అంశంపై ఉన్నత విద్యామండలి అధికారులు దృష్టి కేంద్రీకరించారు.

త్వరలోనే సెట్లకు కమిటీలు..

రాబోయే విద్యా సంవత్సరం ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఆయా సెట్ల కమిటీలను కూడా త్వరలోనే ప్రకటించాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పుడున్న సెట్ల కన్వీనర్లలో కొందరిని కొనసాగిస్తూ, మిగిలిన సెట్లకు కొత్త వారిని ఎంపిక చేయాలని యోచిస్తున్నారు. ఈ సెట్ల నిర్వహణలో కొందరు కన్వీనర్లపై ఆరోపణలు వస్తుండడం, ముఖ్యంగా నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు వస్తుండడాన్ని పరిగణనలోకి తీసుకుని కొత్త సెట్లను ప్రకటించాలని నిర్ణయించారు. దీనిపై త్వరలోనే ఆయా యూనివర్సిటీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా.. బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి ఒకటి రెండు రోజుల్లో కొత్త వైస్ చాన్సలర్‌ను ప్రకటించే అవకాశం ఉంది. వీసీ ఎంపికలో భాగంగా తాజాగా సెర్చ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ పోస్టు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మూడు పేర్లను ఎంపిక చేసినట్టు సమాచారం. ఈ జాబితాలో అదే యూనివర్సిటీలో డీన్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్‌తోపాటు ఉస్మానియా యూనివర్సిటీలో పనిచేసి రిటైరయిన ప్రొఫెసర్ పేరు కూడా ఉన్నట్లు తెలిసింది. సెర్చ్ కమిటీ ఎంపిక చేసిన మూడు పేర్లను ప్రభుత్వ పరిశీలనకు పంపించారు. ఈ ప్రతిపాదనలను గవర్నర్‌కు పంపించనున్నారు. గవర్నర్ నుంచి ఆమోదం వచ్చిన వెంటనే కొత్త వీసీని ప్రకటించనున్నారు.

ఎంఈవోలది కీలక పాత్ర..

రాష్ట్రంలో విద్యా నాణ్యత పెంపులో మండల విద్యాధికారుల (ఎంఈవోల)ది కీలక పాత్ర అని విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. రాష్ట్రంలోని ఎంఈవోలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఎంఈవో ప్రతిరోజూ కనీసం రెండు పాఠశాలలను సందర్శించాలని సూచించారు. చదువుతోపాటు విద్యార్థుల్లో సంపూర్ణ వ్యక్తిత్వం పెంపొందేలా వినూత్న కార్యక్రమాలు నిర్వహించాలని, క్రమశిక్షణ, సున్నితత్వాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాల స్థాయిలో అలవడే క్రమశిక్షణ జీవితాంతం కొనసాగుతుందని చెప్పారు.

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు 7,037 కోట్ల అదనపు రుణం

- ప్రభుత్వానికి జెన్‌కో ప్రతిపాదన
- మంత్రివర్గం ఆమోదం.. త్వరలో ఉత్తర్వులు

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం(వైటీపీఎస్) నిర్మాణ అంచనా వ్యయం భారీగా పెరగడంతో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) నుంచి రూ.7,037 కోట్ల అదనపు రుణం తీసుకునేందుకు జెన్‌కోకు మార్గం సుగమమైంది. అదనపు రుణం కోసం జెన్‌కో చేసిన ప్రతిపాదనను శనివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ఇందుకు సంబంధించిన జీవో త్వరలోనే వెలువడనుంది. ఆ జీవో ఆధారంగా పీఎఫ్‌సీ నుంచి జెన్‌కో రుణం పొందనుంది. రూ.25,099 కోట్ల అంచనా వ్యయంతో నల్లగొండ జిల్లా దామరచర్లలో 2015-16లో తెలంగాణ జెన్‌కో 4,000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న వైటీపీఎస్ నిర్మాణాన్ని ప్రారంభించింది. అయితే, ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం క్రమంగా పెరుగుతోంది. తొలుత రూ.29,965 కోట్లకు, అనంతరం రూ.34,543 కోట్లకు ప్రస్తుతం రూ.36,131 కోట్లకు నిర్మాణ అంచనా వ్యయాన్ని సవరిస్తూ ప్రభుత్వానికి జెన్‌కో ప్రతిపాదనలు పంపించింది. విద్యుత్ కేంద్రం నుంచి వెలువడే కర్బన ఉద్గారాలు, కాలుష్యాన్ని తగ్గించడానికి ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్(ఎఫ్‌జీడీ) అనే సాంకేతికతతో అదనపు పనులు చేపట్టాలని కేంద్రం మార్గదర్శకాలు జారీ చేయడంతో వైటీపీఎస్ నిర్మాణ వ్యయాన్ని తొలిసారి సవరించారు. అనంతరం నిర్మాణంలో జరుగుతున్న జాప్యం, పెట్టుబడి రుణాలపై వడ్డీల భారం పెరుగుతుండడంతో మరో రెండుసార్లు అంచనా వ్యయాన్ని సవరించారు.

మండనున్న విద్యుత్ ధరలు

యాదాద్రి విద్యుత్ కేంద్రంలో ఒక్కోటి 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు యూనిట్లను నిర్మిస్తున్నారు. ప్రస్తుతమున్న సమాచారం మేరకు నవంబరులో రెండు, డిసెంబరులో ఒక యూనిట్ కలిపి 2,400 మెగా వాట్ల ప్లాంట్ అందుబాటులోకి రానుంది. అయితే, నిర్మాణ వ్యయం భారీగా పెరగడంతో ఈ ప్లాంట్ల నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్ ధరలు భారం కానున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వివిధ ప్లాంట్ల నుంచి సగటును రూ.4.92కు యూనిట్ విద్యుత్ కొనుగోలు చేస్తున్నారు. యాదాద్రి ప్లాంట్‌లో ఉత్పత్తయ్యే విద్యుత్ ధర యూనిట్‌కు రూ.8.50 వరకు ఉండే అవకాశం ఉంది.

ఓట్ల కోసం ఒట్లు పెట్టారు

కొత్త పథకాలు ఇవ్వరు.. పాతవి అమలు చేయరు

రైతు భరోసా, పింఛన్లు ఏమయ్యాయి?: హరీశ్



మహబూబ్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులకు డిసెంబరు 9న రుణమాఫీ చేయకపోవడంతో.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు పడవని గ్రహించిన సీఎం రేవంత్ రెడ్డి.. దేవుళ్లపై ఒట్లు పెట్టారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో 42 లక్షల మందికి రుణమాఫీ అర్హత ఉంటే.. 20 లక్షల మందికి మాత్రమే మాఫీ చేశారని తెలిపారు. పెళ్లి కాలేదని, చనిపోయిన భర్తకు ఆధార్‌లేదని, రేషన్ కార్డు లేదని కొర్రీలు పెట్టారని విమర్శించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రైతాంగ నిరసన సభలో హరీశ్‌రావు మాట్లాడారు. మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలన్న రేవంత్ సీఎం అయ్యాక ఒక పంటకు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. అన్ని రకాల పంటలకు బోనస్ ఇస్తామన్నారని, ఇప్పుడు సన్నాలు అని చెప్పి, వాటిని కూడా కొనుగోలు చేయడంలేదని విమర్శించారు. రైతులు తక్కువ ధరకు పత్తిని అమ్ముకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలు ఇప్పుడు ఆగిపోయాయని, కొత్త పథకాలు రాలేదని అన్నారు. ఏపీలో ఇప్పటికే కొత్త పింఛన్లు ఇస్తున్నారని, ఇక్కడ మాత్రం పింఛన్లు పెంచలేదని తెలిపారు. కాగా, వ్యక్తిగత భద్రతా విధుల నుంచి స్పెషల్ పోలీసులను తప్పిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం 17 వేల మంది స్పెషల్ పోలీసులను అవమానించడమేనని హరీశ్‌రావు ఎక్స్ వేదికగా విమర్శించారు. స్పెషల్ పోలీసులను సస్పెండ్, డిస్మిస్ చేయడం తగదని.. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు క్రమంగా తగ్గుతున్నాయని, దీంతో ఆర్థికాభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందని హరీశ్‌రావు అన్నారు. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నివేదికను ఎక్స్‌వేదికగా పోస్ట్ చేస్తూ.. కాంగ్రెస్ పాలనలో కొత్త కంపెనీల రిజిస్ట్రేషన్లు గణనీయంగా తగ్గాయని తెలిపారు.

కాంగ్రెస్ దాడులను ఎదుర్కొందాం

- బీఆర్‌ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): "రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలను కాంగ్రెస్ తమపై చేస్తున్న రాజకీయ వేధింపుల ప్రహసనంగా భావించాల్సి వస్తోంది. ఇకముందు మనపై మరిన్ని వేధింపులు ఉంటాయి. కాంగ్రెస్ చేసే వ్యక్తిగత దాడులు, కుట్రలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందాం" అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం పార్టీ శ్రేణులకు ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి అవినీతి, వైఫల్యాలను ఎత్తిచూపినందుకే బీఆర్‌ఎస్‌పై ఆయన అసహనంతో ఉన్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సర్కారుకు అక్రమ కేసులపై ఉన్నమోజు.. ఆరోగ్యశాఖపై లేకుండా పోయిందని ఆరోపించారు. రోగుల కష్టాలను విస్మరిస్తున్నారని, పెద్దాస్పత్రుల ఆలనాపాలనా చూడటం లేదని, మందుల కొరతను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజలపై విద్యుత్ భారం మోపడాన్ని ప్రధాన ప్రతిపక్షంగా వ్యతిరేకించామని, బహిరంగ విచారణలో పాల్గొని దీనిపై ఈఆర్సీని ఒప్పించలిగామని కేటీఆర్ చెప్పారు. విద్యుత్ చార్జీలపెంపు ప్రతిపాదనను ఈఆర్సీ తిరస్కరించినందుకుగాను బుధవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరపాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

టీజీఎస్పీ పోలీసుల వైఖరిపై నిఘా

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెట్టేవారిపై కఠిన చర్యలు

- బెటాలియన్లలో దర్బార్‌లు నిర్వహిస్తూ.. సిబ్బంది సమస్యలు వింటున్న అధికారులు
- ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం
- సెలవు ఇవ్వడంలేదంటూ ఒంటిపై పెట్రోల్

హైదరాబాద్/ఇబ్రహీంపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ నిరసనలు, ఆందోళనలకు దిగిన తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బంది సోషల్ మీడియా ఖాతాలపై నిఘా విభాగం దృష్టి పెట్టింది. టీజీఎస్పీ సిబ్బంది ప్రత్యేకంగా వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని సమాచారం మార్చుకోవడంతోపాటు, అధికారుల తీరుపై అభ్యంతరకర పోస్టింగ్‌లు పెడుతున్నట్లు గుర్తించారు. కొందరు సోషల్ మీడియా వేదికగా ఇతరులను రెచ్చగొడుతూ నిరసనలు తీవ్రతరం చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఈ మేరకు ఆ తరహా పోస్టింగ్‌లు పెట్టినవారు, తమకు వచ్చిన పోస్టింగ్‌లను ఇతరులకు షేర్ చేసిన వారి వివరాలను అధికారులు ఇప్పటికే సేకరించారు. అలాంటి వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. కాగా, నిరసనలకు దిగిన వారిపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఇప్పటికే పలువురిని సస్పెండ్ చేయడంతోపాటు కొందరిని సర్వీసు నుంచి తొలగించిన ఉన్నతాధికారులు.. మరికొందరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మరోవైపు బెటాలియన్లలో దర్బార్‌లు నిర్వహిస్తూ సిబ్బంది సమస్యలను అధికారులు వింటున్నారు. యూనిఫాం సర్వీస్‌లో ఉండి నిరసనలు చేయవద్దని చెబుతూ.. నిబంధనలు అతిక్రమిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను వివరిస్తున్నారు. అధికారులు చేపట్టిన ప్రయత్నాలు ఫలించడంతో ఇప్పటికే కొందరు నిరసనలు వీడి రోజువారీ విధుల్లో పాల్గొంటున్నారు. మరికొందరు ఎలాంటి నిర్ణయం తీసుకోవాలా అనే ఆలోచనలో పడ్డారు. కాగా, టీజీఎస్పీ పోలీసులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో కోరారు. తరచూ బదిలీల వల్ల తాము, తమ పిల్లలు, కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పడుతున్నామంటూ బెటాలియన్ పోలీసులు వ్యక్తం చేస్తున్న ఆవేదనను అర్థం చేసుకోవాలన్నారు. న్యాయం కోరిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించడం, అరెస్టు చేయడం అన్యాయమన్నారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని టీజీఎస్పీ 3వ బెటాలియన్ కానిస్టేబుల్ ఒకరు మంగళవారం సాయంత్రం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. 2021 బ్యాచ్‌కి చెందిన టీజీఎస్పీ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు మంగళవారం ఉదయం సెలవు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే బందోబస్తు ఉన్నందున సెలవు ఇవ్వడం కదరదని ఉన్నతాధికారులు చెప్పారు. దీంతో సాయంత్రం రోల్‌కాల్‌లో ఉండగానే నాగేశ్వర్‌రావు తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకున్నారు. వెంటనే సహచర కానిస్టేబుళ్లు ఆయనను పక్కకు తప్పించారు. కాగా, నాగేశ్వర్‌రావుకు ఐదు రోజులు సెలవు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు.

వారిని చేర్చుకోండి: కూనంనేని

ప్రత్యేక పోలీసు కానిస్టేబుళ్లకు మట్టి పనులు చెప్పడం, అనధికారికంగా ఆర్డర్లీ సేవలకు వినియోగించడం వంటి విధానాలకు స్వస్తి పలకాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీజీఎస్పీ పోలీసులు చేస్తున్న ఆందోళనలను మానవతా దృక్పథంతో అర్థం చేసుకొని డిస్మిస్ చేసిన 10 మందిని, సస్పెండ్ చేసిన 37 మందిని విధుల్లోకి తీసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

పోలీసు లీవ్ సరెండర్ నిధుల విడుదల

తెలంగాణ పోలీసు సిబ్బంది సెలవులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ. 182.48 కోట్ల సరెండర్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలన అనంతరం నిధుల విడుదలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

'గ్రేటర్'లో అసెంబ్లీ సీట్లు డబుల్!

24 నుంచి 50కు చేరే చాన్స్.. గ్రామీణ ప్రాంతాల్లో పెరిగే సీట్లు తక్కువే

నియోజకవర్గాల పునర్విభజనకు అడుగులు

మొత్తం సీట్లలో మహిళలకు మూడో వంతు!

2025-26లో దేశవ్యాప్తంగా జనగణన

హైదరాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జనగణనను 2025 మొదట్లో ప్రారంభించి.. 2026లో పూర్తిచేసి జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు రాష్ట్రంలో అడుగులు పడుతున్నాయి. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 26(1) ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచాలనే అంశం పొందుపరిచారు. అది ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు దేశవ్యాప్తంగా మొదలయ్యే ప్రక్రియలో ముందుకు సాగనున్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 153కు పెరగనుంది. అంటే కొత్తగా 34 అసెంబ్లీ స్థానాలు ఏర్పడనున్నాయి. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 అసెంబ్లీ స్థానాలు ఉండగా మరో 26 పెరిగి 50కు చేరే అవకాశాలు ఉన్నాయి. హైదరాబాద్ నగర జనాభా అసాధారణ స్థాయిలో పెరుగుతోంది. నియోజకవర్గాల పునర్విభజనను జనాభా ప్రాతిపదికన చేపడుతుండటంతో రాష్ట్రంలో పెరిగే 34 సీట్లలో 26 సీట్లు గ్రేటర్‌లోనే పెరగనున్నాయి. ఇక గ్రామీణ ప్రాంతాలకు వస్తే సగటున ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున 8 సీట్లు పెరిగే అవకాశాలున్నాయి.

రాష్ట్రంలో మహిళలకు 50 సీట్లు?

అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనతో పాటు మహిళా రిజర్వేషన్ల చట్టం కూడా అమలుచేసి 33 శాతం సీట్లను మహిళలకు కేటాయించనున్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు గత ఏడాది పార్లమెంటు ఆమోదముద్ర వేయటంతో చట్టంగా మారింది. ఈ బిల్లు ఆమోదించిన తర్వాత జరిగే జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని చట్టం చెబుతోంది. అసెంబ్లీ సీట్లు 153కు పెరిగితే ఇందులో 50 సీట్ల దాకా మహిళల కోటాకింద వచ్చే అవకాశాలున్నాయి.

లోక్‌సభ సీట్ల పెంపుపై వివాదం

పార్లమెంటు స్థానాల సంఖ్యను పెంచటం మాత్రం 2026 తర్వాత జరిగే జనాభా లెక్కల ప్రాతిపదికన చేపట్టాల్సి ఉంది. కానీ ఇప్పుడు జనగణన 2025-26లోనే పూర్తవుతుంది. దీంతో ఈ జనగణననే పరిగణనలోకి తీసుకొని పార్లమెంటు స్థానాలు పెంచేలా మరో రాజ్యాంగ సవరణ అవసరం కావొచ్చని నియోజకవర్గాల పునర్విభజన నిపుణుడు ఇనగంటి రవికుమార్ తెలిపారు. ప్రస్తుత లోక్‌సభలో 545 సీట్లు ఉండగా పునర్విభజన తర్వాత 888కి పెంచుతామని ఎన్‌డీఏ ప్రభుత్వం లోపాయికారీగా చెబుతోంది. దీన్ని 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి పూర్తి చేయాలని భావిస్తోంది. మరోవైపు లోక్‌సభ స్థానాల పునర్విభజన ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఎందుకంటే సీట్ల పెరుగుదల జనాభా ప్రాతిపదికన జరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాల్లో కుటుంబ నియంత్రణ పాటించటంతో జనాభా తక్కువగా ఉంది. ఈ విషయంలో ఉత్తరాది రాష్ట్రాలు ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో అక్కడ జనాభా పెరిగింది. ఇప్పుడు లోక్‌సభ సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ, ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు వస్తాయి. దీంతో దక్షిణాది నుంచి పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

టెస్కో ద్వారానే వస్త్రాలు కొనాలి

» అన్ని ప్రభుత్వ శాఖలకు ఇది తప్పనిసరి: తుమ్మల

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు అన్నీ కూడా టెస్కో ద్వారానే వస్త్రాలు కొనుగోలు చేయాలని చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. నవంబరు 15 లోగా వస్త్రాల కోసం ఇండెంట్ టెస్కోకు సమర్పించాలని వివిధ సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం టెస్కోకు వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో జీవో నెం.1 తీసుకొచ్చిందన్నారు. దీని ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమయ్యే వస్త్రాన్ని తప్పనిసరిగా టెస్కో ద్వారానే కొనుగోలు చేయాలని చెప్పారు. జీవోకు విరుద్ధంగా ఎవరైనా ప్రైవేట్ సంస్థల నుంచి వస్త్రాలు కొంటే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. కొన్ని సంక్షేమ శాఖలు ప్రతి సంవత్సరం యూనిఫాం రంగులు మార్చడం వల్ల సరఫరాలో ఆలస్యం జరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, కాబట్టి కనీసం ఐదేళ్లు డిజైన్ మార్చకుండా ఉంచాలని సూచించారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

» నవంబరు 1న శ్రీకారం: మంత్రి పొంగులేటి



తిరుమలాయపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నవంబరు 1న ఈ పథకానికి శ్రీకారం చుడతామని చెప్పారు. మంగళవారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలు, గోల్‌తండాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొదటి విడతగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విడతలవారీగా అర్హులైన పేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికి సంక్షేమఫలాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో మట్టి రోడ్డు లేకుండా చేస్తాం

» రూ.12 వేల కోట్లతో 17 వేల కి.మీ. రోడ్ల నిర్మాణం

» రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నల్లగొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో ఎక్కడా మట్టి రోడ్లు లేకుండా చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. గ్రామాల్లో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల ద్వారా త్వరలో రూ.12 వేల కోట్ల వ్యయంతో 17 వేల కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించనున్నట్లు తెలిపారు. మంగళవారం మంత్రి నల్లగొండ జిల్లాలోని పగిడిమర్రి, ముషంపల్లిలో రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారుల విస్తరణలో భాగంగా రూ.30 వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని వెల్లడించారు. బీఆర్ఎస్ నేతలు పిచ్చిమాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. దీపావళి తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభిస్తామని, ప్రతి నియోజకవర్గంలో 3,500 మంది నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం ప్రాజెక్టు పూర్తిచేసేందుకు రూ.4,600 కోట్ల అంచనా వ్యయం నిర్ధారించామని, సొరంగ పనుల యంత్రాల్లో మరమ్మతులకు గురైన బేరింగ్‌ని అమెరికా నుంచి తెప్పిస్తున్నామని చెప్పారు. రెండేళ్లలో సొరంగ మార్గం పూర్తి చేసి రైతాంగానికి నీరందిస్తామని హామీ ఇచ్చారు.

కాళేశ్వరం కమిషన్ గడువు 2నెలలు పొడిగింపు

» ప్రతిపాదనలు రావడంతో గడువు పెంచిన ప్రభుత్వం

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కమిషన్ విచారణ గడువును రెండు నెలలు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విచారణ గడువు ఈ నెల 31తో ముగియనుండగా, మరో రెండు నెలల పాటు విచారణను పొడిగించే ప్రతిపాదనల ఫైలు ప్రభుత్వానికి చేరింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ కోసం ప్రభుత్వం జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. విచారణలో భాగంగా కీలకమైన అధికారులను ఇప్పటికే కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. ఈ దఫా విచారణ అనంతరం మంగళవారం జస్టిస్ ఘోష్ కోల్‌కతాకు తిరిగి వెళ్లిపోయారు. దీపావళి పండుగ అనంతరం నవంబరులో తదుపరి విచారణ జరగనుంది. ఈ దఫా ఐఏఎస్‌లతో పాటు మాజీ ఐఏఎస్‌లు, నిర్మాణ సంస్థలు, సబ్ కాంట్రాక్టర్లను కమిషన్ విచారించనుంది. ఆ తర్వాత కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) అధికారులను కూడా విచారించనుంది. ఈ ప్రక్రియ అనంతరం తుది దశలో కీలక నేతలకు కమిషన్ కబురు పంపనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో విధాన నిర్ణయాలు తీసుకున్న గత ప్రభుత్వంలోని ఇద్దరు కీలక నేతలపై కమిషన్ గురిపెట్టింది. వీరిని నవంబరు నెలాఖరున లేదా డిసెంబరులో విచారణకు పిలిపించే అవకాశాలున్నాయి. కమిషన్ విచారణతో పాటే రిపోర్టును సిద్ధం చేస్తోంది. విచారణను ఏ మాత్రం జాప్యం చేయకుండా నివేదిక అందించాలనే ఉత్సుకతతో కమిషన్ ఉంది.

ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ షాపుల్లో తనిఖీలు

» 15 షాపులకు నిబంధనల ఉల్లంఘన నోటీసులు

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల ప్రాంగణాల్లో ఉన్న ప్రైవేటు మెడికల్ షాపుల్లో రాష్ట్ర ఔషధ నియంత్రణ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, పేట్లబుర్జు, వరంగల్ ఎంజీఎం, కరీంనగర్ జీజీహెచ్‌లోని 15 ప్రైవేటు మెడికల్ షాపుల్లో ఈ తనిఖీలు చేపట్టారు. వీటిలో అనేక నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించి, మొత్తం 15 షాపులకు అధికారులు నోటీసులిచ్చారు. ముఖ్యంగా వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండానే ఔషధాలను విక్రయించడం, రిజిస్టర్డ్ ఫార్మసిస్టు లేకపోవడం, నిర్దేశిత నిబంధనల మేరకు ఔషధాలను నిల్వ చేయకపోవడం లాంటి ఉల్లంఘనలను గుర్తించామని రాష్ట్ర ఔషధ నియంత్రణ డీజీ కమలాసన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నోటీసులకు సమాధానాలు వచ్చిన తర్వాత ఆ షాపులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కబ్జాలంటూ మాపై తప్పుడు ఆరోపణలు: కృష్ణారావు

హైదర్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యేలు కబ్జాలు చేశారంటూ కాంగ్రెస్ నాయకులు పదేపదే నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు భరించామని, ఇకపై ఊరుకునే ప్రసక్తే లేదని చెప్పారు. పరువు నష్టం దావా వేసి, వారిని కోర్టుకీడుస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క చెరువులపై ఇచ్చిన సమాచారం పూర్తిగా తప్పులతడకగా ఉందని ఆరోపించారు. మంగళవారం ఆయన చెరువుల విస్తీర్ణం, ఆక్రమణలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం ద్వారా చెరువుల విస్తీర్ణంపై సేకరించిన వివరాలను వెల్లడించారు. భట్టి హైడ్రా పేరుతో హైదరాబాద్ ప్రజలను భయపెట్టారని, రెవెన్యూ మంత్రి చేసే పని ఆర్థికమంత్రి చేశారని కృష్ణారావు చెప్పారు. భట్టి చెప్పిన దానికి, ఆర్టీఐ కింద అధికారులు ఇచ్చిన సమాచారానికి పొంతన లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారుల నుంచి సరైన సమాచారం తీసుకోవాలని, తప్పుడు సమాచారంతో ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయొద్దని హితవు పలికారు. ఏరియల్ సర్వే కాకుండా, చెరువులను పరిశీలించి విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలని సూచించారు. చెరువులపై సర్వేకు కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

మూసీపై ముందుకే!

(మొదటిపేజీ తరువాయి)

మా పెట్టుబడి. దీన్ని తయారు చేశాక 10 దేశాల్లో రోడ్ షోలు నిర్వహించి ప్రదర్శిస్తాం. పెట్టుబడిదారులు వస్తారు. పెట్టుబడి అంతా ప్రైవేటు కంపెనీలదే. ఈ ప్రణాళిక అంతా అమలైతే మూసీ నది ఒడ్డున మాకో అపార్ట్‌మెంట్ ఉందని చెప్పుకునే పరిస్థితి వస్తుంది. రూ.10 వేలు ఉన్న గజం ధర.. రూ.5 లక్షలు కూడా కావొచ్చు" అని వ్యాఖ్యానించారు. గండిపేటలో కూల్చిన ఫామ్‌హౌస్‌లు బలిసినోళ్లవని, వాళ్ల డ్రెయినేజీ నీళ్లు గండిపేటలో కలిపితే కింద ఉన్నవాళ్లు తాగాల్సి వస్తోందని, అందుకే నిర్దాక్షిణ్యంగా కూల్చేశామని తేల్చి చెప్పారు. కానీ, మూసీ నిర్వాసితుల విషయంలో అలా కాదని, డబుల్ బెడ్ రూం ఇల్లు, పరిహారం తీసుకోవడానికి అంగీకరించిన వారివే తొలగిస్తున్నామని, నిర్వాసితులకు వీలైనంత మేర న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఇంకో హైదరాబాద్ అంత వ్యాపారం.. బాధితులకూ భాగస్వామ్యం

"మూసీ నదిని అభివృద్ధి చేయాలని నాకు ఏ దేవుడూ చెప్పలేదు. నేనూ హామీ ఇవ్వలేదు. కానీ, రాష్ట్ర ఆదాయంలో 55 శాతం హైదరాబాద్ నుంచే వస్తోంది. మూసీ అభివృద్ధి చేస్తే నగర ఆదాయం మరింత పెరుగుతుంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రణాళిక రూపకల్పన కోసం ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఐదు సంస్థల కన్సార్షియంకు బాధ్యతలు అప్పగించామని, 45 రోజుల్లో ప్రాథమిక; 18 నెలల్లో సమగ్ర ప్రణాళికను అందిస్తారని తెలిపారు. దానిపై ప్రభుత్వం ప్రజలకు ప్రజంటేషన్ ఇస్తుందని వెల్లడించారు. "మూసీ ఒడ్డున ఉన్నది చిన్న వ్యాపారులు. చిరుద్యోగులే. వారిని కూడా అభివృద్ధిలో భాగస్వాములను చేస్తాం. స్వయం సహాయక బృందాల తరహాలో నిర్వాసితులను గ్రూప్‌లుగా ఏర్పాటు చేస్తాం. వారికి కొన్ని షాపులను కేటాయిస్తాం. ప్రాజెక్టు పూర్తయ్యాక వ్యాపారానికి ఇంకో సైకిల్ అదనంగా కలుస్తుంది" అని రేవంత్ వివరించారు. ఇప్పుడు హైదరాబాద్‌లో పగలు వ్యాపారం జరుగుతోందని, మూసీ ఒడ్డున షాపింగ్, వినోదం, విహారం వంటివన్నీ రాత్రిళ్లు ఉంటాయని, ఇంకో హైదరాబాద్ అంత వ్యాపారం మూసీ ఒడ్డున రాత్రిపూట జరుగుతుందని చెప్పారు.

కేటీఆర్ ఎందుకు వద్దంటున్నారో అర్థం కావట్లేదు

దుబాయ్‌ని ఒక కాన్సెప్ట్‌తో అభివృద్ధి చేశారని, ఇప్పుడు డబ్బులున్న వారంతా దేశ, విదేశాల నుంచి వెళ్లి, చూసి అక్కడ ఖర్చు చేస్తున్నారని, హైదరాబాద్‌లోనూ అలాగే జరుగుతుందని సీఎం రేవంత్ వెల్లడించారు. "కేటీఆర్ బావమరిదిలా అందరికీ ఫామ్‌హౌస్‌లు, విలాసవంతమైన ఇళ్లు ఉండవు. సామాన్యులు కూడా తమ పిల్లల్ని తీసుకెళ్లి అక్కడ ఆనందించేలా అభివృద్ధి ఉంటుంది. ఒక వ్యక్తికి కావాల్సిన అన్ని వస్తువులూ షాపింగ్ చేసుకునేలా ఏర్పాటు చేస్తాం. పదేళ్లు అధికారంలో ఉండి అమెరికా, లండన్ తిరిగొచ్చిన కేటీఆర్ ఇక్కడ మూసీని, పేదలను అభివృద్ధి చేయవద్దని ఎలా అంటున్నారో అర్థం కావడం లేదు. ఇక్కడ జరిగేది ఏదైనా నా ఇంటికొస్తుందా? గతంలో ఒకాయన ఔటర్ రింగ్ రోడ్డు ఆలోచన చేస్తే.. ఇంకో ఆయన దాన్ని అమలు చేశారు. ఒకాయన ఐటీకి శంకుస్థాపన చేస్తే.. చంద్రబాబు దాన్ని అభివృద్ధి చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కొనసాగించారు. ఇప్పుడు ప్రతిపక్షానికి మాత్రం ఆ బాధ్యత ఎందుకు లేదో అర్థం కావడం లేదు" అని వ్యాఖ్యానించారు. ప్రణాళిక సిద్ధం కాకుండానే నిర్వాసితులను ఎందుకు ఖాళీ చేయిస్తున్నారని ప్రశ్నించగా.. ఎంత భూమి అందుబాటులోకి వస్తుందనేది తెలిస్తే కానీ ప్రణాళిక వేయలేరని, ఒకవేళ ప్రణాళిక వేసేశాక అక్కడ భూమి అందుబాటులోకి రాకుంటే మొత్తం ప్రాజెక్టుకే దెబ్బ తగులుతుందని వివరించారు. ప్రణాళిక తయారు చేస్తున్న సంస్థలు కూడా ఎంత భూమి ఇస్తారో చెప్తేనే.. కార్యాచరణ ప్రణాళిక చేయగలమని చెప్పాయని బదులిచ్చారు.



సీఎం రేవంత్‌ను కలసిన చెస్ క్రీడాకారుడు హరికృష్ణ, తదితరులు

రియల్ ఎస్టేట్ దేశమంతా పడింది..

హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్ ఆదాయం పడిపోయిందని, హైడ్రానే ఇందుకు కారణమని అంటున్నారని, కానీ, హైడ్రా లేని వరంగల్‌లోనూ రిజిస్ట్రేషన్ల ఆదాయం పడిపోయిందని సీఎం రేవంత్ తెలిపారు. రియల్ ఎస్టేట్ దేశమంతా పడిపోయిందని, ఆర్థిక మాంద్యమే దీనికి కారణమని తెలిపారు.

రాజ్ పాకాల ఎందుకు పారిపోయారు?

"మాకు దీపావళి అంటే చిచ్చు బుడ్లు. వాళ్లకు సారా బుడ్లు. దీపావళి దావత్ అలా చేస్తారని మాకు తెలియదు" అని రాజ్ పాకాల ఫామ్ హౌస్ పార్టీపై సీఎం రేవంత్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అక్కడ విదేశీ మద్యం, క్యాసినో కాయిన్లు, కొకైన్ తీసుకున్న వ్యక్తి, పేకలు అన్నీ ఉన్నాయని, ఏమీ చేయకపోతే రాజ్ పాకాల ఎందుకు పారిపోయాడని ప్రశ్నించారు.

కేసీఆర్ చేసిన అప్పులకు బాకీలు మేం కడుతున్నాం

మూడు లక్షల కోట్లు అప్పు చేశామని కేసీఆర్ ప్రభుత్వం చెప్పిందని, కానీ, రూ.7.5 లక్షల కోట్లు అప్పు చేసినట్లు తేలిందని సీఎం రేవంత్ తెలిపారు. "పది నెలల్లో మేం చేసిన అప్పు రూ.49 వేల కోట్లు. కానీ. చెల్లించిన బాకీలు రూ.56 వేల కోట్లు. అంటే.. కేసీఆర్ చేసిన అప్పుల తాలూకు బాకీలను మేం కడుతున్నాం. మేం తెచ్చిన అప్పుల కంటే 7 వేల కోట్లు అధికంగా ఆ చెల్లింపులు చేశాం. అంతేకాదు.. కేసీఆర్ ప్రభుత్వం తరహాలో ఈ 10 నెలల్లో మేం హైదరాబాద్, రంగారెడ్డిల్లో భూములు అమ్మలేదు. కానీ, రూ.17,800 కోట్ల రుణ మాఫీ చేశాం. 200 యూనిట్ల లోపు విద్యుత్తును ఎంతమంది అర్హులుంటే అంత మందికీ ఉచితంగా ఇస్తున్నాం. రూ.500లకే సిలిండర్ అందిస్తున్నాం. ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు నెల మొదట్లోనే ఇస్తున్నాం. మద్యం సరఫరాదారులకు కేసీఆర్ రూ.4 వేల కోట్ల బకాయిలు పెడితే క్లియర్ చేస్తున్నాం. కాంట్రాక్టర్లకు రూ.52 వేల కోట్ల బిల్లులు బకాయి పెడితే.. అందులో ఇప్పటికే రూ.10 వేల కోట్లు చెల్లించాం" అని సంక్షేమ హామీలు ఇంకా అమలు చేయాల్సి ఉంది కదా అన్న ప్రశ్నకు సుదీర్ఘంగా సమాధానమిచ్చారు. నిద్ర లేని రాత్రులు గడుపుతూ ఆర్థిక పరిస్థితిని సమన్వయం చేసుకుంటున్నామని, మిగతా హామీలను కూడా అమలు చేస్తామని స్పష్టం చేశారు.

వర్మ - రాజమౌళి.. ఎవరి స్టైల్ వారిదే!

"రాంగోపాల్ వర్మ సినిమా రిలీజ్‌కు ముందు హడావుడి ఎక్కువ ఉంటుంది. సినిమా బాగుంటుందా? లేదా? అన్నది తర్వాతి సంగతి. అదే రాజమౌళి సినిమాకు రిలీజ్‌కు ముందు హడావుడి తక్కువ ఉంటుంది. ఎవరి దారి వారిదే. కేటీఆర్‌లా రేవంత్ రెడ్డి ఉండాలంటే ఎలా?" అని ఓ ప్రశ్నకు జవాబుగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తాను ఫుట్‌బాల్ ఆటగాడినని, ఈ ఆటలో ప్రతి ఆటగాడు ప్రత్యర్థి జట్టులోని మరో ఆటగాడిని మ్యాపింగ్ చేస్తాడని, అతడిని అలిసిపోయే దాకా పరిగెత్తించి అప్పుడు గోల్ వైపు బంతిని తీసుకెళతాడని, కేటీఆర్, హరీశ్, ఈటల కూడా అలానే అలసిపోతారని చెప్పారు.

కేటీఆర్‌తోనే కేసీఆర్ రాజకీయం ముగింపు

మూసీ నది ప్రక్షాళన వ్యవహారంలో మీరు కేసీఆర్‌ను వదిలేసి కేటీఆర్‌నే విమర్శిస్తున్నారు. ఆ మేరకు కేటీఆర్ సక్సెస్ అయినట్లేనా? అని ప్రశ్నించగా.. "కేసీఆర్ ఎక్స్‌పైరీ మెడిసిన్. ఎన్నికల ముందే ఇది చెప్పాను. కేసీఆర్‌ను మరిపించేందుకే ఇప్పుడు కేటీఆర్‌ను ప్రస్తావిస్తున్నాం. కేటీఆర్‌తోనే కేసీఆర్ రాజకీయం ముగుస్తుంది. ఆ తర్వాత బావతో బామ్మర్ది రాజకీయం ముగుస్తుంది. ఇక బావను ఎలా హ్యాండిల్ చేయాలో మాకు తెలుసు" అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దీపావళిలోపే బాంబులు పేలతాయని పొంగులేటి అన్నారుగా అని ప్రశ్నించగా.. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ విచారణలు కొనసాగుతున్నాయని, చట్టప్రకారమే చర్యలు ఉంటాయని తెలిపారు.

హైదరాబాద్ మారవద్దా!?

కేటీఆర్ ఇటీవల మూసీ నిర్వాసిత చిన్నారి ఒకరిని కలిశాడని, ఆమెకు ఒక ఇల్లు ఇస్తారేమోనని అనుకున్నానని, కానీ, నీళ్ల సీసా మాత్రం ఇచ్చాడని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. "మూసీని ఇలానే వదిలేస్తే మూసుకుపోతుంది. మూసీ మూసుకుపోతే హైదరాబాద్ నగరానికే పెనుప్రమాదం. కేటీఆర్, కేసీఆర్ తాతలు గోచీ పెట్టుకుని ఉండేవాళ్లు. కానీ, కేసీఆర్, కేటీఆర్ పరివర్తన చెంది సూట్‌లు వేసుకునే వరకూ వచ్చారు. మరి హైదరాబాద్ మాత్రం పరివర్తన చెందొద్దా?" అని రేవంత్ ప్రశ్నించారు.

గ్రూప్ 1కు ఎంపికైన అభ్యర్థుల్లో 52% బీసీలే

గ్రూప్-1 పరీక్షల విషయంలో ప్రతిపక్షాలు ఆందోళన చేశాయని, కానీ, పరీక్ష అయ్యాక టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పెట్టిన వివరాల ప్రకారం ఎంపికైన అభ్యర్థుల్లో 52 శాతం బీసీలే ఉన్నారని సీఎం రేవంత్ వివరించారు. ఓసీలు 9 శాతం మంది మాత్రమే ఉన్నారని తేలిందన్నారు.

తిరిగి ఇవ్వడమే ఇక మిగిలింది

ప్రజలు రాజకీయంగా తనకు ఇవ్వాల్సింది ఇచ్చేశారని, ఇక ఇంతకంటే కోరుకునేది ఏమీ లేదని, ప్రజలకు తిరిగి చేయడమే మిగిలిందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. "నేను కోరుకోవడానికి ఇక ఏమీ లేదు. ప్రజలకు చేయడమే మిగిలింది. నా వయసు, ఓపిక, శక్తి అన్నీ ప్రజలకు తిరిగి చేసేందుకే ఉపయోగిస్తా" అని చెప్పారు. మరోవైపు, మహారాష్ట్ర ఎన్నికల తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్నారు.



భారత్‌లో మళ్లీ పెన్సిలిన్ ఉత్పత్తికి శ్రీకారం

» 30ఏళ్ల తర్వాత దేశీయంగా తయారీ

» కాకినాడలో అరబిందో ఫార్మా లైఫియస్ ప్లాంట్ ప్రారంభం

» వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

» 135 ఎకరాల్లో.. 2,500 కోట్ల పెట్టుబడి

» ఇక్కడ పెన్సిలిన్-జి ఉత్పత్తి

తొండంగి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల తర్వాత భారత్‌లో మళ్లీ పెన్సిలిన్ ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 1990వ దశకంలోనే దేశంలో ఉత్పత్తిని ఆపేసిన తర్వాత మళ్లీ ఇప్పుడు తొలిసారిగా పెన్సిలిన్ ఉత్పత్తి ప్లాంట్‌ను ప్రారంభించింది. ఈ అవకాశం ఆంధ్రప్రదేశ్‌కు దక్కింది. అరబిందో ఫార్మా కంపెనీ కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవినగరం గ్రామంలో నిర్మించిన లైఫియస్ ఫార్మా ప్లాంట్‌ను ప్రధాని మోదీ మంగళవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్లాంట్‌లో యాంటీబయాటిక్ మందుల తయారీలో కీలకమైన పెన్సిలిన్-జీని ఉత్పత్తి చేయనున్నారు. ప్రపంచవ్యాప్తంగా పెన్సిలిన్ తయారీలో చైనాను కింగ్‌గా చెబుతారు. పెన్సిలిన్‌ను అధిక మొత్తంలో ఉత్పత్తి చేయడం, దాన్ని చాలా తక్కువ ధరకే అందించడంతో.. ప్రపంచ మార్కెట్‌లో చైనా పోటీని తట్టుకోలేక భారత్ 1990వ దశకంలో పెన్సిలిన్ ఉత్పత్తిని ఆపేసింది. అప్పటి నుంచి చైనా నుంచే పెన్సిలిన్‌ను దిగుమతి చేసుకుంటోంది. అయితే.. 2020లో కొవిడ్ సమయంలో చైనా పెన్సిలిన్ సరఫరా చేయకుండా భారత్‌లోపాటు అనేక దేశాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. దీంతో.. ఫార్మా రంగంలో దేశీయ తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకం కింద కేంద్ర ప్రభుత్వం పెన్సిలిన్ ఉత్పత్తిని ప్రారంభించాలని నిర్ణయించింది. దీనికోసం స్వదేశీ కంపెనీల నుంచి బిడ్లు ఆహ్వానించగా... అరబిందో ఫార్మా కంపెనీ అవకాశం దక్కించుకుంది. కాకినాడ సెజ్‌లో లైఫియస్ ఫార్మా ప్లాంట్‌ను ఏడాదిన్నరలోనే నిర్మించింది. ఇది అందుబాటులోకి రావడంతో మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ దీన్ని వర్చువల్‌గా ప్రారంభించారు.

రూ.1500 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో రూ.1500 కోట్ల అప్పు తీసుకొంది. రిజర్వ్ బ్యాంక్ మంగళవారం నిర్వహించిన ఈ-వేలంలో పాల్గొని ఈ రుణాన్ని సేకరించింది. 23 ఏళ్ల కాల పరిమితి, 7.16 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు; 25 ఏళ్ల కాల పరిమితి, 7.16 శాతం వార్షిక వడ్డీతో రూ.500 కోట్ల అప్పు తీసుకొంది. తెలంగాణతో కలిపి దేశంలోని 10 రాష్ట్రాలు మొత్తం రూ.25,050 కోట్ల అప్పులు తీసుకున్నాయి.

సంగారెడ్డి జిల్లాలో స్టెంట్ల పరిశ్రమ

» వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

» బీబీనగర్ ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు కూడా

» ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమాలు

» వైద్య పరికరాల ఉత్పత్తుల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుదాం: దామోదర

పటాన్‌చెరు, బీబీనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్కులోని ఎస్ఎంటీ గుండె స్టెంట్ల పరిశ్రమను, యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్‌లోని డ్రోన్ సేవలను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఆయుష్మాన్ భారత్ పీఎం జన్ ఆరోగ్య యోజనలో భాగంగా ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతి, ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం న్యూఢిల్లీలో ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ఈ మేరకు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ డ్రోన్ల సేవలు వైద్యరంగంలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులకు నిదర్శనంగా పేర్కొన్నారు. స్టెంట్ల పరిశ్రమ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామోదర మాట్లాడుతూ.. ఆయుర్వేదం, హోమియోపతి వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తుందని పేర్కొన్నారు. దేశీయంగా వైద్య పరికరాల ఉత్పత్తుల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుదామని, దిగుమతులను తగ్గిస్తే వైద్య ఖర్చులు గణనీయంగా తగ్గిపోతాయని చెప్పారు. వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని, మెరుగైన వైద్యం ప్రతి ఒక్కరికి అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సుల్తాన్‌పూర్‌లో ఏర్పాటైన ఎస్ఎంటీ స్టెంట్ల తయారీ కేంద్రంతో రాష్ట్ర వాసులకు గుండెలో అమర్చే స్టంట్లు తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇక్కడ తయారైన స్టెంట్లు ఇప్పటికే వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయని, త్వరలో విదేశాలకూ సరఫరా అవుతాయని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కాగా భువనగిరి నుంచి 60కిలోమీటర్ల దూరం వరకు డ్రోన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. మారుమూల గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఎయిమ్స్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) సంస్థతో కలిసి డ్రోన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలలో నమూనాలను సేకరించి అక్కడి నుంచి జిల్లా ఆస్పత్రిలోని పరీక్షా కేంద్రానికి తరలించి పరీక్ష చేయించేందుకు డ్రోన్లను వినియోగించనున్నట్లు తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద బీబీనగర్ మండలం కొండమడుగు, భువనగిరి మండలం బొల్లేపల్లితో పాటు బొమ్మలరామారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. ప్రయోగాత్మకంగా అప్పటికప్పుడు ఇక్కడి పీహెచ్‌సీలో సేకరించిన నమూనాలను డ్రోన్ల ద్వారా అరగంటలో జిల్లా ఆసుపత్రిలోని ల్యాబ్‌కు పంపి పరీక్షలు చేయించారు. ప్రస్తుతం రెండు డ్రోన్లు అందుబాటులో ఉన్నాయని, ఒకటి ఎనిమిది కిలోల బరువు, ఐదు కిలోల బరువును మోసుకెళ్లే సామర్థ్యం కలిగి ఉన్నాయన్నారు. 60కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయగలవన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి నుంచి 60కిలోమీటర్ల దూరంలోని గ్రామాలకు డ్రోన్ సేవలు కొనసాగిస్తామన్నారు.

కార్పొరేట్ ఆస్పత్రుల అనుమతులు.. సర్కారు చేతుల్లోకి?

ఇప్పటిదాకా డీఎంహెచ్‌వోలకే అధికారాలు.. ఆ విధానాన్ని మార్చే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రుల అనుమతుల మంజూరు ఇక సర్కారు చేతుల్లోకి వెళ్లనుందా? ఇప్పటిదాకా డీఎంహెచ్‌వోలకే ఉన్న ఆ అధికారానికి కత్తెర పడనుందా? పడకల సంఖ్య ఆధారంగా కొత్త ప్రైవేటు ఆస్పత్రులకు అనుమతులిచ్చే విధానంలో మార్పు రానుందా? అంటే.. ఈ ప్రశ్నలన్నింటికీ వైద్య ఆరోగ్యశాఖ నుంచి అవుననే సమాధానమే వస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో చిన్నచిన్న క్లినిక్కుల నుంచి 1000 పడకలు ఉండే ఆస్పత్రుల దాకా.. అన్నింటికీ జిల్లా వైద్యాధికారులే (డీఎంహెచ్‌వోలు) అనుమతులు ఇస్తున్నారు. అదీ.. నామమాత్రపు ఫీజులతో! కానీ, ఇప్పుడు సర్కారు ఆ విధానానికి చుక్కపెట్టి.. 50కి మించి పడకలు ఉండే ఆస్పత్రుల అనుమతులు రాష్ట్ర స్థాయిలోనే ఇవ్వాలనే యోచనలో ఉన్నట్టు సమాచారం. అంటే.. జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీకి బదులు స్టేట్ రిజిస్ట్రేషన్ అథారిటీనే ఆ బాధ్యతలు చేపట్టనుంది. కనీస సౌకర్యాలు లేని, భద్రతాప్రమాణాలు పాటించని ఆస్పత్రులకు.. మరీ ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో వైద్యాధికారులు ప్రైవేటు ఆస్పత్రులకు ఎడాపెడా అనుమతులు ఇచ్చేస్తున్నారనే ఆరోపణలు న్నాయి. ఈ నేపథ్యంలో సర్కారు ఆస్పత్రుల అనుమతులకు సంబంధించి ఒక ఉన్నత స్థాయి కమిటీ వేసి, అధ్యయనం అనంతరం ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకోవాలనుకుంటోంది.

ఫీజుల పెంపు..

కొత్తగా ఏర్పాటయ్యే ప్రైవేటు ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ చార్జీలను భారీగా పెంచాలని సర్కారు భావిస్తోంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. 200కు మించి పడకలు ఉండే కార్పొరేట్ ఆస్పత్రికి కూడా ఈ ఫీజు కేవలం రూ.16 వేలుగా ఉంది. ఫలితంగా.. రూ.వందల కోట్లతో కట్టే కార్పొరేట్ ప్రైవేటు ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ చార్జీల రూపంలో తగినంత ఆదాయం రావడం లేదన్న అభిప్రాయంతో ఉన్న వైద్య, ఆరోగ్య శాఖ.. బడా కార్పొరేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ చార్జీలను అదే స్థాయిలో పెంచాలనే ఉద్దేశంతో ఉంది. ఈమేరకు రిజిస్ట్రేషన్ ఫీజులను చట్ట ప్రకారం సవరించడానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైద్య శాఖ ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం.

ఇదీ ప్రస్తుత విధానం

ప్రస్తుత విధానం ప్రకారం.. ఎవరైనా కొత్తగా ప్రైవేటు ఆస్పత్రి పెట్టాలనుకుంటే సంబంధిత జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ నుంచి కచ్చితంగా అనుమతులు పొందాలి. జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ (డీఆర్ఏ) జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) నియంత్రణలో ఉంటుంది. వీరి ఆధ్వర్యంలోని కమిటీనే కొత్త ఆస్పత్రులకు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ (సీఈఏ) నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేస్తారు. ఆ సమయంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అది ఏ ప్రాంతంలో ఉందో పరిశీలించి, పడకల సంఖ్య ఆధారంగా రిజిస్ట్రేషన్ ఫీజును నిర్ధారిస్తారు. ఒక్కసారి అనుమతినిస్తే.. ఐదేళ్ల వరకూ అది కొనసాగుతుంది. అనంతరం మళ్లీ రెన్యువల్ చేసుకోవాలి. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్, సొసైటీ, స్థానిక సంస్థల, సింగిల్ డాక్టర్ వైద్యశాలలన్నీ జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ పరిధిలోకి వస్తాయి. అలాగే ప్రైవేటు ఆస్పత్రులు విధిగా ప్రతి నెలా తమ ఆస్పత్రుల్లో చికిత్స పొందే రోగుల రికార్డులను వైద్య ఆరోగ్యశాఖకు పంపాలి. ఏదైనా ఆస్పత్రిపై ఫిర్యాదు వస్తే డీఆర్ఏ విచారణ జరుపుతుంది.

13 జిల్లాలకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోలు

» తీవ్ర ఆరోపణలున్న వారికే మళ్లీ బాధ్యతలు

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 13 జిల్లాలకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోలను నియమిస్తూ హెల్త్ సెక్రటరీ క్రిస్టినా మంగళవారం మెమో జారీ చేశారు. 13 జిల్లాలకు రెగ్యులర్ డీఎంహెచ్‌వోలు లేరని అందులో పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు డాక్టర్ నరేందర్, జనగామ జిల్లాకు డాక్టర్ మల్లికార్జున్ రావు, గద్వాల జిల్లాకు డా.కే. సిద్దప్ప, ఖమ్మం జిల్లాకు కళావతి బాయి, ఆసిఫాబాద్ జిల్లాకు సీతారామ్, మహబూబాబాద్ జిల్లాకు జి. మురళీధర్, మహబూబ్‌నగర్ జిల్లాకు కృష్ణ, ములుగు జిల్లాకు గోపాల్ రావు, పెద్దపలి జిల్లాకు అన్నప్రసన్న, సిద్దిపేట జిల్లాకు పల్వాన్ కుమార్, వికారాబాద్ జిల్లాకు వెంకట రవన, వనపర్తి జిల్లాకు ఏ.శ్రీనివాసులు, యాదాద్రి జిల్లాకు మనోహర్‌ను ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోలుగా నియమించారు. అయితే వీరిలో ఒకరిద్దరు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోలపై ఇప్పటికే తీవ్ర అవినీతి ఆరోపణలున్నాయి. అలాగే ఒక జిల్లాకు డీఎంహెచ్‌వోగా పనిజేస్తున్న ఒకరు డిప్యూటేషన్‌పై అక్కడి నుంచి మరో జిల్లాకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా వెళ్లి గత నాలుగైదేళ్లుగా అక్కడే పనిజేస్తున్నారు. సదరు డీఎంహెచ్‌వో వదిలేసిన జిల్లాలో ఇన్‌చార్జిగా వచ్చిన ఇంకొకరు కూడా అదే స్థానంలో నాలుగేళ్లుగా ఉన్నారు. తాజా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోల ఏర్పాటులో కూడా వారిరువురికి మళ్లీ అవే స్థానాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం వైద్యవర్గాల్లో చర్చనీయాంశమైంది.

డీజీపీని కలిసిన యువ ఐపీఎస్‌లు

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి నూతనంగా వచ్చిన ముగ్గురు ఐపీఎస్‌లు మంగళవారం డీజీపీ జితేందర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. 2023 బ్యాచ్‌కు చెందిన కిరణ్ ప్రత్తిపాక, మన్నన్ భట్, యాదవ్ వసుంధర డీజీపీని కలిసిన వారిలో ఉన్నారు. రాష్ట్ర పోలీసింగ్‌లో కొత్తగా చేరిన ఐపీఎస్‌లకు డీజీపీ జితేందర్ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసింగ్‌కు సంబంధించిన పలు అంశాలపై వారితో డీజీపీ చర్చించారు. అనంతరం నూతన చట్టాల అమలుపై ఉన్నతాధికారులతో కలసి ఎస్పీలు, ఏసీపీలు, డీసీపీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సీపీలతో డీజీపీ వీడియో సమీక్ష నిర్వహించారు. నూతన క్రిమినల్ చట్టాలు ఉపయోగించి కేసులు నమోదు చేయడంలో ఎదురవుతున్న సవాళ్లపై ఈ సందర్భంగా చర్చించారు. ఢిల్లీలోని ఎన్ఐసీ అధికారులు క్షేత్ర స్థాయి అధికారుల కోసం రూపొందించిన ఈ- సాక్ష్యం యాప్‌ను ఈ సందర్భంగా డీజీపీ ప్రదర్శించారు.

పోలీసు లీవ్ సరెండర్ నిధుల విడుదల

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీసు సిబ్బంది సెలవులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ. 182.48 కోట్ల సరెండర్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. పోలీసు సిబ్బంది సెలవులకు సంబంధించి సరెండర్ నిధులు కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్నాయనే విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలన అనంతరం నిధుల విడుదలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నిధుల విడుదలపై పోలీసు అధికారుల సంఘం సర్కార్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు డ్రగ్స్ టెస్టులు చేయించాలి

» కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

హైదరాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క బీఆర్ఎస్ ఎమ్మెల్యేకీ డ్రగ్స్ టెస్టు నిర్వహించాలని ప్రభుత్వానికి కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ప్రజాసమస్యలపై పోరాటం చేయడానికి బయటికి రావట్లేదు కానీ.. డ్రగ్స్ అంశం ఎప్పుడు బయటికి వచ్చినా వారంతా ఒక్కతాటిపైకి వస్తున్నారని, అందుకే వారందరినీ పిలిచి ఒకసారి డ్రగ్స్ టెస్ట్ చేయాలని పోలీసులను కోరారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేటీఆర్‌కు అసలు బినామీ విజయ్ మద్దూరీనేనని ఆరోపించారు. రాజ్ పాకాల డ్రగ్స్ ఇస్తే వాడినట్లుగా ముందు ఒప్పుకున్న విజయ్... ఇప్పుడు మాట మారుస్తున్నాడన్నారు. "డ్రగ్స్ టెస్టు కోసం గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు నాగేశ్వర్‌రెడ్డి దగ్గర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాంపిల్స్ ఇస్తారంటూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అంటున్నడు. గ్యాస్ట్రో ఎంటరాలజీకి, డ్రగ్స్ టెస్టుకు ఏంటి సంబంధం?" అని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ప్రశ్నించారు. కొకైన్ తీసుకునే వారితో బీఆర్ఎస్ వాళ్లకు దోస్తీ ఏంటని ప్రశ్నించారు.

నన్ను డ్రగ్స్ కేసులో ఇరికించే కుట్ర చేశారు

» ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రైవేటు ఫంక్షన్‌కు హాజరైన తనను డ్రగ్స్ కేసులో ఇరికించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేశారని ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి ఆరోపించారు. ముందే డ్రగ్స్ పెట్టి తనపై కేసు నమోదు చేసేందుకు ప్రయత్నించారని తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... డ్రగ్స్ ప్యాకెట్లు తన కారులో వేసి కేసులో ఇరికించాలని వారికి ఆదేశాలు వచ్చినట్లు పోలీసులే తనతో చెప్పారన్నారు. సుమారు నెల రోజుల కిందట ఈ కుట్ర జరిగిందని, తనను కేసులో ఇరికించకుండా వదిలేసినందుకు ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డిని సీఎం తిట్టారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ చేసిన సవాల్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమని, డ్రగ్ టెస్ట్‌కు ఎక్కడికి రావాలో చెప్పాలన్నారు. కాగా, బాంబులు పేలుతాయంటూ కాంగ్రెస్ మంత్రులు చిల్లర మాటలు మాని పాలనపై దృష్టి పెట్టాలని, వేటినైనా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ సర్కార్ దోపిడీ బాంబులను అడ్డుకుంటామన్నారు.

గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి అనిల్, బల్మూరి

» డ్రగ్స్ పరీక్షలపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సవాల్ స్వీకరణ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన సవాల్‌ను రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ స్వీకరించారు. డ్రగ్స్ పరీక్షలు చేయించుకునేందుకు వారిద్దరూ కలిసి హైదరాబాద్, గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి మంగళవారం రాత్రి వెళ్లారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఓ వైపు ముఖ్యమంత్రి హైదరాబాద్‌ను డ్రగ్స్ ఫ్రీ సిటీగా చేసేందుకు కృషి చేస్తుంటే, బీఆర్ఎస్ నేతలు డ్రగ్స్‌తో కలుషితం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు వస్తారని ఆస్పత్రి వద్ద దాదాపు రెండు గంటలు ఎదురు చూసినా ఎవరూ రాలేదన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ను కూడా పరీక్షలకు తీసుకొస్తానన్న కౌశిక్ రెడ్డి మాట మీద నిలబడలేదని ఎద్దేవా చేశారు. అరే వీడు సలీం ఫేక్ లాగా అన్ని ఫేకుతుంటాడంటూ హైదరాబాద్‌లో వాడే సామెత బీఆర్ఎస్‌లో కౌశిక్‌రెడ్డికి సరిపోతుందని అన్నారు. "కౌశిక్‌రెడ్డి నీ రాసలీలలు గురించి చెప్పాలా.. నువ్వు ఎక్కడ ఎవరి దగ్గర ఎలా తాగి పడిపోయావో ? ఏమేమి చేశావో చెప్పాలా. ?." అంటూ ధ్వజమెత్తారు.

సబ్ రిజిస్ట్రార్ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

సుభాష్‌నగర్ వెంకటాద్రినగర్‌లో 200 గజాల స్థలం ఉంది. ఆ స్థలం ఖాళీగా ఉండటంతో స్థానిక బీఆర్ఎస్ నేత పద్మజారెడ్డి మరో ఆరుగురు వ్యక్తులతో కలిసి స్థల యజమాని బతికుండగానే మృతి చెందినట్టు మరణ ధ్రువీకరణ పత్రం, నకిలీ పాన్‌కార్డు, ఆధార్‌కార్డులను సృష్టించారు. 2023 ఫిబ్రవరిలో అప్పటి కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న జ్యోతి ఆ స్థలాన్ని పద్మాజారెడ్డి పేరుమీద రిజిస్ట్రేషన్ చేశారు. దీనికి సంబంధించిన ఫిర్యాదు అందడంతో ఈ నెల 4న పద్మాజారెడ్డితో పాటు ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ నిమిత్తం తిరిగి పద్మాజారెడ్డిని అదుపులోకి తీసుకున్న జీడిమెట్ల పోలీసులు సుదీర్ఘంగా విచారించారు. తనకు సబ్ రిజిస్ట్రార్ జ్యోతితో పాటు మరి కొందరు వ్యక్తులు ఈ నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్‌కు సహకరించినట్టు ఆమె వెల్లడించడంతో.. ప్రస్తుతం నాంపల్లిలోని చిట్స్ అండ్ ఫైనాన్స్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న జ్యోతిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం రిమాండ్‌కు తరలించినట్టు జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ తెలిపారు. అదేవిధంగా ఈ నకిలీ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన మరికొందరు ప్రజాప్రతినిధులపై కూడా విచారణ చేయడానికి పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు.

సుబ్బారెడ్డి, సాయిరెడ్డివి అవాస్తవాలే!

జరగకూడనివన్నీ నా కళ్లముందే జరుగుతున్నాయ్.. విజయలక్ష్మి లేఖ పూర్తి పాఠం



రాజశేఖర్‌రెడ్డి గారు ప్రేమించే ప్రతి హృదయానికి, ఈ కుటుంబాన్ని ఆదరించి అక్కున చేర్చుకున్న ప్రతి ఒక్కరికీ మీ విజయమ్మ చేస్తున్న అభ్యర్థన..

ఇప్పుడు జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే మనసుకు చాలా చాలా బాధేస్తోంది. ఇంటి గుట్టు.. వ్యాధి రట్టు. తెరిచిన పుస్తకం అని రాజశేఖర్ రెడ్డి గారు ఎప్పుడూ అనేవారు. రాజశేఖర్‌రెడ్డి గారు, నేను, నా పిల్లలు చాలా సంతోషంగా ఉండేవాళ్లం. నా కుటుంబానికి ఏ దిష్టి తగిలిందో నాకు అర్థం కావడం లేదు. నేను అడ్డుకోవడానికి ఎంత ప్రయత్నించినా.. జరగకూడనివన్నీ నా కళ్లముందే జరిగిపోతున్నాయి. ఈ కుటుంబం గురించి ఎవరికిష్టం వచ్చినట్లు వాళ్లు మాట్లాడుతున్నారు. అబద్ధాల పరంపర కొనసాగుతోంది. తెలిసి కొంత.. తెలియకుండా కొంత మాట్లాడుతున్నారు. అవి దావానలంగా ఎక్కడెక్కడికో పోతున్నాయి. ఇవి కంటిన్యూ కాకూడదు. నా పిల్లలిద్దరికే కాదు.. చెప్పాలంటే ఇది రాష్ట్రానికి కూడా మంచిది కాదు. నేను మీ ముందుకు ఈ విషయంగా రాకూడదని అనుకున్నాను. అయినా రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కుటుంబం గురించి తప్పుగా మాట్లాడే వారందరినీ ఒకటి అడుగుతున్నా.. ఈ కుటుంబాన్ని ప్రేమించినవారు మీరు. మా జీవితంలో మీరందరూ భాగమే అనుకుంటున్నాను. ఇది రాజశేఖర్‌రెడ్డి గారి కుటుంబం. రాజశేఖర్‌రెడ్డి గారికి మేమెంతో.. మీరు కూడా అంతే. ఆయన మమ్మల్ని ఎలా ప్రేమించారో.. మిమ్మల్నీ అంతగానే ప్రేమించారు. మీరు కూడా అంతకంటే ఎక్కువగా మా కుటుంబాన్ని ప్రేమించారు. అంతెందుకు.. రాజశేఖర్‌రెడ్డి గారు మన మధ్య నుంచి వెళ్లిపోయాక నా పిల్లలను.. ఆయన ఉన్నప్పటి కంటే ఎక్కువగా ప్రేమించి, ఆదరించి అక్కున చేర్చుకున్నారు. అది నేను ఎన్నటికీ మరిచిపోలేను. నా జన్మంతా మీకు రుణపడి ఉంటూ.. హృదయపూర్వకంగా నా కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.

మీ అందరికీ మీ ఆడబిడ్డగా రెండు చేతులూ ఎత్తి మనవి చేసుకుంటున్నాను. దయచేసి ఈ కుటుంబం గురించి, నా పిల్లల గురించి తక్కువ చేసి మాట్లాడవద్దని కోరుతున్నా. ముఖ్యంగా సోషల్ మీడియాలో కల్పిత కథలు రాయవద్దు. దూషణలు చేయవద్దు. ఈ కుటుంబం మీద నిజమైన ప్రేమ ఉంటే.. ఇంత కంటే ఎక్కువ మాట్లాడవద్దు. ఆజూాాచీ జీట్లజిజీచి జ్యుట్టజ్ను ట్టీటు. వాళ్లిద్దరూ సమాధానపడతారు. మీరెవరూ రెచ్చగొట్టవద్దని నా మనవి. నేను నమ్మిన దేవుడు యేసయ్య.. సమాధానకర్త. నా బిడ్డల సమస్యలకు పరిష్కారం ఇస్తాడని నా నమ్మకం.

ఇటీవల వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, ఇతరులు అందరూ.. వాళ్లు మాట్లాడుతున్నది.. వాళ్లు ప్రేమించే వైఎస్ఆర్ గారి గురించి అని మరచి.. తీస్తున్నది ఆయన కుటుంబ పరువు అనే స్పృహ లేకుండా.. ఎన్నో అసత్యాలు చెప్పారు. వైఎస్ఆర్ గారు బ్రతికి ఉండగానే ఆస్తులు పంచేశారని అన్నారు. ఇది అవాస్తవం. వైఎస్ఆర్ గారు పిల్లలిద్దరూ పెరుగుతున్న రోజుల నుంచి కొన్ని ఆస్తులు పాప పేరు మీద.. అలాగే కొన్ని ఆస్తులు జగన్ పేరు మీద పెట్టారు. అది ఆస్తులు పంచడం ముమ్మాటికీ కాదు. వైఎస్ఆర్ గారు బ్రతికి ఉండగానే షర్మిలకు ఆస్తులు ఇచ్చేశారని లిస్ట్ చదివారు. అలాగే జగన్ పేరు మీద పెట్టిన ఆస్తుల లిస్ట్ కూడా చదివి ఉండాల్సింది. వైఎస్ఆర్ గారు చేసింది పంపకం కాదు. కొన్ని ఆస్తులు ఇద్దరు బిడ్డల పేరు మీద పెట్టారు.. అంతే.

విజయసాయిరెడ్డి గారు ఆడిటర్‌గా ఉన్నారు కాబట్టి ఆయనకు అన్నీ తెలుసు. వైవీ సుబ్బారెడ్డి గారు ఈ ఇంటి బంధువుగా ఎంవోయూపై సాక్షి సంతకం చేశారు. అయినా.. మీడియాలో అవాస్తవాలు మాట్లాడడం నాకు చాలా బాధ కలిగించింది. అబద్ధాల పరంపర కొనసాగకుండా ఉండడానికి సూటిగా నిజం చెబుతున్నాను. వీరిద్దరూ నా పిల్లలు. వీరిని నేను, వైఎస్ఆర్ గారు ఎంతో అపురూపంగా, ప్రేమగా పెంచుకున్నాం. అమ్మగా నాకు ఇద్దరూ సమానమే. అలాగే రాజశేఖర్‌రెడ్డి గారి మాటా సమానమే. ఆస్తులు కూడా ఇద్దరికీ సమానం అనేది నిజం. నలుగురు చిన్నబిడ్డలకు సమానంగా ఉండాలన్న వైఎస్ఆర్ గారి ఆజ్ఞ నిజం. ఆస్తులు వృద్ధిలోకి తేవడంలో జగన్ కష్టం ఉందనేది నిజం. కానీ అన్ని ఆస్తులూ కుటుంబ ఆస్తులే అన్నది కూడా నిజం. జగన్ బాధ్యత గల కొడుకుగా కుటుంబ ఆస్తులను సంరక్షించాలన్నది కూడా నిజం. వైఎస్ఆర్ గారి చివరి రోజుల్లో జగన్ ఆయనకు.. 'నాన్నా.. నీ తర్వాత ఈ లోకంలో పాప మేలు కోరే వారిలో నేను మొదటి వాడిని' అని మాట ఇచ్చింది కూడా నిజం. ఇది 'నాలో నాతో వైఎస్ఆర్' అనే పుస్తకంలో ఎప్పుడో రాశా. రాజశేఖర్‌రెడ్డి గారు బ్రతికి ఉండగా ఆస్తులు పంచలేదు. అన్నీ కుటుంబ ఆస్తులే. ఇక పంచుదాం అనుకునే సరికి ఆయన ప్రమాదంలో వెళ్లిపోయారు. ఈ విషయం ఆడిటర్‌గా సాయిరెడ్డికి స్పష్టంగా తెలుసు. తెలిసి కూడా అవాస్తవాలు మాట్లాడారు.

రాజశేఖర్‌రెడ్డి గారు వెళ్లిపోయాక.. 2009 నుంచి 2019 వరకు 10 ఏళ్లు కలిసి ఉన్నారు. డివిడెండ్ రూపంలో జగన్ వాటా తీసుకుని, రూ.200కోట్లు పాప భాగానికి ఇచ్చారు. ఎంవోయూ ప్రకారం జగన్‌కు 60 శాతం.. పాపకు 40శాతం అయితే.. ఎంవోయూకు ముందు.. సగం సగం డివిడెండ్ తీసుకునేవారు.. ఎందుకంటే పాపకు సమాన వాటా ఉంది కాబట్టి. వీటన్నింటికీ అప్పుడు, ఇప్పుడు నేనే సాక్షిని.

2019లో సీఎం అయిన రెండు నెలలకు.. డివైడ్ అవ్వాలని ఇజ్రాయిల్‌లో జగన్ ప్రపోజల్. జగన్ చెప్పింది ఏంటంటే.. 'పిల్లలు పెద్ద వాళ్లు అయ్యారు.. నాకు అల్లుళ్లు వస్తారు.. నీకు అల్లుడు, కోడలు వస్తారు.. మనం కలిసి ఉన్నట్లు వాళ్లు కలిసి ఉండక పోవచ్చు.. కాబట్టి విడిపోదాం' అన్నాడు. అలా 2019 వరకు కలిసి ఉన్న కుటుంబం.. ఆస్తులపరంగా విడిపోవాలని నిర్ణయం జరిగింది. ఆ తర్వాత విజయవాడలో, నా సమక్షంలో.. ఆస్తుల్లో ఇవి జగన్‌కు, ఇవి పాపకు అని అనుకున్నారు. 2019లో అప్పుడు రాసిన ఎంవోయూనే ఈ ఎంవోయూ. జగన్ నోటితో చెప్పి.. ఆయన చేతితో రాసిన ఎంవోయూనే ఇది. హక్కు ఉంది కాబట్టే పాపకు 200 కోట్లు డివిడెండ్లు ఇచ్చారు. పాపకు హక్కు ఉంది కాబట్టే ఎంవోయూ రాసుకున్నారు. అఫిషియల్‌గా రాసుకున్నారు. ఎంవోయూలో పాపకు ఇవ్వాల్సిన ఆస్తులు జగన్ గిఫ్ట్‌గా ఇస్తున్నవి కాదు. జగన్ బాధ్యతగా ఇస్తున్నవి. అటాచ్‌మెంట్‌లో లేవు కాబట్టి ఎంవోయూలో ఉన్న సరస్వతి షేర్స్ 100 శాతం, ఎంవోయూలో లేని ఎలహంక ప్రాపర్టీ 100 శాతం పాపకు వెంటనే ఇస్తానని జగన్ అప్పుడే మాట ఇచ్చి సంతకం పెట్టాడు. ఇవి కూడా ఇవ్వకుండా.. ఆటాచ్‌మెంట్లో లేని ఆస్తుల విషయంలో కూడా పాపకు అన్యాయం జరిగింది. పాప భాగానికి వచ్చిన భారతి సిమెంట్స్, సాక్షి మీడియా, వైఎస్ఆర్ గారి ఇల్లు.. ఇలాంటివి కేసుల తర్వాత ఇవ్వాల్సి ఉంది. 2019 వరకు కలిసి ఉన్నాం. షర్మిలమ్మను బిజినెస్‌లో ఇన్వాల్వ్ చేయలేదు. అయినా పాలిటిక్స్‌లో జగన్ చెప్పినట్లు చేసింది. జగన్ కోసం నిస్వార్థంగా కష్టపడింది. జగన్ అధికారంలో రావడానికి పాప కృషి ఎంతో ఉంది.

జన్మనిచ్చిన ప్రతి తల్లిదండ్రులకు బిడ్డలందరూ సమానమే. ఒక బిడ్డ ఇంకో బిడ్డకు అన్యాయం చేస్తుంటే.. చూసి తట్టుకోవడం చాలా కష్టం. తల్లిగా, అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన ఉండి మాట్లాడడం నా విధి, నా ధర్మం. ఇంత మంది పెద్ద మనుషులు చెబుతున్న అబద్ధాల మధ్య నిజం తెలియాలనే.. ఇన్ని విషయాలు చెప్పాల్సి వచ్చింది. వాస్తవాలు ఇవే.. అయినప్పటికీ వాళ్లిద్దరూ అన్నాచెల్లెళ్లు. ఇది వాళ్లిద్దరి సమస్య. ఈ సమస్యను వారే పరిష్కరించుకుంటారు.

రాజశేఖర్‌రెడ్డి గారు ఉండి ఉంటే ఈ ఆస్తుల సమస్య ఉండేది కాదు. ఇంతటి వివాదం జరిగేది కాదు. ఆస్తుల విషయంపై నేనూ ఇలా రావాల్సిన అవసరం పడేది కాదు. అయినా దీని విషయంగా జరుగుతున్న రచ్చను చూసి.. నా మాటలు మాత్రమే ఆపుతాయని విశ్వసిస్తూ.. నేను రాకపోతే ఇలానే కొనసాగుతుందని.. మీ ముందుకు రావాల్సి వచ్చింది.

మరొక్కసారి మీ ఆడబిడ్డగా.. ఇష్టం వచ్చినట్లు మాట్లాడవద్దని ప్రతి ఒక్కరినీ కోరుకుంటూ..

- ఇట్లు ప్రేమతో వైఎస్ విజయ రాజశేఖర్‌రెడ్డి



అమ్మ.. ఆవేదన!

(మొదటిపేజీ తరువాయి)

ఆస్తులన్నింటినీ సమానంగా పంచాలన్నది ఆయన ఆదేశమని షర్మిల పేర్కొంటుండగా... 'ఆ ఆస్తుల్లో నీకు హక్కులేదు. కేవలం ప్రేమాభిమానాలతో కొంత వాటా ఇద్దామనుకున్నా. ఇప్పుడు అది కూడా ఇవ్వను' అని జగన్ తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. పైగా... ఆస్తుల పంపిణీపై గతంలో కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలు చేసేది లేదంటూ ఏకంగా తల్లీ చెల్లిపై నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్టీ)లో కేసు కూడా వేశారు. జగన్ లేఖ... దానికి ప్రతిగా షర్మిల లేఖాస్త్రం... కేసులతో కుటుంబ వివాదం రచ్చకెక్కింది. ఇదే నేపథ్యంలో మంగళవారం విజయలక్ష్మి ఆవేదన, ఆక్రోశంతో బహిరంగ లేఖ రాశారు. 'ఇదీ నిజం' అంటూ జగన్ వైఖరిని ఎండగట్టారు.

ఆస్తులు పంచలేదు... ఇస్తామన్నదీ ఇవ్వలేదు

'2019 వరకూ కలిసే ఉన్నాం. కుటుంబ ఆస్తుల్లో షర్మిలకూ సమాన వాటా ఉంది' అని విజయలక్ష్మి స్పష్టం చేశారు. షర్మిలను కుటుంబ వ్యాపారాల్లోకి రానివ్వలేదని... అయినప్పటికీ జగన్ కోసం నిస్వార్థంగా కష్టపడిందని, ఆయన అధికారంలోకి రావడంలో షర్మిల కృషి ఎంతో ఉందని విజయలక్ష్మి పేర్కొన్నారు. అదే సమయంలో... ఆస్తులను పెంచడంలో జగన్ కష్టం ఉందన్నదీ నిజమేనన్నారు. 'అవన్నీ కుటుంబ ఆస్తులు అన్నది నిజం. బాధ్యతగల కుమారుడిగా కుటుంబ ఆస్తులను సంరక్షించాలన్నది కూడా నిజం" అని విజయలక్ష్మి పేర్కొన్నారు. వైఎస్ జీవించి ఉండగానే షర్మిలకు ఇప్పటికే ఆస్తులు పంచేశారంటూ వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని విజయలక్ష్మి మండిపడ్డారు. "పిల్లలు పెరుగుతున్న రోజుల్లో కొన్ని ఆస్తులు షర్మిల పేరిట, కొన్ని జగన్ పేరిట పెట్టారు. అది... ఆస్తుల పంపకం కానేకాదు" అని స్పష్టం చేశారు. ఆ ఆస్తులను పంచుకుందామనుకుంటున్న సమయంలో వైఎస్ దుర్మరణం పాలయ్యారని తెలిపారు. 2019లో సీఎం అయిన రెండు నెలలకు ఆస్తులు పంచేసుకుందామని జగనే ప్రతిపాదించారని విజయలక్ష్మి తెలిపారు. "విజయవాడలో నా సమక్షంలోనే ఎవరికి ఏ ఆస్తులు అని ఎంవోయూ రాసుకున్నారు. షర్మిలకు హక్కు ఉంది కాబట్టే రూ.200 కోట్లు డివిడెండ్ ఇచ్చాడు. హక్కు ఉంది కాబట్టే అధికారికంగా ఎంవోయూ రాశారు. ఇవేవీ షర్మిలకు జగన్ గిఫ్టుగా ఇస్తున్నవి కావు. బాధ్యతగా ఇవ్వాల్సినవి" అని స్పష్టం చేశారు. కేసులు, ఈడీ కేసులు, జప్తుతో సంబంధం లేని సరస్వతి పవర్ వాటాలు 100 శాతం, ఎంవోయూలో లేని ఎలహంక ప్రాపర్టీ వందశాతం షర్మిలకు ఇస్తానని జగన్ అప్పుడే మాట ఇచ్చి, సంతకం చేశారన్నారు. అవి కూడా ఇప్పటికీ ఇవ్వలేదని ఆక్రోశించారు.

ఫాంహౌస్ కేసులో విచారణ వేగవంతం

» మరో ఐదుగురి వాంగ్మూలం నమోదు

» రాజ్‌కు హైకోర్టు ఇచ్చిన గడువు పూర్తి

» విజయ్ ఇంట్లో పోలీసుల సోదాలు

శంకర్‌పల్లి/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాంహౌస్ ఘటనలో మోకిల పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఫాంహౌస్ పార్టీలో పాల్గొన్న ఐదుగురు వ్యక్తులు పోలీసుల నోటీసులకు స్పందించి, మంగళవారం స్టేషన్‌కు వచ్చారు. వారి స్టేట్‌మెంట్ రికార్డు చేసి పంపారు. ఇప్పటి వరకు 9 మందిని విచారించినట్లు పోలీసులు తెలిపారు. రోజూ ఐదుగురికి నోటీసు లిచ్చి, వారి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నట్లు చెప్పారు. మహిళలకు ఇంకా నోటీసులు ఇవ్వలేదు. త్వరలో వారికీ నోటీసులిచ్చి విచారించనున్నారు. ఫాంహౌస్ యజమాని రాజ్ పాకాలతో పాటు విజయ్ విచారణకు సహకరిస్తారా? లేదా? అన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. వీరిద్దరూ పోలీసుల విచారణకు సహకరిస్తేనే కేసు దర్యాప్తు ముందుకెళ్లే అవకాశం ఉంది. ఫాంహౌస్ పార్టీలో కొకైన్ సేవించి, పట్టుబడిన విజయ్‌ని పోలీసులు అదుపులోకి తీసుకునే ముందు ఆయన భార్య పక్కనే ఉంది. ఆమెకు తెలిసిన ఓ మహిళ మొబైల్‌ను విజయ్ తన ఫోన్ అని చెప్పి, పోలీసులకు అందజేశారు. విజయ్‌కి ఆదివారం పోలీసులు 41సీఆర్‌పీసీ నోటీసులిచ్చిన తర్వాత స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. అయితే జరిగిన విషయాల గురించి విచారించేందుకు సోమవారం రావాలని చెప్పగా.. ఆయన రాలేదు. మంగళవారం పోలీసులు ఫోన్ చేయగా స్విచాఫ్‌లో ఉంది. ఇక రాజ్ పాకాలకు హైకోర్టు 48గంటల సమయం ఇచ్చిన సంగతి తెలిసిందే. మంగళవారంతో ఆ సమయం ముగిసింది. ఆయన స్టేషన్‌కు వస్తారా? లేదా? వచ్చినా విచారణకు సహకరిస్తారా? అన్నది వేచి చూడాల్సిందే. కాగా, జూబ్లీహిల్స్‌లోని విజయ్ ఇంట్లో మంగళవారం నార్సింగ్ పోలీసులు సోదాలు చేశారు. ఏసీపీ రమణగౌడ్ నేతృత్వంలో పోలీస్ బృందాలు మూడు గంటల పాటు తనిఖీలు చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ విజయ్ ఫోన్ విషయమై సోదాలు జరిపామన్నారు. ఆ సమయంలో విజయ్ ఇంట్లో లేరని తెలిపారు.

తిరుపతిలో 8 హోటళ్లకు బాంబు బెదిరింపులు

తిరుపతి క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఎనిమిది హోటళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. మంగళవారం రాత్రి 9.30 గంటల నుంచి వరుసగా ఈ హోటళ్లకు బెదిరింపు మెయిల్స్ పంపారు. ఇప్పటివరకు బెదిరింపులే రాగా.. ఈసారి మాత్రం గ్యాస్, వాటర్ పైపులైన్లు, మురుగునీటి పైపులలో పేలుడు పదార్థాలు ఉంచామని పేర్కొన్నారు. ఇలా తాజ్, బ్లిస్, మినర్వా, చక్రి, పాయ్ వైస్రాయ్, రీనెస్టు, గోల్డెన్ తులిప్, రమీ గెస్ట్‌లైన్ హోటళ్లకు మెయిల్స్ వచ్చాయి. డీఎస్పీ వెంకటనారాయణ పర్యవేక్షణలో పోలీసులు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు హోటళ్లను తనిఖీ చేయగా.. ఎక్కడా పేలుడు పదార్థాలు లభించలేదు.

'భారతి' కొంగు బంగారమే!

పెట్టుబడులతో దిగ్గజ కంపెనీలు బారులు.. జగన్ 82% వాటా విలువ 45 కోట్లు

అందులో 51% వాటాకు వికాట్ 415 కోట్లు.. నాటి మార్కెట్ విలువ.. రూ.2,300 కోట్లు

దాల్మియా, ఇండియా సిమెంట్స్‌దీ ఇదే దారి..

వైఎస్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆయన కుమారుడు సాగించిన జగన్మాయలెన్నెన్నో

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వ్యాపారం చేయడం, పరిశ్రమలు పెట్టి విజయం సాధించడం అంత సులభం కాదు. ఎంతో శ్రమ, ఆర్థికంగా ఒడిదొడుకులు, పన్నులు, అప్పులు... ఇలా ఎన్నో కష్టాలు! కానీ, ఇదంతా సక్రమంగా వ్యాపారాలు చేసేవారికి మాత్రమే వర్తించే సూత్రం! అధికారాన్ని, పరుల సొమ్మును 'పెట్టుబడి'గా చేసుకునే వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఇవి వర్తించవు. భారతి సిమెంట్స్‌లో కేవలం రూ.45 కోట్ల పెట్టుబడి కాస్తా... మూడు నెలలు తిరగకుండానే రూ.3,053 కోట్లకు చేరిపోయింది. జగన్ దంపతులకు ఏడాదికి రూ.500 కోట్లకు పైగా ఆస్తులు సమకూర్చే బంగారుబాతుగా మారిపోయింది. కంపెనీ స్థాపించి ఏడాది కాకుండానే.. పెట్టుబడులు పెడతామంటూ దిగ్గజ పారిశ్రామిక వేత్తలు పోటీ పడ్డారు. మూడేళ్లు తిరిగే సరికి ఒక విదేశీ కంపెనీ ఏకంగా మెజారిటీ వాటా 51 శాతం కొనుగోలు చేసింది. ఇలా.. కొద్ది సంవత్సరాల వ్యవధిలోనే రూ.వందలకోట్ల వ్యాపారం చేయడం పారిశ్రామిక దిగ్గజ సంస్థల యాజమాన్యాలకు సైతం సాధ్యం కాలేదు.

గనులన్నీ 'భారతి'కే ...

2006లో రఘురాం సిమెంట్స్ కాస్త భారతి సిమెంట్స్‌గా రూపాంతరం చెందింది. భారతి సిమెంట్స్ కోసం లక్ష రూపాయలకు ఒక ఎకరా చొప్పున 487 ఎకరాలను రాజశేఖరరెడ్డి ప్రభుత్వం కేటాయించింది. 1400 ఎకరాల్లో విస్తరించి ఉన్న సున్నపురాయి గనుల లీజులను భారతి సిమెంట్స్ పొందింది. దిగ్గజ సంస్థలన్నీ అందులో భారీగా పెట్టుబడులు పెట్టాయి. సిమెంట్ పరిశ్రమలో తమకంటూ ప్రత్యేకత కలిగిన ప్రఖ్యాత కంపెనీలు ఇండియా సిమెంట్స్, దాల్మియా వంటి కంపెనీలు భారతి సిమెంట్స్ షేర్లను మార్కెట్ విలువకు కొనుగోలు చేశాయి. 2010లో విదేశీ కంపెనీ వికాట్..భారతి సిమెంట్స్‌లో మెజారిటీ షేర్లు 51 శాతం మేర 415 కోట్లు చెల్లించి కొనేసింది. ఈ మేరకు ఒప్పందం ఫ్రాన్స్‌లో జరిగింది. ఈ లావాదేవీకి సంబంధించి 2010-11 ఆర్థిక సంవత్సరానికిగాను జగన్ రూ.64 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించారు. 2010లో దీని ఉత్పత్తి సామర్థ్యాన్ని 25 లక్షల టన్నులకు, మరో ఏడాదినాటికి ఇంకో 25 లక్షల టన్నుల సామర్థ్యానికి పెంచుతామని వికాట్ ప్రకటించింది. ఇలా 50 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన భారతి సిమెంట్స్ మొత్తం విలువను రూ.4,600 కోట్లుగా నిర్ధారించారు. అప్పట్లోనే వికాట్ కైవసం చేసుకున్న 51 శాతం వాటాకు మార్కెట్ విలువ రూ.2,346 కోట్లు ఉంది. అతితక్కువ పెట్టుబడితో భారతి సిమెంట్స్‌ను ప్రమోట్ చేసిన జగన్‌కు ఈ డీల్ జాక్‌పాట్ లాంటిదని మార్కెట్ వర్గాలు అప్పట్లోనే వెల్లడించాయి. భారతిలో 82 శాతం వాటా కోసం జగన్ గ్రూప్ నికరంగా పెట్టిన పెట్టుబడి మొత్తం రూ.45 కోట్లు. ఈ వాటా విలువ ఇప్పుడు రూ.3700 కోట్లు.. 51 శాతం వాటా కోసం ఆయన ఇన్వెస్ట్ చేసిన మొత్తం సుమారు 28 కోట్ల రూపాయలు అవుతుందని అనుకున్నా.. ఇప్పుడు లభించిన రూ.2,300 కోట్లు (మార్కెట్ విలువ) అంటే అనేక రెట్లు ఎక్కువని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. వైఎస్ సీఎంగా ఉన్న సమయంలో అధికార పలుకుబడిని ఉపయోగించి భారతి సిమెంట్స్‌కు భారీ ఎత్తున ఈక్విటీని, రుణాలను జగన్ సమీకరించారన్న విమర్శలున్నాయి. భారతి సిమెంట్స్ ఈక్విటీ షేర్లు ఐదున్నర కోట్లున్నాయి. పది రూపాయల ముఖవిలువకే నాలుగున్నర కోట్ల భారతి సిమెంట్ వాటాలను జగన్, ఆయన కంపెనీలు తీసుకున్నాయి. మిగతా షేర్లను దాల్మియా సిమెంట్, ఇండియా సిమెంట్స్ వంటి సంస్థలు, మ్యాట్రిక్స్ ప్రసాద్ వంటి వ్యాపార ప్రముఖులు ఒక్కో షేరుకు 94-175 రూపాయల రేటుతో కొనుగోలు చేయడం గమనార్హం. దాల్మియా సిమెంట్స్ మాత్రం తర్వాత రెండు లక్షల షేర్లను రూ.1,440 రేటుతో కొనుగోలు చేసింది. భారతి ఈక్విటీలో నాలుగున్నకోట్ల షేర్లకుగాను జగన్ గ్రూప్ మదుపు పెట్టిన మొత్తం రూ.45 కోట్లు. కోటిలోపు ఉన్న షేర్లకు పైన పేర్కొన్న కార్పొరేట్ సంస్థలు 140 కోట్ల రూపాయల వరకూ పెట్టుబడులు పెట్టాయి.



ఉత్పత్తి ప్రారంభించకుండానే..

2007లో భారతీ సిమెంట్ కార్పొరేషన్ పెట్టిన జగన్ 2009 ఆగస్టు 27న తన వాటా నుంచి 2,27,584 షేర్లను ఒక్కొక్కటి రూ.1,450 ధరకు మ్యాట్రిక్స్ ప్రసాద్‌కు చెందిన అల్పావిల్లాస్ ప్రైవేటు లిమిటెడ్, అల్పా ఎవెన్యూస్ ప్రై.లిమిటెడ్ సంస్థలకు విక్రయించారు. దీంతో జగన్‌కు రూ.33కోట్లు దక్కాయి. భారతీ సిమెంట్స్ ఉత్పత్తిని ప్రారంభించక ముందే జగన్‌కు దక్కిన ప్రతిఫలం అది. ఈ మొత్తంతో జగన్ పెట్టిన పెట్టుబడి మొత్తం వెనక్కి వచ్చేసింది. విక్రయించిన ఈ షేర్లు జగన్ వాటాలో ఒక శాతం కంటే తక్కువే.

వివేకా హత్య కేసును.. నీరుగార్చే కుట్ర!

» పలుకుబడి కలిగిన వ్యక్తులు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నారు

» ఉమాశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌లో సునీతారెడ్డి, సీబీఐ వాదనలు

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును నీరుగార్చేలా అనేక కుట్రలు జరుగుతున్నాయని ఆయన కుమార్తె సునీతారెడ్డి తెలిపారు. పలుకుబడి కలిగిన పెద్ద వ్యక్తులు కేసును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నారని అన్నారు. నిందితులను బెయిల్‌పై విడుదల చేస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తారని ఆందోళన వ్యక్తంచేశారు. వివేకా హత్య కేసులో ఏ-3గా ఉన్న గజ్జల ఉమాశంకర్‌రెడ్డి దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. సునీతారెడ్డి తరఫున న్యాయవాది ఎస్. గౌతమ్, సీబీఐ తరఫున అనిల్ తన్వర్ వాదనలు వినిపించారు. 'పలుకుబడి కలిగిన వ్యక్తుల ప్రభావానికి గురయ్యే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజేయ కల్లం.. తాను సీబీఐకి ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను తొలగించాలని హైకోర్టులో పిటిషన్ వేశారు. దానిపై సీబీఐ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసిన తర్వాత.. ఆయన ఆ పిటిషన్‌లో వాదనలు వినాలని పట్టుబట్టడం లేదు. ఈ కేసును మొదట విచారించిన సీఐ శంకరయ్య.. సీఆర్‌పీసీ 161 స్టేట్‌మెంట్ ఇచ్చి.. మేజిస్ట్రేట్ వద్ద మాత్రం సీఆర్‌పీసీ 164 స్టేట్‌మెంట్ ఇవ్వలేదు. గంగాధర్‌రెడ్డి అనే సాక్షి మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇవ్వకముందే అనుమానాస్పద స్థితిలో చనిపోయాడు. ఈ పరిణామాలన్నిటినీ పరిశీలిస్తే ఈ కేసును నీరుగార్చడానికి ఏ స్థాయిలో ప్రభావితం చేస్తున్నారో స్పష్టంగా అర్థమవుతోంది' అని పేర్కొన్నారు. అన్ని పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్.. ట్రయల్ త్వరలో ప్రారంభమయ్యే పరిస్థితులు అస్సలు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.